వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 9 సంచిక : 12 హైదరాబాద్ 125 డిసెంబర్ 2011 పేజీలు : 68 రు. 15

* ఫోకస్ : వాల్‌స్ట్రీట్ ముట్టడి పూర్వాపరాలు
* సద్భావన - రథయాత్ర - దేశ భవిష్యత్తు
* సాయుధ బలగాల చట్టం
* తెలంగాణ ఉద్యమం - సకల జనుల సమ్మె
* లిబియా దురాక్రమణ - గడ్డాఫీ హత్య
* సమస్యల వలయంలో యుపిఎ

వీక్షణం రచయితల, అభిమానుల ఆరో వార్షిక సమావేశం

అందరికీ ఆహ్వానం!

తేది	:	**18 డిసెంబర్ 2011 ఆదివారం**
సమయం	:	**ఉదయం 10 గంటల నుంచి**
స్థలం	:	**ఎమెస్కో సమావేశ మందిరం,** సాధూరాం కంటి ఆస్పత్రి పక్కన, గగన్‌మహల్ రోడ్ లిబర్టీ దగ్గర, దోమల్‌గూడ, హైదరాబాద్. **(భోజన ఏర్పాటు ఉంది)**

ప్రాంతీయ, దేశీయ, అంతర్దేశీయ పరిణామాలపై అవగాహనలను, తెలుగు సమాజం తనతో తాను జరుపుతున్న సంభాషణను అక్షరబద్ధం చేస్తున్న రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక వీక్షణం ప్రతి సంవత్సరం తన రచయితల మధ్య సంభాషణకు కూడ వేదిక కల్పిస్తున్నది. వీక్షణం అయిదు సంవత్సరాల కింద ఈ వార్షిక రచయితల సమావేశం ప్రారంభించింది. వీక్షణం రచయితలు, పాఠకులు, అభిమానులు, సిబ్బంది కలిసి కూచుని వీక్షణంలో అచ్చవుతున్న రచనల గురించీ, అచ్చు కావలసిన అంశాల గురించీ చర్చించుకోవడానికి, పత్రిక వెలువడుతున్న తీరు గురించి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు పంచుకోవడానికి, గతాన్ని సమీక్షించుకుని భవిష్యత్తుకు మార్గాలు వేసుకోవడానికి ఈ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ వరుసలో ఆరవ సమావేశంగా రాబోయే సంవత్సరానికి గాను వీక్షణం రచయితల సమావేశం 18 డిసెంబర్ 2011, ఆదివారం ఉదయం 10 నుంచి ఎమెస్కో సమావేశ మందిరం (సాధూరాం కంటి ఆస్పత్రి పక్కన, గగన్ మహల్ రోడ్, దోమలగూడ)లో జరుగుతుంది.

ఇప్పటికే వీక్షణంలో రచనలు చేసి ఉన్నవారు, వీక్షణంలో రచనలు చేయదలచుకున్నవారు, వీక్షణం పాఠకులు, వీక్షణం అభిమానులు, మొత్తంగా తెలుగు సమాజ జీవితం గురించి, ప్రజల గురించి ఆలోచించే ప్రతి ఒక్కరూ ఈ సమావేశానికి ఆహ్వానితులే.

వివరాలకు : కార్యాలయం – 040 6684 3495
(ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు)

125

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

డిసెంబర్ 2011
సంపుటి : 9
సంచిక : 12

లోపలి పేజీల్లో...

ఫోకస్ : 'ఆక్యుపై వాల్‌స్ట్రీట్' నిరసనలు చెబుతున్నదేమిటి?

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ / చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజెన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు	విద్యార్థులకు
విడి ప్రతి	రు. 15	రు. 15	రు. 15
సంవత్సరం	రు. 180	రు. 150	రు. 120
మూడు సంవత్సరాలు	రు. 500	రు. 400	రు. 350
ఐదు సంవత్సరాలు	రు. 800	రు. 650	–
పది సంవత్సరాలు	రు. 1500	రు. 1300	–

వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175**
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

వీక్షణం నవంబర్ 2011 సంచికలో తెలంగాణలో జరిగిన 'సకల జనుల సమ్మె అంశానికి అధిక ప్రాధాన్యత నిచ్చినందుకు కృతజ్ఞతలు. అయితే ఈ అంశంపై ఫోకస్‌కు చలసాని శ్రీనివాస్ రాసిన 'సకల జనుల సమ్మె – సామాన్యుల ఇబ్బందులు' అనే వ్యాసంలో జీవంలేని నిందారోపణలను ఆశ్రయించారు.

బంద్‌లు, రైల్‌రోకోలు, ఉద్యోగుల సమ్మెలు అనేటివి కేవలం తెలంగాణ ఉద్యమంలోనే పుట్టినవి కావని ప్రపంచంలోని బుద్ధిజీవులందరికీ తెలుసు. హక్కుల సాధన కోసం ఉద్యోగులు సమ్మె చేసే హక్కుని ప్రశ్నించడం, సమ్మెపై ప్రభుత్వం వ్యవహరించిన బాధ్యతారాహిత్యమైన తీరును విస్మరించడం రచయితకే చెల్లింది. రచయిత ప్రజల సమస్యలను, ఇబ్బందులను తెరపైకి తీసుకువచ్చారు. కాని, అదే సమయంలో సమ్మె పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాస్తవంగా అవలంబించిన తీరును, బాధ్యతారాహిత్య ధోరణిని, అసలు రాష్ట్రంలో సమ్మె ప్రభావమే లేదనే గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ప్రకటనల పట్ల, కేంద్రానికి సమర్పించిన సంబంధిత నివేదికల పట్ల, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల, ప్రభుత్వాలు అనుసరిస్తున్న అత్యంత నాటకీయ సాచివేత ధోరణి పట్ల కనీస, నైతిక బాధ్యతగా వ్యాసంలో ఇసుమంత ప్రస్తావన కూడా చేయకపోవడం రచయిత ఏకపక్ష ధోరణిని ధృవీకరిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ప్రభుత్వాలపై, పాలకులపై తమ నిరసనను తెలిపే క్రమంలో పాటించే ప్రజాస్వామిక చర్యలు కూడా తెలంగాణ ఉద్యమంలో నేరాలుగా రచయితకు గోచరించడం దురదృష్టకరం.

ప్రపంచంలో హక్కుల సాధన కోసం జరిగే ఏ సమ్మె వల్లనైనా ప్రత్యక్షం గానో, పరోక్షంగానో ప్రజలు ఇబ్బందులు పడడం సహజమే. తెలంగాణలో జరిగిన సమ్మె అందుకు ఏమాత్రం మినహాయింపు కాదు. అయితే తెలంగాణలో జరిగిన సమ్మెలో సమస్త ప్రజల భాగస్వామ్యం స్ఫూర్తిదాయకం, ప్రపంచానికి ఆదర్శప్రాయం. సమ్మె కాలంలో ప్రజలు తాము ఎదుర్కొన్న ఇబ్బందులకంటే తెలంగాణ వాదాన్ని ముక్తకంఠంతో బలంగా వినిపిస్తున్నామనే సంతోషం ఊరూరా కనిపించింది. సమ్మెకాలంలో రచయితకు నిజంగా తెలంగాణ ప్రజల ఇబ్బందులు కనిపించినట్లయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కోరుతూ నేడు జరుగుతున్న ఉద్యమానికి దారితీసిన దశాబ్దాల కాల ప్రజల కష్టాలు కూడా కనిపించాలి. వాటిపై కూడా సహజంగా లక్షరెట్లు విచారం వ్యక్తం చేయాలి. మరి రచయిత అంతటి నిజాయితీని ప్రదర్శించగలరా?

రచయిత తన వ్యాసంలో రాష్ట్ర విభజనను లేదా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అనుక్షణం అడ్డుకుంటున్న సమైక్యవాద ఆంధ్ర–సీమ పెట్టుబడి దారులను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వెనుకేసుకొచ్చారు. వారి పట్ల తన విధేయతను ప్రదర్శించారు. వ్యాసంలో తలా తోక లేకుండా సాగిన బాన్సువాడ ఎన్నికల ఫలితం ప్రస్తావన కేవలం అజ్ఞానంతో కూడిన రచయిత అల్ప సంతోషాన్ని బయట పెట్టింది. బాన్సువాడలో పోచారం ప్రత్యర్థికి నిస్సందేహంగా ఊహించిన దాని కంటే ఎక్కువ ఓట్లే వచ్చాయి. అయితే ఇద్దరూ తెలంగాణ వాదంతోనే బరిలోకి దిగారనే విషయాన్ని కూడా ఇక్కడ గమనించాలి. ఇద్దరి ఓట్లు తెలంగాణ వాదానికి చెందినవే కాని, వాటిలో ఒక్కఓటు కూడా సమైక్యాంధ్ర వాదానికి గాని, తెలంగాణ వ్యతిరేక వాదానికి గాని లేదా మరే వాదానికి గాని మద్దతు కాదనే విషయం కూడా రచయిత గుర్తించాలి.

వ్యాసంలో రచయిత ఒకచోట 'సమ్మె ద్వారా ప్రజలలో అత్యధికులు తమకి ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఆకాంక్షను వ్యక్తపరిచారు' అని పేర్కొన్నారు. మరోచోట 'ప్రస్తుతం నడిచేది సకల జనుల సమ్మెగా కాక సకల జనులపై ఉద్యోగులు చేసే సమ్మెగా మారడం సరైనది కాదు' అని అన్నారు. సకల జనుల సమ్మెలో అత్యధిక ప్రజల సంపూర్ణ మద్దతును, భాగస్వామ్యాన్ని రచయిత అంగీకరిస్తూనే ప్రజలను, ఉద్యోగులను వేరుచేయడం అర్థరహితం, హాస్యాస్పదం, రచయిత విచిత్ర ధోరణికి నిదర్శనం.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ నాయకులు చెప్పినంత సులువుగా తెలంగాణ ప్రజలకు కృష్ణా, గోదావరి నదీ జలాలు అందవనే విధంగా రచయిత వాదిస్తూ మరోవైపు రాష్ట్రం విడిపోతే నదీజలాల వాటా పట్ల ఆంధ్ర–సీమ ప్రాంతాల అభద్రతను చాటుతున్నారు. ఇందులో ఏది నిజమని నమ్మాలి?

ఐదుసార్లు రాష్ట్ర శాసనసభకు ఎన్నికైన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని ఉద్దేశించి మీసాల దామోదర్‌రెడ్డి అంటూ వ్యాసంలో వ్యంగ్య సంభోదన చేయడం రచయిత స్థాయికి తగదు. సమ్మె కాలంలో తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమస్ఫూర్తితో ప్రజలు ఘనంగా జరుపుకున్న బతుకమ్మ, దసరా పండుగలలో రచయితకు కేవలం కెసిఆర్ కుటుంబం మాత్రమే కనబడడం విడ్డూరం.

గత కొంతకాలంగా తెలంగాణ ఉద్యమంలో థర్మామీటర్ పెట్టి ఉద్యమ వేడిని పరీక్షిస్తున్నారు తెలంగాణ వ్యతిరేకులు. ఉద్యమం ఉధృతంగా సాగిన కాలంలో ప్రజలను రెచ్చగొడుతున్నారని, ఉద్యమం కాస్త చల్లబడగానే తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోరుకోవట్లేదని వ్యాఖ్యానించడం పరిపాటి అయింది. తెలంగాణ ప్రజల సుదీర్ఘకాల కల నిజమైన డిసెంబర్ 9, 2009 రోజు తరువాత జరిగిన నీచమైన పరిణామాలన్నిటి ప్రభావం ఊరికే పోతుందా? కలతచెందిన అత్యంత సున్నిత మనస్కులు ఆత్మత్యాగానికి పాల్పడుతుంటే, ఆవేశానికి గురయిన వారిలో అతి కొద్దిమంది కొన్ని సందర్భాలలో ప్రాంతీయ విభేదాలతో బస్సులపై దాడులకు పాల్పడుతున్నారు. ఈ రెండూ ఆలోచనాపరులు ఊహించదగ్గ పరిణామాలే. 'మీ సహనానికి మేం పరీక్ష పెడుతున్నాం. మీరు నూటికి నూరు మార్కులు తెచ్చుకోవాల్సిందే' అనే ధోరణిలో తెలంగాణ ప్రజలపై సుదీర్ఘకాలంగా జారీ అయ్యే బానిస శాసనాల ఆయుష్షు జాగరూకులైన చైతన్య ప్రజల కంబంధ హస్తాలలో ఏనాడైనా ఛిద్రమవకతప్పదని రచయిత గుర్తించాలి.

పాండవులను చూపించకుండానే మహాభారత ఘట్టం 'మాయాబజార్' చిత్రం ఉన్నట్లు, జై ఆంధ్ర ఉద్యమ విశిష్టతను, గొప్పతనాన్ని ఏ సందర్భంలోనూ తెలియ జేయకుండానే రచయిత జై ఆంధ్ర ఉద్యమ నేతగా కూడా చలామణీ అవుతూ కేవలం తెలంగాణ ఉద్యమం వెంటబడడం, కించబరచడం లక్ష్యంగా సాగుతున్నారు. ప్రపంచంలో ప్రజల ఆకాంక్షలను చాటుతూ విజయవంతంగా సాగిన ఏ ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకుని తెలంగాణ ఉద్యమం సాగాలని రచయిత కోరుకుంటారో తెలియజేస్తే స్వీకరించడానికి, పాటించడానికి సిద్ధమని సుమారు ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల సహనం, త్యాగం చాటి చెప్తుంది.

– ఎస్. కిశోర్ కుమార్
హైదరాబాద్

వీక్షణం నవంబర్ 2011 సంచికలో వచ్చిన 'మత హింస బిల్లు పూర్వాపరాలు' బాగుంది. బ్రిటిష్ వాళ్లకి సేవ చేస్తూ వారికి బానిసలుగా ఉన్న మతతత్వ శక్తులు స్వాతంత్ర్యం తరువాత రాజకీయాలలోకి ప్రవేశించి టెర్రరిజం వైపుకు ఏవిధంగా మళ్లారో ఈ వ్యాసంలో బాగా వివరించారు. సమస్త ప్రజానీకం ఈ వ్యాసాన్ని చదవాల్సిన అవసరమున్నది. అందునా నేటి పరిస్థితులలో ఈ వ్యాసం ఆవశ్యకత ఎంతో ఉన్నదని భావిస్తూన్నాను. రచయితకి అభినందనలు. వరవరరావు వ్యాసం 'తెలంగాణ – సంఘ్ పరివార్ ఎజెండా' కూడా ప్రజా ఉద్యమాలలోకి జొరబడి తమ ప్రాబల్యాన్ని సంఘ్ పరివార్ ఏ విధంగా పెంచుకుంటున్నాదో, దాని నిజ స్వభావాన్ని అత్యంత వివరంగా రాశారు. శత్రు వైరుధ్యాల మధ్య ఉండే వైరుధ్యాన్ని వాడుకొనే పేరుతో వారికి తోకలుగా మారి ప్రజా పోరాటాన్నీ నట్టేట్లో ముంచే పరిస్థితిని గురించి హెచ్చరించారు. నాయకత్వం విప్లవ శక్తుల చేతుల్లో ఉన్నప్పుడే ఆ వైరుధ్యాన్ని మనం సక్రమంగా ఉపయోగించగలం గానీ ఆ పరిస్థితులు లేనపుడు విప్లవ ప్రజానీకానికి ఎలాంటి నష్టాలొస్తాయో ఈ వ్యాసం వలన బాగా అర్థం చేసుకోవచ్చు అని నేను భావిస్తున్నాను. ఇది ఒక తెలంగాణ పోరాటానికి సంబంధించినదే కాదు, ఏ ప్రజా పోరాటాలకైనా సరే. విప్లవ నాయకత్వం గుర్తించుకోవలసిన అంశాలు ఈ వ్యాసంలో ఉన్నాయి.

– కడియాల సుబ్బనాచారి
దుత్తలూరు, నెల్లూరు

వీక్షణం

తెలంగాణ, కరవు, సిబిఐ విచారణలు, రచ్చబండ..


ఆంధ్రప్రదేశ్ అనే రాష్ట్రం తనను తాను ఆధునిక, ప్రజాస్వామిక, సర్వసత్తాక, సామ్యవాద గణతంత్ర రాజ్యం అని పిలుచుకునే దేశంలో భాగంగానే ఉన్నదా, లేక నిరంకుశ, అరాచక రాచరిక పాలనగా, మధ్యయుగపు దొంగల రాజ్యంగా, దోపిడీ పీడనల నిలయంగా, ప్రజలంటే లెక్కలేని పాలకవర్గాల ఇష్టారాజ్యంగా ఉన్నదా? ఈ ప్రశ్న అడగడానికి వర్గ దృక్పథమో, ప్రజల పట్ల ప్రేమో కూడ అక్కర్లేదు. ఆధునిక యుగంలో ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం సాగాలని అనుకునే వాళ్లకెవరికైనా ఈ ప్రశ్న తడుతుంది. కేవలం ఆధునిక ప్రజాస్వామిక రాజనీతి శాస్త్ర పరిచయం ఉన్నవాళ్లకు కూడ జుగుప్స కలిగించేంత నిర్దాక్షిణ్యమైన, నిర్లక్ష్యపూరితమైన, దుర్మార్గమైన, ప్రజావ్యతిరేక ప్రభుత్వం ఇవాళ రాష్ట్రాన్ని పాలిస్తున్నది. ప్రజలతో, ప్రజల సమస్యల పరిష్కారంతో ఎటువంటి సంబంధం లేని ప్రభుత్వం ఇక్కడ రాజ్యం చేస్తున్నది. ప్రభుత్వమూ అధికార పక్షమూ మాత్రమే కాదు, తమను తాము ప్రతిపక్షాలమని పిలుచుకునే పాలకవర్గ ముఠాలన్నీ కూడ ప్రజల పట్ల, ప్రజల సమస్యల పట్ల అంతే నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నాయి. ప్రజల వనరులను కొల్లగొట్టడంలో అన్ని పాలకవర్గ ముఠాలూ సమానమేనని నిర్లజ్జగా చూపుకుంటున్నాయి. ఎక్కడైనా ఎప్పుడైనా ప్రజల సమస్యల ప్రస్తావన వచ్చినా అది పెదాల మీది నుంచి మాత్రమే, తాత్కాలికంగా, క్షణికంగా మాత్రమే వస్తున్నది. రాష్ట్ర ప్రజలు అసంఖ్యాకమైన సమస్యలతో అల్లాడిపోతుంటే అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు దోపిడీలో, అక్రమార్జనలో అవతలి వారిని అధిగమించడంలో, పరస్పర ఆరోపణలలో, భోగవిలాసాలలో, కుటిల ఎత్తుగడలలో మునిగి తేలుతున్నాయి. ఈ నెలలో జరిగిన పరిణామాలే పరిశీలించినా, అందులోనూ ప్రధానమైన, ప్రజాజీవితానికి ముఖ్యమైన నాలుగు అంశాలు – తెలంగాణ, కరవు, సిబిఐ విచారణలు, రచ్చబండ – పరిశీలించినా ఇవాళ్టి పాలకవర్గాలు ప్రజల నుంచి ఎంత దూరమై ఉన్నాయో, ఎంత ప్రజావ్యతిరేకంగా ఉన్నాయో స్పష్టమవుతుంది. తెలంగాణ సమస్య నిజానికి సమస్య కాదు, తమ సమస్యలకు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఒక పరిష్కారమని తెలంగాణ ప్రజలు ఎప్పటినుంచో భావిస్తున్నారు. ఆ పరిష్కారాన్ని అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించి, ఆ తర్వాత విస్తృత సమాలోచనలు జరపాలనే కారణంతో వెనక్కి వెళ్లింది. మరి రెండు సంవత్సరాలు గడిచినా ఆ సమాలోచనల వ్యవహారం ఏమయిందో, తెలంగాణ ప్రజలు ఇంకా ఎన్నాళ్లు వేచి చూడవలసి ఉందో, ఈ నిరీక్షణ నిరాశ వల్ల బలి అయిపోతున్న వందలాది ప్రాణాలకు ఎవరు బాధ్యత పడతారో తెలియడం లేదు. ప్రజల ఆకాంక్షల పట్ల మాత్రమే కాదు, స్వయంగా తమ ప్రకటనల పట్ల తమకే గౌరవం లేని అవిశ్వసనీయత ఈ పాలకులది. అటువంటి నమ్మకద్రోహానికి పాల్పడే పాలకులను తమ విశ్వసనీయత ద్వారా ఓడించవలసిన ప్రతిపక్షాలు కూడ అంతే అవిశ్వసనీయంగా ఉన్నాయి. దానితో ప్రజల నిరాశా నిస్పృహలు మరింత పెరుగుతున్నాయి. శాసన సభ్యత్వాలకు రాజీనామాలు చేయడం ద్వారా ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తామని ప్రకటించి, అదే ఏకైక పోరాట రూపంగా హోరెత్తించి, ఆ పని చేయని వారిని ద్రోహులుగా ఎండగట్టిన ప్రతిపక్ష సభ్యులు మళ్లీ మళ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. తాము రాజీనామా చేశామనే సంగతే మరిచిపోతున్నారు. మరొక ప్రాంత నాయకుల, వ్యాపారుల దోపిడీని ఖండిస్తూనే, ఆ వ్యాపారాలలో భాగస్తులవుతున్నారు. తెలంగాణ ప్రయోజనాలకు భంగకరమని ప్రపంచానికంతా తెలిసిన పథకాలలో భాగం పంచుకుంటున్నారు. సరిహద్దుకు అటూ ఇటూ నిలబడ్డట్టు కనబడుతున్న రెండు పక్షాలూ ఒకేతానులో ముక్కలమని రుజువు చేసుకుంటున్నాయి. ఈ అవిశ్వసనీయతే ఇవాళ రాష్ట్రంలో ప్రధాన సమస్య అయిన కరవు విషయంలో కూడ కనబడుతున్నది. రాష్ట్రంలోని 1100 మండలాలలో దాదాపు 800 మండలాలలో వర్షపాతం తక్కువగా ఉన్నదని, భూగర్భజలాలు ఇంకి పోతున్నాయని, వ్యవసాయం సజావుగా సాగడంలేదని వార్తలు వస్తుంటే, ప్రభుత్వం మాత్రం అప్పుడొకటి ఇప్పుడొకటిగా ఇప్పటికి 709 మండలాలను మాత్రం కరవు పీడిత ప్రాంతాలుగా ప్రకటించింది. అలా ప్రకటించిన ప్రాంతాలన్నిటికి కూడ అందించవలసిన సహాయ చర్యలు అందించడం లేదు. మరోవైపు ప్రతిపక్షాలు ఆర్భాటంగా పత్రికాసమావేశాలు ఏర్పాటు చేసి, యాత్రలు జరిపి ఖండన ప్రకటనలు ఇవ్వడం మినహా సహాయ చర్యలు చేపట్టేందుకు నిర్మాణాత్మకంగా ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడం లేదు. రైతుకూలీలను కూడగట్టడం లేదు. మరోవైపు సిబిఐ విచారణలలో బయటపడుతున్న నిజాలు పాలక, ప్రతిపక్షాల మధ్య ఎటువంటి తేడా లేదని చూపుతున్నాయి. రాష్ట్ర ప్రజలకు చెందిన ఖనిజాలను, భూమిని, సంపదను, సకల వనరులను బహుళజాతి సంస్థలకు, వ్యాపారులకు, అక్రమార్జనాపరులకు అప్పగించడంలో, పనిలో పనిగా తమ బొక్కసాలు నింపుకోవడంలో అందరికందరూ దొంగలేనని స్పష్టమవుతున్నది. దీనికి ఇవాళ అధికారంలో ఉన్నముఠా గాని, నిన్నటివరకూ అధికారం చలాయించి ఇవాళ ప్రతిపక్షంగా మారిన ముఠా గాని, మొన్నటివరకూ అధికారంలో ఉన్న ముఠా గాని మినహాయింపు కాదని, ఈ తిలా పాపంలో తలా పిడికెడు భాగస్వామ్యం ఉన్నదని సిబిఐ ఎదుట బహిర్గతమవుతున్న వాస్తవాలు చూపుతున్నాయి. వ్యక్తి పేరు చంద్రబాబు నాయుడయినా, రాజశేఖర రెడ్డయినా, జగన్మోహన రెడ్డి అయినా, కిరణ్ కుమార్ రెడ్డయినా, పార్టీ పేరు కాంగ్రెస్ అయినా, వై ఎస్ ఆర్ కాంగ్రెస్ అయినా, తెలుగుదేశం అయినా ప్రజల వనరులను దోచుకోవడంలో, దోచిపెట్టడంలో ఇసుమంత కూడ తేడా లేదని, అందరూ తోడు దొంగలేనని బయటపడుతున్నది. ఈ ముఠాలన్నిటి స్వభావం ఒకటేనని రుజువవుతున్నది. ఈ పాలకవర్గ ముఠాలలో ఒకరి నుంచి మరొకరికి అధికారం మారినందువల్ల ఏమీ ప్రయోజనం లేదని, ప్రజలింకా నిజమైన ప్రత్యామ్నాయం కోసం, నిజమైన ప్రజానుకూల పాలన కోసం అన్వేషించ వలసిందేనని ఈ రాష్ట్ర చరిత్ర ప్రతిరోజూ వేనోళ్ల ప్రకటిస్తున్నది. పాలకుల ఈ ప్రజావ్యతిరేక నైజం క్రమక్రమంగా ప్రజలకు తెలిసి వస్తున్నదనడానికి కూడ సూచనలు కనబడుతున్నాయి. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన రూపాయికి కిలో బియ్యం పథకం విషయంలోనూ, రచ్చబండ కార్యక్రమంలోనూ ప్రజలు ముఖ్యమంత్రినీ, మంత్రులనూ అధికారులనూ నిలదీస్తున్న సంఘటనలే ఈ ప్రజాచైతన్యానికి నిదర్శనం. ఈ చైతన్యాన్ని బలోపేతం చేయడం, విస్తరించడం బుద్ధిజీవుల బాధ్యత. వీ

ఉత్తర ప్రదేశ్ విభజన - అవకాశవాదపు మరోముఖం


ఉత్తరప్రదేశ్‌ను అవధ్‌ప్రదేశ్, పూర్వాంచల్, బుందేల్‌ఖండ్, పశ్చిమ్‌ప్రదేశ్ అనే నాలుగు రాష్ట్రాలుగా విభజించాలని ఆ రాష్ట్రంలో అధికార పక్షంగా ఉన్న బహుజన్ సమాజ్ పార్టీ నిర్ణయించడం, ఆ నిర్ణయాన్ని మంత్రివర్గం ఆమోదించడం, అందుకు సంబంధించిన తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టి గెలిపించడం హడావుడిగా జరిగిపోయాయి. ఇరవై కోట్ల జనాభాతో సువిశాల రాష్ట్రంగా ఉన్న ఉత్తరప్రదేశ్ ను చిన్న రాష్ట్రాలుగా విభజించడం అవసరమే. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా గాని, అధికారాల వికేంద్రీకరణకు గాని, పాలనా సౌలభ్యం కొరకు గాని పెద్ద రాష్ట్రాల విభజన ఎప్పుడైనా స్వాగతించవలసినదే. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు సుముఖంగా ఉండిన డా. బి ఆర్ అంబేద్కర్ ఆశయాలతో నడిచే బి ఎస్ పి ఈ నిర్ణయానికి పూనుకోవడం సహజమే. కాని ప్రస్తుత మాయావతి ప్రభుత్వ చర్య అంత సులభంగా విశ్లేషించ గలిగినది కాదు, అందులో కొన్ని సంక్లిష్టమైన అంశాలు ఇమిడి ఉన్నాయి. రాష్ట్ర విభజనను ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్న సమాజ్ వాది పార్టీ ఈ నిర్ణయాన్ని తప్పుపట్టడంలో ఆశ్చర్యం లేదు. కాని తమవల్ల మాత్రమే తెలంగాణ వస్తుందని ఇన్నాళ్లుగా నమ్మబలుకుతున్న భారతీయ జనతాపార్టీ ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించి తన అసలు రంగు బయట పెట్టుకుంది. ఇదివరకే రాష్ట్ర విభజనకు, ముఖ్యంగా బుందేల్ ఖండ్ ఏర్పాటుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ ఈ నిర్ణయాన్ని ఆమోదించాలా వ్యతిరేకించాలా తెలియని గందరగోళంలో పడింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన యుపిఎ తాత్సార వైఖరి వల్ల ఆగ్రహంగా ఉన్న తెలంగాణ వాదులు ఈ పరిణామాన్ని స్వాగతిస్తున్నారు. కాని ఈ నిర్ణయంలో స్వాగతించవలసింది ఎంత ఉందో అనుమానించవలసిందీ అంత ఉంది. అది కేవలం 2012 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఇప్పటికే తగ్గిపోతున్న జనాదరణను తిరిగి రాబట్టుకోవడానికి వేసిన ఎత్తుగడే తప్ప అందులో ప్రజా ఆకాంక్షల పట్ల గౌరవమూ లేదు, అధికార వికేంద్రీకరణ జరపాలనే కోరికా లేదు. పాలనా సౌలభ్యం ఏర్పడుతుందో లేదో తెలియదు. అంబేద్కర్ ఆశయాల కొనసాగింపూ లేదు. పైగా ఆ నిర్ణయం సాకారం కావడానికి అనేక సాంకేతిక అవరోధాలు ఉన్నాయని తెలిసి కూడ బి ఎస్ పి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ప్రజలను పక్కదారి పట్టించడానికే ఆ నిర్ణయం ప్రకటించింది. ఒకరకంగా చెప్పాలంటే అది అవకాశవాద నిర్ణయం. భారత రాజ్యాంగం ప్రకారం కొత్త రాష్ట్రాల ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వ, శాసనసభల పరిధిలో లేదు. రాష్ట్ర శాసనసభ తీర్మానం చేసినంత మాత్రాన కొత్త రాష్ట్రం ఏర్పడదు. పార్లమెంటు తలచుకుంటే, రాష్ట్ర శాసనసభ తీర్మానం చేయకపోయినా తేడా రాదు. ఈ చట్టపరమైన అంశం తెలిసినప్పటికీ ఆయా రాష్ట్రాలు కోరుతున్న ప్రజలను మభ్యపెట్టడానికే ఈ నిర్ణయం ప్రకటించడం జరిగింది. అలాగే, రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షలు ఆయా ప్రాంత ప్రజలలో భిన్నమైన స్థాయిలో ఉన్నాయి. బుందేల్ ఖండ్ ఏర్పాటు చేయాలని అక్కడి ప్రజలు గత ఆరు దశాబ్దాలుగా కోరుతుండగా, పశ్చిమ ప్రదేశ్ ఎప్పుడూ ఎవరూ కోరలేదు. ఇలా భిన్నమైన ప్రతిపాదనలను ఒకే గాటన కట్టడం సరయినది కాదు. అంతకన్న ముఖ్యంగా ప్రజల ఆకాంక్ష ప్రకారం బుందేల్ ఖండ్ లో ఏడు ఉత్తరప్రదేశ్ జిల్లాలతో పాటు, ఆరు మధ్యప్రదేశ్ జిల్లాలు కూడ ఉన్నాయి. మధ్యప్రదేశ్ ప్రాంతాల మీద తీర్మానం చేయడానికి ఉత్తరప్రదేశ్ శాసనసభకు అధికారం లేదు. విభజన సరయిన నిర్ణయమే అయినప్పటికీ, ఈ సమస్యలవల్ల జాగ్రత్తగా తీసుకోవలసిన నిర్ణయం అవుతుంది. ఎన్నికల ఎత్తుగడగా తీసుకోవలసిన నిర్ణయం కాదు. వీ

కుప్పకూలుతున్న యూరోజోన్ ఆర్థిక వ్యవస్థ


ఒకవైపు కార్పొరేట్ అక్రమాలకు, అసమానతలకు, నిరుద్యోగానికి వ్యతిరేకంగా వాల్‌స్ట్రీట్ ముట్టడి ఉద్యమం అమెరికాను మాత్రమే కాక, యూరప్‌తో సహా ప్రపంచాన్నంతా ముట్టడిస్తుండగా, మరోవైపు ఆ కార్పొరేట్ అక్రమాల వల్ల, ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వల్ల యూరప్ దేశాల ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలమవుతున్నాయి. యూరపియన్ దేశాలు ఉమ్మడి ద్రవ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలనే కోరికతో 1992లో మాస్ట్రిక్ట్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. అన్ని దేశాలు తమ రుణభారాన్ని తగ్గించుకుంటామని హామీ ఇవ్వాలనేది ఆ ఒప్పందంలో ప్రధానమైన షరతులలో ఒకటి. కాని అప్పటి నుంచే గ్రీస్, ఇటలీ వంటి దేశాలు ఈ హామీని ఉల్లంఘించడానికి అడ్డదార్లు వెతుకుతూ వచ్చాయి. ఈ అక్రమాలను సంక్లిష్టమైన, సాంకేతిక ద్రవ్య విధానాల ద్వారా అమలు చేశాయి. ఆ దేశాలకు ఈ ద్రవ్యవిధానాలను తయారుచేసి ఇచ్చినది అమెరికన్ బహుళజాతి సంస్థలు. ఇలా గ్రీస్ రుణభారం నానాటికీ పెరిగిపోవడం మొదలయి 2010 ఏప్రిల్ నాటికి భరించరాని స్థితికి చేరింది. ఆ రుణభారం కింద అణగిపోయిన పర్యాటక, నౌకా నిర్మాణ పరిశ్రమలను కాపాడడానికి సాయపడవలసిందని గ్రీస్ ప్రభుత్వం యూరపియన్ యూనియన్‌ను, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థను అభ్యర్థించింది. కాని ఒక వారంలోపే గ్రీస్ ప్రభుత్వానికి రుణ యోగ్యత లేదని, దానికి ఇచ్చిన రుణం వెనక్కి రాకపోవచ్చునని అంతర్జాతీయ పరపతి సంస్థలు ప్రకటించాయి. ఆర్థిక వ్యవస్థ ఇలా కుప్పకూలడం ప్రారంభం కాగానే గ్రీస్ ప్రభుత్వం దేశంలో పొదుపు చర్యలు ప్రకటించి ప్రధానంగా సంక్షేమ వ్యయాల మీద కోత విధించింది. ఈ పొదుపు చర్యలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ వీధుల్లోకి వచ్చారు. సమ్మెలు జరిపారు. ఈ నిరసన ప్రదర్శనలు హింసకూ రక్తపాతానికీ కూడ దారితీశాయి. ప్రభుత్వ మనుగడే అనుమానంలో పడింది. ఇటువంటి సంక్షోభమే క్రమంగా ఐర్లాండ్, పోర్చుగల్, స్పెయిన్, ఇటలీ, బ్రిటన్, బెల్జియం, ఫ్రాన్స్‌లకు కూడ వ్యాపించింది. అక్టోబర్ చివరి వారంలో సమావేశమైన 17 యూరో దేశాల ప్రతినిధులు ఈ సంక్షోభాన్ని నివారించడానికి చర్యలు ప్రతిపాదించారు. గ్రీస్ అంతర్జాతీయ బ్యాంకులకు పడిన బకాయిలో సగాన్ని రద్దు చేయాలని నిర్ణయించారు. ఇబ్బందులలో ఉన్న వ్యాపారాలకు ఆర్థిక సహాయ ఉపశమనాలు ప్రకటించారు. కాని ఈ చర్యలన్నీ తాత్కాలిక ప్రయోజనాలనే తప్ప దీర్ఘకాలిక ఫలితాన్ని ఇవ్వజాలవని పరిశీలకులు భావిస్తున్నారు. మొత్తం మీద యూరో జోన్ దేశాల ఆర్థిక వ్యవస్థలన్నీ ఎప్పుడు కూలిపోతాయో తెలియని అంచుకు చేరాయి. ఇలా యూరో ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడడం అమెరికా ఆర్థిక వ్యవస్థమీద, అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల మీద ప్రభావం వేసింది. ఇలా ఇటు కింద ప్రజల వైపు నుంచి ఆందోళనలు, అటుపైన పాలకవర్గాల వైపు నుంచి అక్రమాలతో ఇంతగా సంక్షోభ స్థితి ఉండడం నిజమైన ప్రజాశక్తులకు గొప్ప అవకాశం. ప్రజాశక్తులు ఈ అవకాశాన్ని వాడుకుని ప్రత్యామ్నాయ సామాజిక రాజకీయార్థిక వ్యవస్థలను నిర్మించగలగాలి. ఇప్పటికిప్పుడు ఆ శక్తి సామర్థ్యాలు లేకపోయినా, ఇటువంటి సంక్షోభాలు పెట్టుబడిదారీ వ్యవస్థలో నిత్యమూ తలెత్తుతుంటాయి గనుక మరుసటి సంక్షోభ సమయానికైనా తమను తాము సంసిద్ధం చేసుకోవలసిన బాధ్యత ప్రజాశక్తుల మీద ఉంది. వీ












- **మాకూ కలలున్నాయి** – ఎం. రాఘవాచారి వ్యాసాలు – పాలమూరు అధ్యయన వేదిక ప్రచురణలు – 164 పేజీలు, 1/8 డెమీ, రు : 60, ప్రతులకు : ఎం. రాఘవాచారి, ఫ్లాట్ నెం. 41, శాంతి చంద్రిక, ఇ.నెం. 3–148, బాలాజీనగర్, మహబూబ్‌నగర్, సెల్ : 94909097972; దిశ, సహచర, నవోదయ, విశాలాంధ్ర, ప్రజాశక్తి పుస్తక షాపుల్లో
- **జయశంకరా** – యాదిమరువని పాటలు – సంపాదకుడు: జూలూరు గౌరీశంకర్ – తెలంగాణ రచయితల వేదిక – 92 పేజీలు, 1/8 డెమీ, రు : 40
- **పొంతకుండ** – తెలంగాణ కవిత్వం – జూలూరు గౌరీశంకర్ – తెలంగాణ రచయితల వేదిక – 84 పేజీలు, 1/8 డెమీ, రు : 50


పై రెండు ప్రతులకు : జూలూరు గౌరీశంకర్, 1–8–702/33/20ఎ, పద్మాకాలనీ, నల్లకుంట, హైదరాబాద్ – 500 044


- **కళారవీ! కవీ!** – (శ్రీశ్రీ శతజయంతి ప్రత్యేక వ్యాస సంపుటి) – డా. వి. వీరాచారి – ప్రజాహిత ప్రచురణలు – 92 పేజీలు, 1/8 డెమీ, రు : 80, ప్రతులకు : ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు, రెవెన్యూ కాలనీ, హన్మకొండ; డా. వి. వీరాచారి, ఇ.నెం. 3–83, శ్రీ వేంకటేశ్వర కాలనీ, గోపాలపురం గ్రా., హనుమకొండ మం. వరంగల్ – 506 015
- **దిమ్మిస** – వినిర్మాణ కవిత్వం – 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం – 87 పేజీలు, 1/8 డెమీ, రు : 25, ప్రతులకు : యూసుఫ్, 10–1–639, చింతల్‌బస్తి, ఖైరతాబాద్, హైదరాబాద్ – 500 004; పసునూరి రవిందర్, ఫ్లాట్ నెం. 406, గుల్‌మోహార్ పార్క్ కాలనీ, శేరీలింగంపల్లి, హైదరాబాద్ – 500 010, సెల్ : 7702648825; అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలలో
- **స్మశానం దున్నేరు** – డా. కేశవరెడ్డి – హైదరాబాద్ బుక్ ట్రస్ట్, – 161 పేజీలు, 1/8 డెమీ, రు : 80, ప్రతులకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫ్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500067, సెల్ : 040 23521849, www.hyderabadbooktrust.blogspot.com
- **ముఫియాస్కో** – (హాస్య వ్యంగ్య కథలు) నిష్టల వెంకటరావు – విశాఖ సారస్వత వేదిక – 102 పేజీలు, 1/8 డెమీ, రు : 50, ప్రతులకు : నిష్టల వెంకటరావు, 9–32–10, శుభ రెసిడెన్సీ, పిఠాపురం కాలనీ, సెక్టర్ 12, విశాఖపట్టణం – 530 003
- **వానలో కొబ్బరిచెట్టు** – హెచ్చార్కె – పాలపిట్ట బుక్స్ – 100 పేజీలు, 1/8 డెమీ, రు : 50, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16–11–20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500 036. ఫోన్ : 9848787284, palapittabooks@gmail.com
- **అర్థశాస్త్ర సిద్ధాంతాలు ఓ మిథ్య** – సిర్‌గాపూర్ విద్యాసాగర్ రెడ్డి – తెలుగు అనువాదం : నిజాం వెంకటేశం – పాలపిట్ట బుక్స్ – 96 పేజీలు, 1/8 డెమీ, రు : 60, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, ఫ్లాట్ నెం. 3, ఎం.ఐ.జి.–2, బ్లాక్ – 6, ఎ.పి.ఎచ్.బి., బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్– 500 044. ఫోన్ : 040–27678430, palapittabooks@gmail.com
- **క్రీడాభిరామం** – సి. వెంకటేష్ – రీతిక పబ్లికేషన్స్ – 171 పేజీలు, 1/8 డెమీ, రు : 90, ప్రతులకు : రీతిక పబ్లికేషన్స్, 105, ఇన్‌టెక్ రెసిడెన్సీ, 6–2–969, ఖైరతాబాద్ (వెస్ట్), హైదరాబాద్ – 500 004











జన్యుమార్పిడి పంటల పరిశీలనకు కమిటీ

జన్యుమార్పిడి పంటల పరిశోధనా క్షేత్రాలను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. సెంటర్ ఫర్ సెల్యూలార్, మాలుక్యులార్ బయాలజీ (సిసిఎంబి) వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ పి.ఎం. భార్గవను ఈ కమిటీకి నామినేట్ చేసింది. గతంలోనే ఏర్పాటు చేసిన ఈ కమిటీలో సిసిఎంబి, అటవీ పర్యావరణ శాఖ నుంచి ప్రతినిధులు లేరు. తాజాగా ఈ ప్రతినిధులకు చోటు కల్పించింది.

మూడోవంతు జనాభా పట్టణాల్లోనే..

2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 8.46 కోట్లు కాగా, ఇందులో పట్టణ ప్రాంత జనాభా 2.83 కోట్లు వీరిలో 90.01 లక్షల మంది మురికి వాడల్లో నివసిస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం గుర్తించిన మురికివాడలే 7520. 1901లో పట్టణాలలో జనాభా 9.65 శాతం మాత్రమే. 2001 నాటికి అంటే వంద ఏళ్లలో పట్టణ జనాభా 27.08 శాతానికి చేరింది. అంటే మూడు రెట్లు పెరిగింది. 2011 లెక్కల నాటికి రాష్ట్రంలో పట్టణ జనాభా 34 శాతానికి చేరింది. పట్టణ జనాభా జాతీయ సగటు 31.16 శాతం మాత్రమే కావడం గమనార్హం.

సకల జనుల సమ్మె విరమణ

సెప్టెంబర్ 13న మొదలయిన సకల జనుల సమ్మె 42 రోజుల పాటు సాగింది. తెలంగాణ ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగ సంఘాల నేతలు మంత్రివర్గ ఉపసంఘం తోనూ, ఉప ముఖ్యమంత్రితోనూ, ముఖ్యమంత్రితోనూ చర్చించి అక్టోబర్ 24న సమ్మె విరమణను ప్రకటించారు. ఎస్మా, జివొ 177 రద్దు, సమ్మెకాలాన్ని సెలవుగా పరిగణించడం వంటి తొమ్మిది అంశాలపై ఒప్పందం జరిగింది. తెలంగాణ రాజకీయ జె.ఎ.సి పిలుపు మేరకు, తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు 42 రోజులు సమ్మెలో పాల్గొన్నట్లు ఉద్యోగ సంఘాల నాయకులు ప్రకటించారు.

అవసరాల రామకృష్ణారావు కన్నుమూత

నాలుగు దశాబ్దాల పాటు సాహిత్య వనంలో నవ్వులు పువ్వులు పూయించిన అవసరాల రామకృష్ణారావు (81) అక్టోబర్ 28న హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో కన్నుమూసారు. ఆయన 1931 డిసెంబర్ 21న చెన్నైలో పుట్టారు. తన 15వ ఏట 'పిచ్చుక' (1947) అనే కథ రాశారు. ఆయన మొత్తంగా 600 కథలు రాశారు. చిన్నపిల్లలకోసం ప్రత్యేకంగా రచనలు చేశారు. ఇంకా గణితం, ఇంగ్లీష్‌లపై పుస్తకాలు రాశారు. మొత్తం ఎనిమిది నవలలు రాశారు.

కొనసాగుతున్న రైతుల ఆత్మహత్యలు

రాష్ట్రంలో కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, మెదక్, మహబూబ్‌నగర్ ఈ ఆరు జిల్లాల్లోనే గత నెల రోజుల్లో 90 మంది రైతులు ఆత్మహత్యచేసుకున్నారు. దిగుబడులు తక్కువ రావడం పంటలు ఎండిపోవడం ఇప్పటికి కారణాలుగా కనిపిస్తున్నా పేరుకుపోయిన అప్పులు, నిరాశ నిస్పృలు ఆత్మహత్యలకు కారణాలుగా ఉన్నాయి. రైతు స్వరాజ్య వేదిక తరఫున వివిధ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాసాయి.

అత్యాచారం కేసుల్లో ఆరవ స్థానం

దేశంలోని 35 ప్రధాన నగరాల్లో రాజధాని ఢిల్లీలోనే మహిళలపై అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. రాష్ట్రాల్లో అయితే ఈ విషయంలో మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ ఆరవ స్థానంలో ఉంది. దేశంలోని వివిధ నగరాల్లోనూ, వివిధ రాష్ట్రాల్లోనూ 2010లో జరిగిన అత్యాచారాలు, ఇతర నేర సంఘటనలపై జాతీయ క్రైం కంట్రోల్ బ్యూరో (సిసిబి) సమర్పించిన నివేదికలోని ఈ లెక్కలను ప్రభుత్వం అక్టోబర్ 27న విడుదల చేసింది. 3125 అత్యాచారం కేసులతో మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. పశ్చిమబెంగాల్-2311, అసోం-1721, మహారాష్ట్ర-1599, ఉత్తరప్రదేశ్-1563, ఆంధ్రప్రదేశ్-1362, ఒడిశా-1025, చత్తీస్‌గఢ్-1112లతో వరుస స్థానాల్లో ఉన్నాయి.

గోపులింగారెడ్డి మృతి

కవి, రచయిత, జానపద సాహిత్య పరిశోధకులు డా. గోపులింగా రెడ్డి (61) అక్టోబర్ 30న కరీంనగర్‌లో గుండెపోటుతో మరణించారు. ఆయన 1970 జూలై 4న ఆవిర్భవించిన 'విప్లవ రచయితల సంఘం' (విరసం) లో వ్యవస్థాపక సభ్యులు. హైదరాబాద్ సిటీ విరసం యూనిట్‌కు నాలుగు సంవత్సరాలు కన్వీనర్‌గా పనిచేశారు. 1979 కరీంనగర్ జిల్లాలోని కవులు రచయితలతో కలిసి 'వికాస సాహితీ' అనే సంస్థను స్థాపించారు. 1990లో కరీంనగర్ జిల్లాలోని సాహితీ సంస్థలన్నిటినీ ఒక వేదికపై తీసుకువచ్చి 'సాహితీ గౌతమి'ని స్థాపించారు. 1969లో మిత్రులతో కలిసి 'విద్యుల్లత' సాహితీ మాస పత్రికను ప్రచురించారు. తెలంగాణలోని తొమ్మిది జిల్లాలలో ఏడు సంవత్సరాలు పర్యటించి రెండు వేల జానపద గేయాలను సేకరించారు. తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్, తెలంగాణ లెక్చరర్ల ఫోరం, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ ఫోరం ఏర్పాటులో ప్రముఖ పాత్ర వహించారు. కరీంనగర్ జిల్లా తెలంగాణ విద్యావంతుల వేదిక స్థాపకుల్లో ఒకరిగా క్రియాశీల పాత్ర వహించారు.

చెరుకు సుధాకర్ అరెస్ట్

తెలంగాణ రాష్ట్ర సమితి ముఖ్యనేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు, నల్గొండ జిల్లాలో వైద్యునిగా ప్రసిద్ధుడైన చెరుకు సధాకర్‌ను నవంబర్ 4న అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేసి వరంగల్ సెంట్రల్ జైలుకు తరలించారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా పలు హింసాత్మక సంఘటనల్లో పాలుపంచుకున్నారంటూ ఆయనపై పిడి ఆక్ట్ ప్రయోగించారు. ఆయన విడుదలకై పెద్ద ఎత్తున నిరసనలు, సభలతో సహా ఉద్యమిస్తున్నారు. వీ

హిందుత్వ నినాదంతో ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి, అధికారం చేపడదామనుకుంటున్న బిజెపి హిందూ మతోన్మాద రాజకీయాలను, కుటిల నీతిని వివరిస్తున్నారు **డి.వి. రామకృష్ణారావు**

సద్భావన - రథయాత్ర - దేశ భవిష్యత్తు

శాంతి, మత సామరస్యం కోసం అంటూ గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీ తన 62వ పుట్టిన రోజున సద్భావన దీక్ష చేపట్టాడు. సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు ఆ దీక్ష కొనసాగింది. అహ్మదాబాద్‌లోని గుజరాత్ యునివర్సిటీలో ఎసి కన్వెన్షన్ సెంటర్‌లో దీక్షకు కూర్చున్నాడు. మోడీ దీక్షకు మద్దతు పలికేందుకు భారతీయ జనతా పార్టీ (బి.జె.పి.) అగ్రనేతలు ఎల్.కె. అద్వానీ, రాజ్‌నాథ్ సింగ్ అరుణ్‌జైట్లీ తదితరులు, పంజాబ్ ముఖ్యమంత్రి ప్రకాశ్‌సింగ్ బాదల్, అన్నా డి.ఎం.కె నేతలు ఎం. తంబిదురై, వి. మైత్రేయన్‌లు తరలివచ్చారు. తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత తన సందేశాన్ని పంపారు.

ఈ సందర్భంగా బి.జె.పి నేతలు మాట్లాడుతూ దేశమంతటా అవినీతి, నీరాశలు తాండవిస్తుంటే గుజరాత్ అభివృద్ధి పథంలో దూసుకపోతోందని కితాబిచ్చారు. పార్టీ అధ్యక్షుడు నితిన్ గడ్కారీ మోడీతో తనకు గల దూరాన్ని అనారోగ్యకారణంతో వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ 'నాగరిక సమాజంలో గుజరాత్ వంటి అల్లర్లు జరగకూడదని అప్పుడే (2002లో) చెప్పాను. ఇప్పుడు కూడా బాధపడుతూనే ఉన్నాను' అని పేర్కొన్నాడు. తన మీద రాళ్లు వేస్తే వాటినే అభివృద్ధికి మెట్లుగా ఉపయోగించుకున్నానని మోడీ పేర్కొన్నాడు. 2002 అల్లర్లతో తమ ప్రతిష్ఠ దిగజార్చే ప్రయత్నం ప్రతిపక్షాలు చేశాయని, తన వాదనను ఎవరు పట్టించుకోలేదనీ పేర్కొన్నాడు.

ఎహసాన్ జాఫ్రీ హత్య కేసులో సుప్రీం కోర్టు ఉత్తర్వులను ఇవ్వడానికి నిరాకరించడంతో పాటు, నరేంద్రమోడీకి ప్రధాన మంత్రి అభ్యర్థిగా అన్ని అర్హతలూ ఉన్నాయని అమెరికా కాంగ్రెషనల్ రిసెర్చి సర్వీసెస్ సంస్థ నివేదిక అభివర్ణించిన నేపథ్యంలో ఆయన ఈ 'సద్భావన దీక్ష' ను ప్రారంభించాడు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే, ఇదే అమెరికా, గుజరాత్ అల్లర్ల నేపథ్యంలో అమెరికాలో ఒక కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉన్న సందర్భంలో మోడీకి వీసా నిరాకరించింది. మళ్లీ ఇప్పుడు భారతదేశంలో తన సామ్రాజ్యవాద వ్యాపార ప్రయోజనాల కొనసాగింపుకు ఒక నాయకున్ని వెతుక్కుంటోంది.

సంఘపరివార్, దాని మానసపుత్రిక బి.జె.పి రాజకీయ స్వభావాన్ని, పొంచి ఉన్న ప్రమాదాన్ని మరోసారి ఈ 'సద్భావన' సందర్భంలో మనం అంచనా వేసుకోవాలి. ఆర్.ఎస్.ఎస్, బి.జె.పిల నినాదం హిందుత్వ జాతీయవాదం. ఆ నినాదంతో మెజారిటీలకు మైనారిటీలను ప్రమాదకారులుగా చూపించి, మైనారిటీలను తమకు అధీనంలో ఉండేలా అణచివేసి మెజారిటీ, మైనారిటీ విభజనతో రాజకీయాలను నడపడమే వాటి ఉద్దేశ్యం. ఆ రాజకీయాలతోనే ఇంతింతై వటుడింతై అన్నట్లు బి.జె.పి ఈ దేశంలో 1984 నుంచి క్రమంగా ఎదిగింది. అంతకు ముందు భారతీయ జనసంఘ్‌గా ఉండి 1980లో భారతీయ జనతా పార్టీగా ఏర్పడింది. 1984లో కేవలం రెండు పార్లమెంట్ సీట్లు మాత్రమే కలిగి ఉన్న బి.జె.పి రథయాత్రలు, అయోధ్య కాండతో తన బలాన్ని పుంజుకుంది. వరుసగా 1989 పార్లమెంట్ ఎన్నికల్లో 85 సీట్లు, 1991లో 120 సీట్లు, 1996 ఎన్నికల్లో 161 సీట్లు, 1998 ఎన్నికల్లో 182 సీట్లు, 1999 ఎన్నికల్లో 182 సీట్లు సాధించుకుంది. ఆ పార్టీ తరపున మూడు సార్లు అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధాన మంత్రి పదవిని చేపట్టారు. గుజరాత్ మారణకాండ ఉత్సాహంతో దేశవ్యాప్తంగా తన హిందుత్వ ఎజెండాను మోడీ నమూనాతో విస్తరించాలని బి.జె.పి. పథకాలు వేసింది. కానీ బి.జె.పి పతనానికి బీజాలు 2002 గుజరాత్‌లోనే పడ్డాయి. ఆ ఫలితంగా 2004 పార్లమెంట్ ఎన్నికల్లో 138 సీట్లతో సరిపుచ్చుకుంది. 2009 ఎన్నికల నాటికి 116 సీట్లతో సర్దుకోవాల్సి వచ్చింది. ఈ పరిణామాలతో హిందుత్వ వాదులకు కేవలం రాముడి పేరు మీద, ముస్లిం వ్యతిరేకత మీద ఇంకెంత మాత్రం రాజకీయ లబ్ధి పొందలేమని అర్థమయింది. గుజరాత్‌లోనూ మోడీ నాయకత్వంలో బి.జె.పి 2002 అసెంబ్లీ ఎన్నికల్లో 126 సీట్లు సాధించగా, 2007 ఎన్నికల్లో 117 సీట్లతో సరిపుచ్చుకుంది. కేవలం ఓట్లు, ఎన్నికలే ప్రజాభిప్రాయానికి ప్రతీకలు కాకపోయినప్పటికీ అవి ప్రజల అసంతృప్తులకు సూచికగా ఉన్నాయి.

ఇప్పుడు మళ్లీ రాబోతున్న అసెంబ్లీ ఎన్నికలు, ఆ తరువాత పార్లమెంట్ ఎన్నికల కోసం కసరత్తులు మొదలయ్యాయి. కేవలం ఒక సమూహం ప్రజలపై ద్వేషభావంతో, ఉద్వేగాలను ఎగదోసి అధికారాన్ని చేపట్టలేమని బి.జె.పికి అవగతమవుతోంది. ఆ క్రమంలోనే 'అభివృద్ధి', 'అవినీతి'కి వ్యతిరేకంగా పోరాటం అనే నినాదాలను, అలాంటి కొన్ని పద ప్రయోగాలు, పటాటోపాలతో బి.జె.పి ముందుకు వస్తోంది. బి.జె.పి నినాదాల చరిత్ర మనకు తెలిసినదే. పి.వి. నరసింహరావు, మన్‌మోహన్ సింగ్‌ల నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1991 నుంచి అమలు చేసిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను ఎన్.డి.ఎ ఆధ్వర్యంలోని అటల్ బిహారీ వాజ్‌పాయి ప్రభుత్వం 'స్వదేశీ' నినాదం పక్కకుపెట్టి(?) తు.చ తప్పకుండా అమలుచేయడం మనకు తెలిసినదే.

సాటి మనుషులపై, వివిధ విశ్వాసాలున్న సమూహాలపై వ్యతిరేకత ఆధారంగా, మనుషులకున్న నమ్మకాలు, ఉద్వేగాల ఆధారంగా మళ్లీ

మళ్లీ బి.జె.పి అధికారం అందుకోవాలని చూస్తోంది. బి.జె.పి తెస్తున్న హిందూత్వ నినాదానికి మూలాలు కేవలం మూడు శాతంగా ఉన్న హిందూ బ్రాహ్మణీయ భావజాలంలో ఉన్నాయి. ఈ హిందూత్వ భావజాలంతో హిందూత్వవాదులు ఈ దేశంలోని ఆదివాసులపై, దళితులపై, మహిళలపై, ముస్లిం మైనారిటీలపై చేసిన దాడుల చరిత్ర మనకు తెలుసు. అవి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉంది.

అంతర్జాతీయంగా పెట్రోలు కోసం సద్దాం హుస్సేన్, అతని కొడుకులను చంపి, లక్షలాది మంది ఇరాక్ ప్రజలను చంపి, మొన్న లాడెన్‌ను చంపి, నిన్న గడ్డాఫిని చంపి ముస్లింలపైన, అరబ్బు ప్రపంచంపైన తీవ్రవాదంపై యుద్ధం పేరుతో దురాక్రమణలను అమెరికా కొనసాగిస్తోంది. ఇప్పుడు భారతదేశంలోని బి.జె.పి వైపు చూస్తోంది. ఇటు బి.జె.పికున్న ముస్లిం వ్యతిరేకత, అటు అమెరికాకున్న ముస్లిం వ్యతిరేకత కలిసి మన మీద రాజ్యం చేయడానికి వస్తున్న సందర్భం కానవస్తోంది. భారత్ సహకారంతో పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకలపైన మొత్తంగా దక్షిణాసియాపై తన పట్టుకోసం ప్రయత్నిస్తోంది. దీనర్థం కాంగ్రెస్ ఏదో లౌకిక రాజకీయాలు వెలగబెట్టిందని కాదు. గుజరాత్‌లోని ఒక సామాన్య ముస్లిం మహిళ బి.జె.పి., కాంగ్రెస్‌ల గురించి–'బి.జె.పి, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకే నాణానికి బొమ్మా బొరుసూ లాంటివి. కాంగ్రెస్ ముస్లిం శవాలను చూపించి రాజకీయాలు చేసి అధికారంలోకి రావాలని చూస్తోంది. బి.జె.పి ముస్లింలను చూపించి, చంపి అధికారంలోకి రావాలని చూస్తోంది' అని వ్యాఖ్యానించింది.

అయితే హిందూత్వ నినాదంకు మన సమాజంలో బలం ఎక్కడుంది అని చూస్తే అది మన సమాజంలోని మధ్యతరగతిలో ఉంది. నూతన ఆర్థిక విధానాలతో కొన్ని ఫలాలను అందుకొన్న ఈ దేశ మధ్యతరగతి స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి తన క్రియాశీలక పాత్రను కోల్పోయింది. అందిన అవకాశాలతో ఇళ్లు, మేడలు కట్టుకోవడం, కార్లు కొనుక్కోవడం, వస్తువులు బంగారం కొనుక్కోవడం, ఖరీదైన వైద్యం, పిల్లలకు ఖరీదైన చదువులు కొనుక్కోవడం, బ్యాంక్ ఎకౌంట్లు సరిచూసుకోవడం, ఫైనాన్స్‌లు, షేర్లలో డబ్బులు పెట్టడం, చిట్టీలు కట్టడం, డబ్బులు మిత్తికి తిప్పడం, విదేశాల్లోనో, ఉన్నత పదవుల్లోనో స్థిరపడిన తమ పిల్లల ఆదాయాల్లోని మిగులును స్థిరాస్తులుగా మలచడంలో విరామం లేకుండా మునిగిపోయింది. తమ ఆస్తులకు, భద్రతకు అట్టడుగువర్గాల ప్రజలను ప్రమాద కారులుగా చూసే ధోరణి వచ్చేసింది. జాతీయోద్యమ కాలంలో సృజనాత్మకంగా, క్రియాశీలకంగా ఉన్న ఈ వర్గం తన క్రియాశీలతను కోల్పోయింది.

ఈ దేశంలోని వివిధ సమూహాల, వివిధ అస్తిత్వాల ప్రజల ప్రజాస్వామిక ప్రశ్నలు ముందుకు వచ్చాక కూడా హిందూత్వ నినాదంకు బలం ఎక్కడి నుంచి వస్తోందో మనం ఆలోచించాలి. ఈ దేశంలోని జనాభాలో అత్యధికంగా పేదలుగా ఉన్న దళితులు, ఆదివాసులు, బహుజనులను తన నినాదం వైపుకు సంఘపరివార్ శక్తులు ఎలా ఆకర్షించగలుగుతున్నాయో ఆలోచించాలి. ఆధునికత, ఆధునిక సౌకర్యాలు, శాస్త్రీయ పరిశోధనా ఫలాలు ఈ దేశంలోని సామాన్యులకు అందడం లేదు. తాయత్తులు, విబూది, రుద్రాక్షలు, కన్నీటి ప్రార్థనలే సామాన్యులకు ఈ నాటికీ 'రక్షణ'గా ఉన్నాయి. సరైన మంచినీళ్లు కూడా దొరక్క అతిసార వ్యాధులతో, విషజ్వరాలతో ఏజెన్సీ ప్రాంతాల్లో మొదలుపెట్టి, గ్రామాల్లో, పట్టణ మురికి వాడల్లో వేలాది మంది ప్రజలు ఏట చనిపోతూనే ఉన్నారు. మనుషుల ఈ బలహీన పరిస్థితిపై మత విశ్వాసాలు పాదుకుంటున్నాయి. ఆకలి, నిరుద్యోగం, వైద్య సదుపాయాలు అందని స్థితిలో ప్రజలు మధ్య యుగాల నాటి మత భావనలను ఆశ్రయిస్తున్న పరిస్థితి ఉంది.

బి.జె.పి దేశంలో ఉన్న సామాజిక స్థితిని ఆసరాచేసుకొని హిందూ సాంస్కృతిక పునరుద్ధరణకు తన ప్రయత్నాల్ని ముమ్మరం చేస్తోంది. హిందూ జాతీయతావాదం, హిందూ సాంస్కృతిక పునరుద్ధరణ వాదాలతో ముందుకు వస్తోంది. పెరిగిన చైతన్యంతో ఈ దేశంలోని దళితులు, ఆదివాసులు, మహిళలు, ముస్లిం మైనారిటీలు ఈ పోకడలను ప్రశ్నిస్తున్నారు. తిరస్కరిస్తున్నారు.

భారత రాజ్యాంగంలోని పీఠికలో రాసుకున్న సెక్యులర్, సోషలిస్టు వంటి పదాల జాడేలేకుండా చేసే ప్రయత్నాలు ఆచరణలో సాగుతున్నాయి. రాజ్యాంగంలో రాసుకున్న కనీస, మౌలిక విలువల వైపు కూడా మనం ప్రయాణించలేకపోయాం. పాలకులు చరిత్ర పొడవునా సెక్యులర్ భావనకు తూట్లు పొడుస్తూ వచ్చారు. మతం ఒక వ్యక్తిగత వ్యవహారం అనేది ఆధునిక భావన అయితే, ఆ భావనకు తూట్లు పొడిచి మతం రాజ్యాధికారానికి సోపానంగా మార్చుకున్నారు. సున్నితమైన వ్యక్తిగత నమ్మకాలపై మళ్లీ మళ్లీ రాజ్యాధికార దాహంతో రక్తక్రీడను నడిపిస్తున్నారు. పాలకులుగాని, బ్యూరోక్రాట్లుగాని మతంతో సంబంధంలేని లౌకిక భావనను వ్యక్తంచేయడం మనం వెతుకుదామన్న దొరకదు. ఇటీవల ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ లోకూర్ పోయి తిరుపతి ధ్వజ స్తంభానికి మొక్కుకుంటారు. మన రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఎవరికి అందుబాటులో ఉన్నా, లేకున్నా ఏదో ఒక వెంకటేశ్వర ఆలయంలో కచ్చితంగా ఉంటారు. ఇక మన ఇస్రో శాస్త్రవేత్తలు పూజలు చేయకుండా, కొబ్బరికాయలు కొట్టకుండా తమ పరిశోధనలను ప్రారంభించడానికే భయపడిపోతారు. ఇలా పాఠశాలలు, ఆస్పత్రులు, పనిచేసే కార్యాలయాలు, కార్ఖానాలు మతంతో కలిసిపోయి నడుస్తాయి. శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం, కొత్త ప్రశ్నలకు, కొత్త ఆలోచనలకు అవకాశమే లేకుండా ఉన్నాయి.

మన నగరాల చరిత్ర చూస్తే అవి పరిపాలన కేంద్రాలుగాను, దేవలయాల కేంద్రాలుగాను ఏర్పడ్డాయి తప్ప పారిశ్రామిక ప్రగతి వల్ల కావు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రతి కొత్త ప్రభుత్వ మంత్రులూ, ఎం.ఎల్.ఎ.లూ వాస్తు పేరిట కోట్లాది రూపాయల ప్రజా ధనం ఖర్చుచేయడం మనకు తెలిసినదే. సాయిబాబాలూ, దైవజ్ఞ శర్మలూ, రాజు భయ్యాలూ, తాంత్రిక స్వాములూ ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఆశీస్సులు అందిస్తూనే ఉంటారు. ముఖేశ్ అంబానీ 30 వేల కోట్లతో (ఒక మనిషి జీవించడానికి ఇంత ఇల్లు అవసరమా అనేది వేరే చర్చ) ఇల్లు కట్టి వాస్తు బాగులేదనే మీమాంసతో ఇంట్లోకి వెళ్లడానికి వెనుకడుగు వేస్తాడు. సాయిబాబా చనిపోతే ఆ చావు కబురు కూడా ఆస్తి పంపకాలు అయ్యేదాక చెప్పలేని పరిస్థితి ఒక పక్కనుంటే, మన ఏలికలూ, సినిమా తారలూ, టెండూల్కర్‌లూ అక్కడ ఏడ్చి వాటికి సాధికారత కల్పిస్తారు. మన అజ్ఞానంపై రాజ్యం ఇలా తన పాలన సాగిస్తూనే ఉంది. మరి మన దేశంలో లౌకికత ఎక్కడ ఉంది అని చూస్తే అది అట్టడుగు వర్గాల ప్రజల సహజీవనంలో ఉంది. మురికివాడల్లో ఉంది. బతుకుదెరువుకు వలసపోయి సమష్టిగా జీవిస్తున్న సామాన్యుల జీవితాల్లో ఉంది.

సామ్రాజ్యవాదం-ముస్లిం సమాజంపై దాడులు అన్న అంశంపై ఆర్.ఎస్. రావు మాట్లాడుతూ మతంకు రాజ్యంతో ఉన్న సంబంధాన్ని ఇలా విశ్లేషించారు - 'ప్రకృతి కేంద్రంగా ఉత్పత్తి ఉండేటటువంటి సమాజాలకు మతం ఒక అవసరంగా ఉంటుంది. ప్రకృతి మీద ఆధారపడేటటువంటి సమాజాలకి తమ శ్రమ మీద తమకు ఉండవలసిన అవగాహన తక్కువగా ఉంటుంది. భూస్వామ్య సమాజంలో అయితే తమని పాలించే రాజు సాక్షాత్తు విష్ణువే. భూస్వామ్య వ్యవస్థలో ఎవరికి ఎక్కువ భూమి ఉంటే వాడే రాజు. పెట్టుబడిదారీ సమాజం వచ్చాక రాజ్యానికి మతానికి దూరం చాలా పెరిగిపోయింది. పాశ్చాత్య దేశాలలో రాజ్యంపై చర్చ్‌కి ఉన్న ఆధిపత్యం సన్నగిల్లింది. రాజ్యాన్ని వదిలిన మతం పౌర సమాజంలోకి వెళ్లింది. ఇప్పుడు సమాజంలో ఇంకా ఎక్కువ పాత్ర పోషించాల్సిన అవసరం మతానికి ఏర్పడిపోయింది. 'సెక్యులరిజం' అని ఎవరైన మాట్లాడుతున్నారంటే, అది పెట్టుబడిదారీ సమాజం ఆవిర్భవించిన తరువాత జరిగిన పరిణామాల గురించి మాట్లాడు తున్నారని అర్థం చేసుకోవాలి. సెక్యులరిజం అంటే మతాన్ని రాజ్యానికి దూరంగా పెట్టడం. రాజ్యానికి, ప్రజలకు మధ్యగల సంబంధాలను, విభేదాలను రాజ్యమే పరిష్కరిస్తుంది. మతం పరిష్కరించదు. ప్రజలకి ప్రజలకి మధ్య విభేదాలను పరిష్కరించడంలో మతం పాత్ర శూన్యం. అంటే మరి ప్రజలకు మతం అక్కరలేదా అంటే ఉండొచ్చు-ఎవరింట్లో వాళ్లకి, నాలుగు గోడల మధ్యలో... అంతా వ్యక్తిగతం అని అంటారు. లౌకికవాదం పెట్టుబడికి ఉంటే, లౌక్యమనేది సామ్రాజ్యవాదానికి ఉంటుంది అని అంటారు.

పెట్టుబడిదారీ సమాజం లేని దేశంలోకి పెట్టుబడి ప్రవేశించి నపుడు అప్పుడది హింసాత్మకమవుతుంది. రాజ్యాధికారం కావాలను కంటుంది. రాజ్య రక్షణ కావాలనుకుంటుంది. స్థానిక సంస్కృతితోటి, స్థానిక ఆర్థిక నాయకత్వంతో కలిసిపోవాలి. అలా కలిసిపోయి తనకు అనుకూలంగా తయారు చేసుకుంటుంది. ప్రజా రాజకీయాలన్ని ఓట్ల రాజకీయాల్లో భాగమయిపోయాయి. ఈ ఓట్ల రాజకీయాల్లోకి మతాన్ని తీసుకువస్తున్నారు. ప్రజా రాజకీయాలతో మతాన్ని మనమంతా బయటకు పంపాలి' అని అంటారు.

మన దేశంలో సామ్రాజ్యవాదం ఒక ఫాసిస్టు స్వభావంతో ముందుకు వస్తోంది. అది మన నెత్తిన అణుకుంపటిని పెట్టి, మన ఖనిజాలను దోచుకెళ్లడానికి వస్తోంది. మనల్ని జీవితం నుంచి బేదఖలు చేసి మత విద్వేషాలలో పరిష్కారాలు చూపించాలని అనుకుంటోంది. ఈ నేపథ్యంలో మన సమాజానికి హిందూత్వ మతోన్మాద ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే అజ్మీర్, మక్కా మసీద్, మాలేగాం, మొదసా, సంఝౌతా ఎక్స్‌ప్రెస్ పేలుళ్ల వెనక ఉన్నది సంఘపరివార్ అనుబంధ శక్తులనేది బయటపడింది. ఈ హిందూత్వ శక్తులకు పోలీసు అధికారులు, సైనికాధికారులు, బ్యూరోక్రాట్ల అండదండలు ఉన్నట్లూ బయటపడింది. ఇలాగా ఒక ప్రణాళికా బద్ధంగా విద్య, చరిత్ర, సామాజిక, రాజకీయార్థికానికి సంబంధించిన అన్ని వేదికలలోకి తన కాషాయీకరణ ఎజెండాను సంఘ్‌పరివార్, బి.జె.పి శక్తులు ముందుకు తీసుకెళు తున్నాయి. ఈ దేశ ప్రజల మెడలపై హిందూ మతోన్మాద కత్తి వేలాడుతూనే ఉంది. ఈ దేశ విభజన, దేశ స్వాతంత్ర్యాల పునాదిలో పది లక్షలకు పైగా హిందూ, ముస్లిం ప్రజల రక్తం పారింది. ఈ దేశ పుట్టుక మత విద్వేషాల రక్త తర్పణతో మొదలైంది. దేశంలోనూ, ప్రపంచంలోనూ ప్రకృతి బీభత్సాల తర్వాత మనుషులు అత్యధికంగా చనిపోయింది మతపరమైన హింసాకాండల్లోనే. మనం చైతన్యంతో సమిష్టి జీవితంలోకి, పరస్పర సహకార జీవితంలోకి నడవాల్సి ఉంది.

మోడీ తన సద్భావన దీక్షను ముగిస్తూ తనకు మెజారిటీ మైనారిటీ అనే భేదమేమి లేదని, ఆరు కోట్ల గుజరాత్ ప్రజల అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్నాడు. కాని ఆయన నడిచి వచ్చిన చరిత్రంతా మైనారిటీలపై విద్వేషంపైనే ఆధారపడి ఉంది. గుజరాత్‌లో ముస్లింల పరిస్థితులను చూస్తే 2010-2011 సంవత్సరానికి గాను గుజరాత్‌లో మైనార్టీ విద్యార్థులు పొందాల్సిన స్కాలర్‌షిప్‌లు 52 వేలకు పైచిలుకు కాగా మోడీ ప్రభుత్వం అసలు స్కాలర్‌షిప్‌లే మంజూరుచెయ్యలేదు. అదే కాలంలో వేరే రాష్ట్రాలతో పోల్చిచూస్తే ఉత్తరప్రదేశ్‌లో నాలుగున్నర లక్షలకు పైగా, బీహార్‌లో మూడు లక్షలకు పైగా, బెంగాల్‌లో తొమ్మిది లక్షలకు పైగా మైనారిటీ విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు పొందారు. ఇందులో డెబ్బై అయిదు శాతం వాటా కేంద్ర ప్రభుత్వం భరించింది. పట్టణాల్లో ముస్లింల పరిస్థితి పై కులాల హిందువులతో పోల్చి చూస్తే ఎనిమిది రెట్లు పేదరికంలో ఉన్నారు. బ్యాంక్ ఖాతాలలో జనాభా ప్రాతిపదికన పన్నెండు శాతం ఖాతాలు ముస్లింలకు ఉన్నా మొత్తంగా ఇచ్చిన రుణ సదుపాయంలో ముస్లింల వాటా 2.6 శాతం మాత్రమే. అంటే ఖాతాలు ఉన్నా రుణ సదుపాయం అందడంలేదు. పాఠశాలల్లో చేరిన ముస్లిం విద్యార్థుల్లో ఇరవై ఐదు శాతం మంది మాత్రమే మెట్రిక్యులేషన్ పూర్తిచేయగలుగుతున్నారు. మోడీ ఆధ్వర్యంలోని గుజరాత్ ప్రభుత్వం ముస్లింలు తమ కనీస హక్కులను కూడా అడిగే సాహసం చేయలేని స్థితిలోకి నెట్టివేసింది. హిందువులకు మోడీ లేకపోతే తమకు భద్రత ఉండదనే భావన కలిగించి, ముస్లింలను తీవ్రమయిన భయానికి గురిచేసి మోడీ తన అధికారాన్ని నెట్టుకొస్తున్నాడు. వ్యాపారాలకు అనుమతులు, లైసెన్సులు దొరకక ముస్లింలు వివక్షకు గురికావడమే కాదు, కనీసం మతపరమయిన ఊరేగింపులకూ అక్కడ అనుమతులు దొరకడం లేదు. ఈసారి ఏప్రిల్ నెలలో ముస్లిం నాయకులు మోడీ వద్దకు తమ వ్యాపారాలు, సాధకబాధకాలు గురించి మాట్లాడడానికి పోతే వారి సంభాషణ ముందు కాస్త సజావుగా సాగినట్లు అనిపించినా స్కూళ్లు, స్కాలర్‌షిప్‌లు అనగానే నేను 'వివక్ష' పాటించను అన్నాడు. ఉర్దూ కవి వలీ గుజరాతీ జ్ఞాపికను కూల్చిన స్థానంలో పునరుద్ధరించాలని అడిగితే అలాంటిది అసలు ఏమీ జరగనట్లు వ్యవహరించాడు. హిందూ పౌరులతో సమానమయిన భావనతో మేము జీవించలేకపోతున్నామని అక్కడి ముస్లిం ప్రజానీకం వాపోతున్నారు. ఇలాంటి తీవ్రమైన వివక్షతో సద్భావన సాధ్యమేనా?

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలను చూస్తే-అరుంధతీరాయ్ తన పుస్తకానికి తెలుగు అనువాద పుస్తకం ఆవిష్కరణ సభకు ఆగస్టు 20న హైదరాబాద్‌కు వచ్చినప్పుడు బి.జె.వై.ఎం కార్యకర్తలు ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీని వెనుక అసలు కారణం ఆమె దేశ అభివృద్ధిపైన, కాశ్మీర్‌పైన వ్యక్తచేస్తున్న అభిప్రాయాలే వారికి అభ్యంతరమయ్యాయి. ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కాశ్మీరీలకు స్వాతంత్రం ఇవ్వాలనీ, దీనిపై ప్లెబిసైట్ నిర్వహించాలని అన్నందుకు 'భగత్‌సింగ్ క్రాంతిసేన' పేరిట హిందూత్వ శక్తులు అక్టోబర్ 10న దాడి చేశాయి. ఇలా అభిప్రాయాలు వ్యక్తంచేసే భావప్రకటనా స్వేచ్ఛపై దాడులు కొనసాగుతున్నాయి.

స్వయంగా బి.జె.పి పాలన ఉన్న రాష్ట్రాలు, బి.జె.పి మద్దతుతో పాలన నడుస్తున్న రాష్ట్రాలలో ఆ పార్టీ ప్రతినిధులు తీవ్రమయిన అవినీతి,

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలతో విసిగిపోయిన ప్రజలు రాబోతున్న ఎన్నికలలో యుపిఎ పక్షాలను ఓడించడం ఖాయమని అంటున్నారు **వి. హనుమంతరావు**

సమస్యల వలయంలో మన్మోహన్ ప్రభుత్వం

మన్మోహన్ సింగ్ ప్రభుత్వం సమస్యల విషవలయంలో చిక్కుకొని ఊపిరాడక గిలగిలా కొట్టుకుంటోంది. కొమ్ములు తిరిగిన ప్రపంచ దేశాలే ఆర్థిక మాంద్యమనే మహా సముద్రంలో మునిగి తేలుతున్నాయి. నిన్నకాక మొన్ననే 2008లో పెట్టుబడిదారీ వ్యవస్థ చావుతప్పి కన్నులొట్టబోయి, బయట పడ్డామని కాస్త ఊపిరి పీల్చుకొంటున్నామని ఆ దేశాలు అనుకుంటూండగానే మళ్లీ దెబ్బ మీద దెబ్బ పడింది. ఆ విధానానికి రోజులు దగ్గర పడ్డాయనడానికి సంకేతాలు. సామ్యవాద దేశాలు ప్రపంచ పటం నుంచి అదృశ్య మయ్యాయని సంబరాలు చేసుకొని, తన హవాకింక తిరుగులేదని మీసాలు మెలివేసిన అమెరికాలోనే ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. వారు కేవలం వారి సమస్యలను పరిష్కరించమనో, జీతాలు పెంచమనో అడగడం లేదు. వారి సమస్యలకు మూలకారణమైన కార్పొరేట్ వ్యవస్థ మీద తమ బాణాలు సంధించడం ఎంతైనా స్వాగతించాల్సిన పరిణామం. కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలే అమెరికా పాలకులను శాసిస్తున్నాయి. 2008లో ఆ దేశంలో బ్యాంకులు దివాళా తీసినపుడు అమెరికా కేంద్ర బ్యాంక్, ఫెడరల్ రిజర్వ్ 1.6 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం అందించి వాటిని ఒడ్డున పడవేసి తానే రుణాల ఊబిలో మునిగిపోయి, హద్దులు దాటే పరిస్థితి ఏర్పడేసరికి రిపబ్లికన్ పార్టీ కాళ్లా వేళా పడి ఊపిరి పీల్చుకుంది. 1.6 ట్రిలియన్ డాలర్లంటే ఎంతో తెలుసా? 16,000,000,000,000 డాలర్లు.

దాన్ని రూపాయల్లో చెప్పాలంటే 51తో గుణించండి. (రూపాయి విలువ దిగజారిపోతూ 51 రూపాయలు ఒక డాలర్‌తో సమానం). మన దేశ పాలకులు కూడా మూడు లక్షల కోట్ల రూపాయల ఉద్దీపన పథకాల పేరుతో కార్పొరేట్ల ఒడిలో కుమ్మరించింది. ఆ తర్వాత రెండేళ్లలో సహాయం అందుకున్న సంస్థలు దండిగా లాభాలు చేసుకొంటూనే వస్తున్నాయి. అయినా, ప్రభుత్వం ఉద్దీపన పథకాలను ఉపసంహరించు కోలేదు.

మన దేశం ఇతర దేశాలతో జరిపే లావాదేవీల్లో చెల్లింపులన్నీ డాలర్లలోనే జరుగుతాయి. మొన్న మొన్నటి వరకూ ఒక డాలర్ చెల్లించాలంటే సుమారు 40–50 రూపాయల మధ్య చెల్లిస్తే సరిపోయేది. అంటే మనం దిగుమతి చేసుకొనే సరుకులను ఎక్కువ రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ప్రపంచ దేశాల్లో మాంద్య పరిస్థితి లేర్పడిన నేపథ్యంలో అక్కడ ప్రజల కొనుగోళ్లు తగ్గాయి. అంటే మన ఎగుమతులు తగ్గుతున్నాయి. దిగుమతుల కోసం ఖర్చు పెరిగి ఎగుమతులు – దిగుమతుల మధ్య అంతర పాపం పెరిగినట్లు పెరిగిపోతోంది. ఎగుమతులు తగ్గినపుడు మన ఉత్పత్తులు తగ్గుతాయి. పారిశ్రామికోత్పత్తి గత రెండేళ్లలో ఎన్నడూ లేనంతగా 1.22 శాతానికి పడిపోయింది. యూరోప్‌లో ఏర్పడిన సంక్షోభం ఫలితంగా నవంబర్ 17 నాటికి 314 పాయింట్లు తగ్గింది.

ద్రవ్యోల్బణం ఆకాశం వైపు పుడుసుకొని పోతూనే ఉంది. 13 సార్లు రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లు పెంచినపుడు పరిశ్రమల్లో ఉత్పత్తి ఖర్చు ఆ మేరకు పెరిగి, బజారులో ధరలు పెరిగి, కొనుగోళ్లు తగ్గి, మార్కెట్ మందగిస్తుంది. ఒక పక్క యూరోప్, అమెరికాల్లో మాంద్యం ప్రభావం ప్రపంచీకరణ ఉచ్చులో మన దేశం ఉండడంతో ఆ మాంద్యం ప్రభావం మన దేశం మీద కూడా పడింది.

మన ఫండమెంటల్స్ కుడోకా లేదని ప్రణబ్ ముఖర్జీ పదే పదే అదే పాట పాడుతుంటారు. ఈ పండమెంట్స్‌లో జిడిపి మొదటిది. (జి అంటే గాస్, డి అంటే డీజిల్, పి అంటే పెట్రోల్ అని ఎవరో ఎద్దేవ చేశారు.) గత రెండేళ్ల చరిత్ర తిరగవేస్తే ఈ పెరుగుదల 9 శాతం

కుంభకోణాలలో మునిగిపోయి ఉంటే అద్వానీ అవినీతికి వ్యతిరేకంగా రథయాత్ర (గతంలో రకరకాల పేర్లతో ఇప్పటికే ఐదు సార్లు రథయాత్రలు చేశారు) చేపట్టారు. ఆ యాత్ర 38 రోజుల పాటు అక్టోబర్ 11 నుంచి మొదలై నవంబర్ 20 దాకా 7600 కిలోమీటర్లు 22 రాష్ట్రాల్లో కొనసాగింది. 46 చోట్ల బహిరంగ సభల్లో అద్వానీ మాట్లాడారు. ఇవన్నీ రాబోతున్న ఎన్నికలకు భూమికగా సాగుతున్నాయి.

రాజ్యం, పాలకులు మనల్ని చరిత్ర పొడవునా మతం ప్రాతిపదికన, కులం ప్రాతిపదికన ఇంకా అలాంటి అనేక ప్రాతిపదికలతో విడదీశారు. ఇప్పుడు మనం అంటే పాలితులుగా, పీడితులుగా, ప్రజలుగా, శ్రామికులుగా ఈ దుర్మార్గాలను, దమననీతిని, అణచివేతలను ఏ ప్రాతిపదికపై ఒకటై ప్రతిఘటిస్తామనే ప్రశ్న చరిత్ర మళ్లీ మళ్లీ మనముందు విసురుతోంది. పాలకులు మనుషుల మధ్య, వివిధ సమూహాల మధ్య వ్యతిరేకత, వైషమ్యాలు ప్రాతిపదికన తమతో ప్రజల్ని నడిపారు. నడిచివచ్చిన చరిత్ర పాలకుల ఆధిపత్యాల చరిత్ర, అణచివేతల చరిత్ర అని తెలిసిన మనం చైతన్యంతో పొంచి ఉన్న దుర్మార్గాన్ని, ఎదురౌతున్న సవాళ్లను సంఘటితంగా ఎదిరిస్తామా లేదా అనేది అసలు ప్రశ్న.

(రచయిత వీక్షణం సహాయ సంపాదకులు) వీ

ఉంటుందని పాలకులు జోస్యం చెబుతూ వచ్చారు. ఇప్పుడు వాస్తవంలో 7.5 శాతం ఉండవచ్చునని పాలకులే అంటున్నారు. ఇది ఫండమెంటల్ బాగుందా? పెట్టుబడులు పెరగడం రెండో ఫండమెంటల్. రిజర్వ్ బ్యాంకు వడ్డీ రేట్లు 13 సార్లు పెంచడంతో పారిశ్రామికవేత్తలు కొత్త పరిశ్రమలు స్థాపించదలచుకొన్నవారు, నడుస్తున్న పరిశ్రమను విస్తరించదలచుకొన్న వారు వారి ప్రతిపాదనలను పెండింగ్‌లో పెట్టారు. కాగా పెట్టుబడులెలా పెరుగుతాయి? ఒక పక్క ప్రభుత్వమే ప్రభుత్వరంగ పరిశ్రమల్లో తన పెట్టుబడులను తగ్గించుకొంటూ పోతుంటే, పెట్టుబడులెలా పెరుగుతాయి? వ్యవసాయంలో పెట్టుబడులు పెంచుతున్నామని ప్రకటనలే గాని, ఆచరణలో కాదు. ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టే ప్రయత్నం చేయవద్దు ప్రణబ్‌జీ. జిడిపి పెరిగితే ఉపాధి పెరగాలి కదా.

రెండవ విడత సంస్కరణలు ప్రవేశ పెట్టడం గురించి పదే పదే మాట్లాడుతున్నారు. అలాంటప్పుడు మొదటి విడత సంస్కరణల గురించి, ఏమి సాధించారో ప్రజలకు వివరించాలికదా. ద్రవ్యోల్బణం పెరుగుదల, పేదలెవరో 62 సంవత్సరాల తర్వాత కూడా తేల్చలేక పోవడం, ద్రవ్యలోటును నాలుగున్నర శాతానికి తగ్గిస్తానని 2011-12 బడ్జెట్ సమావేశంలో చేసిన ప్రకటనను సాధించలేకపోవడం, ఆహార సంక్షోభం కొనసాగింపు, విదేశీ పెట్టుబడులు తగ్గడం, వడ్డీ రేట్లు పెరగడం, మౌలిక సౌకర్యాల కల్పన పథకం ఎపుడూ పూర్తవుతుందో ప్రభుత్వమే చెప్పలేని పరిస్థితి, ప్రభుత్వ రంగ సంస్థల్లో 40 వేల కోట్ల మేర ఉపసంహరణ లక్ష్యాన్ని సాధించలేని పరిస్థితి. (లాభాల్లో ఉన్న కొన్ని సంస్థల వద్ద ఉన్న రిజర్వ్ నిధులను మళ్లించి ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి చేస్తున్న కుటిల పన్నాగం) కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పర్యావరణ నిబంధనలను నీరుగార్చడం, సబ్సిడీల తగ్గింపు (పేదలకు మాత్రమే, పారిశ్రామికవేత్తలకిచ్చేవి కావు). రాను రాను పబ్లిక్ - ప్రైవేట్ రంగాలు ఉమ్మడి పథకాలు సామాన్య ప్రజలకే కాదు, పారిశ్రామికవేత్తలకు కూడా ప్రభుత్వ శక్తి సామర్థ్యాల్లో విశ్వాసం సన్నగిల్లడం, ఖజానా డొల్లమోత మోగుతుంటే విదేశీ పెట్టుబడులను రెండు చేతుల్తో ఆహ్వానించడం, కార్మికుల, మధ్యతరగతి వారిలో నైపుణ్యతగల వారి తీవ్ర కొరత - ఇలా మరెన్నో ఆర్థిక సమస్యల కారుమబ్బులు దేశాన్ని చుట్టవేస్తున్నాయి. ఆహార సంక్షోం గురించి చెప్పడం చర్వితచరణమే అవుతుంది.

అమెరికాలో ఆర్థికరంగ పర్యావరణం నిరాశపడిన సంగతి గమనించిన అమెరికా కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలు తమ వద్ద పేరుకుపోయిన నిధులను అమెరికాలోనే పెట్టుబడులు పెడితే వడ్డీ డబ్బులు కూడా కిట్టవు. వాళ్ల దృష్టి ఇండియా లాంటి వర్ధమాన దేశాల మీద పడింది. భారతదేశంలో పరిశ్రమలతో జతకట్టి, మెల్లమెల్లగా భారతీయ వాటాదారులను వెళ్లగొట్టి ఆ పరిశ్రమలను తామే సొంతం చేసుకోవడం, ఆధునిక టెక్నాలజీ పేరుతో రక్షణ రంగంతో ప్రారంభించి, చిన్న పరిశ్రమల్లో ప్రవేశం, దేశంలో చవగ్గా లభించే శ్రామికవర్గాన్ని దృష్టిలో ఉంచుకొని, తమ పరిశ్రమలను మన దేశానికి తరలించి, ఇక్కడే తయారు చేసి వివిధ దేశాల్లో ఉన్న తమ ఖాతాదారులకు ఎగుమతి జేయడం, చిల్లర వ్యాపారుల్ని, పౌరుల్ని డిక్కిలోవేసి, పెద్ద ఎత్తున రిటైల్ వ్యాపార రంగంలో ప్రవేశం, వ్యవసాయ రంగంలో ప్రవేశించి పువ్వులు, పండ్లు, కూరగాయలు ఉత్పత్తి చేసి తమ దేశాలకు పంపించడం - ఇలా వీలైనన్ని దారుల్లో దేశంలోకి, మన ప్రభుత్వ అంగీకారంతో ప్రవేశం ఇప్పటికే జరిగి పోతోంది. ఈ పన్నులన్నీ అమెరికా రహస్యంగా ఏమీ చేయడం లేదు. ఆ మధ్య అమెరికా - ఇండియా ద్రవ్య, ఆర్థిక పార్ట్‌నర్‌షిప్ వాషింగ్టన్‌లో సమావేశం జరిగినపుడు అమెరికా ట్రెజరీ కార్యదర్శి టిమోటీ గైత్నర్ తన ప్రభుత్వ డిమాండ్లను పేర్కొంటూ ఇండియాలోని బ్యాంకింగ్, ఇన్సురెన్స్ తయారీరంగం, రిటైల్ వ్యాపారం, మౌలిక సౌకర్యాల్లాంటి రంగాల్లో ప్రవేశానికి అమెరికా కంపెనీలు ఇబ్బందుల నెదుర్కొంటు న్నాయి. ఈ అడ్డంకులు ఉభయ దేశాల ఆర్థికాభివృద్ధిని, ఉపాధి, కల్పనకు అవరోధంగా ఉంటున్నాయి. ఈ అవరోధాలు తొలగితే ఉభయ దేశాల ఆర్థిక వ్యవస్థలను సమ్మిళితం చేయడం సులభమవు తుంది. దేశంలో, బయట నుంచి పెట్టుబడులను పెంచుకోవడానికి, తన దేశం అభివృద్ధికి ఆర్థిక, ద్రవ్య సంస్కరణలను వేగిరపరచడానికి ఇదెంతో అవసరమని భారతదేశం గుర్తించింది. ఈ పరిణామాలు ఇలాగే ఉంటాయని తరిమెల నాగిరెడ్డి 1960వ దశకంలో 'తాకట్టులో భారతదేశం' అనే గ్రంథంలో హెచ్చరించారు. ఆర్థిక వ్యవస్థ ఇలా నేలచూపు చూడడం పి.వి. నరసింహారావు హయాంలో అప్పటి ఆర్థిక మంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్ ప్రవేశ పెట్టిన ఫలితమేనని రిజర్వ్ బ్యాంక్ ధృవపరచడం గమనార్హం. ఈ కింది పట్టిక చూడండి

సంస్కరణలకు ముందు, తర్వాత

	సగటు	
	1980-81 నుంచి 1989-90 (పదేళ్లు)	**1993-94 2002-03 (పదేళ్లు)**
నిజ జిడిపి (శాతం)	5.8	6.0
పారిశ్రామికోత్పత్తి (శాతం)	7.4	6.5
వ్యవసాయోత్పత్తి (శాతం)	5.2	0.4
స్థూల దేశీయ పెట్టుబడుల రేటు (జిడిపిలో శాతం)	21.2	24.5*

*1993-94 2001-02 మధ్య తొమ్మిది రేట్ల సగటు.

సంస్కరణలు ప్రవేశపెట్టినప్పటి నుంచి జిడిపి పెరుగుదల వ్యవసాయం, పరిశ్రమల పెరుగుదల వల్ల కాదని, కేవలం సేవల రంగం పెరుగుదల వల్లనే అని ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సేవల రంగం నుంచి ఉత్పత్తి ఉండదు. ఉత్పత్తికి తోడ్పడుతుంది అంతే. కాగా జిడిపి పెరుగుదలే ఒక మాయ. అయినా అభివృద్ధి జరిగిపోతోందని ఇల్లెక్కి ప్రచారం. ద్రవ్యోల్బణాన్ని అరికట్టక పోతే పెరుగుదల దెబ్బతింటుందని అంగీకరిస్తాం. కాని పెరుగుదల ఎవరి కోసం? ఉదాహరణకు పరిశ్రమలు స్థాపిస్తే ఉత్పత్తి పెరిగిన కొద్ది యాజమాన్యాలకు మరిన్ని లాభాలు, ప్రభుత్వానికి పన్నుల ద్వారా మరింత ఆదాయం, కార్మికులకు పరిశ్రమల ఆధునికీకరణ వల్ల ఉద్యోగ క్షీణత.

సంస్కరణలు దేశానికి ఎన్ని దుష్పరిణామాలకు దారితీసిందో పైన పేర్కొన్నవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. దీనికి రాజకీయాలు, స్కాంలు, ఆహార అభద్రత తోడయ్యాయి. వచ్చే సంవత్సరంలో జరిగే అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలలో యుపిఎ పక్షాలకు ఉద్వాసన పలకడం ఖాయం అనిపిస్తోంది.

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

కార్మికుల, ప్రజల, విద్యార్థుల నాయకత్వంలో పోరాటాలతోనే తెలంగాణ సాధ్యమవుతుందనీ, ఎన్నికల రాజకీయాలతో తెలంగాణ రాదనీ అంటున్నారు **సి. కాశీం**

రెండేళ్ల ప్రత్యేక తెలంగాణ ఉద్యమం

'గిన్నెలో పాలుపోసి పొయ్యిమీద పెడితే అవి పొంగుతాయి. అవి ఎందుకు పొంగుతాయో నాకు తెలియదు. తెలుసుకోవాలని కూడా ఎప్పుడూ నేను ప్రయత్నించలేదు. కారణం చెప్పమని నన్ను బలవంతం చేస్తే పొంగటం పాల లక్షణమంటాను. అది నిజమే కావచ్చు. కాని అసలు కారణం మాత్రం కాదు. అంటే నేను ప్రకృతి శాస్త్రవేత్తని కాదన్నమాట. ఇలాగే కారణాలు తెలియకుండా, తెలుసుకోవాలని కూడా లేకుండా సంఘటనలను గురించి చదవవచ్చు, రాయవచ్చు... అలాంటప్పుడు మనల్ని మనం చరిత్రకారులమని పిలుచుకోవటంలో అర్థం లేదు. చరిత్రను పరిశీలించడమంటే కారణాలను పరిశీలించడమే' అని ఇ.హెచ్.కార్ అనే చరిత్ర రచయిత ఒక ఉపన్యాసంలో చెప్పాడు.

కార్ అవగాహనతో నడుస్తున్న తెలంగాణ చరిత్రలోకి ప్రవేశిస్తే చాలామంది మేధావులమని భ్రమపడుతున్న వాళ్లు తెలంగాణ చరిత్రను, ఉద్యమాన్ని కారణాలతో నిమిత్తం లేకుండా విశ్లేషిస్తున్నారు. వీరికి గతం పట్ల నిర్మాణాత్మక దృక్పథం లేదు. వర్తమానం పట్ల శాస్త్రీయ అవగాహన ఉండడం లేదు. ఈ కారణం చేత పాసింగ్ కామెంట్స్ ప్రజలలోకి వెళ్తున్నాయి. దాని వలన నిరాశ ఆవహించిన తెలంగాణ యువత ఆత్మబలిదానాలు చేసుకుంటున్నారు. ఈ నేల మీద జరిగిన అద్భుత పోరాటాలను, వాటిలో ఉండే త్యాగ నిరతిని ప్రజలకు అందించడంలో జరిగిన పొరపాటే ఆత్మబలిదానాలకు కారణం. ఒకసారి ఓడిపోయినా అంతిమంగా గెలుపు ప్రజలదేననే విశ్వాసం కల్పించలేకపోయారు. ఉద్యమాలకు ఉండే కార్యాకారణ సంబంధాన్ని అర్థం చేసుకుంటే తప్ప ఈ రెండేళ్ల ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోని ఎత్తుపల్లాలు అర్థం కావు. లక్ష్యం నెరవేరకపోవడానికి కారకులెవ్వరనే సత్యం బోధపడదు. ఈ కారణాలు తెలిస్తే కాని భవిష్యత్ ఉద్యమ నిర్మాణం సాధ్యం కాదు. ఆశాజనకంగా ఉండదు.

1969 తర్వాత తెలంగాణలో ప్రత్యేక రాష్ట్రం కోసం అంతటి ప్రజావెల్లువ 2009లో వచ్చింది. ఉద్యమం ఈ రూపంలోకి రావడానికి పూర్వనేపథ్యం చాలా ఉన్నది. 1996లో చంద్రబాబు రూపొందించిన ప్రపంచబ్యాంకు ఆర్థిక నమూనా తెలంగాణ ప్రాంతాన్ని పీల్చి పిప్పిచేసింది. ఇదే కాలంలో విప్లవోద్యమం రూపొందించిన ప్రజల ఆర్థిక నమూనా బీజరూపంలోనైనా ఉత్తర తెలంగాణ గ్రామాలలో అమలు జరిగింది. ఈ కాలంలోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ప్రజల ఆకాంక్షగా ఎజెండా మీదికి వచ్చింది. అది ప్రజాస్వామిక ఆకాంక్షగా కూడా మారింది. ఈ క్రమంలోనే విప్లవోద్యమం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కార్యాచరణను రూపొందించి అమలుచేసింది. భువనగిరి, సూర్యాపేట సభలు జరిగి వరంగల్ డిక్లరేషన్ ప్రజల ముందుకు వచ్చింది. తెలంగాణ జనసభ(1998) తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్(1998) ఏర్పడి క్షేత్ర స్థాయిలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని విస్తృతంగా ప్రజలలో ప్రచారం చేశాయి. 'ప్రజాస్వామ్య ప్రత్యేక తెలంగాణ' డిమాండ్‌ను ముందుకు తీసుకొచ్చాయి. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలంగాణ ఉద్యమం మీద నిర్బంధం ప్రయోగించి పనిచేయలేని స్థితిని కల్పించాడు. బెల్లిలలిత, ఐలయ్యలను హత్య చేశారు. కొందరిపై దాడులు చేశారు. ఇంకొందరిని జైళ్లలో నిర్బంధించారు.

సరిగ్గా తెలంగాణలో ఈ పరిపక్వ రాజకీయ వాతావరణాన్ని ఉపయోగించుకోవడానికి 2001లో టిఆర్ఎస్ ఏర్పడింది. ప్రజా సంఘాల చేతుల్లో ఉన్న తెలంగాణ ఉద్యమం ఓట్ల నాయకుల చేతుల్లోకి పోయింది. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ సైద్ధాంతికంగా బూర్జువా డిమాండ్ కావడం వలన సహజంగానే బూర్జువా నాయకత్వం ఉనికిలోకి వచ్చింది. ఉద్యమం పేరుతో కాలం గడుపుతూ ఓట్లు-సీట్లు- లాబీయింగ్‌లతో ఆ నాయకత్వం జల్సాచేసింది.

చర్చల పేరుతో అధికారంలోకి వచ్చిన రాజశేఖరరెడ్డి విప్లవోద్యమాన్ని క్రూరంగా అణచివేశాడు. ప్రజాసంఘాల నాయకత్వాన్ని హత్య చేయించాడు. తెలంగాణ పేరెత్తిన వాడిని జైళ్లలో తోసేశాడు. టిఆర్ఎస్ నాయకులను డబ్బుతో కొనేశాడు. ఇన్ని అన్యాయాలు చేసి ప్రకృతి కన్నెర్రచేస్తే కాలిపోయి బూడిదయిండు.

తెలంగాణ నినాదం మరుగున పడిపోతున్న దశలో తెలంగాణ ఉద్యోగులు రంగం మీదికి వచ్చారు. 1969 ఉద్యమానికి జీవం పోసిన టి.ఎన్.జి.ఒ.లు తిరిగి నలభై వసంతాల తర్వాత 2009లో ప్రజా వెల్లువకు మూలమయ్యారు. 2009 అక్టోబర్‌లో సిద్ధిపేటలో జరిగిన 'ఉద్యోగుల గర్జన' ఈ ఉద్యమానికి జవసత్వాలను ఇచ్చింది. ఈ సభ జరగడానికి తర్వాతి కార్యాచరణకు టిఆర్ఎస్ కారణమనేది చారిత్రక వాస్తవం. ఉద్యోగుల ప్రాతిపదిక మీద టిఆర్ఎస్ నాయకుడు కె.సి.ఆర్. ఇదే సంవత్సరం నవంబర్ 29న ఆమరణ దీక్షకు దిగాడు. ఆయనను కోస్తాంధ్ర పాలకులు అరెస్టు చేసారు. శత్రు శిబిరంలో అనేక పరిణామాలు జరిగాయి. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల విద్యార్థులు జెఎసిలుగా ఏర్పడి ఉద్యమాన్ని తమ భుజాల మీదికి ఎత్తుకున్నారు. కెసిఆర్ దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఓయు ఆర్ట్స్ కళాశాలను ఉద్యమ కేంద్రంగా మలిచారు. దారులన్నీ ఆర్ట్స్ కాలేజ్‌వైపే మళ్లాయి. ఒకవైపు కెసిఆర్ దీక్ష, మరోవైపు వెల్లువలా వచ్చిన విద్యార్థి ఉద్యమం కేంద్ర ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేసాయి. ఛలో అసెంబ్లీ పిలుపుతో విద్యార్థులు ఢిల్లీ పాలకుల వెన్నులో చలి పుట్టించారు. తెలంగాణ చరిత్రలో

ఎన్నడూ లేని విధంగా పార్లమెంట్‌లో తెలంగాణపై చర్చించి ప్రభుత్వం తరపున దేశ హోంమంత్రి చిదంబరం 'తెలంగాణ ప్రక్రియను మొదలు పెడుతున్నాం' అని డిసెంబర్ 9న ప్రకటించాడు. ఈ ప్రకటనకే సంబర పడిపోయిన తెలంగాణ నాయకులు స్వీట్లు పంచుకొని తెలంగాణ వచ్చినట్లుగా పండుగ చేసుకున్నారు. కోస్తాంధ్ర పెట్టుబడిదారులు, భూస్వాములు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు ఏకమై కోస్తా, రాయలసీమలో కృత్రిమ ఆందోళనలను సృష్టించారు. డబ్బును వెదజల్లి కేంద్రాన్నే కొనేశారు. ఈ సందర్భంలో తెలంగాణ నాయకులు, ఉద్యమ సంస్థలు, రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, మేధావులు మౌనంగా ఉన్నారు. 'తెలంగాణ ప్రక్రియను మొదలుపెట్టడం కాదు, పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో ఉద్యమించకుండా ఢిల్లీ పాలకులకు విధేయంగా ఉండిపోయారు. తమ బానిస మనస్తత్వాన్ని నిరూపించు కున్నారు.

కోస్తాంధ్ర పాలకుల ప్రభావానికి ఢిల్లీ పాలకులు లొంగిపోయి డిసెంబర్ 23న తెలంగాణకు వ్యతిరేకమైన ప్రకటనను అదే చిదంబరం ఇచ్చాడు. తెలంగాణ ప్రజ కడుపు మండింది. పార్టీలు, జెండాలు, అజెండాలు పక్కకుపెట్టి జెఎసిల రూపంలో ఏకమయ్యారు. రాజకీయా లకు తావులేకుండా తెలంగాణనే ప్రధాన ఎజెండాగా రోడ్ల మీదకు వచ్చారు. ప్రజా చైతన్యం వెల్లువలా వచ్చింది. విప్లవోద్యమం రూపొందించిన గ్రామ కమిటీలను గుర్తుకు తెచ్చేలా జెఎసిల నిర్మాణం జరిగింది. రాజకీయ నాయకుల వెంట పరుగెత్తే ప్రజలు వారిని మర్చిపోయారు. ఎందుకంటే సమైక్యాంధ్ర కోసం అక్కడి నాయకులందరు ఏకమై మూకుమ్మడి రాజీనామాలు చేస్తే, తెలంగాణ కాంగ్రెస్, తెలుగుదేశం నాయకులు మాత్రం పదవులు పట్టుకొని వేలాడారు. ఆ కోపం ప్రజలకుఉంది. ఇక్కడి నాయకుల దళారీ, దివాళాకోరు స్వభావాన్ని ఎండగడుతూ ప్రజలు ఉద్యమించారు. కనుక అనివార్యంగా చరిత్రలో మొదటిసారి రాజకీయ నాయకులు ప్రజల వెంట పరుగెత్తారు. ప్రజలు ఏర్పాటు చేసుకున్న వేదికల మీద ఉపన్యాసాలు ఇవ్వడానికి వెంపర్లాడారు. పోరాడుతున్న ప్రజలను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించారు.

ప్రజలు ఎలా పోరాడుతున్నారో అంతకు రెట్టింపు ఉత్సాహంతో విద్యార్థులు క్యాంపస్‌లను కదన రంగముగా మార్చారు. పారా మిలటరీతో యుద్ధం జేశారు. ఎన్నికల రాజకీయాలకు దూరంగా, బూర్జువా రాజకీయ నాయకులను దగ్గరకు రానీయకుండా విద్యార్థులందరు ఏకమయ్యారు. ఆర్ట్స్ కళాశాల మెట్లను తెలంగాణ రాజకీయ వేదికగా మలిచారు. ప్రపంచమంతా బిత్తరపోయేలా ఐకమత్యంతో ఉద్యమించారు. 2010 జనవరి 3న దేశాన్ని ఆశ్చర్యంలో ముంచుతూ ఆర్ట్స్ కళాశాల సాక్షిగా 5 లక్షల మంది విద్యార్థులతో అద్భుతమైన బహిరంగ సభను విద్యార్థులు విజయవంతం చేశారు. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా ఆ సభ విజయవంతమైంది. పరిణతి చెందిన తెలంగాణ విద్యార్థి నాయకత్వానికి ఇదొక ఉదాహరణ. 80వ దశకంలో తెలుగు నేలపై రాడికల్ విద్యార్థులు చేసినటువంటి ఉద్యమాన్ని గుర్తుకు తెచ్చేలా తెలంగాణ విద్యార్థులు ఉద్యమించారు. కోస్తా, రాయలసీమలలో రాజకీయ నాయకులు వెనుక ఉండి ఎంత ప్రయత్నించినా అక్కడ ప్రజా ఉద్యమం రాలేదు. కాని తెలంగాణలో ప్రజలు, విద్యార్థులు రాజకీయ నాయకులను ఉద్యమంలోకి ఈడ్చుకొచ్చారు.

ఈ సందర్భంలో ఢిల్లీ కేంద్రంగా 2010 జనవరి 5న చిదంబరం కుట్ర చేశాడు. ఈ కుట్రలో తెలుగు నేలపై ఉన్న అన్ని రాజకీయ పార్టీలు భాగమయ్యాయి. అఖిలపక్షం పేరుతో చిదంబరం అన్ని పార్టీలను పిలిపించి తెలంగాణలో జరుగుతున్న ఉద్యమాన్ని చీల్చడానికి కుట్రను పన్నాడు. తెలంగాణ ప్రాంతంలో ఎన్నికల రాజకీయాలకు అతీతమైన చైతన్యం ప్రజలలో రావడాన్ని ఈ పోలీసు మంత్రి జీర్ణించుకోలేక పోయాడు. ఈ పోరాట చైతన్యం ప్రజలను ఇంకోవైపు మళ్లిస్తుందనే భయం కూడా చిదంబరానికి ఉండింది. అందుకే ఏదో రూపంలో విద్యార్థి జాక్‌ను, ప్రజా జాక్‌ను చీల్చాలని పథక రచన చేశాడు. కాంగ్రెస్ నుంచి జానారెడ్డి, తెలుగుదేశం నుంచి నాగం జనార్దన్‌రెడ్డి, టిఆర్ఎస్ నుంచి కెసిఆర్ కలిసి రాజకీయ జెఎసిని ఏర్పాటు చేశారు. అందరం కలిసి ఉన్నామనే భ్రమను ప్రజలలో కల్పించారు. అప్పటికే వీళ్లతో సంబంధం లేకుండా గ్రామ స్థాయిలలో ఏర్పడి పనిచేస్తున్న జాక్‌లన్నింటిని విచ్ఛిన్నం చేసే కార్యక్రమానికి పూనుకున్నారు. ఈ కుట్రను అమలు చేయడంలో భాగంగా కొన్నాళ్లకు రాష్ట్ర స్థాయిలో ఏర్పడిన రాజకీయ జెఎసి నుంచి జానారెడ్డి బయటికి వెళ్లిపోయాడు. నాగం జనార్దన్‌రెడ్డిని బయటికి పంపించారు. మందకృష్ణ మరికొన్ని ప్రజాసంఘాలు బయటికొచ్చాయి. ఇట్లా పై నుంచి కింది వరకు జెఎసిలన్నీ విచ్ఛిన్నమయ్యాయి. చిదంబరం కుట్ర ఫలించింది.

ఇక మిగిలిపోయి ఉన్నది విద్యార్థిజాక్. దీనిలో రాజకీయ పార్టీల్లేవు కనుక విచ్ఛిన్నం చేయడానికి కొంత ఆలస్యమైంది. నిప్పులు చిమ్ముకుంటూ నింగికి ఎగసి పోయినట్లుగా వచ్చిన విద్యార్థి ఉద్యమం నిర్మాణ రాహిత్యం వలన, స్వార్థపరుల కుట్రల వలన నెత్తురు కక్కుకుంటూ నేలకు రాలిపోయింది. ఆశ్చర్యంగా చూడడం అందరి వంతైంది. శ్రామిక కులాల నుంచి వచ్చిన విద్యార్థులకు డబ్బు, పదవి, ఆశను చూపెట్టారు. విలాసవంతమైన జీవితానికి అలవాటుచేశారు. విలువల రాహిత్యాన్ని విద్యార్థులలో ప్రవేశ పెట్టడంలో పాలకులు విజయం సాధించారు. పార్టీలకు అనుబంధంగా, వ్యక్తులకు అనుబంధంగా విద్యార్థులను విడగొట్టి చరిత్ర సృష్టించిన ఓయు జెఎసిని మూడు ముక్కలు చేశారు. విద్యార్థి బలాన్ని, ఐక్యమత్యాన్ని లేకుండా చేశారు. విద్యార్థులలో ఉండే ఈ ఐక్యత, చైతన్యం సమూలంగా సమాజాన్ని మార్చే వైపుగా ప్రయాణిస్తుందనే భయంతో పాలకులు చేసిన కుట్రలో అందరూ భాగస్వాములయ్యారు. తెలుగునేలలో చాలా రోజుల తర్వాత విద్యార్థులలో వచ్చిన చైతన్యం ఏ ఫలితం రాకుండా పక్కదారి పట్టింది.

ఇట్లా ప్రజా జెఎసి, విద్యార్థి జెఎసి చీలిపోతేనే ఎన్నికల నాయకుల ఆటలు చెల్లుతాయనే కుట్ర ఢిల్లీలో జరిగింది. దానిని తెలంగాణ నాయకులు కాంగ్రెస్ పార్టీ దర్శకత్వంలో ప్రదర్శించారు. కెసిఆర్ నిరాహార దీక్ష చేసిన సందర్భంలో ఆయనకే వ్యతిరేకంగా ఉద్యమించి ఆయన దీక్షను కొనసాగేటట్లు చేసిన ఘనత విద్యార్థులదే. కనుక స్వతంత్రంగా ఉంటూ నిర్ణయాలు కూడా తీసుకొని పోరాడే విద్యార్థులు తెలంగాణ ద్రోహుల మాట వినే స్థితిలో ఉండరనే ఎరుక తెలంగాణ నాయకుల మనసులో ఉంది. అందుకే వాళ్లని విచ్ఛిన్నం చేస్తే తమను ప్రశ్నించే వారే ఉండరనే మోసపు బుద్ధితో ఈ పని చేశారు.

"పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే మొదలు ప్రజా ఉద్యమాలను, విద్యార్థి ఉద్యమాలను నివారించాలి. లేదంటే పక్కదారి పట్టించాలి. అదే మన మనుగడకు సరైన దారి" అని చిదంబరం ఢిల్లీలో తెలంగాణ నాయకులతో మాట్లాడాడు. వీటన్నిటి వ్యక్తీకరణనే 'శ్రీకృష్ణ కమిటీ'. కేంద్రం కాలయాపన కోసం కమిటీ వేస్తే పరుగెత్తి విన్నపాలు ఇచ్చారు. గోబ్యాక్ అనాల్సిన నాయకులు స్వాగతం పలికారు. ఇది ఈ సందర్భంలో జరిగిన మరో పెద్ద కుట్ర.

ఇన్ని రకాలుగా, ఇంత మంది కలిసి తెలంగాణ ప్రజలలో వచ్చిన చైతన్యాన్ని, పోరాట వ్యక్తీకరణను పక్కదారి పట్టించారు. మళ్లీ తెలంగాణ ఉద్యమానికి విరామం!

కొన్నాళ్లు గడిచాయి. రాజకీయాలలో కొన్ని మార్పులు వచ్చాయి. మళ్లీ తమ పబ్బం గడుపుకోవడానికి ఏదో కదలిక కావాలి. అందుకు సరైన మనుషులెవ్వరు అని వెతుకుతుంటే ఉద్యోగులు కన్పించారు. ఎందుకంటే ప్రజలను, విద్యార్థులను కదిలిస్తే వాళ్లు రాజకీయ నాయకుల చేతుల్లో ఉండరు. చైతన్యం పెరిగింది కనుక నాయకులను దాటి ముందుకెళ్తారు. అపుడు వాళ్లను ఆపేశక్తి ఎవరికీ ఉండదు. అనివార్యంగా ప్రజలను నాయకులు అనుసరించాలి. అలా అనుసరిస్తే అధిష్టానం మొట్టికాయలు పెడుతుంది. కనుక చెప్పినట్లు విని, చేతుల్లో ఉండే మధ్యతరగతి వేతన జీవులు ఉద్యోగులు. అందుకే వీళ్ల ద్వారా 'సహాయనిరాకరణ' పిలుపునిచ్చారు. ఢిల్లీలో కదలిక రాలేదు. తెలంగాణను ఇవ్వలేదు. అగౌరవంగా సహాయ నిరాకరణ ఆగిపోయింది. ఉద్యోగుల ద్వారా తెలంగాణ రాదని ముందే తెలిసినా? ఎందుకు కదిలించినట్లు? రాజకీయ పబ్బం గడుపుకోవడానికి. మన టార్గెట్ 2014 ఎన్నికలు అంటూ పదే పదే రాజకీయ నాయకత్వం ప్రకటిస్తూ వస్తుంది. అంటే ఎన్నికల రాజకీయ నాయకత్వానికి తెలంగాణ విషయంలో ఎన్నికల నుంచి ఎన్నికలు అనే స్పష్టత ఉంది. అయినా ప్రజలలో పలుకు బడిని పెంచుకోవడానికి రైలు రోకోలు, వంటా వార్పులు, రోడ్డు మీద బతుకమ్మలు నడుస్తుంటాయి. ఇంకా దీర్ఘకాలం ప్రజలను ఎంగేజ్ చేయడం కోసం 'సకల జనుల సమ్మె' లాంటి కార్యక్రమాలు ముందు కొస్తుంటాయి. చాలా పరిమితులున్న మధ్యతరగతి వేతన జీవుల ద్వారా తెలంగాణ లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యమని సహాయ నిరాకరణ సమయంలో తెలిసిపోయింది. అయినా ఆర్భాటంగా సకల జనుల సమ్మెను ఐదుసార్లు వాయిదా వేసి చివరికి మళ్లీ ఉద్యోగులతో మొదలుపెట్టారు. రాజకీయ నాయకులు తమ పదవులను వదిలివేసి, వీధుల్లోకి వచ్చి పోరాటం చేయాల్సింది పోయి, ఆ బాధ్యతను ఉద్యోగుల మీదకు నెట్టారు.

'సకల జనుల సమ్మె' పదంలో అర్థం మాత్రం చాలా విస్తృత మైనది. సమాజంలో అన్నివృత్తుల వాళ్లు సమ్మె చేయాలి. ఒకవిధంగా ప్రజలందరూ తమ రోజువారీ పనులను బంద్ చేయాలి. వీళ్లంతా రోడ్డు మీదకి వచ్చి పోరాడాలి. నిజానికి ఇది చాలా మంచి భావననే. కాని సమ్మె అనేది ఉద్యోగులు, పనిమనుషులు యాజమాన్యానికి వ్యతిరేకంగా చేసేది. మరి సొంత పనులు చేసుకునే రైతు, కూలీ, చాకలి, మంగలి ఎవరికి వ్యతిరేకంగా సమ్మె చేయాలి? చదువుకునే విద్యార్థులు ఎవరి మీద సమ్మె ప్రారంభించాలి. ఇట్లా చాలా ప్రశ్నలు 'సకల జనుల సమ్మె' పదం చుట్టూ ముసురుకున్నాయి. తెలంగాణ రైతు పంట పండించకుండా తన మీదనే తాను సమ్మె చేసుకుంటే నష్టపోయేది తెలంగాణ రైతే. కోస్తాంధ్ర భూస్వామికి కాని, దోపిడిదారుడికి కాని పిసరంతైనా నష్టం లేదు. కనుక సకల జనులంటే ఎవరనే స్పష్టత లేకుండా ఉద్యమం నడిచింది. ఈ సమ్మెను ఎవరికి వ్యతిరేకంగా నడిపించాలనే విషయాన్ని చెప్పకుండానే ప్రారంభించారు. రోజువారి కార్యక్రమాలను నిర్ణయించి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన నాయకత్వం ఎవరనేది కూడా అస్పష్టం. తెలంగాణను సమస్తంగా దోచుకుంటున్న, తెలంగాణ రాష్ట్రం ఇవ్వకుండా అడుగడుగున అడ్డుపడుతున్న కోస్తాంధ్ర పెట్టుబడిదారుల ఆర్థిక మూలాలను దెబ్బకొట్టకుండా, వారికి నష్టం చేయకుండా మనల్ని మనం ఎంతగా బాధించుకున్నా లాభం లేదనే అవగాహన నాయకత్వానికి ఎందుకు లేకుండా పోయింది. ప్రభుత్వ ఉద్యోగులు కార్యాలయాల ముందు టెంట్లు వేసుకొని పాటలు పాడుకుంటే తెలంగాణ రాదనే స్పృహను ప్రజలలో ప్రచారం చేయకపోతే పోరాట నిబద్ధత ఎలా పెరుగుతుంది?

ఇంత చేస్తే సకలజనుల సమ్మె 'ఉద్యోగుల సమ్మె'గా మారింది. కనీసం ఈ సందర్భంలోనైనా అనేక పరిమితులున్న ఉద్యోగులు కొంత త్యాగానికి సిద్ధపడితే వారికి మద్దతుగా ప్రజలను కదిలించడంలో నాయకత్వం విఫలమైంది. ఉద్యోగులలో ఆత్మస్థైర్యాన్ని పెంచడానికి మీకు మేమున్నామనే కార్యాచరణ ఎక్కడా జరగలేదు. ఇది ఉద్యమంలో అతిపెద్ద లోటు. ఎక్కడికెళ్లినా సభలు, సమావేశాలు, ఆటలు, పాటలే కాని కోస్తాంధ్ర పాలకులకు వ్యతిరేకంగా నిర్దిష్ట కార్యాచరణ లేదు. పోరాట కార్యాచరణను రూపొందించలేక కాదు, ప్రజలను కదిలించడం ఇష్టం లేక చాలా పరిమితులలో ఉద్యమ రూపాలను ఎన్నుకున్నారు. సామూహికంగా ప్రజలు కదిలితే ఉద్యమం తమ చేతుల్లో ఉండదనే భయంతో నాయకత్వం వ్యవహరించిందని ఎవరైనా అంటే అది అన్న వాళ్ల తప్పుకాదు. కోస్తాంధ్ర వ్యాపారస్తుల ఆర్థిక మూలాలకు భంగం కలిగే విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధనం కార్యక్రమంలో నకిరేకల్‌లో చెరుకు సుధాకర్ బృందం ఎన్నుకున్న పోరాట రూపాన్ని తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు ఎందుకు విస్తరించలేదు. అంటే ప్రజలను మిలిటెంట్ పోరాటాల వైపు మళ్లిస్తే భవిష్యత్‌లో తమ కాళ్ల కిందికి కూడా నీళ్లు వస్తాయనే కుట్ర బుద్ధితో వ్యవహరించారు.

తెలంగాణ ఉద్యమం ఎగిసి పడినప్పుడల్లా విద్యార్థులు అగ్రభాగాన ఉండి గత రెండేళ్లుగా పోరాడుతున్నారు. కాని సకల జనుల సమ్మె సందర్భంలో విద్యార్థులలో ఏ మాత్రం కదలిక లేదు. చీలికలు పేలికలైన విద్యార్థులను పక్కనపెడితే కనీసం ఒక రాజకీయ పార్టీకి అనుబంధంగా ఉన్న బలమైన విద్యార్థి సంఘాన్ని కూడా సమ్మె కాలంలో కదిలించలేదు. ఒకవేళ విద్యార్థులు ఉద్యోగులకు మద్దతుగా కదిలి ఉంటే కేంద్రంపై మరింత ఒత్తిడి పెరిగేది. అట్లాంటి శక్తి ఉన్న విద్యార్థులను పోరాటంలోకి తీసుకరాకుండా ఉండడం కూడా ఉద్యమానికి హాని తలపెట్టినట్లే భావించాలి.

ఇట్లా వినిర్మాణంగా ప్రారంభమైన సకలజనుల సమ్మె చివరికి ఏమి సాధించకుండా అగౌరవంగా ముగిసింది. అంటే దాని ఎత్తుగడలోనే లోపమున్నదని అర్థమవుతుంది. ఎవరు పిలువకముందే రాజకీయ నాయకత్వం, ఉద్యోగ సంఘాల నాయకత్వం హస్తినాకు దారులు కట్టింది. పోయినవాళ్లు తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పురవీధుల్లో కించపర్చి వచ్చారు. సకల జనుల సమ్మె ఇంతగా అపహాస్యం కావడానికి, ఇన్ని లోపాలతో ముగియడానికి తెలంగాణ ఉద్యమంలో ఒక కార్యకర్తగా నాతో సహా అందరి తప్పు ఉంది. ఉద్యమాలు చేయాలని నినదించడమే కాని ప్రజలను ఉద్యోగులకు మద్దతుగా కదిలించలేకపోయాము. రాజకీయ నాయకత్వం సమ్మెను వాయిదా వేస్తున్నామని ప్రకటిస్తే మేం కొనసాగిస్తామని ముందుకు రాలేకపోయాం. కనుక తప్పు ఎవరి మీదనో నెట్టి వేసి మనం పవిత్రులుగా ఉండాలనుకోవడం అతిపెద్ద తప్పు అవుతుంది. ఉద్యమ సందర్భంలో అందరం పాత్రధారులమే. సూత్రధారులమే.

తెలంగాణ లాంటి ప్రాంతీయ బూర్జువా ఉద్యమానికి కచ్చితంగా బూర్జువా వర్గమే నాయకత్వం వహిస్తుంది. కనుక ఎన్నిరోజులైనా ఆ వర్గం ఉద్యమాన్ని తమ ప్రయోజనాల చుట్టే తిప్పుతుంది. అందుకే చైతన్యవంతమైన కార్మికవర్గం ఈ ఉద్యమంలోకి ప్రవేశించి క్రియాశీలంగా

సకల జనుల సమ్మె విజయాలూ, వైఫల్యాల గురించి, అందరినీ కలిపి నడపడంలో విఫలమైన రాజకీయ ఐక్య కార్యాచరణ కమిటీల గురించి వివరిస్తున్నారు **గొడితాల వెంకటేశ్వర్లు**

కాగల కార్యం తీర్చిన సకల జనుల సమ్మె

'కాగలకార్యం గంధర్వులు తీర్చినట్లు' టి.ఆర్.ఎస్ 'అనుకున్న లక్ష్యం' సమ్మె సకల విధాలా తీర్చింది. నిజానికి సమ్మె సాధించింది విఫల ప్రయత్నమే అయినా విశేషమే. అప్రయత్నంగానయినా నేడు రాజకీయ నాయకుల బొంకుతనానికి మనం అంటకాగినట్లు సాగిందిగాని ప్రజలకు, రాజకీయ పార్టీలకు మధ్య అంట్లు తెంపే అసలు కార్యం నెరవేరలేదు. కె.సి.ఆర్ మేనేజ్‌మెంట్‌లో కోదండరాం ఇచ్చే అసైన్‌మెంట్స్‌ను ఉద్యోగులు హోం వర్క్‌గా బాగానే నిర్వహించారు. అయితే సమ్మె ప్రారంభంలో ఉద్యోగులు తమ తమ ప్రాంతాలలో తెలంగాణ బతుకు, సంస్కృతికి ప్రతీకలైన బతుకమ్మలు, బోనాలు, భజనలు, కోలాటాలు జడకొప్పులతో దడపుట్టిస్తూ రోజూ ఏదో ఒక రూపంలో ఉద్యమాన్ని నడిపించారు. తమకుతామే అంటే తెలంగాణ కోసం బలమైన ఆకాంక్ష గల, నిరంతర ఉద్యోగ ధ్యాసగల (పక్కగా వ్యాపారాలు చేసుకునే వారు కాదు) వారు మాత్రమే మీటింగులు ఏర్పాటు చేసుకొని స్థానిక కళాబృందాల ధూంధాంలతో పాటు, పేరుమోసిన కళాబృందాలను కూడా ఆర్థికంగా భారమైనా భరిస్తూ, సంక్షుభితమైన వారి ఆర్థిక జీవితాలను మరింతగా తాకట్టుపెట్టి సభలు నిర్వహించుకొని, ఉపన్యాసాలు ఇచ్చుకున్నారు. సమ్మె సాగుతున్నకొద్దీ ఉద్యోగ ఉపాధ్యాయులు తామే ఉపన్యాసాలు చెప్పుకోవడంకంటే ఉద్యోగుల సమ్మెను నిజంగానే సకల జనుల సమ్మెగా రూపొందించ ప్రయత్నం చేశారు. గ్రామాల్లో చైతన్య యాత్రల పేరు మీద స్థానిక రెవిన్యూ, విద్యుత్, ఉపాధ్యాయులతో పాటు అన్ని రకాల ఉద్యోగులు – కొనిచోట్ల ఊరేగింపులు అయితే, మరికొన్ని చోట్ల వీలైనంత మందిని సమీకరించి సభలు నిర్వహించారు. ఆయా సభల్లో పాల్గొన్నది (పట్టణాల్లోకాదు) వయోవృద్ధులు, ఇంటి వద్ద ఉండి చంటిపిల్లల్ని పట్టుకునే అమ్మమ్మలు, పనికిపోలేని వారు, బడిలేక పనికిపోయిన వారుపోగా అక్కడక్కడా ఆటల్లో మునిగిన విద్యార్థులు కొందరు మాత్రమే. హాజరైన కొన్ని చోట్ల యువత ఉన్నప్పటికి అధికారులు, ఉపాధ్యాయులను చూసి ముందుకొచ్చి పాల్గొన్నవారు గ్రామాల్లో చాలా తక్కువ. అయినా ఉద్యోగ ఉపాధ్యాయులు తమ లక్ష్యం, నిస్వార్థమైన తమ ఉద్యమం ఎటువైపో స్పష్టంగా చెప్పడానికి ప్రయత్నం చేశారు.

అయితే అసలు విషయమంతా ఇక్కడే ఉంది. ఊళ్లలో ప్రజలు రాజకీయ పార్టీల అనుయాయులు వారి నాయకగణం ఆదేశించకుండా ఇటువంటి ప్రజాచైతన్య జనసామూహిక కార్యక్రమాల్లో పాల్గొనరు. ఊరిలో రేషను కార్డుకైనా, ఇంటికైనా, ఫించనుకైనా, పంచాయితీకైనా ప్రత్యక్షంగా కన్పించేది, కాగితాల మీద కావాల్సిన పనికి కాసులతోనైనా చేయించగల రాజకీయ నాయకుల మాటలపై అతి విశ్వాసం మూలంగా, ఎప్పుడూ ప్రత్యక్షంగా సంబంధాలు లేని అధికారులు, ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు పిలుపునిచ్చి, దండోరా వేయించినా జనం పట్టించుకోలేదు. ఒక్కటి మాత్రం నిజం. నేను పైన పేర్కొన్నట్లు 2001 నుండి కేవలం తెలంగాణ సాధన కోసమే అన్నట్లు పుట్టిన 'తెలంగాణ రాష్ట్ర సమితి' రూపాంతరం చెంది తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీగా మార్పుచెందిన తర్వాత కూడా చేయలేని ప్రచారం ఈ నాలుగు పదుల పనిదినాల సమ్మె ప్రస్ఫుటంగా చేయగలిగింది. ఎక్కడికెళ్లినా, ఏ ఉద్యోగి ప్రసంగ పాఠం విన్నా అర్థమౌతుంది ఉద్యోగులంతా గంధర్వులయ్యారని.

కాంగ్రెస్ నాయకుల కపటనాటకాలు, పదవీలాలస, పేటకోమాట, పూటకోతీరు, అమాయకులైన విద్యార్థి యువకుల ఆత్మత్యాగాలపై ప్రమాణాలు చేసి నిస్సిగ్గుగా మాట్లాడే స్థానిక కాంగ్రెస్ రాజకీయ క్రీ(నీ)డలను, ప్రజాస్వామ్యంలో అధికార పీఠమెక్కిన రాజకీయ పార్టీ ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలందిస్తూ, అధికార మదంతో కండ్లు మూసుకుపోయి క్షేత్రస్థాయిలో ప్రజలెదుర్కొంటున్న సమస్యల పట్ల ధ్రుతరాష్ట్ర దృష్టిని ప్రదర్శిస్తున్న ప్రభుత్వాన్ని, ప్రజల పక్షాన నిలబడి నిలదీసి ప్రజల నిజమైన ఆకాంక్షను ప్రతిఫలించాల్సిన ప్రతిపక్ష పార్టీ

పాల్గొంటూ కార్మిక వర్గ నాయకత్వం ఎదిగేటట్లు కృషిచేయాలి. తెలంగాణ ఉద్యమ నాయకత్వాన్ని కార్మిక వర్గం తమ చేతుల్లోకి తీసుకోవాలి. అప్పుడే బూర్జువా నాయకత్వం భయపడుతుంది. లేదంటే ఒంటెత్తు పోకడలోనే ఉద్యమాన్ని నడుపుతుంది. సరిగ్గా తెలంగాణ ఉద్యమంలో ప్రత్యామ్నాయ నాయకత్వం లేకపోవడం వలన ఎన్నికల నాయకత్వం తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. దీనికి చెక్ పెట్టే కార్యాచరణకు కార్మిక వర్గం సిద్ధం కావాలి. త్యాగానికి సిద్ధపడే స్వభావం, స్వార్థం లేకపోవడం అనే రెండు మంచి లక్షణాలున్నా కార్మికవర్గం నాయకత్వం లోకి వస్తేనే తెలంగాణ రాష్ట్ర సాధన సులభమవుతుంది. లేదంటే అమెరికా, సోనియా, కోస్తాంధ్ర పెట్టుబడిదారుల ప్రయోజనాలు నెరవేరినంత కాలం తెలంగాణ రాష్ట్రం సాధ్యం కాదు. ఇది పెట్టుబడి లక్షణం. పెట్టుబడి చావడానికైనా సిద్ధపడుతుంది. కాని వనరులున్నా వలసను అంత తొందరగా వదిలిపెట్టదు.

(రచయిత విరసం కార్యవర్గ సభ్యులు, 'నడుస్తున్న తెలంగాణ' ఎడిటర్) వీ

గోడమీది పిల్లి వైఖరిని ప్రదర్శించింది. రెండుకళ్ల సిద్ధాంతాన్ని, ప్రజలిచ్చిన పదవిని వదలుకోవడానికి తమ చేతగాక భయపడి ఇతరులపై నెట్టివేసే అసహ్యధోరణిని ఉద్యోగులు ప్రతిగ్రామంలో, పట్టణాల్లో ఉద్బోదించడం జరిగింది. నిజానికి ఉద్యమంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఇట్లా తప్ప మాట్లాడే పరిస్థితి లేదు. ఇదీ ఆయా పార్టీల దుస్థితి. ఇటువంటప్పుడు ప్రజాస్వామ్య ఓట్ల రాజకీయంలో ప్రయోజనం టి.ఆర్.ఎస్‌కు తప్ప ఎవరికుంటుంది? ఇది అయాచితంగా అనివార్యంగా ఉద్యోగులు చేసిన ప్రచారమన్నది కాదనలేని సత్యం. బహుశా టి.ఆర్.ఎస్ కోరుకుంది కూడా ఇదే కావచ్చు. అంతర్ముఖుడైన చంద్రశేఖరరావు, కోదండరామ్, స్వామిగౌడ్, దేవీప్రసాద్, విఠల్ అనే చతుర్ముఖాల ద్వారా జెండా కప్పకుండానే తన ఎజెండా అంతర్లీనంగా ప్రచారం పొందినట్లయింది. క్రియాశీల కార్యకర్తలు లేకుండానే టి.ఆర్.ఎస్ అదృశ్యజెండాను గడప గడపకు తిప్పినట్లయింది. పాతుకుపోతున్నట్లు అనిపించిన ఈ అయాచిత ప్రచార వాసనను బట్టి అక్కడక్కడా ఆ నాయకులు మాట్లాడిన మాటల్లో 'తెలంగాణ వచ్చేంత వరకు' పోరాడుదాం, పోరాడాల్సిందేనని జె.ఎ.సి.తో చెప్పించడం లాంటి సందర్భాలు గమనిస్తే 2014 నాటికో ఆ తర్వాతికో ఉద్యమ కొనసాగింపుతో పాటు ఇలాగే ఉపాధ్యాయ ఉద్యోగ కార్మిక వర్గాల వేడిని రగిలిస్తూ సీట్లు పెంచుకొని, అధికారంతో పాటు నోట్లు సంపాదించుకోవడానికి అడుగేస్తున్నట్లు అనుమానించాల్సి వస్తోంది. ఇటీవల పోలవరం టెండర్లు తమ వారికి దక్కించుకున్నారని, స్వంత పత్రికకు పెట్టుబడుల సమీకరణలపై ఆరోపణలు రావడం గమనార్హం. త్యాగాలు ప్రజలవి, మోసాలు రాజకీయ నాయకులవి అన్నట్లు ఇలాగే జరిగితే అసలు లక్ష్యం నెరవేరకుండానే ఉద్యోగులంతా కలిసి కాగల కార్యం గంధర్వులు తీర్చినట్లేకదా.

రాజీనామాల రాజకీయ నాటకానికి తెరలేపి వారికి మద్దతుగా ఉద్యోగులు సకల జనుల సమ్మెకు దిగాలని నిర్ణయించి, తెలంగాణలోని అన్ని ఉద్యోగ సంఘాలు ఆంధ్రప్రదేశ్ పేరుతో ఉన్న సంఘాలనుండి వేరుపడి ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర సంఘాలుగా ఏర్పడి కింది స్థాయి నుండి ప్రతి ఉద్యోగి నుండి సమ్మె నోటీసులు తీసుకొని అందరిని సమ్మెలో భాగస్వామ్యం చేసింది రాజకీయ జె.ఎ.సి. వివిధ ఉద్యోగ వర్గాలు ఒకొక్కరుగా సమ్మెలో చేరి కుల, మత వర్గ భేదం లేకుండా ఆఖరుకు కాగితాలు ఏరుకునే ఆత్మాభిమానులు, అడుక్కుతినే బడుగు జీవులు ఒక్కో రోజు ఉద్యమకెరటాలై ఎగిరితే బస్సులు ఆగిపోయి, బావులు మూతబడి, బడులు మూగబోయి, కార్యాలయాలకు తాళం కప్పలు బడ్డాయి. ఆఖరికి రైలు రోకోకు మోఖా జేశారు.

మహోజ్వల ఝంఝామారుతంలా సాగిపోతున్న సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి రాజ్యం చేసిన కుట్రలు అన్నిన్ని కావు. గాంధీజీ చేపట్టిన సహాయ నిరాకరణోద్యమంలో జరిగిన 'చౌరీచౌరా' సంఘటనతో ఉద్యమాన్ని అర్థాంతరంగా ఆపేసినట్లు, చౌటుప్పల్‌లో జరిగిన బస్సులపై దాడిని మొత్తం అంతా ఆంధ్రా పెట్టుబడిదారుల, ఆస్తుల, వ్యక్తులపై దాడిగా చిత్రించి నోళ్లు నెత్తిన బెట్టుకున్న ఆంధ్రా మీడియా అసత్యాలను, అర్ధసత్యాలను సాకుగా చూపి ఉద్యమం హింసాత్మకమౌతోందని కుట్ర పూరిత ప్రచారం చేశాయి. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని ఏనాడో రాజకీయ నాయకుల పాదాల వద్ద తాకట్టు పెట్టిన ఉపాధ్యాయ మేధావి వర్గ నాయకుడు – సహజంగానే ఉపాధ్యాయుల ఓట్లతో గెలిచి రాజీనామా చేయకుండా కాంగ్రెస్‌తో అంటకాగుతున్న నేపథ్యంలో, రగులుతున్న తెలంగాణ ఉద్యమంలో ప్రజాగ్రహానికి గురై, అవమానంగా భావించి వ్యక్తిగత ప్రతిష్ఠ కోసం సంఘటిత శక్తిపై కుట్రకు తెరలేపిన వారున్నారు. సమైక్య రాష్ట్రంలో అటు ఆంధ్రా ఇటు తెలంగాణలోనూ బలమైన ఉద్యమ నిర్మాతగా, సామాజిక సమస్యలపై ఎస్.సి, ఎస్.టి., బి.సి., మైనారిటీ వర్గాల ప్రయోజనాల కోసం ముఖ్యంగా అణగారిన కులాల ఆత్మగౌరవ పోరాటం నడుపుతూ వికలాంగులు, గుండెజబ్బు పిల్లలకోసం దండు నడిపిన దళిత జననేత సందర్భం కాకపోయినా సామాజిక తెలంగాణ పేరుతో (వేలకు వేల ఫీజులు వసూలు చేస్తూ పల్లెల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు లేకుండా బస్సులను పంపి రవాణా చేస్తున్న ప్రైవేటు యాజమాన్యాలపై గాని, సంవత్సర సిలబస్ అంతా మూడు నెలల్లో పూర్తి చేసి కాంపిటీషన్ పేరుతో పిల్లలపై పెంచుతున్న ఒత్తిడిపైగాని చర్చించని నేతలు) గ్రామీణ పిల్లల చదువుల పేరుతో సీమాంధ్రుల కార్పొరేట్లు పరచిన ఎర్రతివాచీకి ఎరగా బలై బాకాలూది సమ్మెను బద్దలుకొట్టాలని చూసిన వారున్నారు. సమ్మె ఇలాగే కొనసాగితే ఉద్యోగులు పైచేయి సాధిస్తారని, శాసనాల అమలుదారులు, శాసనకర్తలై పోతారన్న భయంతో ఎలాగైనా సమ్మె విరమింపజేసి తిరిగి అంతిమంగా రాజకీయ నాయకత్వం చేతుల్లోకి తీసుకోవాలన్న ఆలోచన రాజకీయ నాయకత్వాలకూ (అన్ని పార్టీల) కలిగించింది.

అయినా సమ్మె విచ్ఛిన్నానికి రాజ్యం కుట్ర చేస్తుందని జె.ఎ.సి. నాయకత్వానికి తెలియదా? ఉద్యమ నాయకత్వం జరుగుతున్న కుట్రలను ఛేదించడానికి చేసిన ప్రయత్నం ఏది? ఉద్యమానికి మారు రూపాన్ని వెంటనే ప్రకటించలేకపోయింది. మూసలో పోసినట్లు ఇన్ని రోజులు ఉద్యమం నడపడం ఏ ప్రయోజనానికి దారితీసింది? ప్రచారానికా? సాధనకా? సాంకేతిక నైపుణ్యంతో ఆర్.టి.సి.ని, గన్నులెక్కుపెట్టి సింగరేణిని, పేరెంట్స్ కమిటీల పేరుతో ఉపాధ్యాయుల సమ్మెను ప్రభుత్వం విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించినపుడు కింది స్థాయిలో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులు సమ్మె విరమణను కోరుకుంటున్నారా? అని అడిగారా, సమ్మెకు ముందు నోటీసులు కోరిన నాయకులు సమ్మె విరమించే ముందు వారి మనోభావాలు అడగాల్సిన అవసరం లేదా? కొత్త రాష్ట్రంలో సంతకాలు చేస్తామని తెలంగాణ ఒక్కటే మన ఏకైక డిమాండ్ అని సమ్మెలోనికి పోయిన మనకు కొత్త డిమాండ్లు ఎందుకు ముందుకొచ్చాయి. ఈ డిమాండ్లు సాధారణ సమ్మె ద్వారా సాధించుకోలేమా? అటువంటప్పుడు కనీసం ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత డిమాండ్లు అప్రంటీస్ రద్దు, పెన్షన్ పథకం, హెల్త్‌కార్డులు, పాఠశాలల్లో పూర్తి స్థాయి సిబ్బంది నియామకం వంటి డిమాండ్లు పెట్టి ఉంటే ఇటు ప్రజా ప్రయోజనాలతో పాటు, స్వప్రయోజనాలు కూడా నెరవేరేవేమో. కేసుల రద్దు తప్ప ఏ ఒక్క డిమాండుకూ కిందిస్థాయిలో డిమాండ్ లేదు. చివరికి ఉద్యోగ వర్గాల్లోని నాయకత్వాల్ని రేపటి ఎవరివో ప్రయోజనాలు కాపాడుకోవడానికి, కిందిస్థాయి కార్యకర్తల ఉద్యమ ఉధృతి మీద జె.ఏ.సి నీళ్లు చల్లడం నిజంకాదా. నిజానికి కిందిస్థాయిలో ఏ ఒక్కరికీ సమ్మె విరమించాలనే ఆలోచనేలేదు.

గ్రామ స్థాయిలో చిన్నచిన్న పట్టణాల్లో ఎక్కడ ఇబ్బంది జరిగింది? ఎవరైనా మాకు ఇబ్బంది కల్గిందని సమ్మెవల్ల నేనిది నష్టపోయానని ఏ

ఒక్కరన్నా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారా? ఏ ఒక్క ఉపాధ్యాయుడినైనా మాబడి ఎందుకు తెరవట్లేదని ప్రజలు అడిగారా? సమ్మె వాయిదా పడిందన్న తర్వాత కూడా నిజామాబాద్ జిల్లాలో మారుమూల పల్లెలో పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను సమ్మె ఎందుకు విరమించారంటూ నిర్బంధించిన సంఘటన చూశాం. పొలాలు ఎండిపోతున్నా ప్రభుత్వ కుట్రను గమనించి రైతులు విద్యుత్ అధికారులపై తిరుగబడ్డ దాఖలా ఉందా? తమ లావాదేవీలు ఆగిపోయాయని ఆఫీసర్లపై, అధికారులపై ఎక్కడైనా దాడి జరిగిందా? ఆటోలు ఆగిపోయినవా? ప్రయాణాలు నిలిచిపోయి ప్రయాణికులు ఎక్కడ ఇబ్బంది పడ్డారు? వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయారా? పొట్టచేతబట్టుకొని పోతున్న రోజువారి తాపీ కూలీల తట్ట ఎక్కడైనా తిరుగబడిందా? కష్టమైనా నిష్ఠూరమైనా భరించారు. అందరూ తెలంగాణ కోసం కొట్లాడుతున్నారు. సరే కానీయండి అయిందేదో అయింది, ఇంకొన్నాళ్లు మనల్ని మనమే హింసించుకుందాం అన్నారేగాని ఎవరిపైనా సామాన్యులు తిరుగ బడలేదు. నోరు తెరుచుకున్న మీడియా, కార్పోరేట్ రంగాలు తప్ప.

ఆఖరుకు వృద్ధాప్య ఫించన్లు తీసుకునే వారు కూడా (రాకుంటె మాయె బిడ్డా మీరైతె పోరాడండి అన్నారేగాని) వీళ్లను (రాజకీయ నాయకుల) నమ్ముకోవద్దనే చెప్పారు. 'ఓట్లు గిప్పుడుంటే వాళ్ల సంగతి సూద్దుంగాని, లెవాయె ఎట్లా' అనుకుంటూ కసిగా ఇంకొన్నాళ్లు చేద్దాం అది కూడా తీవ్రరూపంలో ఉండాలని ఆత్రుతపడ్డారు. ఎందుకంటే ధ్వంసం చేయాల్సిన దాన్ని ధ్వంసం చేయకుండా కొత్తదాన్ని ఎప్పుడూ నిర్మించలేం. ఇది గమనించకుండా అందరూ అనుకున్నట్లుగానే ఉద్యమాన్ని రాజకీయ వ్యవస్థ చేతికి అప్పగించినట్లయింది. దీని పర్యవసానం అప్పుడే మొదలయింది. అందులో భాగమే ఇప్పుడు ఇక్కడ టి.ఆర్.ఎస్., అక్కడ ఢిల్లీలో కాంగ్రెస్ నాయకులు నిరాహార దీక్షలు. విద్యార్థులను ఉద్యమానికి దూరం చేయడం మైనస్ పాయింటే. మనం అనుకున్నట్లు సమ్మె వాయిదా పడిందనగానే మళ్లీ ఉద్యమం రాజుకోకుండా స్ట్రగుల్ కమిటీ పేరుతో ఒకవైపు, యువ కిరణాలు, రచ్చబండ, రైతుమహిళా సదస్సులు పేరుతో తెలంగాణలో తిరగడానికి రాజకీయ నాయకులు, మంత్రులు తయారయ్యారు. ఎం.ఎల్.ఏ లు ఉద్యమం గురించి మాట్లాడటం మొదలు పెట్టారు.

ప్రభుత్వంలో ఉన్నవారు సంక్షేమ పథకాల సాకుతో, ఉద్యమం చల్లారిందన్న దృష్టితో 'రైతుకోసం పాదయాత్ర' పేరుతో, ఉద్యమ సమయంలో ఒక్కమాట మాట్లాడని చంద్రబాబు పోలవరం టెండర్లు రద్దు చేయమని రాజకీయ రచ్చ చేస్తూ దారి తప్పి ప్రయాణం చేయబూనుకున్నాడు. ఉద్యమం ఆగిపోయిందన్న భ్రమలో, పరస్పర ఆరోపణలతో ఆత్మరక్షణలో పడ్డ చంద్రబాబునాయుడు పోలవరం కట్టాల్సిందేనని తటస్థం నుండి సంపూర్ణ సమైక్యవాదిగా బయటపడి ఉద్యమాన్ని పక్కదోవ పట్టించాలన్నా సాధ్యం కాదేమో. ఇదిలా ఉండగా పోలవరం బస్సుయాత్ర అనంతరం గద్దర్ ఆధ్వర్యంలో ఒక రాజకీయ శక్తి రూపొందనుందన్న ప్రకటన కూడా గమనించదగిందే. నిజంగా మరొక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తికోసం తెలంగాణ ప్రజలు ఎదురుచూస్తున్నారా? ఇప్పటికే దాదాపు నూటయాభై సంఘాలు తొమ్మిది, పది రాజకీయ పార్టీలు తెలంగాణ పోరాటంలో తెలంగాణ నాయకత్వం కోసం పోరాటం చేస్తూనే ఉన్నాయి. మరిప్పుడు తెలంగాణ ఉద్యమం ఆగిపోయేదా? ఈ విరామం మరిన్ని ఉద్యమాలకు భూమికగా మిగలనుంది. అందులో భాగమే రాజకీయ నాయకుల నిరాహారదీక్షలు (ఉదాహరణకు – కోమటిరెడ్డి వెంకటరెడ్డి). ఆయన నిరాహారదీక్షకు పూనుకోవడం విరమించడం ఏ ప్రయోజనాలకో అందరికీ తెలుసు. జిల్లాలోని ఒక్క కాంగ్రెసు నాయకుడు కూడా పరామర్శించకపోవడంలోనే దీక్ష అంతర్యాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి సంఘటనలతో అధినాయకత్వం కూడా బహుశా ఇక ఉద్యమం మన చేతుల్లోకి వచ్చింది కాబట్టి ఎంతకాలమైనా సాగదీయ వచ్చునని ఆశగా మరో గందరగోళ ప్రకటనకు సిద్ధమౌతోంది.

నిజానికి రాజకీయ జె.ఎ.సి చేయాల్సింది ఏమిటి? రాజకీయ డిమాండ్ కోసం, రాజకీయ ప్రక్రియ ద్వారా నెరవేరాల్సిన సకల జనుల ఆకాంక్షకోసం రాజకీయ నాయకుల పార్టీలనన్నింటిని (కలిసి వచ్చేవారిని, కలిసి వస్తామన్నవారిని) నిరభ్యంతరంగా ఏకం చేసి నడపాల్సింది. అపకారం చేశారని భావిస్తున్నా. కలిసొస్తామన్న కాంగ్రెస్, తెలుగుదేశం నాయకులను ఎందుకు కలుపుకోరు? అలాంటి వారిని కలుపుకోకుండా వారి కార్యక్రమానికి అంటీముట్టనట్లు వ్యవహరించడం, కేవలం టి.ఆర్.ఎస్ కార్యక్రమాల ప్రాధాన్యాన్ని పెద్దదిగా చేయడం ఎటువైపు నడుస్తున్నట్లు? వాస్తవానికి అలాంటి వారిని సమ్మెలో ప్రత్యక్ష భాగస్వాములను చేసి ఉంటే రాజకీయ నాయకుల ప్రాబల్యంతో ప్రజాసమూహాలు పెల్లుబికి వస్తే ఏ బలగాలు ఆపగలిగేవి? ఎస్కార్ట్‌తో బస్సులు, మిలిట్రీతో రైళ్లు తిరుగగలిగేవా? తీరా సమ్మె వాయిదా వేసిన తర్వాత ఇప్పుడు 'చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు' కొంతమందిని కలుపుకొని పోతామని అనడం ఎంతవరకు సమంజసం. అది కూడా అందరిని కలుపుకుపోదాం అని అనడం లేదు. ఏ పార్టీనైనా, రాజీనామా చేసినా చేయకపోయినా (రాజీనామా చేస్తే ఎలాగూ ఫలితం లేదు కాబట్టి) ఈ సకల జనుల ఆకాంక్ష కోసం, ఒక పార్టీ ప్రయోజనం కాకుండా సకల పార్టీలను ఒకే జెండా, ఎజెండా కిందికి తీసుకొని వచ్చి ఇప్పటికైనా రాజీనామా చేసినా లేదా తర్వాతనైనా వారినే ఏకగ్రీవ ఎన్నిక చేస్తామని పిలుపునిస్తే తెలంగాణ సాధ్యం కాకుండా పోతుందా? రాజకీయ ఎత్తుగడ సీట్ల పెంపుకోసం కాకుండా 'తెలంగాణ సాధన రాజకీయ బలం పెంపు' కోసం పనిచేయాల్సి ఉంది. ఇదీ కిందిస్థాయిలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సాధారణ ప్రజల కోరిక.

పై విధంగా మన మార్గం నిర్దేశించుకోకుండా మనం సాగించిన సమ్మె సాధించిన ఫలితం ఏమిటి? మనం పైకి చెప్పుకుంటున్న సమ్మె ఢిల్లీని కదిలించిందని త్వరలో అధినాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చేట్లు చేయగలిగామని, రాజకీయ వ్యవస్థ కళ్లు తెరిపించామన్న పొడిమాటలు తప్ప. ఆత్మహత్యాసదృశమైన ముగింపు తప్ప. ఎప్పటిలాగే సమ్మెకాలానికి జీతం సర్వీసు భద్రత తప్ప. ఒక విషయం తేలింది. అదేమంటే తెలంగాణ లో ప్రజాకాంక్షకు వ్యతిరేకం కాంగ్రెస్ పార్టీ అని, పరోక్షంగా తెలుగుదేశం అని. తెలంగాణ సాధన దిశలో కాంగ్రెసుకు రాష్ట్రంలో అంతర్గత పోట్లాట (ఎం.ఎల్.ఎ., ఎం.పి) పెట్టామని, చివరికి తెచ్చేది ఇచ్చేది రాజకీయ వ్యవస్థేనని తేకుంటె, రాకుంటె చచ్చేది కూడా నిరంకుశ, నిస్సిగ్గు, ప్రజావ్యతిరేక రాజకీయ నాయకులేనన్నది మాత్రమే.

(రచయిత డి.టి.ఎఫ్. నాయకులు, ఉపాధ్యాయుడు,
వీక్షణం నల్గొండ జిల్లా అసహజ మరణాల సూచి రచయిత) వీ

గడ్డాఫీ మంచి చెడులు ఆ దేశ ప్రజలు తెల్చుకునేవారనీ , గడ్డాఫీని చంపే హక్కు అమెరికాకు, నాటో సేనలకు లేదనీ అంటున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

లిబియా దురాక్రమణ - గడ్డాఫీ హత్య

ప్రపంచ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థకు నాయకత్వ స్థానంలో ఉన్న అమెరికా, తీవ్ర ఆర్థిక సంక్షోభాల ఫలితంగా, వేగవంతంగా తన అగ్రాసనాధిపత్యాన్ని కోల్పోతున్న దశలో సామ్రాజ్య వాద ప్రయోజనాల రక్షణ కోసం అత్యుగ్రవాద శక్తిగా (హైపర్ ఇంపేరియ లిజం) అవతరిస్తున్న దశ ఇది. అమెరికా అంతర్జాతీయ న్యాయ సూత్రాలను లెక్క చేయదు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలను అమలు చేయదు. తనకు ఏది ప్రయోజనం అనుకుంటే అదే చేస్తోంది. తన దోపిడిని నిరంతరాయంగా కొనసాగించడానికి ఎంత నైచ్యానికైన ఒడిగడుతుంది. సార్వభౌమ దేశాలను, స్వతంత్ర ఆర్థిక విధానాలను విస్తరింపజేసుకునే దేశాలను, పరాధీన స్థితి నుంచి బయటపడదలచిన దేశాలను, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే దేశాధినేతాలను, తాయిలాలకు లొంగని నాయకులను హతమార్చడం అమెరికా నైజం.

అఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై ఉక్కుపాదం మోపిన అమెరికా గడ్డాఫీ హత్యతో లిబియాను తన గుప్పిట్లోకి తెచ్చుకుంది. లిబియా ప్రజలను రక్షించేందుకు, ప్రజాస్వామ్య పాలన స్థాపించేందుకు అని అమెరికా చెప్తున్నది వట్టి మాటేనని గత అనుభవాలు చాటి చెప్తున్నాయి. గడ్డాఫీ హత్యతో నియంత పాలన అంతమైందని చెప్పుకుంటున్న అమెరికా, దాని మిత్ర దేశాలైన ఇంగ్లాండు, ఫ్రాన్స్‌లే వాస్తవానికి అనేకమంది నియంతలను పెంచి పోషించాయనేది జగమెరిగిన సత్యం. సౌది అరేబియా నుండి కువైట్ వరకు ప్రపంచ వ్యాప్తంగా అందుకు అనేక ఉదాహరణలున్నాయి. చమురు సంపద కోసం అమెరికా ఎంతకైనా తెగిస్తుందనేదానికి గడ్డాఫీ ఉదంతం మరో ప్రత్యక్ష నిదర్శనం.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికా వేసే ప్రతి అడుగు చమురు, సహజ వనరులపై ఆధిపత్యం కోసం ఉద్దేశించినదే. అందుకు అడ్డుతగిలిన దేశాలపై మానవ హక్కుల ఉల్లంఘన నెపంతో, ప్రజాస్వామ్య స్థాపన సాకుతో దురాక్రమణ దాడులు చేయడం అమెరికా పాటించే కుటిలనీతి, తన ప్రయోజనాల కోసం సార్వభౌమ దేశాల అంతరంగిక వ్యవహారాల్లో అడుగడుగునా జోక్యం చేసుకోంటుంది. ఇరాక్‌పై దురాక్రమణ జరిపి, సద్దాం హుస్సేన్‌ను హతమార్చి ఆదేశ చమురు సంపదపై ఎలా పట్టు సాధించిందో మనకు విదితమే. అమెరికా దురాక్రమణ తర్వాత ఇరాక్ ఎంత ఘోరమైన స్థితిలోకి దిగజారిందో ప్రతి రోజు జరుగుతున్న మారణకాండ తెలియజేస్తున్నది.

న్యూయార్క్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రంపై 2001 సెప్టెంబర్ 11న జరిగిన దాడికి ఒసామబిన్ లాడెన్ నాయకత్వంలోని అల్‌ఖైదా కారణమని, దానికి మద్దతు ఇచ్చిందన్న సాకుతో ఆఫ్ఘనిస్తాన్‌ను 7 అక్టోబర్ 2001న అమెరికా దురాక్రమించింది. న్యూయార్క్‌పై దాడిని అల్‌ఖైదా జరిపిందని ఆరోపణలేగాని రుజువులు లేవు. అల్‌ఖైదాకు ఆఫ్ఘనిస్తాన్ మద్దతు ఇచ్చినట్లు ఇంతవరకు రుజువులు లేవు. ఐక్యరాజ్య సమితి భద్రత మండలి సమావేశం ఆమోదించిన తీర్మానంలో ఎక్కడా ఐరాస సభ్యరాజ్యమైన ఆఫ్ఘనిస్తాన్‌పై మిలటరీ చర్య తీసుకోవాలని లేదు. అమెరికన్ వాణిజ్య సముదాయంపైన జరిగిన ఉగ్రవాద దాడికి ఏ ఆల్‌ఖైదా కారణమని అమెరికా ప్రకటించి నిష్కారణంగా ఇరాక్, అఫ్ఘనిస్తాన్‌లపై 'నాటో' సైనిక కూటమిలో దురాక్రమణకు పాల్పడిందో – ఆ ఆల్‌ఖైదా ఉగ్రవాదులతోనే అమెరికా చేతులు కలిపి లిబియా అధినేత గడ్డాఫీని అక్టోబర్ 20న మట్టుపెట్టింది.

అఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ పలుకుబడికి వ్యతిరేకంగా అమెరికా పోషించిన ముజాహిదీన్‌లతో కలిసి పనిచేస్తూ పాకిస్తాన్‌లో లిబియన్ ఇస్లామిక్ తీవ్రవాద దళాన్ని ప్రారంభించిన వాడు బెల్హాజీ. ఇతను 9/11 నిందితులలో ఒకడు. ఈ బెల్హాజీ గ్రూపు అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా ఉంది. 2003లో బెల్హాజీ అమెరికా గూఢచారి సంస్థకు పట్టుబడ్డారు. గడ్డాఫీని బుజ్జగించడానికి బెల్హాజీని ఓ 'గిఫ్ట్' కింద లిబియాలోని జైలుకు బదిలీ చేసింది అమెరికా. అతడ్ని కొంత కాలం జైల్లో ఉంచిన గడ్డాఫీ తర్వాత ఉదారవాద దృష్టితో విడుదల చేశాడు. అయితే అతను అప్పటికే సిఐఏ ఏజెంటుగా మారాడు. లిబియా ఇస్లామిక్ ఫైటింగ్ గ్రూఫ్ (ఎల్ఐఎఫ్‌జి) పేరుతో ఒక ఛాందసవాద సంస్థను ఏర్పాటు చేశాడు. ఎవరైతే ముప్పయేళ్లుగా అల్‌ఖైదా తరపున మిలిటెంట్లు గా పోరాడుతూ వస్తున్నారో, వాళ్లకి 2011లో అమెరికా నాయకత్వంలో ఉన్న నాటో సైనిక కూటమి గడ్డాఫీని గద్దె దించడానికి సైనిక శిక్షణ ఇచ్చింది. రాడికల్ ఇస్లామిక్ గ్రూపుల్ని అదుపులో పెట్టాలని పాకిస్థాన్‌పై ఒత్తిడి తెస్తోంది, మరోవైపు సిరియా, లిబియాలలో సాయుధ తీవ్రవాద గ్రూపులకు అండదండలు అందిస్తుంది అమెరికా.

లిబియా 1911 వరకు టర్కీ రాజ్యం కింద వలసగా ఉంది. ఇటలీ – టర్కీ యుద్ధంలో ఇటలీ గెలిచింది. దానితో లిబియా 1911 నుంచి ఇటలీ వశమైంది. ఇటలీ ఆక్రమణ తర్వాత 1912–27 మధ్య కాలంలో లిబియాను ఇటాలియన్ ఉత్తర ఆఫ్రికాగా పిలిచారు. సైరేనైకా, ట్రిపోలిటానియా, ఫెజాన్ అనే మూడు ప్రాంతాలను కలిపి లిబియాగా 1934లో ఇటలీ స్థిరీకరించింది. 1943–51 మధ్యకాలంలో ట్రిపోలిటానియా, సైరేనైకాలు బ్రిటిష్ ఆధీనంలో ఉండగా, ఫెజాన్ మాత్రం ఫ్రాన్స్ ఆధీనంలో ఉండేది. లిబియాకు 1951 ముగిసేలోగా స్వాతంత్ర్యం ఇవ్వాలని ఐక్యరాజ్య సమితి 1949 నవంబర్ 21న తీర్మానం చేసింది. దానికనుగుణంగానే 1951 డిశంబర్ 24న లిబియాకు స్వాతంత్ర్యం వచ్చింది. యునైటెడ్ కింగ్‌డమ్ ఆఫ్ లిబియాకు రాజుగా ఇద్రిస్ నియమితుడయ్యాడు. లిబియా రాజ్యాంగం ప్రకారం రాజు ఇద్రిస్ పాలనలో లిబియా జాతీయ అసెంబ్లీతో పాటు అధ్యక్షుడుగా మహ్మద్

అబ్దులాల్ ఎల్ ఆలెమ్, ఇద్దరు ఉపాధ్యక్షులు ఒమర్ షేక్ షెనిబ్, అహ్మద్ అబూబకర్ నియమితులయ్యారు. ఇది ఆఫ్రికాలో నాలగవ పెద్ద దేశం, ప్రపంచంలో 17వ పెద్ద దేశం. స్వాతంత్ర్యం వచ్చే నాటికి లిబియా నిరుపేద గిరిజన తెగల దేశంగానే ఉంది.

లిబియాలో 1959లో చమురు నిక్షేపాల వెలికితీతతో అతి పేద గిరిజన దేశం అకస్మాత్తుగా ఆఫ్రికాలోనే అతి సంపన్నదేశంగా అవతరించింది. లిబియా శుద్ధమైన చమురు నిక్షేపాలు గల పదవ అతిపెద్ద దేశంగా ఘనత కెక్కింది. 1963లో లిబియా పేరును కింగ్‌డమ్ ఆఫ్ లిబియాగా మార్చారు. చమురు విక్రయంతో ప్రభుత్వం ఆదాయం బాగా పెరిగింది. రాజు ఇద్రిస్ భోగభాగ్యాల్లో మునిగిపోయాడు. ప్రజల క్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. పాలన స్తంభించింది. లిబియాలో అమెరికా, బ్రిటన్ దోపిడీలు పెరుగడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగింది. 1969 సెప్టెంబర్ 1న 27 ఏళ్ల మౌమ్మర్ గడ్డాఫీ నేతృత్వంలో మిలటరీ అధికారుల బృందం రాజు ఇద్రిస్‌పై తిరుగుబాటు చేసింది. రాజు ఇద్రిస్ ప్రతిఘటించకుండానే పాలనాధికారాలను గడ్డాఫీ బృందానికి అప్పగించాడు.

గడ్డాఫీ పాలన పగ్గాలు చేపట్టగానే దేశంలో మార్పులు ఎన్నో చేశాడు. చమురును జాతీయం చేశాడు. తనను తానే మరో చేగువేరాగా పిలుచుకున్నాడు. పాశ్చాత్య దేశాలు, ముఖ్యంగా అమెరికా పెత్తందారీ విధానాల వ్యతిరేకం భావాలకు లిబియాను కేంద్రస్థానంగా తీర్చిదిద్దాడు. లిబియా పాలన కోసం కొత్త తరహాలో 'రివల్యూషనరీ కమాండ్ కౌన్సిల్'ను ఏర్పాటు చేసి దానికి అధ్యక్షుడిగా వ్యవహరించాడు. తన పేరు ముందు 'జనరల్' బిరుదుకు బదులు కేవలం కల్నల్ అని మాత్రమే పెట్టుకున్నాడు. లిబియా సమాజం 'ప్రజలచే పాలించబడే సమాజం అని' తనకు అత్యున్నత సైనిక బిరుదులొద్దని అంటుండేవాడు. అరబ్ నేషనలిజం, సంక్షేమరాజ్యం, ప్రత్యక్ష జన ప్రియ ప్రజాస్వామ్యం అనే నినాదాల ప్రాతిపదికన తన పాలన ఉంటుందని చెప్పుకునేవాడు. 1977లో లిబియాను 'సోషలిస్టు పీపుల్స్ లిబియన్ అరబ్ జమాహిరియా' (ప్రజల ప్రభుత్వం)గా మార్చాడు. స్థానిక ప్రజాదరణ మండళ్ల ద్వారా, సహజీవన మండళ్ల ద్వారా నేరుగా ప్రజలచే పాలించబడే ప్రత్యక్ష ప్రజాస్వామ్యం అమల్లోకి వచ్చిందని గడ్డాఫీ ప్రకటించాడు. 2008లో పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా లభించే ఆదాయం నేరుగా ప్రజలకే పంచుతానని విప్లవాత్మక ప్రకటన చేశారు. పొరుగు దేశాలకు సంబంధించి నాజర్ విధానాలనే పాటించాడు. అరబ్ దేశాల ఐక్యతకు, ఐక్య అరబ్‌జాతి కొరకు పోరాటం చేశారు. పాలస్తీనా విమోచన సంస్థకు గట్టి మద్దతు ఇచ్చారు. ఆఫ్రికా, ముస్లిం దేశాల్లోనూ తిరుగుబాటు ఉద్యమా లను విముక్తి పోరాటాలను ప్రోత్సహించే విధంగా తన అంతర్జాతీయ విధానాన్ని కొనసాగించారు. ఇది ఎంతమాత్రం ఇష్టంలేని అమెరికా గడ్డాఫీ ఉగ్రవాద సంస్థలకు సహాయం చేస్తున్నారనే ముద్ర వేసింది.

ఇరాక్ ఇరాన్ యుద్ధంలో ఇరాన్‌కు మద్దతు ప్రకటించి అమెరికా ఆగ్రహానికి గురయ్యారు. అప్పటి అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ గడ్డాఫీని మధ్య ప్రాచ్య ప్రాంతపు పిచ్చి కుక్క అని ఎద్దేవా చేశారు. దరిమిలా రెండు దేశాల మధ్య విభేదాలు మరింతగా ముదిరాయి. ఈజిప్టు అధ్యక్షుడు నాజర్ అన్నా, ఆయన అరబ్ – సోషలిస్టు విధానమన్నా గడ్డాఫీకి విపరీతమైన అభిమానం. అమెరికన్, బ్రిటన్ సైనిక స్థావరాలను తొలగించాడు, అంతర్జాతీయ వేదికలపై అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేశాడు. పాలస్తీనా ప్రజలకు అండగా ఉన్నాడు. అలీనోద్యమంలో ముఖ్య పాత్రధారిగా ఉంటూ ఆఫ్రికాదేశాల ఐక్యత కోసం పరితపించాడు. సోవియట్ రష్యా కూటమితో సన్నిహితంగా ఉంటూ అమెరికాతో దాని మిత్ర దేశాలకు సవాలు చేశాడు. ఇజ్రాయిల్ జాత్యాహంకారాన్ని నిర్ద్వంద్వంగా ఖండించాడు, లెబనాన్‌కు మద్దతుగా నిలిచాడు. ఇజ్రాయిల్‌తో ఈజిప్టు అధ్యక్షుడు అన్వర్ సాదత్ శాంతి ఒప్పందం కుదుర్చుకోవడం పట్ల ఆగ్రహించి ఆ దేశంపై దాడులు చేశాడు. ఈ చర్యలే అమెరికాకు కంటగింపుగా మారాయి. 1969 నుంచి తాజా పరిణామం వరకు గడ్డాఫీపై పలుమార్లు హత్యాయత్నాలు జరిగాయి. ప్రతిసారీ ఆయన క్షేమంగా బయటపడ్డారు.

నాజర్, గడ్డాఫీ తదితరుల ఎదుగుదల, పోరాటం ప్రపంచ పరిణామానికి సూచిక. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ప్యారిస్‌లో 1911 లో అరబ్ జాతీయవాదం ఊపిరిపోసుకున్నది. మళ్లీ అదే ప్యారిస్‌లో రెండవ ప్రపంచ యుద్ధానికి కొంత కాలం ముందే 1930 దశకంలో బాతిస్టు ఉద్యమం మొగ్గ తొడిగింది. ఈ రెండు సిద్ధాంతాలు ఆనాటి అరబ్బు ఉద్యమకారులకు సైద్ధాంతిక ఆయుధాలయ్యాయి. అరబ్బు జాతీయవాదంలో అరబ్బు ఇస్లామిక్ సౌభ్రాతృత్వం ప్రధానమైంది. బాతిస్ట్ ఉద్యమం పై అప్పటికే బలపడిన కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం ఉన్నది. రెండూ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించడంతో పాటు సామ్యవాద భావజాలాన్ని ఆమోదించాయి. అనేక తిరుగుబాట్లకు దారితీసిన అరబ్బు జాతీయతావాద ప్రభంజనం నుంచి ఎదిగిన అగ్రశ్రేణి నేతలలో గడ్డాఫీ ఒకరు.

గడ్డాఫీ ప్రతిపాదించిన థర్డ్ ఇంటర్నేషనల్ థియరీ అరబ్బు జాతీయ వాదానికి ఇస్లామిక్ సామ్యవాదానికి, ప్రజాస్వామిక పాలనా విధానానికి మేళవింపు, ఇరవయవ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన మార్పుల నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఒక సగటు అరబ్బు దృక్పథాన్ని ఈ సిద్ధాంతం ప్రతిబింబిస్తుంది. అయితే మహిళలకు సంబంధించి సమాన హక్కులు, భిన్న బాధ్యతలు వంటి సుత్రీకరణలు ముస్లిం చాందసవాదుల విమర్శలకు గురయ్యాయి. గడ్డాఫీ తాను నమ్మిన సిద్ధాంతాలకు అనుగుణంగా మొదటి దశ పాలన సాగించాడు. అయితే ఏకవ్యక్తి పాలన సాగింది. ఇందులో గడ్డాఫీ బాధ్యత ఎంత అనేది చర్చించాల్సిందే. గడ్డాఫీ పదవీచ్యుతుడైన తరువాత కూడా ఆయన బొమ్మలను జనం ఎగబడి కొనుక్కోవడం గమనార్హం. యుగోస్లావియా కావచ్చు, లిబియా తదితర అరబ్బు దేశాలు కావచ్చు కమ్యూనిజం అందించిన స్ఫూర్తితో భిన్న సమాజాలు తమకు అనువైన పాలనా విధానాలతో ప్రయోగాలు సాగించుకున్న కాలమది. సాధారణ పరిస్థితులు నెలకొంటే ఏ ప్రయోగాలు ఏయే మార్పులకు దారి తీసేవో తెలియదు. గడ్డాఫీ పాలనను అక్కడి ప్రజలు ఎంతకాలం ఆమోదించేవారో తెలువదు. సామ్రాజ్యవాద ఉక్కుపాదం పడడంతో ఈ సమాజాల స్వేచ్ఛా గమనం నిలిచిపోయింది.

లిబియాలో విప్లవ నాయకుడిగా గడ్డాఫీ పాశ్చాత్య పెట్టుబడులకు స్థానం లేకుండా చేశారు. ఆయన అరబ్బు సౌభ్రాతృత్వాన్ని ఎంతగా విశ్వసించారంటే, ఈజిప్టుతో లిబియాను విలీనం చేయడానికి ప్రయత్నించారు. సూడాన్ తదితర దేశాలతోనూ ఇదే రీతిలో ప్రయత్నాలు సాగాయి. కరడుగట్టిన సామ్రాజ్యవాద వ్యతిరేకతను ప్రదర్శించారు. ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిన తరువాత అమెరికా అనేక ఆంక్షలు, ఒత్తిళ్లతో లిబియాను ఉక్కిరి బిక్కిరి చేసింది. ఐనా 2009లో ఐరాస సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ ఇరాక్‌లో అమెరికా తల దూర్చడం, ఆ దేశంపై యుద్ధ బీభత్సం సృష్టించినందుకు అమెరికా మాజీ అధ్యక్షుడు బుష్‌పై యుద్ధనేరాల కింద విచారణ జరుపాలని డిమాండ్ చేసిన ధీరోదాత్తుడు గడ్డాఫీ. ఈ దశలో గడ్డాఫీ ప్రైవేటీకరణను ప్రవేశ పెట్టి విదేశీ సంస్థలను అనుమతించారు. బహుళ జాతి సంస్థలు ప్రవేశించిన తరువాత లిబియాలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. అయినా గఢాఫీ పట్టు కొనసాగింది.

సద్దాంహుస్సేన్ పతనం అనంతరం తన దేశంలో భారీ విధ్వంసక

రసాయన అణు ఆయుధాలను తనిఖీ చేయాలని అంతర్జాతీయ సంస్థలకు తనంతట తానే విజ్ఞప్తి చేశాడు. అదే సమయంలో ప్రపంచ ఆర్థిక మాంద్యం ప్రభావం లిబియాపైనా పడింది. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. ఉపాధి తగ్గిపోవడంతో లిబియన్లలో అసంతృప్తి ప్రబలింది. పొరుగున ఉన్న ట్యునీషియాలో మల్లెపూవు విప్లవం విజయవంతం ప్రతిపక్షాలు గావడంతో పోరు బాటపట్టాయి. అమెరికా పూర్తి అండదండలు అందించింది. తిరుగుబాటుదారుల చర్యలను దేశ వ్యతిరేక చర్యలుగానే భావించిన గడ్డాఫీ అణచివేత చర్యలకు దిగారు. దీనిని సాకుగా తీసుకొని అమెరికా దాని తొత్తులు ఫ్రాన్స్, బ్రిటన్ రంగంలోకి దిగాయి. గడ్డాఫీ వ్యవస్థను నామరూపాలు లేకుండా చేయాలనే నిర్ణయించుకున్నాయి. గడ్డాఫీ వ్యతిరేక శక్తులను ప్రోత్సహించాయి. అయితే గడ్డాఫీకి ఉన్న పట్టు ముందు అమెరికా అనుకూల దళాలు ముందుకు సాగలేకపోయాయి. ఐక్యరాజ్యసమితితో ఆమోదముద్ర వేసుకుని దాడికి వ్యూహం పన్నాయి. కుక్కను చంపే ముందు దానిపై పిచ్చిదనే ముద్ర వేయాలనే సూత్రాన్ని ఇరాక్‌లో సద్దాం హుస్సేన్‌పై విజయవంతంగా ప్రయోగించిన అమెరికా.. లిబియన్లపై గడ్డాఫీ మరణహోమం సృష్టిస్తున్నాడని ఆరోపిస్తూ నాటో వైమానిక దాడులు సాగించింది. ప్రత్యర్థులు, నాటో దళాలు కలిసి సాగించిన దాడులకు గడ్డాఫీ ప్రభుత్వం కూలిపోయింది. అయినప్పటికీ చివరి వరకు గడ్డాఫీ సామ్రాజ్యవాద దళాలతో పోరాడుతూనే మరణించారు.

లిబియన్ల అక్షరాస్యత 83 శాతం. యువతను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే ఇది 99.9 శాతం. చదువుకోవాలన్న ఆసక్తి ఉంటే ఎంతకాలమైన చదువుకోవచ్చు, ఏమైనా చదువుకోవచ్చు. అయితే నేర్చుకున్న విజ్ఞానాన్ని మాతృ దేశానికే ఉపయోగించాలి. అంటే ప్రభుత్వ వ్యయంతో చదువుకొని విదేశాలకు వెళ్లకూడదనే షరతు ఉంది. అలాగే ప్రతి పౌరుని ఆరోగ్య బాధ్యత ప్రభుత్వానిదే. హాస్పిటల్‌లో జాయిన్ అయినప్పటి నుండి డిశార్చ్ అయ్యే వరకు ఉచితంగా ప్రభుత్వమే వైద్యం అందిస్తుంది. నిరుద్యోగం సమస్య అసలేలేదు. విదేశీయులు దాదాపు 25 లక్షల మంది లిబియాలో పనిచేస్తున్నారు. రవాణా ఉచితం, గృహ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. లిబియాలో కరెంటు కష్టాలులేవు. కరెంటు ఉచితం. ఏదైనా ఆర్థిక అవసరం ఏర్పడితే లిబియా పేదలకు చాలా తేలికగా రుణాలు లభిస్తాయి. రుణాలపై వడ్డీ ఉండదు. పెళ్లి చేసుకున్న దంపతులకు ఇల్లు కొనుక్కుని స్థిర పడడానికి ప్రభుత్వం 50 వేల డాలర్లు బహుమానంగా ఇస్తుంది. వ్యవసాయంపై ఆసక్తి ఉన్న వారికి భూమి, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులు ఇచ్చి ప్రోత్సహిస్తుంది. రోజుకు 65 లక్షల క్యూబిక్ మీటర్ల మంచినీటిని సరఫరా చేసే అతిపెద్ద పైపుల సంధాన వ్యవస్థను ఏర్పాటు చేశాడు. ఈ పైపులైన్ సహార ఏడారి కింది నుండి వెళ్తుంది. ట్రిపోలీ, బెంఘాజీ, సిర్తేతో పాటు పలు నగరాలు, గ్రామాలకు నీరు అందుతుంది. కారు కొనుక్కోవాలంటే సగం డబ్బు ప్రభుత్వమే భరిస్తుంది. పెట్రోల్ ధర 15 సెంట్లు మాత్రమే. ఇన్ని సదుపాయాలు అగ్రరాజ్యమైన అమెరికాలో కూడా లేవు. సంపన్న దేశాలు ఏవి కూడా ఈ తరహా సదుపాయాలు పేదలకు కల్పించడానికి సిద్ధపడవు. లిబియా తలసరి ఆదాయం 15,000 డాలర్లు. ఆఫ్రికా దేశాలన్నింటికంటే లిబియా సంపన్నదేశం.

లిబియా జనాభా 60 లక్షలు. గడ్డాఫీ లిబియాకు చేసిన కృషి సామాన్యమైంది కాదు. రాజకీయంగా నిలదొక్కుకునే క్రమంలోనే కావచ్చు. సంక్షేమ రాజ్యానికి పునాది వేశాడు. ప్రజలంతా విద్యాధికులై సుఖశాంతులతో జీవించాలనుకున్నాడు. తనకు ప్రతికూలత రాకూడదనుకున్నాడు. రాజకీయంగా సోషలిస్టు విధానాలు, మతపరంగా లౌకిక విధానం, దౌత్యపరంగా వర్ధమాన దేశాలకు సంఘీభావంతో ఉండేటట్లు తన వ్యూహాన్ని గడ్డాఫీ రూపొందించుకున్నాడు. గడ్డాఫీతన వైఖరిని వివరిస్తూ 'గ్రీన్‌బుక్' రాస్తే అది అరబ్ దేశాలన్నింట్లో లక్షలాది ప్రతులు అమ్ముడుపోయాయి. నాటో కూటమి దేశాలలో 150 లిబియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాడు. లిబియా రుణం లేనిదేశం. లిబియన్లను అగ్రస్థానంలో నిలబెట్టిన ఘనత గడ్డాఫీకే దక్కింది. మరి ఇంత మేలు చేసిన గడ్డాఫీపై తిరుగుబాటు ఎందుకు జరిగింది? గడ్డాఫీ ప్రజల జీవన ప్రమాణాలను బాగా అభివృద్ధిపరిచినప్పటికి, అక్కడ ఎన్నికలు, పౌర హక్కులు, రాజకీయ హక్కులు లేకపోవడం ప్రజల అసంతృప్తికి కొంత కారణమైంది. రాజు ఇద్రిస్ వంశీయులు, పశ్చిమ దేశాలలో లిబియా వ్యాపార వర్గాలు, రాయబార కార్యాలయాల్లో పనిచేసే ఉన్నతాధికారులు, సైనికాధికారులు రాజ్యకాంక్ష ధనకాంక్షతో ఇటలీ, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, అమెరికాల సహాయంతో బెంఘాజీ పట్టణంలో తిష్టవేసి తిరుగుబాటు చేశారు.

లిబియాలో తిరుగుబాటు 2011 ఫిబ్రవరి 16న ప్రభుత్వ వ్యతిరేక నిరసనలతో ప్రారంభమైంది. బెంఘాజీలో అల్లర్లు, మానవ హక్కుల కార్యకర్త ఫెతీ తర్బెల్ అరెస్టుతో 17న తిరుగుబాటుదార్లు అగ్రహాదినం పాటించారు. ప్రజా ఉద్యమాన్ని అణచివేయొద్దని, హింసాత్మక దాడులు దిగొద్దని అంతర్జాతీయ సమాజం చేసిన విజ్ఞప్తులను గడ్డాఫీ పెడచెవిన పెట్టాడు. ఫిబ్రవరి 26న ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి ఆయనమీద, ఆయన కుటుంబ సభ్యుల మీద ఆంక్షలు విధించింది. ఫిబ్రవరి 28న యురోపియన్ యూనియన్ దేశాలు ఆంక్షలు విధించాయి. తిరుగుబాటుదారులకు రహస్యంగా ఆయుధాలు అందజేశాయి. అదే అదనుగా ఐక్యరాజ్యసమితిని అమెరికా రంగంలోకి దింపింది. గడ్డాఫీ వైమానిక దాడులను నిలువరించడమే లక్ష్యంగా 2011 మార్చి 17న లిబియాను 'నోఫ్లై జోన్ తీర్మానాన్ని' ఆమోదించింది. అయినా, గడ్డాఫీ సైన్యం వైమానిక దాడులను ఆపకపోవడంతో మార్చి 19న పారిస్‌లో హుటాహుటిన సమావేశమైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు గడ్డాఫీకి వ్యతిరేకంగా 'ఆపరేషన్ ఒడిస్సీ డాన్'ను ప్రారంభించాయి. ఇందులో భాగంగా ఫ్రాన్స్ అదే రోజు గడ్డాఫీ సైనిక స్థావరాలపై క్షిపణుల వర్షం కురిపించింది. మార్చి 24 ఈ బాధ్యతను నాటోకు అప్పగించడంతో అమెరికా, బ్రిటన్ సైన్యాలు పెద్ద ఎత్తున భీకరదాడులకు దిగాయి. నాటో సహాయంతో తిరుగుబాటుదారులు దాడులు ఉధృతం చేయడంతో గడ్డాఫీ సైన్యాలకు ఓటమి తప్పలేదు. వరుసగా పలు నగరాలు చేజిక్కించుకున్న తిరుగుబాటుదారులు ఆగస్ట్ 23న ట్రిపోలీని ఆక్రమించడంతో గడ్డాఫీ నగరం నుంచి పారిపోయాడు. చివరకు సిర్తేలో తిరుగుబాటుదారుల చేతిలో అక్టోబర్ 20న హతమయ్యాడు.

అక్టోబర్ 20న లిబియా ఎన్‌టిసి (జాతీయ పరివర్తన మండలి) సేనల చేతికి చిక్కిన గడ్డాఫీని కిరాతకంగా ఈడ్చుకుంటు రోడ్లవెంట తీసుకువెళ్లడం, ప్రాణాలతో పట్టుబడినా సన్నివేశాలను పలు దేశాల టీవీలు ప్రసారం చేశాయి. గడ్డాఫీ అతిపెద్ద సైనిక కాన్వాయిని సిర్తేలో నాటో దళాలు వైమానిక దాడి చేసి బలహీనం చేశాయి. అప్రమత్తమైన గడ్డాఫీ గాయాలతో ఒక కల్వర్టులో దాక్కొగా కనుక్కోని ఎన్‌టిసి సైనికులు తలపై కాల్పులు జరిపారు. సజీవంగా దొరికిన వ్యక్తిని అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు భిన్నంగా కాల్చిచంపడం జరిగింది. ఫోరెన్సిక్ వైద్యులు పొట్టలో కాల్పులు జరుపగా చనిపోయినట్లు ధృవీకరించారు. గడ్డాఫీ మృతదేహాన్ని జంతుమాసం భద్రపరిచే పాత స్టోర్‌లో ఉంచారు. వాళ్ల ఆచారం ప్రకారం శవాన్ని 24 గంటలలోపు దహనం చేయాల్సి ఉంది. మొదట్లో గడ్డాఫీ మృతదేహాన్ని సాంప్రదాయ బద్ధంగా ఖననం ఏర్పాట్లు చేస్తామని ఎన్‌టిసీ అధికారులు అన్నారు.

ఐ.రా.స. కమిషన్ ఒక ప్రకటన విడుదల చేస్తూ గడ్డాఫీ ప్రాణాలతో ఉండగా ఒక వీడియో దృశ్యం, శవంగా ఉండగా మరో వీడియో దృశ్యం వెలుగులోకి వచ్చాయి. ఈ రెండింటి మధ్య ఏం జరిగిందో తెలియాల్సి ఉందని అందువలన గడ్డాఫీ మృతిపై ఒక విచారణ చేపడుతామని ఐరాస ప్రకటించింది. అమెరికా తైనాతీ సంస్థగా తయారైన ఐక్యరాజ్య సమితి గడ్డాఫీని హతమార్చిన తీరుతెన్నులపై సమగ్రమైన నివేదిక కావాలని కోరినప్పటికీ, అమెరికా ప్రాపకంతో లిబియా ప్రతిపక్షం పేరిట ఎదుగుతూ వచ్చిన జాతీయ తాత్కాలిక పాలనా మండలి (ఎన్‌టిసి) ఐక్యరాజ్య సమితి మాటను ఖాతరు చేయలేదు. అమెరికా అడుగు జాడల్లోనే లిబియా ప్రతిపక్షం కూడా వ్యవహరిస్తూ గడ్డాఫీకి సమాధి గౌరవం కల్పిస్తే ఆ సమాధి లిబియా ప్రజలకు తీర్థయాత్రా స్థలంగా మారుతుంది కాబట్టి సమాధి కట్టే ప్రశ్నేలేదు అని చాటింది! అంటే ఒక వైపున గడ్డాఫీని లిబియా ప్రజల్ని కాల్చుకుతిన్న నియంతగా చిత్రించి, అందుకే గడ్డాఫీని ప్రజలు వదిలించుకోవాలని కోరుకుంటున్నారని అమెరికా, లిబియా ప్రతిపక్షాలు జమిలిగా ప్రకటన చేస్తూనే, మరోవైపు గడ్డాఫీ భౌతిక కాయాన్ని ఖననం చేస్తే ఆ సమాధి లిబియా ప్రజలకు తీర్థయాత్రా స్థలంగా మారుతుందని భీతిచెందడం దేనికి?

లిబియాలో గడ్డాఫీని చంపేసినట్లు వార్తలు వెలువడగానే మార్కెట్లు హర్షం తెలిపాయి. లిబియాలో కొత్తగా చమురు వెలికితీతకు నూతన శకం ప్రారంభమైందని ఆనందించారు. దురాక్రమణ ముగిసి లిబియా పునర్నిర్మాణ పనులు మొదలయ్యాయో లేదో చమురు లాభాల వేట తీవ్రతరమయ్యే సూచనలు ఇక్కడ కనబడుతున్నాయి. కోట్లాది డాలర్ల లిబియా చమురు వాణిజ్యంలో అధికభాగం వాటా కొట్టేయడానికి అనేక దేశాలు అప్పుడే సన్నాహాలు మొదలుపెట్టాయి. ఇందులో భాగంగా ట్రాన్సిషనల్ నేషనల్ కౌన్సిల్ (టిఎన్‌సి) నాయకులతో మంతనాలు సాగించేందుకు బెంఘాజీకి వాణిజ్య బృందాన్ని పంపే ఆలోచనలో ఉన్నామని 'ది ఇండిపెండెంట్' పత్రికకు బ్రిటన్ వాణిజ్య వేత్తలు తెలిపారు. ఆఫ్రికాలోనే లిబియా చమురు రిజర్వులు పెద్ద మొత్తంలో ఉన్నాయి. అక్కడ 44 వేల కోట్ల బ్యారళ్ల చమురు భూగర్భంలో ఉన్నట్లు అంచనా. చారిత్రకంగా చూస్తే అక్కడ చమురు వెలికితీత సగటు కంటే చాలా తక్కువగా ఉంది. అందుకే నాటో దేశాలు గడ్డాఫీని తొలగించేందుకు కుట్ర పన్నాయి.

పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లు గడ్డాఫీ నుంచి విముక్తి పేరుతో లిబియా ప్రజలు అమెరికా కూటమి కబంధ హస్తాల్లో చిక్కుకున్నారు. గడ్డాఫీ హత్య గావించబడ్డప్పటికీ యుద్ధం ఇప్పట్లో ముగియదు. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో యుద్ధం ముగియలేదు. లిబియా ప్రజలు ఇక తమను తాము పాలించుకునే అవకాశం కోల్పోయారు. అమెరికా తొత్తులే పాలకులు అవుతారు. ఇరాక్‌లో సద్దాంను కూలదోసిన వెంటనే పాశ్చాత్య కంపెనీలు చమురు గనులను చౌకగా చేజిక్కించు కున్నాయి. ఇప్పుడు లిబియాలో జరిగేది కూడా ఇదే. సెర్బియా, అఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో మాదిరిగానే ఇప్పుడు లిబియాలో కూడా అమెరికా విమానాలు బాంబులు కురిపించి నగరాలను ధ్వంసం చేశాయి. ఆ తరువాత పునర్నిర్మాణం పేర పాశ్చాత్య కంపెనీలు కాంట్రాక్టులు పొందుతాయి. లిబియా ప్రజల విముక్తి పేర అడుగుపెట్టిన నాటో దేశాలు ఆ దేశాన్ని పీల్చి పిప్పిచేయడానికి సమాయత్త మవుతున్నాయి. గడ్డాఫీ ప్రభుత్వంలోని న్యాయమంత్రి 'జాతీయ మార్పు మండలి' చీఫ్ ముస్తాఫా అబ్దెల్ జలీల్ నేతృత్వంలో బెంఘాజీలో నిర్వహించిన భారీ సభలో ప్రసంగిస్తూ గడ్డాఫీ నిషేధించిన 'షరియా' చట్టాన్ని పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించాడు. షరియాను ఉల్లంఘించే ఏ చట్టమైనా చెల్లనేరదని ప్రకటించాడు. విముక్త మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటు కోసం విభిన్నమైన రాజకీయ పార్టీలతో సంప్రదింపులు మొదలయ్యాయన్నాడు. రాజ్యాంగ రూపకల్పన కోసం కార్యాచరణను ప్రారంభించినట్లు తెలిపాడు. ఎన్‌టిసి నేతృత్వంలో నెలరోజుల్లోగా మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పరచనున్నట్లు తెలిపాడు. తిరుగుబాటు ఆరంభంలో లౌకికవాదానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపిన జలీల్ అమెరికా ఒత్తిడితో ఇస్లామిక్ తీవ్రవాద సంస్థను తృప్తి పరచడానికి లిబియాలో ఇస్లామిక్ చట్టాల్ని అమలు పరుస్తానని స్వప్రయోజనార్థం ఉగ్రవాదులకు హామి ఇచ్చింది. మరోవైపు ప్రభుత్వంలో ఇస్లామియా మిలిటెంట్లకు భాగస్వామ్యం ఇవ్వాలని బెల్హాజీ షరతు విధించాడు. అరబ్ విప్లవాన్ని సమర్థిస్తున్నట్లు చెబుతూనే అమెరికా లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ప్రక్కనపెట్టి ఇస్లామిక్ ఫండమెంటలిస్టులకు ఆధిపత్యాన్ని కట్టబెట్టింది.

అమెరికా నాయకత్వంలోని నాటోదేశాలు గడ్డాఫీని హత మార్చడమే ఏకైక లక్ష్యంగా వేట సాగించడానికి ప్రధాన కారణం చమురు దాహమే. ఆఫ్రికా దేశాలలో 4.6 కోట్ల బ్యారెల్స్ చమురు నిల్వలున్నాయి. చమురు సంపన్న దేశాలైన సౌది అరేబియా, కువైట్, ఇరాక్, సుడాన్‌లు ఇప్పటికే అమెరికా చెప్పు చేతుల్లో ఉండగా ఇప్పుడు లిబియా కూడా వశమైంది. ఇక మిగిలింది ఇరాన్ ఒక్కటే. దానిపైన అణ్వస్త్ర తయారీ పేరిట ఒత్తిళ్ల సాగుతూనే ఉన్నాయి. గతంలో రష్యా, చైనా బ్రెజిల్ దేశాలలో గడ్డాఫీ కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసి ఆ లాభాలను తన గుప్పిట్లోకి తెచ్చుకోవడమే అమెరికా కూటమి లక్ష్యం.

ప్రజాస్వామ్య రక్షణ పేరిట లిబియాపై అమెరికా సామ్రాజ్యవాద కూటమి తలపెట్టిన దురాక్రమణను, లిబియా ప్రతిపక్ష గ్రూపు దాడులను తిరుగుబాటుగా చిత్రించింది ఈ తిరుగుబాటు నిర్వహించడానికి ఆధార పడింది ఇస్లామిక్ ఉగ్రవాదులపై కావడం విశేషం. ప్రపంచ ఉగ్రవాద సంస్థగా అమెరికా ముద్రవేసిన ఆల్‌ఖైదాను స్థానికంగా మఘ్రెబ్ ప్రాంతంలో మట్టికరిపించిన వాడు గడ్డాఫీయే. లిబియా నేత గడ్డాఫీ నాటో వైమానిక దాడిలో గాయపడి హతమవడంతో అరబ్బు జాతీయవాద శకం ముగిసినట్టయింది. రెండవ ప్రపంచ యుద్ధానంతర ప్రపంచ రాజకీయాలలో పాశ్చాత్య సామ్రాజ్యవాదంపై పిడికిలి బిగించిన అరబ్బు యోధులలో, పరిపాలకులలో నాజర్, హుస్సేన్‌ల సరసన నిలువదగిన వ్యక్తి గడ్డాఫీ. ప్రపంచీకరణ తెస్తున్న ఒత్తిడుల మధ్య గడ్డాఫీ చాలా వరకు రాజీపడ్డాడు. అయితే పాశ్చాత్య సామ్రాజ్యవాదం అరబ్బు జాతీయవాద తుది ప్రతీకను కూడా నలిపివేయాలనుకుంది. దీంతో యోధుడిగా జీవితాన్ని ప్రారంభించిన గడ్డాఫీ చివరకు మళ్లీ అదే రీతిలో తుది పోరాటం సాగిస్తూ వీరమరణం పొందారు.

గడ్డాఫీ మంచి చెడ్డలు ఏమైనా అది లిబియా అంతర్గత వ్యవహారం. ఆ దేశ ప్రజలే నిర్ణయించుకోవాలి. గడ్డాఫీ నియంతనా, అధికార పిపాసా, భిన్నాభిప్రాయాన్ని సహించని వాడా అన్నది తేల్చుకోవల్సింది లిబియా ప్రజలు మాత్రమే. గాడాఫీకి శిక్ష విధించే అధికారం అమెరికాకుగాని, నాటోకుగాని లేదు. అమెరికాకు తొత్తులుగా వ్యవహరించిన లిబియా తిరుగుబాటు దార్లకు అంతకంటే లేదు. ఎందుకంటే గడ్డాఫీ నిజమైన జాతీయవాది, సామ్రాజ్యవాద వ్యతిరేకి. అమెరికా, నాటోల దుర్మార్గమైన జోక్యాన్ని గనక ఈ విధంగా సాగనిస్తే రేపు అన్ని దేశాల సార్వభౌమత్వా లకు ప్రమాదం తప్పదు. గడ్డాఫీని నియంత అనేవారు. ప్రపంచ నియంత అమెరికా పైశాచికత్వాన్ని చూడలేకపోతే అది ప్రపంచమంతటికి ప్రమాదం. ఏ దేశం పైనైన బలప్రయోగం చేసేందుకు అమెరికాకు, నాటోకు ఎలాంటి నైతిక హక్కులేదు. దోపిడీ, దురాక్రమణలతో తప్ప దాహం తీర్చుకోలేని ప్రపంచ సామ్రాజ్యవాద రక్కసిని ఓడించడం ప్రపంచ ప్రజల తక్షణ కర్తవ్యం.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు) వీ

బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు పదునుపెట్టి, ప్రశ్నించే వీలు లేని విధంగా సైన్యానికి సర్వ అధికారాలు కట్టబెట్టిన అణచివేత చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అంటున్నారు **ఎస్. శేషయ్య**

సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం

సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం 1958ని రద్దు చేయాలని దేశవ్యాప్తంగా పౌర ప్రజాస్వామిక హక్కుల సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ చట్టాన్ని రద్దుచేయాలని గత పదకొండు సంవత్సరాలుగా మణిపూర్‌కు చెందిన ఇరోమ్ షర్మిలా నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆత్మహత్య ప్రయత్నం నేరం కింద ఆమెను అరెస్టు చేసి ఆసుపత్రిని జైలుగా మార్చి ముక్కు ద్వారా ద్రవ ఆహారాన్ని ఇస్తూ నిర్బంధంలోనే ఉంచింది ప్రభుత్వం. నవంబర్ 5న ఆమె నిరాహార దీక్ష పన్నెండవ సంవత్సరంలోకి చేరిన సందర్భంగా 'షర్మిలాను రక్షించండి', 'సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని రద్దు చేయండి' అనే నినాదాలతో దేశవ్యాప్తంగా పాదయాత్రలతో ప్రచార ఉద్యమం కొనసాగుతూ ఉంది. 10 జూలై 2004లో 34 సంవత్సరాల తంజమా మనోరమా దేవిని సైనికులు ఆమె ఇంటి నుంచి బలవంతంగా ఎత్తుకెళ్లి, అత్యాచారం చేసి కాల్చి చంపారు. ఈ సంఘటనను నిరశిస్తూ 12 మంది మణిపూర్ మహిళలు రాజధాని ఇంఫాల్‌లో అస్సోం రైఫిల్స్ కేంద్ర కార్యాలయం ముందు నగ్నంగా ప్రదర్శన చేసారు. 'భారత సైనికుల్లారా మమ్మల్ని రేప్ చేయండి' అని నినాదాలు ఇస్తూ భారత సైనికుల దుర్మార్గాన్ని ప్రపంచ ప్రజలకు తెలియజేసారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మిలిటరీ చేతుల్లో 2600 మంది ఉద్యమకారులు, సామాన్య ప్రజలు హత్యకు గురయ్యారు. కేవలం 'నేరం చేస్తాడు' అనే అనుమానంతో కాల్చి చంపే అధికారం సైన్యానికి కల్పించడం ఈ చట్టం ప్రత్యేకతల్లో ఒకటి.

చారిత్రక నేపథ్యం

భారత దేశం భిన్నమయిన జాతుల నిలయం. సమ్మేళనం. కానీ భారత సంవిధానం (ఇండియన్ ఫెడరలిజం) అది ఏర్పడిన క్రమం స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక పద్ధతిలో జరగలేదు. ఈశాన్య భారతంలో భాగమైన అస్సోం, మణిపూర్, త్రిపుర, నాగాలాండ్, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రత్యేకమైన భాష, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం ఉన్నాయి. బ్రహ్మపుత్ర లోయకు పక్కన ఉన్న అస్సోం ప్రాంతం తప్ప అన్ని ప్రాంతాలు చాలా వెనకబడి ఉన్నాయి. వీటిని 'దగాపడిన చెల్లెల్లు' (సెవెన్ సిక్ సిస్టర్స్)గా వ్యవహరిస్తారు. ఈ ప్రాంతాలు, రాష్ట్రాల్లో నివసించే ప్రజలు భారత యూనియన్‌లో విలీనం కావడానికి ఇష్టపడలేదు. భారత ప్రభుత్వం బలవంతంగానే యూనియన్‌లో విలీనం చేసింది. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత కూడా ఈ జాతులు తమ స్వయం పాలన కోసం, స్వయం నిర్ణయాధికారం కోసం వివిధ రూపాల్లో పోరాడుతూనే ఉన్నారు. ఈ ప్రజాస్వామిక ఆకాంక్షను భారత ప్రభుత్వం 'వేర్పాటు ఉద్యమాలు'గా ముద్రవేసి సైనిక బలగాలతో అణచివేయడం ప్రారంభించింది. అంతే కాకుండా సైనికపరంగా, దేశ రక్షణ కోసం ఈ ప్రాంతాన్ని చాలా వ్యూహాత్మక ప్రదేశంగా పరిగణిస్తూ ఉంది. ఈ కారణాల చేత ఒక చట్టాన్ని చేసి సైనిక పాలనకు చట్టబద్ధతను, విశ్వసనీయతను కల్పిస్తూ ఉంది. వాస్తవానికి అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతూ ఉంది.

భారత రాజ్యాంగం 26 జనవరి 1950న అమల్లోకి వచ్చింది. వచ్చిన మూడు సంవత్సరాల లోపే ఈశాన్య భారతంలో ప్రభుత్వానికి విస్తృతమైన అధికారాలను కల్పిస్తూ అస్సోం మైంటెనెన్స్ ఆఫ్ పబ్లిక్ ఆర్డర్ (అటానమస్ డిస్ట్రిక్ట్) రెగ్యులేషన్ చట్టం వచ్చింది. ఈ చట్టం నాగాలాండ్ పర్వత ప్రాంతాలకు కూడా వర్తిస్తుంది. ఈ చట్టం గవర్నర్‌కు విస్తృతంగా అధికారాలు ఇచ్చింది. సామూహికంగా ప్రజల నుండి పన్నులు వసూలు చేయడానికి, వారంటు లేకుండా అరెస్టు చేయడానికి, సభలను, సమావేశాలను, ప్రదర్శనలను నిషేధించడానికి ఈచట్టం వీలు కల్పించింది. 1953 చట్టం కంటే ముందు స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 1942 ముందుకు వచ్చిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని అణచి వేయడానికి బ్రిటిష్ పాలకులు తీసుకువచ్చిన సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల ఆర్డినెన్స్ 1958 చట్టానికి మూలం.

సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం 1958ని మొదటి ఆర్డినెన్స్ రూపంలో తెచ్చారు. కొద్ది రోజుల్లోనే పార్లమెంట్ వర్షాకాలం సమావేశంలో ఈ ఆర్డినెన్స్‌కు సమర్థన (రాటిఫికేషన్) ప్రవేశపెట్టారు. అప్పటి రాజ్యసభ చైర్మన్ పి.ఎన్. సప్రు ఈ ఆర్డినెన్స్‌ను ప్రవేశపెట్టాల్సిన అత్యవసర పరిస్థితి ఏముందని ప్రశ్నించాడు. చాలా మంది పార్లమెంట్ సభ్యులు ఈ ఆర్డినెన్స్ చట్టంగా మారితే ప్రజల పౌర, ప్రజాస్వామిక హక్కులకు ప్రమాదం ఏర్పడుతుందని చెప్పారు. రాజ్యాంగానికి అతీతంగా పరిపాలన సాగుతుందనీ, చట్టం అమల్లో ఉన్న ప్రాంతాల్లో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగి, సాధారణ పరిపాలన స్థానంలో సైనిక పాలన ఏర్పడే పరిస్థితి వస్తుందని పార్లమెంట్ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ పార్లమెంట్‌లో మూడు గంటలు, రాజ్యసభలో నాలుగు గంటల చర్చ తర్వాత చట్టం ఆమోదం పొంది అమల్లోకి వచ్చింది. 1958లో మొదట ఈ చట్టం అస్సోం, మణిపూర్, నాగాలాండ్‌లోని పర్వత ప్రాంతాలకే పరిమితమయ్యింది. ఆ తర్వాత 1972లో ఈ చట్టాన్ని సవరించి నాగాలాండ్, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ ప్రాంతాలకు విస్తరించారు. 1983లో ఇలాంటి చట్టం (సాయుధ బలగాల (పంజాబ్, చండీగర్) ప్రత్యేక అధికారాల చట్టం) పంజాబ్, చండీగర్‌లకు సంబంధించి చేశారు. జమ్మూ–కశ్మీర్ ప్రాంతంలో జరుగుతున్న కశ్మీర్ ఉద్యమాన్ని అణచివేయడానికి 1990లో సాయుధ బలగాల (జమ్మూ–

కశ్మీర్) ప్రత్యేక అధికారాల చట్టాన్ని తీసుకవచ్చారు. దీంతోపాటు సాయుధ బలగాల (ఎమర్జెన్సీ డ్యూటీ) చట్టం కూడా ఉంది.

ఈ చట్టాల ప్రధాన ఉద్దేశ్యం కల్లోలిత ప్రాంతాల్లో ప్రజా వ్యవస్థను (పబ్లిక్ ఆర్డర్) పరిరక్షించడానికి, సాధారణ పరిపాలన వ్యవస్థకు, పోలీసు వ్యవస్థకు సైన్యం సహకరించడానికి ప్రత్యేక అధికారాలు కల్పించడం. సాధారణ పరిపాలనకు సహకరించే, తోడ్పడే సందర్భంలో సైన్యం నేర విచారణ చట్టం (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్) పరిధిలోనే వ్యవహరించాలని ఈ చట్టం ప్రత్యేకంగా నిర్దేశిస్తుంది. కానీ, వాస్తవానికి సైన్యం అన్ని చట్టాలను పక్కనపెట్టి, తమ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తూన్నది. పౌర సమాజాన్ని సైనికీకరణ దిశగా తీసుకవెళ్తోంది.

చట్టం ప్రధాన అంశాలు

ఈ చట్టంలో కేవలం ఏడు సెక్షన్లు మాత్రమే ఉన్నాయి. కానీ ఈ చట్టం ఇచ్చిన అధికారంలో సైన్యం చేసిన అకృత్యాలు, దుర్మార్గాలు, అత్యాచారాలు, హత్యలను గ్రంథస్తం చేస్తే వేల పేజీల పుస్తకం అవుతుంది. సైన్యం చేసే నేరాలను విచారించడానికి, శిక్షించడానికి ఎటువంటి వ్యవస్థ లేకపోవడమే కాకుండా వారికి మరిన్ని రక్షణలు కల్పించడం ఈ చట్టం ప్రత్యేకత. సెక్షన్ 1 చట్టాన్ని సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టంగా పేర్కొంది. సెక్షన్ 2 ఈ చట్టం అమలయ్యే ప్రాంతాల గురించి వివరిస్తుంది. (అస్సాం, మణిపూర్, మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మిజోరాంలలోని 'కల్లోలిత ప్రాంతాలు'). సాయుధ బలగాలు అంటే కేవలం మిలిటరీ బలగాలతో పాటు వైమానిక దళాలు కూడా అని పేర్కొంది. అవసరమయితే వైమానిక దాడులకు కూడా ఈ చట్టం అవకాశం ఇస్తుంది. ఈ చట్టాన్ని అమలు చేయడానికి ఆయా రాష్ట్రాల్లో రెండు ప్రత్యేకమైన పరిస్థితులు ఉండాలి. ఒకటి, ప్రజా వ్యవస్థ (పబ్లిక్ ఆర్డర్)ను కాపాడే పరిస్థితులు లేనప్పుడు; రెండు, సాధారణ పరిపాలన కొనసాగించడం అసాధ్యమైనప్పుడు పరిస్థితులను చక్కదిద్దడానికి, పరిపాలనలో సాధారణ పరిస్థితి నెలకొల్పడానికి సైన్యాన్ని సహాయంగా పంపాలి అనేది చట్టం ప్రధాన ఉద్దేశం.

కల్లోలిత ప్రాంతం

ఈ చట్టంలోని సెక్షన్ 3 కల్లోలిత ప్రాంతంను వివరిస్తుంది. సెక్షన్ 3లో కల్లోలిత ప్రాంతం అని ప్రకటించడానికి కచ్చితమైన ప్రమాణాలు గురించిన వివరణ లేదు. కేంద్ర ప్రభుత్వం లేదా గవర్నరు లేదా కేంద్ర పాలిత ప్రాంతం పరిపాలనా అధికారి ఒక ప్రాంతంలో కల్లోలితమైన ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయని అభిప్రాయ పడితే ఆ ప్రాంతాన్ని కాదు రాష్ట్రం మొత్తానికి చట్టాన్ని అమలు చేస్తూ ఒక నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఈ అభిప్రాయానికి రావాడనికి అవసరమైన పరిస్థితులు, సాక్ష్యాలు ఉన్నాయా లేదా అనే వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు. కేవలం తమ స్వీయమానసిక అభిప్రాయాల ఆధారంగా ఒక ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించే వెసులుబాటు ఈ చట్టం కల్పించింది. కల్లోలిత, ప్రమాద పరిస్థితులు లేకున్నా రాష్ట్రాన్ని మొత్తంగా కల్లోలిత ప్రాంతంగా ప్రకటించిన సందర్భాలు ఉన్నాయి. ఇవ్వాళ కశ్మీర్‌లో చాలా వరకు శాంతియుత వాతావరణం ఏర్పడిందనీ, కొన్ని ప్రాంతాల్లో ఆటంకవాదుల కార్యకలాపాలు తగ్గాయనీ, అందువల్ల ఆ ప్రాంతాల నుండి చట్టాన్ని ఉపసంహరించాలనీ కశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా ఢిల్లీలో మంత్రుల చుట్టూ తిరుగుతున్న సంగతి తెలిసిందే. కానీ కేంద్రం ఆయన అభ్యర్థలను తిరస్కరిస్తూ ఉంది. ఈ విషయంలో కేంద్ర మంత్రుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని కూడా వార్తలు వచ్చాయి. అంటే క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పక్కన పెట్టి రాజకీయ, సైనిక వ్యూహంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకుంటాయి. 'కల్లోలిత ప్రాంతం'గా ప్రకటించడం అంటే పరోక్షంగా ఎమర్జెన్సీని విధించడం. సైన్యాన్ని దింపడం, సైనిక పాలనకు అవకాశం ఇవ్వడం.

సాయుధ బలగాల ప్రత్యేక అధికారాలు

చట్టంలో సెక్షన్ 4 సాయుధ బలగాలకు విశేషమైన అధికారాలు కల్పించింది.

1. సెక్షన్ 4(ఎ) : సైనికాధికారి (కమిషన్డ్ ఆఫీసర్స్ నాన్ కమిషన్డ్ ఆఫీసర్స్, జూనియర్ కమాండర్) అభిప్రాయంలో 'కల్లోలిత ప్రాంతంలో ఎవరైనా శాంతి భద్రతకు విఘాతం కలిగించినా, నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నప్పుడు అయిదు లేక ఎక్కువ మంది గుమిగూడినా, ఆయుధాలు కలిగి ఉన్నా, ఏ పరికారాన్నైనా ఆయుధంగా ఉపయోగించినా బలప్రయోగం, కాల్పులు జరిపి చంపవచ్చు.

2. సెక్షన్ 4(బి) : ఆయుధాల డంపులను, బంకర్లను, రక్షణ స్థావరాల నుండి సాయుధ దాడులకు పాల్పడినా, ప్రయత్నించినా, ఆయుధ శిక్షణ ఇచ్చే క్యాంపులను, సాయుధ గ్రూపులు దాగి ఉండే ప్రదేశాలపై సైన్యం దాడులు చేసి, ధ్వంసం చేసే అధికారం ఉంది.

3. సెక్షన్ 4(సి) : ఎవరైనా నేరం చేసినా లేదా నేరం చేస్తాడనే అనుమానం ఉన్నా వారంటు లేకుండా అరెస్టు చేసే అధికారం ఉంది. అరెస్టు చేసే సందర్భంలో బలప్రయోగం చేయవచ్చు.

4. సెక్షన్ 4(డి): ఏ ప్రదేశంలోనైనా ఒక వ్యక్తి నిర్బంధంలో ఉన్నా, ఆస్తి, ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని చట్ట వ్యతిరేకంగా దాచిపెట్టినా వారంటు లేకుండా సోదా చేసే అధికారం ఉంది. సోదా చేసే క్రమంలో బలప్రయోగం చేయవచ్చు.

ఈ విధంగా సెక్షన్ 4 సాయుధ బలగాలకు విస్తృతమైన అధికారాలు ఇచ్చింది. సాధారణ నేర విచారణ చట్టంలో పోలీసులకు అరెస్టు, సోదా, ఇంటరాగేషన్ చేసే అధికారం ఇవ్వబడింది. అయితే ఈ అధికారం పై అనేక నిబంధనలు ఉన్నాయి. రాజ్యాంగం, నేర విచారణ చట్టం (సిఆర్.పి.సి.) ముద్దాయికి అనేక హక్కులు కల్పించింది. బలప్రయోగం చేసినా అవసరమైనంత మేరకే అని చట్టాలు చెబుతాయి. కాని ఈ చట్టం కాల్చి చంపే అధికారం ఇచ్చింది. వారంటు లేకుండా అరెస్టులు, సోదాలు చేసే అధికారం ఇచ్చింది. సాధారణ క్రిమినల్ చట్టాల్లో పోలీసుల అధికారం ఎక్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, జుడిషియల్ మెజిస్ట్రేట్ పర్యవేక్షణ ఉంటుంది. ఈ చట్టం కల్పించిన విశేషాధికారాలతో సాయుధ బలగాలు ఎంత విచక్షణారహితంగా వ్యవహరిస్తాయో ఊహించలేం. డి.కె. బాసు కేసులో అరెస్టు, సోదాలు, కస్టడీ మరణాలకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనలు ఏ మాత్రం అమలు కావు.

సెక్షన్ 5 ప్రకారం సైన్యం అరెస్టు చేసిన వ్యక్తిని, ఆలస్యం కాకుండా దగ్గరలోని పోలీసు స్టేషన్ అధికారికి అప్పజెప్పాలి. అరెస్టుకు దారితీసిన పరిస్థితులకు సంబంధించిన రిపోర్టును అందజేయాలి. కానీ సాయుధ బలగాలు ఈ నియమాన్ని పాటించవు. అనుమానం పేరుతో మిలిటెంట్లను / అమాయకులను రోజుల తరబడి ఆర్మీ క్యాంపుల్లో నిర్బంధించి, చిత్రహింసలు పెట్టి పోలీసులకు స్వాధీనం చేస్తారు. ఆర్మీ క్యాంపుల్లో చిత్రహింసలకు మరణించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అక్రమంగా అరెస్టు, చిత్రహింసలు, కస్టడీ మరణాలకు వ్యతిరేకంగా ఆందోళన చేసే అవకాశం ఉండదు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన

పెట్టుబడిదారీ వ్యవస్థల సంక్షోభాల నేపథ్యంలో వాల్‌స్ట్రీట్ ఉద్యమం తీసుకువచ్చిన ప్రశ్నలనూ, ఉద్యమ పూర్వాపరాలనూ విశ్లేషిస్తున్నారు **పి. ప్రసాద్**

'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమ గమనం - గమ్యం

తుపాన్లు వచ్చేముందు తూనీగలు గాలిలో ఎగరడం ప్రకృతి నియమం. కార్మికవర్గ తిరుగుబాట్లు తలెత్తేముందు 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' తరహా ఉద్యమాలు తలెత్తడం రాజకీయ నియమం. తూనీగలు స్వయంగా వర్షాన్ని కురవలేవు. కారుమబ్బులు మాత్రమే కురుస్తాయి. అయితే వర్షం కురిసే వాతావరణాన్ని అవి ఆస్వాదించి, ఆహ్వానిస్తాయి. ప్రకృతి నియమాలకు లోబడి తూనీగలు తమ విధులను నిర్వహిస్తాయి. 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' తరహా ఉద్యమశక్తులు కూడా స్వయంగా విప్లవించలేవు. విప్లవీకరణ చెందిన కార్మికవర్గం మాత్రమే విప్లవీకరించ గలదు. అయితే అవి విప్లవ పరిస్థితులకి స్పందించి, దారిని సుగమం చేస్తాయి. సామాజిక నియమాలకు లోబడి 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' తరహా ఉద్యమశక్తులు తమ రాజకీయ విధులను నిర్వహిస్తాయి. కొన్నిసార్లు వర్షం కురవకుండానే తూనీగలు అదృశ్యం కూడా కావచ్చు. 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' తరహా ఉద్యమాలు కూడా కొన్నిసార్లు కార్మికవర్గ తిరుగుబాట్లు అనుసరణ జరగకుండానే ముగిసిపోవచ్చు. ఇలాంటి కొన్ని ప్రత్యేక సందర్భాలలో కూడా పై రెండింటి సాధారణ లక్షణాలకి గల ప్రాధాన్యత మాసిపోదు. వర్షాగమన పరిస్థితులకూ, విప్లవాగమన పరిస్థితులకూ గల ప్రాధాన్యత తగ్గబోదు. తాజా 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమం ఎలా ముగుస్తుందన్నది ముఖ్యం కాదు. ఎలాంటి పరిస్థితులను సూచిస్తున్నదన్నదే ముఖ్యమైనది.

తాజా 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' (ఆక్యుపై వాల్‌స్ట్రీట్ – ఒ.డబ్ల్యు.ఎస్.) ఉద్యమం 'తక్కువ సాంద్రత – ఎక్కువ విస్తృతి'తో కొనసాగుతున్నది. తక్కువ సాంద్రత గల ఉద్యమం ఎందుకంటే, ఇది కేవలం ప్రతీకాత్మక (సింబాలిక్) స్వభావంతో నడుస్తున్నందునే. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థను భౌతిక వస్తుగతంగా దెబ్బతీసేది కాకపోవడం వల్లనే. ఇది ఎక్కువ విస్తృతి గల ఉద్యమం ఎందుకంటే, అతి తక్కువ సమయంలో అత్యధిక దేశాలకూ, నగరాలకూ వ్యాపించడం వల్లనే. ప్రపంచవ్యాప్తంగా ప్రచార బాహుళ్యం పొందడం వల్లనే. దీని పాజిటివ్, నెగిటివ్ అంశాలివి. దీని బలమూ, బలహీనతలూ ఇవే. దీని బలహీనత ఏమిటంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక పునాదుల జోలికి వెళ్లకపోవడమే. దీని బలమేమిటంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ రాజకీయ ప్రతిష్ఠను మసక బార్చడమే. దీని ప్రధాన లక్ష్యమేమిటంటే, పెట్టుబడిదారీ వ్యవస్థపై నిరసన, అసంతృప్తులను సోషలిస్టు మార్గంవైపుకు వెళ్లనివ్వకుండా దారి మళ్లించడమే. దీని ప్రధాన ఫలితం ఏమిటంటే, పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చివేసే లక్ష్యంగల సోషలిస్టు విప్లవశక్తులకి పెనుస్ఫూర్తి నివ్వడమే. ఈ మంచి, చెడులను సమతుల్యతతో విశ్లేషించే ప్రాతిపదికతో 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమాన్ని అర్థం చేసుకుందాం.

సెప్టెంబర్ 17న న్యూయార్క్‌లోని వాల్‌స్ట్రీట్ ప్రాంతంలో కొద్దిమందితో ప్రారంభమైన ఈ ఉద్యమం అక్టోబర్ చివరి నాటికే 85 దేశాలకి విస్తరించింది. నిర్వాహకుల ప్రకటన ప్రకారం రెండు వేలకి పైగా నగరాలకీ, పట్టణాలకీ వ్యాపించింది. ఇంకా విస్తృత మవుతూనే ఉంది. కార్పొరేట్ కంపెనీల ఆర్థిక అరాజకాలపై కొనసాగుతున్న

పోలీసులపై చర్య తీసుకునే అవకాశం కూడా లేదు. ఎందుకంటే సెక్షన్ 6 సాయుధ బలగాలకు నేర విచారణ నుండి రక్షణ కల్పిస్తున్నది. ఈ సెక్షన్ ప్రకారం, సాయుధ బలగాలకు చెందిన ఎవరైనా ఈ చట్టం కల్పించిన అధికారాలను దుర్వినియోగం చేస్తాడనీ, అతనికి వ్యతిరేకంగా దావా గానీ, చట్టప్రకారం కేసు వేయడానికి వీలు లేదు. కేసు వేయడానికి ముందుగా కేంద్ర ప్రభుత్వం అనుమతి అవసరం. సాధారణ పోలీసులపై మనం ప్రైవేట్ కంప్లైంట్ వేయడానికి వీలు లేదు. సాధారణ క్రిమినల్ కేసులు విచారణ జరిపి శిక్షించడానికి వీలు లేదు. సైనికుల మీద విచారణ జరిపి శిక్షించాల్సింది ఆర్మీ కోర్టులు మాత్రమే. ఈ కోర్టుల్లో శిక్షలు పడడం చాలా అరుదుగా జరుగుతుంది.

ఈ చట్టాన్ని రాజ్యాంగ వ్యతిరేకం అనీ, ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు దారి తీస్తుందనీ సుప్రీం కోర్టులో సవాలు చేశారు. (నాగా పీపుల్స్ మూవ్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా). కానీ సుప్రీంకోర్టు కూడా ఈ చట్టం రాజ్యాంగ బద్ధమేనని తీర్పు ఇచ్చింది. సాయుధ బలగాలు ఏం చేయాలో, ఏం చేయకూడదో అని కొన్ని సూచనలు చేసింది. వాటిని సాయుధంగా బలగాలు పాటించిన ఉదంతాలు లేవు. ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు రావడంతో కేంద్ర ప్రభుత్వం జస్టిస్ జీవన్‌రెడ్డి నేతృత్వంలో ఒక కమిషన్ వేసింది. చట్టం అమలుపై సమీక్షించి సూచనలు ఇవ్వమని కోరింది. ఈ చట్టాన్ని రద్దు చేయమని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూనే, కమిషన్ మరో అన్యాయమైన సూచన చేసింది. ఈ చట్టంలోని అధికారాలను యథాతథంగా చట్ట వ్యతిరేక కార్యకలాప నిరోధక చట్టంలో (యుఎపిఎ) చేర్చమని కోరింది. 1763లో వచ్చిన యుఎపిఎ చట్టాన్ని 2004, 2008లో సవరణలు చేసి మరింత అప్రజాస్వామికమైన పద్ధతులను ప్రవేశపెట్టారు. గతంలో టాడా, పోటా లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం రావడంతో వాటిని వెనక్కు తీసుకున్నారు. అదే విధంగా ఈ రోజు ఎపిఎఫ్ఎస్‌పిఎ, యుఎపిఎ లను రద్దు చేయాలని ఉద్యమం జరుగుతూనే ఉంది. వీటికి మద్దతు తెలపడం మనందరి బాధ్యత.

(రచయిత ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం అధ్యక్షులు) వీ

ఉద్యమంగా ప్రచారమవుతున్నది. 'మేం 99 శాతం మందిమి' అన్నది కేంద్ర నినాదంగా మారింది. ఒక్క శాతంగా ఉన్న బడా కార్పొరేట్ కంపెనీలకి 99 శాతం అంటే ప్రపంచ ప్రజలకి చెందిన ప్రజాధనాన్ని 'బెయిల్ అవుట్ల' పేరిట కట్టబెట్టడాన్ని ఈ ఉద్యమం వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారమవుతున్నది. ఉద్యమ నిగూఢ లక్ష్యం ఏదైనా, ప్రకటిత లక్ష్యం మాత్రం ఇదే. ఉద్యమ సారం ఏదైనా, రూపం మాత్రం ఇదే.

తాజా 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమం కొనసాగుతున్న తీరుతెన్నుల వివరాలలోకి వెళ్లడం లేదు. ఏయే దేశాలకి, ఏయే నగరాలకి ఎలా విస్తరించిందో వివరించనవసరం లేదు. ఏయే కేంద్రాలలో ఎందరెందరు ఎలా పాల్గొంటున్నారన్నవి ఉదహరించడం లేదు. అలా వివరించనక్కర లేదనడానికి రెండు కారణాలున్నాయి. పత్రికలు, టీవీ ఛానళ్ల ద్వారా పుంఖాను పుంఖంగా ఈ ఉద్యమ వివరాలు ప్రజలకి లభిస్తున్నాయి. చర్విత చరణంగా మళ్లీ వివరించనక్కర లేదు. మరో కారణమేమిటంటే, ఉద్యమ కథనం కంటే విశ్లేషణ ముఖ్యం కావడమే. ఉద్యమంలో సంఘటనలూ, సన్నివేశాల కంటే, ఉద్యమ గమనమూ, గమ్యమూ ముఖ్యమైనవి. ఏ నిర్దిష్ట చారిత్రక, రాజకీయ నేపథ్య భౌతిక పరిస్థితుల్లో ఈ ఉద్యమం ఆవిర్భవించిందన్నదే ముఖ్యమైనది. ఏ నిర్దిష్ట రాజకీయ పాత్రను పోషిస్తుందన్నదే కీలకమైనది. ఈ నిర్దిష్ట దృక్కోణంతో టూకీగా విశ్లేషించడమే ఈ వ్యాస లక్ష్యం.

బయటకు కనిపించే రాజకీయ ఉద్యమాల వెనక కంటికి కనబడని ఆర్థిక శక్తులుంటాయి. ఆర్థిక ప్రవాహాలు తెర వెనక ఉంటాయి. తెరమీది రాజకీయ ప్రవాహాలుంటాయి. తెర వెనుక విధానాలుంటాయి. తెర మీద నినాదాలు వినిపిస్తాయి. చూపుడు వేలితో పైన తూర్పును చూపిస్తూ, కాళ్లతో కింద పడమర వైపుకు నడిపించే పరిస్థితులు కొనిసార్లుంటాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ రంగులరాట్నం వంటిది. తనపై తానే పోరాడినట్లు అభినయించగలదు. తన తీవ్ర ప్రత్యర్థి వర్గమైన పీడిత వర్గాన్ని తమలో తాము అంతర్గతంగా కొట్లాడుకునేటట్లు చేయగలదు. అందుకే 'మెరిసేదంతా బంగారం కాదు – తెల్లనివన్నీ పాలు కావు' అన్నట్లు నిశిత పరిశీలనా దృష్టితో ప్రతి రాజకీయ పరిణామాన్ని పరిశీలించాలి. అందుకు తాజా 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమం కూడా మినహాయింపు కాదు.

ఏదేని ఓ ఉద్యమ గమనాన్నీ, గమ్యాన్నీ విశ్లేషించాలంటే, దాని ఆవిర్భావం నాటి భౌతిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. ఓ 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమం ఏదో ఒక దేశానికి పరిమితం కాదు. అది ఓ ఖండానికి కూడా పరిమితం కాదు. యావత్తు ప్రపంచ ప్రజల ఆకాంక్షలకనుగుణ్యమైన నినాదాలతో అది ఆవిర్భవించింది. అందుకే దీన్ని అర్థం చేసుకోవడానికి సమకాలీన ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిణామాలను పరిగణనలోకి తీసుకోవాలి.

దహనశీల రాజకీయ పరిణామాలతో క్రమంగా వేడెక్కుతున్న చలనశీల ప్రపంచమిది. వర్తమాన ప్రపంచం ఇంకా ఓ అగ్నిగుండంగా మారని మాట నిజమే. ఇంకా ప్రపంచం విప్లవ వెల్లువలకి గురికాలేదు. కానీ అగ్ని పర్వతం బద్దలయ్యే ముందు 'ముందస్తు పొగలు' వెలువడే పరిస్థితి ఏర్పడుతున్నది. అలాంటి భుగభుగలూ, భగభగలూ ఇప్పటికే ప్రపంచం నిండా వెలువడుతున్నాయి. ప్రచ్ఛన్న యుద్ధానంతరం ప్రపంచీకరణ విధానాలతో రూపొందిన ప్రపంచం ఒకింత గడ్డకట్టింది. చలనశీలతను కోల్పోకపోయినా, దహనశీలత ఆనాడు కొరవడింది. ఫలితంగా ఘనీభవించిన నాటి ప్రపంచం ఇటీవల వరుసవారీ ఉష్ణగాలులతో ద్రవీభవించసాగింది. అది మరుగుతున్నది. 'విప్లవీకరణ ప్రపంచంగా బాష్పీభవించడానికి మరికొంత వ్యవధి ఉన్న మాట నిజమే. కార్మికవర్గం జూలు విదుల్చుకొని రాజకీయ యవనిక మీదికి వచ్చిననాడే బాష్పీభావన స్థితికి చేరుతుంది. ఈ పరివర్తనా దశలో వర్తమాన ప్రపంచం ఉంది. ఈ దశలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎదురయ్యే సవాళ్లు, అవి ఎంచుకునే పరిష్కార మార్గాలు ఎలా ఉంటాయో శాస్త్రీయంగా అంచనా వేయాలి.

1991లో మొదటి గల్ఫ్ యుద్ధం నుంచి 2001లో న్యూయార్క్ జంట శిఖరాలపై దాడి (9/11) వరకూ అమెరికా దురాక్రమణ నీతి ఏకపక్షంగానే సాగింది. కానీ 2001 తర్వాత అది క్రమంగా ఎదురు దెబ్బలు తింటూ వచ్చింది. 9/11కి మరో పదేండ్లు గడిచాయి. మొదటి దశాబ్దం (1991–2001)లో ప్రపంచ వాణిజ్య సాగరంలో అమెరికా 'వాలు ఈత'తో ఈదులాడింది. కానీ తదనంతరం రెండవ దశాబ్దం (2001–2011)లో అది ఎదురీత సాగించాల్సి వచ్చింది. ఈ ఎదురీత కూడ ఆఖరి సంవత్సరాలలో దానికి శ్వాస ఆడని పరిస్థితులు ముంచుకొస్తున్నాయి. మునకకి దారితీసే ప్రమాదంలో క్రమంగా అమెరికా చిక్కుకుంటున్నది. ఈ చివరి సంవత్సరాల పరిణామాల నేపథ్యం నుంచి తాజా 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమాన్ని పరిశీలించాలి.

ప్రపంచ ఆర్థిక సంక్షోభ సంవత్సరంగా '2008' పేరొందింది. ఈ సంక్షోభ నివారణ పేరిట ట్రిలియన్ల డాలర్లతో కూడిన భారీ ఆర్థిక ఉద్దీపన పథకాలను అమలు చేసిన (ఇయర్ ఆఫ్ బెయిల్ అవుట్స్) సంవత్సరంగా '2009' పేరొందింది. ఈ బెయిల్ అవుట్లకి వ్యతిరేకంగా యూరప్ వ్యాప్తంగా పెల్లుబికిన కార్మిక పోరాటాల సంవత్సరంగా '2010' పేరొందింది. పై మూడు సంవత్సరాలకి భిన్నంగా '2011' పేరొందింది. అది 'ఒకే ఏడాది – రెండు వెల్లువలు' కి కారణమైంది. పూర్వార్థం 'మల్లెల విప్లవం' (అరబ్ ప్రజా వెల్లువ) తోనూ, ఉత్తరార్థం 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమంతోనూ 2011 సంవత్సరం ప్రాచుర్యంలోకి వచ్చింది. స్థూలంగా పరిశీలిస్తే '2008, 2009' రెండూ పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రసవ వేదనాలు అనుభవించిన సంవత్సరాలుగా పరిగణించవచ్చు. '2010, 2011' రెండూ పెట్టుబడిదారీ వ్యవస్థ దుష్ఫలితాలపై ప్రపంచపీడిత ప్రజలు పోరాటాలు సాగించిన సంవత్సరాలుగా పరిగణించవచ్చు. పైగా ఈ ఒక్క ఏడాది (2011) రెండు రకాల ప్రజా వెల్లువలను ఆవిష్కరించింది. దీనిని బట్టి ఏడాదికేడాది ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ పతనోన్ముఖ మార్గంలో అడుగులు వేస్తున్నది. ఈ వాస్తవాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

2010లో యూరప్‌లో వెల్లువెత్తిన కార్మిక పోరాటాలు ప్రధానంగా ఐదారు దేశాలలోనే సాగాయి. అందులో ఫ్రాన్స్ కార్మిక వర్గం అత్యంత సమరశీల పాత్రను పోషించింది. స్పెయిన్, ఇటలీ, గ్రీస్, పోర్చుగల్, బ్రిటన్ దేశాలలో కూడా ఉధృతంగా కార్మిక పోరాటాలు సాగాయి. (ఒక్క బ్రిటన్ తప్ప మిగిలిన పై దేశాలన్నీ మధ్యధరా సముద్ర ఉత్తర తీర దేశాలే కావడం గమనార్హం!) రవాణ, కమ్యూనికేషన్ల రంగాలు సైతం రోజుల తరబడి సార్వత్రిక సమ్మెలతో స్తంభించిపోయాయి. ఇది చాలా విప్లవాత్మక పరిణామమే. అయితే ఒక ప్రతికూల అంశం కూడా వెంటాడుతున్నది. ప్రచ్ఛన్న యుద్ధంలో సంక్షేమ ముసుగును చూపించి పెట్టుబడిదారీ ప్రభుత్వాల పక్షాన యూరప్ ట్రేడ్ యూనియన్లు చేరిపోయాయి. మొదట ప్రపంచ యుద్ధ కాలంలోనే యూరప్ ట్రేడ్ యూనియన్లు పెట్టుబడిదారీ వర్గాలతో లాలూచీ పడుతున్న పరిణామాన్ని లెనిన్ విశదీకరించాడు. ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటికి ట్రేడ్ యూనియన్లు పరిశ్రమాధిపతులతో జూనియర్ భాగస్వాములుగా చేరాయి. తాజా బెయిల్ అవుట్లు, హక్కుల కాలరాతలతో రోడ్డెక్కిన యూరప్ కార్మికవర్గం ఇంకా నూతన విప్లవ నాయకత్వాలను ఆవిష్కరించుకోలేకపోయింది.

పాత బ్యూరాక్రటిక్ ట్రేడ్ యూనియన్ నాయకత్వాలే నూతన డెమోక్రటిక్ కార్మిక పోరాటాలకి 'మారిన ముసుగు'తో నాయకత్వం వహిస్తున్నాయి. అవి కార్మిక పోరాటాలకి 'లక్ష్మణ రేఖలు' గీసి బ్రేకులు వేస్తున్నాయి. అందువల్ల నూతన విప్లవ ట్రేడ్ యూనియన్ శక్తులు రూపొందుదానికి అనువైన భౌతిక పరిస్థితులు పరిపక్వమవుతున్నాయి. ఈ పూర్వ పరిస్థితులను పదునెక్కనివ్వకుండా వీలైనంత మేరకి మొద్దుబార్చాల్సిన ఆవశ్యకత పెట్టుబడీదారీ వర్గానికి ఏర్పడింది. ఈ నేపథ్యం కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

పై యూరప్ కార్మిక వెల్లువలు 2010 ఉత్తరార్ధంలో ఉధృతంగా సాగితే, 2011 పూర్వార్ధంలో అరబ్ ప్రజా వెల్లువలు ఉధృతంగా సాగాయి. మధ్యధరా సముద్ర ఉత్తర తీర దేశాలలో మొదటి గొలుసు కట్టు కార్మిక పోరాటాలు సాగితే, దక్షిణ తీర దేశాలలో రెండవ గొలుసుకట్టు అరబ్ ప్రజాతంత్ర పోరాటాలు సాగాయి. ట్యూనీషియా, ఈజిప్ట్, మొరాకో, ఆల్జీరియా (ప్రతిఘాతుక రాజకీయ పరిణామం జరిగిన లిబియా కూడా ఈ తీర దేశమే) దేశాలన్నీ మధ్యధరా దక్షిణ తీర దేశాలే కావడం గమనార్హం. ఇంతవరకూ పెట్టుబడులు, సరుకులే (వస్తు, సేవలు) ప్రపంచీకరణ చెందుతూ వచ్చా. పై రెండు గొలుసు కట్టు ఉద్యమాలు 'పోరాటాల ప్రపంచీకరణ'కి నిలువెత్తు నిదర్శనాలుగా నిలుస్తాయి. ఇది నూతనంగా ముంచుకొస్తున్న ఓ ప్రత్యేక ధోరణే. విశృంఖల ప్రపంచీకరణ విధానాలకి ఎదురవుతున్న నూతన సవాళ్లు ఇవి. ప్రపంచీకరణ శక్తులలో అనివార్యంగా పునరాలోచనకు దారితీసే పూర్వ పరిస్థితులివి. తమ దీర్ఘకాలిక ప్రయోజనాలకు 'విశృంఖల ప్రపంచీకరణ' నష్టం కలిగిస్తాయని అవి గుర్తించసాగాయి. విశృంఖల ప్రపంచీకరణ ప్రక్రియ కంటే 'నియంత్రిత ప్రపంచీకరణ' ప్రక్రియే తమకి ఎక్కువ లాభం చేకూరుస్తుందని కార్పొరేట్ శక్తుల్లో కొత్త ఆలోచనలు తలెత్తుతున్నాయి. ఈ పూర్వ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

పెట్టుబడిదారీ వ్యవస్థకి రెండు పార్శ్వాలున్నాయి. ఒకటి ఆడమ్ స్మిత్ కోణం కాగా, రెండవది కీన్స్ కోణం. దొరికినంత దోచుకోవాలన్న విశృంఖల లాభనీతిని ఆడమ్ స్మిత్ బోధించాడు. నియమబద్ధంగా దోచుకొని, అందులో కొంత బాధిత ప్రజల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాలన్న లాభనీతిని కీన్స్ బోధించాడు. ఆవిరి యంత్రం ఆవిష్కరణతో ఆరంభమైన పెట్టుబడిదారీ వ్యవస్థ తన బాల్యంలోనే ఆడమ్ స్మిత్‌ను ప్రసవించింది. సుమారు ఒకటిన్నర శతాబ్ద కాలం ఆడమ్ స్మిత్ బోధనలనే పెట్టుబడిదారీ వ్యవస్థ అనుసరించింది. కార్ల్‌మార్క్స్, ఎంగెల్స్ కాలాలలో ఆడమ్ స్మిత్ స్వేచ్ఛా వాణిజ్య బోధనలే వర్ధిల్లాయి. కానీ 'మహామాంద్యం' (1929)తో పరిస్థితులు మారాయి. మునిగిపోతున్న తన నావను కాపాడుకునేందుకు పెట్టుబడిదారీ వ్యవస్థ కీన్స్‌ను ప్రసవించింది. స్వేచ్ఛా వాణిజ్య సూత్రాల స్థానంలో సంక్షేమ వాణిజ్య సూత్రాలు కొత్తగా రంగంలోకి వచ్చాయి. ఈ కొత్త నీతి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను సోషలిస్టు విప్లవ ప్రమాదం నుంచి తాత్కాలికంగా రక్షించింది. ఈ విధంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ఆడమ్ స్మిత్, కీన్స్‌ల మధ్య అవసరాను గుణ్యంగా ఫిరాయించే పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

1930 నుంచి 1990 దశాబ్దం వరకూ సుమారు అరవై ఏండ్ల పాటు ప్రపంచ పెట్టుబడిదారీ యవనిక మీద కీన్స్ వర్ధిల్లాడు. ఈ అర్ధశతాబ్దం ఆడమ్ స్మిత్ తెరవెనుక సీటులో కూర్చున్నాడు. సోవియట్ యూనియన్ పతనంతో ఆడమ్ స్మిత్ వేయి ఏనుగుల ప్రపంచీకరణ బలంతో జూలు విదుల్చుకొని మళ్లీ తెర మీదికొచ్చాడు. ఆడమ్ స్మిత్ స్వేచ్ఛా వాణిజ్య విధానం ప్రపంచాన్ని పాలించింది. అయితే ఆడమ్ స్మిత్‌కి ఈసారి దీర్ఘకాలం జీవించే అవకాశం లభించలేదు. 1990 నుంచి తెరవెనక్కి వెళ్లిన కీన్స్ నేడు పునరాగమనం చేస్తున్నాడు. ఈ విధంగా స్థానభ్రంశం చెందుతున్న పరివర్తనా దశలో నేటి పెట్టుబడిదారీ ప్రపంచం ఉంది. ఈ పరివర్తనా దశలో ఆడమ్ స్మిత్‌వాదులకీ, కీన్స్‌వాదులకీ మధ్య అంతర్గత సంఘర్షణ ఉండడం సహజమే. ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

స్వేచ్ఛా వాణిజ్యమంటే ఆటవిక నీతే. చిన్న జంతువును పెద్ద జంతువులు భక్షించవచ్చు. వాటిని అంతకంటే పెద్ద జంతువులు భక్షించవచ్చు. పులులూ, సింహాలూ మిగిలిన అన్నింటినీ ఫైనల్‌గా భక్షించవచ్చును. జింకల రక్షణ బాధ్యత జింకలదే. కుందేళ్ల మనుగడ బాధ్యత కుందేళ్లదే. సింహాల నుంచి కుందేళ్లకు సంరక్షణ చర్యలు అక్కరలేదు. అదే విధంగా గాయపడ్డ పులులు, సింహాలకి కూడా సంరక్షణ చర్యలు అక్కరలేదు. ఈ స్వేచ్ఛా వాణిజ్యనీతికి మళ్లీ కాలం చెల్లింది. బెయిల్ అవుట్లు అందుకొక నిదర్శనం. కానీ ఆచరణలో ఆలా జరగలేదు. సంక్షేమ నిధులకై భారీ కేటాయింపులకి ఆయా దేశాల ప్రభుత్వాలు దిగాయి. అయితే ఇది 1930 నాటి సంక్షేమ రూపం కాదు. తద్భిన్నమైనది. ఈ తేడాను గ్రహించగలిగితే ఈనాటి 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమ నేపథ్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

'మహా మాంద్యం' సమయంలో బెయిల్ అవుట్లు (ఉద్దీపన ప్యాకేజీలు) ప్రధానంగా కార్మిక వర్గ సంక్షేమం కోసం ఆయా ప్రభుత్వాలు ప్రకటించాయి. 'తవ్వు-పూడ్చు', 'కూల్చు-కట్టు', 'విరుపు- అతుకు' (విరగ్గొట్టు-అతికించు), 'ఇప్పించు-కొనిపించు' (డబ్బులు పంచి సరుకులు కొనిపించడం) వంటి సంక్షేమ పథకాలు అమలులోకి వచ్చాయి. సంక్షేమ పథకాల కోసం ఆనాడు భారీ బెయిల్ అవుట్లను ప్రభుత్వాలు విడుదల చేశాయి. ఆనాటి బెయిల్ అవుట్ల లక్ష్యం ప్రధానంగా కడుపు మాడిన కార్మికవర్గానికి పని కల్పించి, ఆకలి తీర్చడమే. అంతేతప్ప పులలకీ, సింహాలకీ (కార్పొరేట్ కంపెనీలకి) అనుకూలంగా కాదు. తద్భిన్నంగా ఈసారి బెయిల్‌అవుట్లు ప్రధానంగా కార్పొరేట్ కంపెనీల సంక్షేమం కోసం ఉద్దేశించినవే. కుందేళ్లు, మేకలు, గొర్రెల సంక్షేమం కంటే, పెద్ద పులులూ, సింహాల కోసమే అవి కేంద్రీకరించాయి. ఇందుకోసం ట్రిలియన్ల డాలర్ల కొద్దీ ప్రజా ధనాన్ని ప్రభుత్వాలు వెచ్చిస్తున్నాయి. దీంతో కార్పొరేట్ కంపెనీలకి భారీ కేటాయింపుల పట్ల ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తు తున్నాయి. ఈ పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

2008లో 'సబ్ ప్రైమ్ సంక్షోభం' పేరుతో అమెరికాలో తలెత్తిన సంక్షోభం ప్రపంచాన్ని ఆవరించింది. దీని నివారణ పేరిట అమెరికా, యూరప్‌లలో బెయిల్ అవుట్లు విస్తృతంగా అమలులోకి వచ్చాయి. చైనా, జపాన్, ఆస్ట్రేలియా, ఇండియాలు కూడా అనుసరించాయి. ఒక్క అమెరికాలో నాటి నుంచి నేటి వరకు మూడు బెయిల్ అవుట్లు అమలు జరిగాయి. 2009 ఫిబ్రవరిలో 787 బిలియన్ డాలర్లతో మొదటి బెయిల్ అవుట్ (ఉద్దీపన పథకం) ను ప్రకటించింది. 2010 నవంబర్‌లో 600 బిలియన్ డాలర్లతో రెండో బెయిల్ అవుట్‌ను ప్రకటించింది. తాజాగా అమెరికన్ జాబ్ యాక్ట్ పేరిట 447 బిలియన్ డాలర్లతో మరో బెయిల్ అవుట్‌ను ఆమోదించింది. ఈ మూడు బెయిల్ అవుట్ల్ కోసం సుమారు రెండు ట్రిలియన్ డాలర్లను కేటాయించింది. అయినా సంక్షోభం తగ్గుముఖం పట్టలేదు. దీనికి ముందు ఈ ఏడాది ఆగస్ట్ 2 న ఏర్పడిన రుణం పరపతి పరిమితి సంక్షోభం ఎంతటి తీవ్ర స్థాయికి చేరిందో తెలిసిందే. అంటే, రెండు ట్రిలియన్ డాలర్ల అమెరికన్ ప్రజల సొమ్మును అమెరికన్ బడా కార్పొరేట్ కంపెనీలకి అమెరికా ప్రభుత్వం ధారపోసింది.

ఓవైపు అమెరికాలో నిరుద్యోగం, పేదరికం, రోగగ్రస్తుల సంఖ్య పెరుగుతుంటే, మరోవైపు ఇలా ప్రజాధనాన్ని కంపెనీలకి తగబెడుతున్న పరిస్థితి ప్రజలను ఆగ్రహానికి గురిచేస్తున్నది. ఇరాక్, అఫ్ఘనిస్తాన్ యుద్ధాలకి భారీ వ్యయం మీద కూడా ప్రజాగ్రహం తీవ్రతరమవుతున్నది. ఈ పరిస్థితి కూడా 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమానికి పూర్వరంగంగానే చూడాలి.

అమెరికా కంటే విభిన్నమైన రీతిలో తాజాగా యూరోజోన్ సంక్షోభం ముందుకొచ్చింది. అమెరికా బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రజాధనాన్ని కేటాయించే పనిని అమెరికా ప్రభుత్వం చేపడుతున్నది. యూరోజోన్ పరిస్థితి తద్భిన్నమైనది. యూరో జోన్‌లో 17 సభ్య దేశాలున్నాయి. 17 దేశాలకు ఉమ్మడి కరెన్సీ ఉంది. ఈ 17 దేశాల బడ్జెట్లు, ద్రవ్య మార్కెట్ల మీద ఉమ్మడి నియంత్రణా వ్యవస్థ ఉంటుంది. ఆయా దేశాల వార్షిక బడ్జెట్ లోట్లు, ద్రవ్యలోట్లు నిర్ణీత స్థిరాంకం దగ్గర నియంత్రించబడాలి. దీనివల్ల ఒకే యూరోజోన్‌లోని సభ్యదేశాల మధ్య అసమానతలు, వివక్షలు అమలులోకి వస్తాయి. అమెరికాలో అమెరికా ప్రజాధనాన్ని బెయిల్ అవుట్ల ద్వారా అమెరికా బడాకంపెనీలే కబళిస్తాయి. కానీ యూరోజోన్‌లోని మిగులు ఆదాయం గల సభ్యదేశాల బడా కార్పొరేటు కంపెనీలు రుణగ్రస్త సభ్యదేశాల ప్రజాధనాన్ని కబళిస్తాయి. యూరోజోన్‌లోని పోర్చుగల్, ఐర్లాండ్, ఇటలీ, గ్రీస్, స్పెయిన్ (పి.ఐ.ఐ.జి.ఎస్. – వీటినే 'పిగ్స్' దేశాలని పిలుస్తున్నారు) దేశాల ప్రజాధనాన్ని బెయిల్ అవుట్ల పేరుతో యూరో జోన్‌లో సహ సభ్యదేశాలైన జర్మనీ, ఫ్రాన్స్‌లు కొల్లగొడుతున్నాయి. అంటే, పిగ్స్ దేశాల ప్రజాధనం పిగ్స్ దేశాల కార్పొరేట్ కంపెనీలకి కాకుండా జర్మనీ, ఫ్రాన్స్ దేశాల కంపెనీలకీ, బ్యాంకులకీ బదిలీ అవుతున్నది. అమెరికా ప్రజల డబ్బును అమెరికా కంపెనీలు దోచుకుంటుంటే, గ్రీసు ప్రజల ధనం జర్మనీ కంపెనీలు దోచుకోవడం గమనార్హం. కావున యూరోజోన్ విధిస్తున్న బెయిల్ అవుట్లు యూరోజోన్ దేశాల ప్రజలనే కాకుండా కంపెనీలని కూడా ఆగ్రహానికి గురి చేస్తున్నాయి. ఈ అదనపు ఆగ్రహావేశాల అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

పిగ్స్ దేశాలన్నీ రుణగ్రస్త దేశాలే. వాటి రుణాలు వాటి జి.డి.పి.ల కంటే మించిపోయాయి. (అమెరికా రుణం కూడా జి.డి.పి. తో సమాన స్థాయికి చేరిందనుకోండి.) గ్రీసుది 170 శాతానికి చేరింది. యూరోజోన్ విధించిన ఏకీకరణ ద్రవ్య నియంత్రణ పరిధిలోకి పిగ్స్ దేశాల బడ్జెట్లను తేవాల్సి ఉంది. దీనివల్ల యూరోజోన్‌లోని జర్మనీ, ఫ్రాన్స్ వంటి మిగులు దేశాల బ్యాంకులు, ద్రవ్య సంస్థలు పిగ్స్ దేశాలకి అధిక వడ్డీతో ద్రవ్య సరఫరా చేశాయి. అయినా పిగ్స్ దేశాల ద్రవ్యస్థితి పురోగతిని సాధించలేదు. పైగా మరింత దిగజారింది. జర్మనీ, ఫ్రాన్స్‌ల బ్యాంకులు ద్రవ్య సంస్థలు (ముఖ్యంగా ప్రైవేట్ రంగంలోనివి) యూరోజోన్ మీద అంతర్గత ఒత్తిడి తెచ్చాయి. వాటి ఒత్తిళ్లకి తలొగ్గిన యూరోపియన్ యూనియన్, యూరోపియన్ కమిషన్, ఐ.ఎం.ఎఫ్.ల త్రయం పిగ్స్ దేశాలకి బెయిల్ అవుట్ల మంజూరీకి దిగింది. ఉదాహరణకు గ్రీస్ కోసం అక్టోబర్ చివరలో పై త్రయం మంజూరు చేసిన బెయిల్ అవుట్ సొమ్ము నిజానికి గ్రీస్‌క అందలేదు. గ్రీస్‌కి చెందిన కార్పొరేట్ కంపెనీలకి కూడా అందదు. జమా వ్యయంల అకౌంట్ల పుస్తకంలోనే గ్రీస్‌కు చేరతాయి. కానీ భౌతికంగా ఆ డబ్బు మొత్తం రుణ చెల్లింపుల పేరిట జర్మనీ, ఫ్రెంచ్ ద్రవ్య సంస్థల బొక్కసంలోకే చేరింది. గ్రీస్ బడ్జెట్‌లో అప్పుల ఖాతాలో చేరింది. జర్మన్ బ్యాంక్‌లకు రుణం చెల్లింపుగా మారింది. అంటే పిగ్స్ దేశాలు మరింత దివాళా తీస్తాయి. పిగ్స్ దేశాల మీద యూరోజోన్ పెత్తనం కొత్తగా సార్వభౌమాధికార అంశాన్ని కూడా ముందుకు తెస్తున్నది. దీన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

బెయిల్ అవుట్లను సాధారణంగా ఈ కింది విధంగా వర్గీకరించ వచ్చును. 1) కంపెనీల నుంచి ప్రభుత్వాలే నిధులు సేకరించి కేవలం బాధిత నిరుద్యోగ ప్రజలకి, 'తవ్వు – పూడ్చు', 'కూల్చు–కట్టు', 'పంచు–కొనిపించు' వంటి సంక్షేమ పథకాల కోసం అమలు జరిగేవి. 2) కంపెనీల నుంచి సేకరించకుండా ప్రభుత్వాల దగ్గరున్న నిల్వ ధనంతో బాధిత ప్రజల సంక్షేమం కోసం అమలు జరిగేవి. 3) ఓ వైపు ప్రజల సంక్షేమం కోసం, మరోవైపు కంపెనీల సంక్షేమం కోసం అమలు జరిగేవి. 4) కేవలం కంపెనీలకి మాత్రమే రాయితీలు లేదా సబ్సిడీలను ప్రకటిస్తూ అమలు జరిగేవి. 5) ఓవైపు ప్రజల నుంచి కోతలు విధించడం ద్వారా లభించే సొమ్మును కంపెనీలకి కేటాయించుతూ అమలు జరిగేవి.

ఈ ఐదు రకాలలో మొదటి, రెండవ రకం బెయిల్ అవుట్లు 1930 నాటి 'మహామాంద్యం' కాలంలో అమలు జరిగాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఊపులో (బూమ్) ఉన్నకాలంలలో సాధారణంగా మూడవ రకం బెయిల్ అవుట్లను ఆయా ప్రభుత్వాలు అమలు చేస్తాయి. అంతకు ముందు బూమ్ కాలంలో నిల్వ పడ్డ ప్రభుత్వ ధనాన్ని సంక్షోభ ప్రారంభ కాలంలో నాల్గవ రకం బెయిల్ అవుట్లను ఆయా దేశాల ప్రభుత్వాలు అమలు చేస్తాయి. సంక్షోభం తీవ్రతరమవుతున్న క్రమంలో ఓ దశ (మహా మాంద్యానికి పూర్వదశ అని అర్థం)లో ఐదవ రకం బెయిల్ అవుట్లను అమలు చేస్తాయి. ప్రస్తుతం యూరోజోన్‌లోని పిగ్స్ దేశాలలో అమలు జరిగే బెయిల్ అవుట్ల స్వభావాన్ని పరిశీలిస్తే ఈ ఐదవ కోవను పోలి ఉన్నాయని అర్థమవుతుంది. అందుకు తాజాగా ఇటలీ, గ్రీస్ ప్రభుత్వాల మార్పిళ్లు చక్కని నిదర్శనం. అమెరికన్ బెయిల్ అవుట్లు కూడా క్రమంగా ఈ దశలోనే అడుగులు వేస్తున్నాయి. ఈ ఐదవ కోవ బెయిల్ అవుట్లు ఆయా దేశాల ప్రజలకి అత్యంత దుర్భరమైనవి. సరిగ్గా ఈ దుర్భర స్థితికే పిగ్స్ దేశాల ప్రజలు తాజాగా గురవుతుండడం గమనార్హం.

ఈ ఒక్క నవంబర్ మొదటి వారంలోనే గ్రీస్, ఇటలీ దేశాల ప్రభుత్వాలు పతనమయ్యాయి. ఇండియా లేదా పాక్ లేదా, బంగ్లాదేశ్ వంటి మూడో ప్రపంచ దేశాలలో రాజకీయ అస్థిరత సాధారణమైనదే. ప్రభుత్వాలు తరచుగా కూలిపోవడం సహజమైనదే. కానీ పారిశ్రామిక సంపన్న దేశాల ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు సుస్థిరమనీ, అక్కడ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలు సాఫీగా నడుస్తాయనీ విన్నాం. ఇటలీ జి–7 దేశాలలో ఒకటి. గ్రీస్ ప్రాచీన నాగరికత, ప్రజాతంత్ర వ్యవస్థల వారసత్వ దేశంగా పేరొందింది. అలాంటి రెండు దేశాల ప్రభుత్వాలు కేవలం బెయిల్ అవుట్లకే కుప్పకూలిపోయాయి. యూరోజోన్ ఉమ్మడి ద్రవ్య నియంత్రణ వ్యవస్థ మీద ప్రజల ఆగ్రహావేశాలకి ప్రతిస్పందనగా రెండేండ్ల క్రితం గ్రీస్ పార్లమెంట్ ఎన్నికల తీర్పు వెలువడింది. కన్సర్వేటివ్ మితవాద పక్ష కూటమి ఓటమి పొందింది. సోషలిస్టు పార్టీ గెలిచింది. పపాండ్రిమో ప్రధానిగా ఏర్పడ్డ సోషలిస్టు ప్రభుత్వం నేడు కూలిపోయింది. అక్టోబర్ చివరలో దివాళా స్థితి నుంచి గ్రీస్‌ను రక్షించే పేరిట యూరోజోన్ 177 బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్‌ను మంజూరు చేసింది. ఏయే కుదింపులు, కత్తిరింపులు, కోతలు, వాతలను గ్రీస్ ప్రజల మీద అమలు చేయాలో స్పష్టంగా తాజా బెయిల్ అవుట్ నిర్దేశించింది. దీనిమీద తమ దేశ ప్రజల నుంచి 'రిఫరెండం' తీసుకుంటానని గ్రీస్ ప్రధాని పపాండ్రిమో పార్లమెంట్‌లో ఓ ప్రకటన చేశాడు. ఇక అంతే. జర్మన్, ఫ్రాన్స్ దేశాల బ్యాంకర్ల నుంచి ఐ.ఎం.ఎఫ్. వరకూ మండిపడ్డాయి. ఆయన్ని సాగనంపాయి. మన్మోహన్ సింగ్ వంటి లుకాస్ పపాడేమస్ (మాజీ యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు) అను టెక్నోక్రాట్ ప్రధానిగా నూతన ప్రభుత్వం గ్రీస్‌లో

ఏర్పడేంత వరకూ ఊరుకోలేదు. తాజా బెయిల్ అవుట్ ఫలితమిది.

ఇటలీ కూడా 2600 బిలియన్ డాలర్ల (2.6 ట్రిలియన్ డాలర్లు) రుణాలతో సంక్షోభంలో చిక్కుకున్నది. దానికి రుణం ప్యాకేజీని యూరో జోన్ ప్రకటించడానికి కొన్ని షరతులను విధించింది. మూడుసార్లు వరసగా ప్రధానిగా పనిచేస్తున్న బెర్లుస్కోనీ ఇరకాటంలో చిక్కుకున్నాడు. జీతం కోతలు, పెన్షన్ల కోతలు, ఇతర సంక్షేమ చర్యల హరింపుకు దేశ ప్రజలను సిద్ధం చేయాల్సిన బాధ్యత బెర్లుస్కోనీ ప్రభుత్వం మీద పడింది. పబ్లిక్ ఫైనాన్స్ బిల్లు మీద పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో 8 ఓట్లు తగ్గాయి. (316 ఓట్లు రావాల్సి ఉండగా 308 వచ్చాయి.) స్వంత పార్టీ పీపుల్స్ ఆఫ్ ఫ్రీడమ్‌కి చెందిన ఎం.పి.లు ఫిరాయించడంతో రాజీనామా చేయాల్సి వచ్చింది. కోతల సంస్కరణల ప్యాకేజీని పార్లమెంట్ ఆమోదించాక ప్రధానిగా బెర్లుస్కోనీ రాజీనామా చేశాడు. ప్రజల చేత ఎన్నిక పద్ధతికి భిన్నంగా మాజీ యూరోపియన్ కమిషనర్ మారియో మౌంటీ (మన మన్మోహన్, అహ్లువాలియా వంటి) ప్రభుత్వాన్ని స్థాపించడం గమనార్హం. ఈ బెయిల్ అవుట్లు బ్యూరాక్రట్ల ఎంపికకు దారులను ఏర్పరిచింది. ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలను పతనం చేస్తున్నాయి.

కార్ల్ మార్క్స్ తొలుత పెట్టుబడిదారీ దేశాలలో సోషలిస్టు విప్లవాలు వస్తాయన్నాడు. మార్క్స్ – ఎంగెల్స్‌ల కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఇంకా సామ్రాజ్యవాద దశకి చేరలేదు. 1898లో ఫిలిప్పైన్స్ కేంద్రంగా అమెరికా – స్పెయిన్‌ల మధ్య జరిగిన యుద్ధం సామ్రాజ్యవాద దశ ఆరంభమైనదనడానికి నిదర్శనమని ఆ తర్వాత కొన్నేళ్లకి లెనిన్ సూత్రీకరించాడు. ఈ క్రమంలోనే మొదటి ప్రపంచ యుద్ధ నేపథ్యంలో ఆయన 'పెట్టుబడిదారీ విధానం ఉన్నత దశే సామ్రాజ్యవాదం' అనే సిద్ధాంత గ్రంథం రాశారు. ఈ నూతన దశలో పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థలు గల వెనకబడ్డ దేశాలలోనే తొలుత జనతా ప్రజాస్వామిక విప్లవాలు వస్తాయని చారిత్రక జోస్యం చెప్పాడు. ఈ వెలుగులోనే మావో నేతృత్వంలోని చైనా, హోచిమిన్ నేతృత్వంలోని వియత్నాంలలో విప్లవాలు విజయవంతమయ్యాయి. కానీ అమెరికా యూరప్ వంటి పెట్టుబడిదారీ దేశాల కార్మికవర్గం విప్లవాలు తేలేక పోయింది. రెండో ప్రపంచ యుద్ధంలో ఫాసిజానికి వ్యతిరేకంగా యూరప్ కార్మికవర్గం వీరోచితంగా ప్రతిఘటించింది. అయితే వెనుకబడ్డ తూర్పు యూరప్ తప్ప, అభివృద్ధి చెందిన పశ్చిమ యూరప్ దేశాలలో అధికారంలోకి అది రాలేకపోయింది. ఆ తర్వాత గత ఆరున్నర దశాబ్దాలుగా అమెరికా, యూరప్ కార్మికవర్గం సంఘీభావ లేదా జీతభత్యాల పోరాటాలు తప్ప రాజ్యాధికారం కోసం ఉద్యమించలేకపోయింది. లెనిన్ మాటల్లో చెప్పాలంటే నిరంకుశ పెత్తందారీ (అరిస్టోక్రాటిక్ అండ్ బ్యూరాక్రాటిక్) ట్రేడ్ యూనియన్ల చేతుల్లో స్తబ్ధంగానే ఉంది. కారణాలు ఏమైనప్పటికీ, ఐదారు దశాబ్దాల తర్వాత మొదటిసారి ముఖ్యంగా యూరప్ కార్మికవర్గం ఇటీవల రాజకీయ పోరాటాలకి (రాజ్యాధికారం కోసం కాదు) దిగడం ఓ శుభ పరిణామం.

ఇండియా, ఇరాన్, ఇండోనేషియాలలో జనతా ప్రజాతంత్ర విప్లవాలు మొదట జయప్రదమవుతాయా? లేక ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికాలలో తొలుత సోషలిస్టు విప్లవాలు విజయవంత మవుతాయా? అన్న సిద్ధాంత చర్చ చేయనక్కరలేదు. పెట్టుబడిదారీ దేశాలలో దీర్ఘ కాలం తర్వాత కార్మికవర్గం రాజకీయ పోరాటాలకి దిగిన భౌతిక సత్యాన్ని ఉదహరిస్తున్నాం. అలా చెప్పాల్సి వస్తే లెనిన్ సూత్రీకరణ వెలుగులో లిబియా పరిణామాన్ని చూడాల్సి ఉంది. 2010లో ఫ్రాన్స్ ఐదారు సార్వత్రిక సమ్మెలను చవిచూసింది. ఫ్రాన్స్ కార్మికవర్గం గత ఐదారు దశాబ్దాలలో ఎన్నడూ చేపట్టనన్ని పోరాటాలు సాగించింది. అంతర్గతంగా ఎదురైన సంక్షోభ భారాలను మార్కెట్ల విస్తరణ ద్వారా వెనకబడ్డ దేశాల మీదికి సామ్రాజ్యవాద దేశాలు నెడతాయనీ, అందుకే విప్లవాలు కూడా అటు నుంచి ఇటు బదిలీ అవుతాయనీ లెనిన్ చెప్పాడు. తమ సంక్షోభ భారాలను వెనకబడ్డ దేశాలకి బదిలీ చేయడానికి అవి అవసరమైతే మార్కెట్ల కోసం యుద్ధాలు చేస్తాయని కూడా లెనిన్ చెప్పాడు. 2010లో అంతర్గతంగా కార్మికవర్గం నుంచి అతి తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఫ్రాన్స్ ఎదుర్కొన్నది. 2011లో అడుగుబెట్టాక అవి లిబియా దురాక్రమణకి ముందుకొచ్చింది. ఇరాక్, అఫ్ఘనిస్తాన్ దురాక్రమణల పూర్తి బాధ్యత అమెరికా చేపట్టింది. తద్భిన్నంగా లిబియాలో ఫ్రాన్స్ ప్రధాన దురాక్రమణదారుడిగా ముందుకొచ్చింది. అల్జీరియా నుంచి సైనిక దురాక్రమణ ఉపసంహరణ (1958) తర్వాత తిరిగి ఫ్రాన్స్ తాజాగా లిబియా తరహా సైనిక చర్యకు (నాటాలో జూనియర్ భాగస్వామిగా మాత్రమే యుగోస్లావియా, అఫ్ఘనిస్తాన్‌లలో పాల్గొన్నది.) పూనుకోవడం ఇదే ప్రథమం. ఫ్రాన్స్‌లో అస్థిరత ఒక సుస్థిర రాజ్యాన్ని (లిబియా) కబళించింది. కావున విప్లవం ఫ్రాన్స్ నుంచి లిబియాకి బదిలీ అయింది. అమెరికా, యూరోజోన్ తాజా సంక్షోభాలు అక్కడ సోషలిస్టు విప్లవాల వైపుకి కాకుండా మరిన్ని నగ్న దురాక్రమణల వైపుకు మారవచ్చు. లెనిన్ సూత్రీకరణల వెలుగులో ఈ పరిణామాలున్నాయి.

పెట్టుబడిదారీ దేశాలలో సాధారణ కాలాలలో తమ దేశాల కార్మిక వర్గం పక్షాన ధృఢంగా నిలబడి పోరాడిన కమ్యూనిస్టులు, ట్రేడ్ యూనియన్లలో అత్యధిక భాగం యుద్ధ కాలాలలో, తమ స్వంత ప్రభుత్వాల పక్షం వైపు ఫిరాయించిన చారిత్రక చేదు అనుభవాలున్నాయి. 1911 నుంచి రెండో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో దీనిమీదే లెనిన్ సిద్ధాంత పోరాటం చేశాడు. 'పితృభూమి రక్షణ' పేరిట సామ్రాజ్యవాద ప్రభుత్వాల ఏజెంట్లుగా మారిన కారల్ కాట్స్కీ వంటి ఎందరో చరిత్రలో ఉన్నారు. 2010లో ఫ్రాన్స్‌లో కార్మికవర్గ పోరాటాలకు నాయకత్వం వహించిన సోషల్ డెమోక్రాట్లు, ట్రేడ్ యూనియన్లు కూడా, 2011లో అది లిబియాను దురాక్రమించిన చర్యను 'ప్రజాస్వామిక చర్య'గా భావించవచ్చు. లేదా భ్రమించవచ్చు. సంక్షోభ భారాలను తమ మీద మోపకుండా వెనకబడ్డ దేశాల మీదికి మళ్లించిన చర్యల పట్ల పెట్టుబడిదారీ దేశాల కార్మికవర్గం ఉపశమనం పొందవచ్చు. లిబియా నుంచి రేపు కారుచౌకగా కొల్లగొట్టి, ఇతర వెనకబడ్డ దేశాలకి అమ్ముకొని ఫ్రాన్స్ భారీ లాభాలు గడించవచ్చు. తద్వారా నేటి సంక్షోభం నుంచి కొంత ఉపశమనం పొందవచ్చు. ఆ మేరకి తమ స్వంత కార్మికవర్గానికి జీతం కోతలు, హక్కుల కాలరాతల నుంచి కొంత ఉపశమనం కల్పించ వచ్చు. పైగా యుద్ధోన్మాద ప్రచారంతో జాతీయ దురభిమానాన్ని తమ స్వంత కార్మికవర్గంలో రెచ్చగొట్టవచ్చు. లిబియా ప్రజా ప్రతిఘటన తిరిగి ఫ్రెంచ్ ప్రజలను యుద్ధ భారాలకి గురిచేసేంత వరకూ ఈ ఉపశమనం మొదట కొన్నేండ్లు కొనసాగవచ్చును. (ఇదంతా లెనిన్ జోస్యం ప్రకారం జరిగిందే.) ఇలాంటి సంధి కాలంలో యూరప్ సంక్షోభ భారాలను ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలకి యుద్ధాల ద్వారా మళ్లించే ప్రయత్నాలు జరుగుతాయని గమనంలో ఉంచుకోవాలి.

యూరప్ కార్మిక వెల్లువలను సోషలిస్టు విప్లవాలుగా పరిణామం చెందనివ్వకుండా మూడో ప్రపంచ దేశాల మార్కెట్ల దురాక్రమణల వైపుకు మళ్లించే కొన్ని నూతన శక్తులు రూపొందుతాయి. అవి యూరప్ కార్మిక వర్గం పట్ల ప్రేమను ఒలకబోస్తూ ముందుకొస్తాయి. 'బెయిల్ అవుట్ల పేరిట మన కార్మికులకి కోతలా?' అంటూ ప్రశ్నించి, వీధుల్లోకి వస్తాయి. అవి యూరప్ ప్రజల దృష్టిలో ప్రజాస్వామిక శక్తులుగా ఉంటాయి. కానీ వాస్తవార్థంలో ఈ 'ప్రజాస్వామిక పోరాట శక్తులు' తమ స్వంత

యూరప్‌దేశాల ప్రభుత్వాలను మూడో ప్రపంచం మీదికి యుద్ధోన్మాదంతో కాలు దువ్వడానికి ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయి. ఈ సంధి దశలో రూపొందనున్న రాజకీయ పరిణామ క్రమం పట్ల ప్రగతిశక్తులకి స్పష్టమైన అవగాహన, అంచనాలుండాలి.

అమెరికా, యూరప్ సామ్రాజ్యవాద దేశాలను ప్రస్తుతం పీడిస్తున్న ఆర్థిక సంక్షోభం తీవ్రమైనది. విస్తృతమైనది. లోతైనది. దీని పయనం ఎటు అన్న ప్రశ్న తలెత్తడం సందేహమే. 'యుద్ధాలు విప్లవాలను వేగవంతం చేస్తాయి. విప్లవాలు యుద్ధాలను వాయిదా వేస్తాయి' అన్న లెనిన్ జోస్యపు వెలుగులో నేటి యూరప్ సంక్షోభ పరిణామాలను విశ్లేషించాల్సి ఉంది. ప్రపంచ కార్మికవర్గ విప్లవ శక్తులు నేడు స్థూలంగా బలహీనంగా ఉన్నాయి. నేటి సంక్షోభ స్థితిని యుద్ధంగా మారనివ్వకుండా వాయిదా వేయగలిగిన స్థాయిలో యూరప్ కార్మికవర్గ విప్లవ శక్తులు లేవనే చెప్పాలి. పెట్టుబడిదారీ దేశాలలో సత్వర విప్లవాలకు ఈ సంక్షోభం దారితీయక పోవచ్చు. అయితే ఆర్థిక సంక్షోభం మాత్రం ఆయా దేశాల రాజకీయ వ్యవస్థను ప్రశాంతంగా ఉండనివ్వవు. విప్లవాలుగా మార్చగల భౌతిక పరిస్థితులు పరిపక్వం కానపుడు, అనివార్యంగా యుద్ధోన్మాద పరిస్థితులు ముందుకొస్తాయి. అది ప్రపంచ యుద్ధం కాకపోవచ్చు. ప్రాంతీయ యుద్ధాలు కావచ్చు. లేదా ఒకటి తర్వాత ఒకటిగా స్వాతంత్ర్య దేశాలను దురాక్రమించవచ్చు. అఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియాల బాటలో ఇరాన్, సిరియా, ఉత్తర కొరియా వంటి ధిక్కార దేశాల మీదికి యుద్ధోన్మాద శక్తులు దాడికి దిగవచ్చు. ఈ లక్ష్యంతో ప్రాంతీయ యుద్ధ కూటములు ఏర్పడవచ్చు. అందుకే 'జీతం కోతలూ, హక్కుల కాలరాతలూ, సబ్సిడీల కుదింపులూ, సంక్షేమ సౌకర్యాల హరింపులూ మన కార్మిక వర్గానికి వద్దు! వేరే మార్గాలు వెతకండి' అంటూ పెట్టుబడిదారీ దేశాలలోని బూర్జువా మేధో వర్గాలు తమ స్వంత ప్రభుత్వాలపై ఉద్యమించుతాయి. ఈ నేపథ్య పరిస్థితుల్లో 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమం రూపొందడం గమనార్హం.

'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమం బడా పెట్టుబడిదారీ, వాణిజ్య, కార్పొరేట్ వ్యవస్థకు ప్రతీక (సింబల్)గా గత శతాబ్దానికి పైగా వర్ధిల్లు తున్నది. న్యూయార్క్‌లోని వాల్‌స్ట్రీట్ అలాంటి అంతర్జాతీయ బడా కంపెనీల కార్యాలయాలకి నిలయంగా పేరొందింది. జూకోటి పార్కు నేడు నిరసనోద్యమ కేంద్రంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అయితే నిజానికి పెట్టుబడిదారీ వ్యవవస్థ పునాదులు అక్కడ లేవు. ఆ వ్యవస్థకి గుండె, మెదళ్లు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించబడిన ఉత్పత్తి సాధనాలు మాత్రమే. అవి సృష్టించే సరుకుల (వస్తు, సేవలు) తో కూడిన మార్కెట్లు దానికి రక్త ప్రసరణ వ్యవస్థగా వర్ధిల్లుతున్నది. తుపాకులు, ఆయుధాలతో కూడిన సైనిక శక్తి రక్త మాంసాలతో కూడిన దేహబలం (కండ బలం)గా పని చేస్తున్నవి. ఇంకా ఇతర అవయవాలు, నాడీ మండలాల వంటి రాజకీయ ఆర్థిక శక్తుల బలాలతో సామ్రాజ్యవాద వ్యవస్థ నేడు ప్రపంచాన్ని శాసిస్తున్నది. అందుకే దాని పునాదులు వాల్‌స్ట్రీట్, దలాల్ స్ట్రీట్‌లో లేవు. భూములు, పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, గనులు, సేవా రంగాలలో ఉన్నాయి. అందుకే తాజా 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమం సామ్రాజ్యవాద వ్యవస్థ పునాదులపై జరిగేది కాదు. ఇది ప్రతీకాత్మక (సింబాలిక్) ఉద్యమం మాత్రమే.

ఈ ఉద్యమం విప్లవాత్మమైనదిగా భావించనక్కరలేదు. అదే సమయంలో పెట్టుబడిదారీ అనుకూల శక్తులు నడిపించే అభివృద్ధి నిరోధక ఉద్యమంగా కూడా భావించనక్కరలేదు. తూనీగలు వర్షించక పోయినా, వర్షాగమన సంకేతాలన్నాం. అలాగే కార్మికవర్గ పోరాటాలకి వీటిని ముందస్తు ఆగమన సంకేతాలు గానే భావించాలి. స్థూలంగా మూడు రకాల శక్తులు ఈ తరహా ఉద్యమాలలో పాల్గొంటాయి. పీడిత, తాడిత, బాధిత కార్మికవర్గాల పట్ల నిబద్ధత, చిత్తశుద్ధిగల ప్రగతిశీల మేధో వర్గాలు పాల్గొంటాయి. బూర్జువా ప్రజాస్వామికవాదులు, ఉదార మేధావులు, మానవతా శక్తులు, పర్యావరణ శక్తులు తదితర మధ్యేవాద మేధోవర్గాలు పాల్గొంటాయి. నిజమైన కార్మికవర్గాన్ని విప్లవీకరించనివ్వ కూడదన్న ఉదార పెట్టుబడిదారీ శక్తులూ. మానవ ముఖంతో ప్రపంచీకరణ విధానాల అమలును కోరే నయా ఉదారవాద శక్తులూ పాల్గొంటాయి.

ప్రస్తుతం జరిగే 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమంలో ఏయే దేశాలలో ఏయే కోవలకి చెందిన శక్తులు ఎంతెంత నిష్పత్తులతో పాల్గొంటున్నారనేది ఇప్పుడే కచ్చితంగా చెప్పలేం. అందుకే ఈ ఉద్యమ దిశ-దశ-గమనం-గమ్యాలు ఆయా దేశాల నిర్దిష్ట భౌతిక పరిస్థితులను బట్టి ఉంటాయి. వీటికి దూరంగా ఉండడానికి బదులు, వాటిలో చురుగ్గా పాల్గొనడం ద్వారానే కార్మికవర్గ, విప్లవశక్తులు ముందడుగు వేయగలవు. వాటికి దూరంగా ఉండడం వల్ల అది అభివృద్ధి నిరోధక శక్తుల నియంత్రణలోకి వెళ్లే అవకాశాలుంటాయి. అనేక పరిమితులూ, పరిధులూ, లోపాలూ, లొసుగులూ ఉన్నప్పటికినీ స్థూలంగా పెట్టుబడిదారీ వ్యవస్థను ఏదో మేరకి ఈ తరహా ఉద్యమాలు బలహీనపరుస్తాయి.

ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ అను దేహం మీద జరిగే ప్రత్యక్ష పోరాటం కాకపోవచ్చు. ఉత్పత్తి సాధనాల స్వాధీనంకై జరగకపోవచ్చు. సార్వత్రిక సమ్మెల వంటి సరుకుల స్తంభన కాకపోచ్చు. రవాణ, కమ్యూనికేషన్ల స్తంభన కాకపోవచ్చు. అసలు దాని ఏ ఒక్క చిన్న దేహ భాగాల (అవయవాలు) మీద కూడా నేటి 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమం సాగడం లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ దేహభాగాల మీద కాకుండా దాని తల మీది టోపీ మీద సాగే పోరాటమిది. అయినా ఇది కూడా ప్రభావశీలమైనదే. ఎందుకంటే, మహారాజులకి మకుటం ఎలాంటిదో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకి వాల్‌స్ట్రీట్ కూడా అలాంటిది.. రాజుగారి వంటి మీద ఒక్క దెబ్బ తగలకపోయినా టోపీ (మకుటం) ఊడి పడితే రాజప్రతిష్ఠను కోల్పోతాడు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రతీక అయిన ద్వితీయ మార్కెట్ల (స్టాక్ మార్కెట్లు) కేంద్రం (వాల్‌స్ట్రీట్) మీద జరిగే తాజా పోరాటం కూడా రాజకీయ ప్రభావశీలమైనదే. అది భౌతిక వస్తుగత కేంద్రాలలోని పీడిత వర్గ ప్రజలను ఉగ్రాతలూగించి ఉద్యమింపజేస్తుంది. అందుకే ఈ 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమాన్ని కార్మికవర్గ విప్లవ శక్తులు సద్వినియోగం చేసుకోవాలి.

తెలంగాణ సాయుధ పోరాట శక్తులు లక్షలాది ఎకరాల భూస్వాముల భూ ఖండాలను విప్లవకరంగా పంపకం చేస్తున్నప్పుడు దాన్ని దెబ్బతీసే లక్ష్యంతో భూదానోద్యమం వచ్చింది. దీని లక్ష్యం విప్లవిస్తున్న రైతాంగ ఉద్యమాన్ని దెబ్బతీయడం మాత్రమే. దాన్ని వ్యతిరేకించి, చిత్తు చేయడం విప్లవకరమవుతుంది. కానీ తద్భిన్నంగా యూరప్ కార్మికవర్గం తిరగబడబోతున్న పరిస్థితులను పసిగట్టి ముందే, కార్పొరేట్ వ్యతిరేక నినాదాలు రూపొందిన పరిస్థితి ముందుకొచ్చింది. ఇది స్తబ్దంగా ఉన్న ప్రపంచ కార్మిక, పీడిత ప్రజలను చైతన్యపరుస్తుంది. నిద్రాణంలో ఉన్న కార్మికవర్గాన్ని మేల్కొలుపుతుంది. మార్క్స్ చెప్పిన 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి' నినాదాన్ని సజీవ రాజకీయ, భౌతిక శక్తిగా మారుస్తుంది. ఈ ఉద్యమాన్ని హైజాక్ చేయజూసే శక్తుల కుట్రలను అధిగమించుతూ, ప్రపంచ విప్లవ సంస్థలు దీన్ని సద్వినియోగం చేసుకుంటాయని ఆశించుదాం.

(రచయిత ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) వీ

వాల్‌స్ట్రీట్ ఉద్యమం పట్ల వ్యక్తమైన సంఘీభావం, ఆ ఉద్యమంపై వ్యక్తమైన అభిప్రాయాల ఆధారంగా సామ్రాజ్యవాద సంక్షోభాన్ని వివరిస్తున్నారు **పి.వి. రమణ**

సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల ఆవశ్యకత

నాకంటూ ఇల్లు లేదు
ఏదో అలా అలా తిరుగుతున్నాను
నేనొక తిరుగుబోతు కార్మికుణ్ని
నా తమ్ముళ్లూ, చెల్లెల్లూ
ఈ రోడ్డుపైనా తిరుగాడుతున్నారు
– – – – –
నా ఇంటిని తీసుకొని
ధనవంతుడు నన్ను బయటకు గెంటాడు
– – – – –
జూదమాడిన మనిషి కోటీశ్వరుడయ్యాడు
పని చేసిన మనిషి బీదవాడయ్యాడు
మరి నాకంటూ ఇల్లు లేదు ఈ ప్రపంచంలో

– వూడీ (వుడ్రోవిల్సన్) గుథ్రీ

(అమెరికా జానపద సంగీతాన్ని సెలూన్ల నుండి, వలస కార్మికుల క్యాంపులకు, హోబో అడవులకు, రేడియోకు తీసుకువచ్చిన గొప్ప ప్రజా రచయిత)

'చరిత్రలో గొప్ప కాల్పనిక విప్లవ గాథలు చెప్పేవాడు, సంచలనాత్మక కథలతో వినోదం కలగచేసే వాడు, ఓడ ప్రయాణంలో తప్పుడు మార్గాలను చూపే భూగర్భ శాస్త్రవేత్తలాగ నేరస్తుడే'.

– హిప్పోవైట్ ప్రోస్పర్ బవివియర్ విస్సాగరే

(పారిస్ కమ్యూన్‌లో పాల్గొన్న యోధుడు, 'పారిస్ కమ్యూన్ చరిత్ర' రచయిత)

సామ్రాజ్యవాద పెట్టుబడికి మూలమైన, ఫైనాన్స్ కంపెనీలు, మోర్టగేజ్ కంపెనీలు, బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు, బహుళజాతి సంస్థలు, స్టాక్ ఎక్స్ఛేంజీల ఆధిపత్య స్థానమే న్యూయార్క్‌లో ఉన్న వాల్‌స్ట్రీట్.

అక్కడ ప్రారంభమైన 'వాల్‌స్ట్రీట్‌ను ఆక్రమించండి' ఉద్యమం నేడు అమెరికాలోనే వంద నగరాలకు, ప్రపంచ వ్యాప్తంగా 1500 పట్టణాలకు వ్యాపించింది. వేలాది మందితో ప్రదర్శనలు, ఊరేగింపులు లాంటి పోరాట రూపాలతో పాటు అనేక ఇతర రూపాలలో కూడా తమ నిరసనల్ని తెలియజేస్తున్నారు. షికాగోలో బ్యాంక్ ఆఫ్ అమెరికా భవనం ముందు చెత్తతో నింపిన సంచుల్ని వెదజల్లారు. బ్యాంక్ లాబీలో చెత్త జల్లినందుకు 56 నుండి 80 సంవత్సరాల మధ్య వయస్సున్న ఐదుగురు స్త్రీ ఉద్యమకారుల్ని అరెస్టు చేశారు. వాషింగ్టన్ హార్ప్‌సెనేట్ భవనంలో 'వెటరన్ పీస్' సంస్థ వారు అమెరికా జాతీయ జెండాను తిరగేసి ప్రదర్శించి తమ నిరసన తెలియచేశారు. 'మాన్‌హటన్'లో 'మిలియనీర్స్ మార్చ్' పేరుతో, జె.పి. మోర్గాన్ కంపెనీ సి.ఇ.ఒ. అయిన జామీ డైమన్, కోటీశ్వరుడైన వ్యాపాస్తుడు డేవిడ్ కోచ్, ఫైనాన్స్ వ్యాపారి హోవార్డ్ మిల్‌స్టీన్, హెడ్జ్ ఫండ్ అధిపతి జాన్ పాల్సన్, న్యూస్ కార్ప్ చైర్మన్ రూపర్ట్ మర్డోక్ లాంటి మిలియనీర్స్ ఇళ్ల వద్ద నిరసన తెలిపారు. ముప్పై వేల మందితో ప్రదర్శన జరిపి 'ఓక్‌లాండ్ పోర్టు' ఆక్రమణ సాగించారు. ప్రదర్శకులు ఇతర నినాదాలతో పాటు 'వర్గ యుద్ధం' 'పెట్టుబడిదారీ విధానానికి చావు మూడింది' అనే నినాదాలు ఇచ్చారు.

'కార్పొరేట్ల దురాశను అంతం చెయ్యండి' అనే బ్యానర్లతో లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వద్ద ప్రదర్శన జరిపారు. పక్కనే ఉన్న 'సెయింట్ పాల్ కాథడ్రల్ చర్చి' బయట క్యాంపు వేశారు. చర్చి ఎదురుగా చట్టవ్యతిరేకంగా క్యాంపు నిర్వహిస్తున్నారని పోలీసులు తొలగించాలని ప్రయత్నించారు. చర్చి ఛాన్సలర్ రివరెండ్ గైల్స్ ఫేజర్ కలగచేసుకొని, 'వారి హక్కులను సాధించుకునేందుకు శాంతియుతంగా ప్రదర్శన చేయడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఇందులో పోలీసుల జోక్యం అనవసర'మని చెప్పడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. ఇటలీ, మిలన్‌లో విద్యార్థులు 'గోల్డ్‌మన్ సాక్స్' ఆఫీసుపై దాడి చేశారు. ఇటలీలో అతిపెద్ద బ్యాంక్ అయిన 'యుని క్రెడిట్' ప్రధాన ఆఫీసుపై గుడ్లు విసిరారు. రోమ్ నగరంలో వేలాది మంది ఊరేగింపులో 'ఒకే ఒక్క పరిష్కారం – విప్లవం' అని నినాదాలు చేశారు. ఒక భవనానికి అగ్గిపెట్టారు. బ్యాంకుల, షాపుల కిటికీలను బద్దలు కొట్టారు. సూపర్ మార్కెట్ లూటీ జరిగింది. ఒక పోలీసు వ్యాను దగ్ధం చేశారు. ఒక బ్యాంక్ వద్ద బాంబు పెట్టారు. పోలీసుల, ప్రదర్శకుల ఘర్షణలో అనేక మంది ప్రదర్శకులతో పాటు 26 మంది పోలీసులకు గాయలయ్యాయి.

మనీలాలో అమెరికా రాయబార కార్యాలయం ముందు ప్రదర్శన జరిపి 'అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి', 'ఫిలిప్పైన్స్ అమ్మకానికి కాదు' అని నినాదాలు ఇచ్చారు.

ఉద్యమకారుల ఆలోచనలు, ప్రకటనలు

ప్రజలకు పిలుపిస్తూ, 'మీరు అనేక యుద్ధాలలో పాల్గొన్నారు. పెద్ద పెద్ద యజమానులకు సేవ చేశారు. దేశ దేశాలు తిరిగారు. మీ శ్రమకు తగ్గ ఫలితం అందిందా? గతం నీకు తృప్తినిస్తుందా? వర్తమానం నీకు మార్గం చూపుతుందా? భవిష్యత్ ఏమైనా హామీ ఇచ్చిందా? ఒక మనిషి బతకడానికి, మనిషిలా చావడానికి ఒక బారెడు భూమి నీకు ఉందా? రండి. ఇవన్నీ చర్చించడానికి, జీవించే హక్కును కాపాడుకోవడానికి రండి. మేమంతా ఒక్క గొంతుతో మాట్లాడుతున్నాం' అని ప్రకటించారు.

'మా ప్రయాణంలో ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటం ప్రారంభ దశ. ఆ రోజుల్లో మా విధానం వ్యవస్థపై తోడేళ్ల మందలా దాడి చేయడం. ఈ విధానంలో ఒక నాయకత్వం, మిగతా వారు అనుసరించడం జరిగింది. దాని రూపం మారి నేడు మేమంతా ఒకే ప్రజా సమూహం. మాలో మేం మాట్లాడుకొంటాం, మాకు కావాల్సిన ఒకే ఒక్క డిమాండ్ మీద దృష్టి సారిస్తాం. భవిష్యత్‌లో విప్లవాత్మక ప్రజాస్వామ్యాన్ని సాధించడానికి అది మమ్మల్ని పురిగొల్పుతుంది. అతివాద వామపక్ష భావజాలంతో, పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోస్తామనే పేరుతో మా విధానాన్ని అమాయకంగా ముందే బయటపెడితే ఎంత ప్రమాదమో మాకు తెలుసు. అమెరికా రాజకీయ వ్యవస్థ మమ్మల్ని నిర్లక్ష్యం చేయలేని పరిస్థితిని కల్పిస్తాం' అని మరొక సందర్భంలో వివరణ ఇచ్చారు.

'ప్రపంచ కార్పొరేట్ వ్యవస్థ వలన నష్టపోయిన వారందరూ కలవాలి. కార్పొరేట్లకు లాభమే ముఖ్యం గాని ప్రజలు కాదు. ఆహార సరఫరా క్రమాన్ని విషపూరితం చేస్తున్నారు. నిరంతరం వలసవాదాన్ని ఇంటా బయటా ప్రోత్సహిస్తున్నారు. మీడియాను కంట్రోల్ చేస్తున్నారు' అంటూ న్యూయార్క్ పట్టణ ఆక్రమణ ఉద్యమంలో విధాన ప్రకటన చేశారు.

'ఆక్రమించడమనే కార్యక్రమం ఒక ఎత్తుగడ. కార్మికులారా, ఐక్యంగా మీ పని స్థలాలను ఆక్రమించండి. వాటిని ప్రజాస్వామ్య యుతంగా వ్యవస్థీకరించండి. విద్యార్థుల్లారా, అధ్యాపకుల్లారా క్లాసు రూములను, స్వేచ్ఛగా ఆలోచించే మేధను ఆక్రమించండి. ప్రతీ పట్టణంలోనూ, నగరంలోనూ, ప్రతి కూడలిలోనూ, ప్రజా అసెంబ్లీలను నిర్వహించండి' అని పిలుపునిచ్చారు.

మా సందేశం ఇవ్వడానికి మేం మెయిన్ స్ట్రీమ్ మీడియాపై ఆధార పడాలని ఎప్పుడూ అనుకోలేదు. ఒక విధంగా మా పద్ధతుల ద్వారా మెయిన్ స్ట్రీమ్ మీడియాను అసంగతమైనదిగా నిరూపించాం – అని వివరించారు.

ఉద్యమ సమస్యలపై యాభై వర్కింగ్ గ్రూపులు పని చేస్తున్నాయి. ఉద్యమకారుల హక్కుల గురించి, రక్షణ గురించి 'అమెరికా సివిల్ లిబర్టీస్ యూనియన్' (ఏసిఎల్‌యు) అరెస్టులు, పోలీసు దాడులపై న్యాయ సలహాలకు 'నేషనల్ లాయర్స్ గిల్డ్ కమిటీ'లు సహాయ సహకారాన్ని అందిస్తున్నాయి.

ప్రముఖుల మద్దతు, అభిప్రాయాలు

కేన్స్‌లో జరిగిన 'జి 20' దేశాల సమావేశ సందర్భంగా ఐ.ఎల్.ఓ. డైరెక్టర్ జనరల్ జువాన్ సోమాలియా 'ఈనాటి ప్రపంచంలో ఉద్యోగాల పరిస్థితి చాలా భయంకరంగా ఉంది. నిరుద్యోగం 20 కోట్లపైనే ఉంది. ఇంకా పెరుగుతూనే ఉంది. ఈ విషయమై ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న నిరసనల్ని పట్టించుకోకపోతే సామాజికంగా, రాజకీయంగా గొప్ప ప్రమాదం సంభవించే పరిస్థితి ఉంది' అని హెచ్చరించారు.

స్లోవియన్ రాజకీయ తత్వవేత్త 'మనం కలలు కంటున్నామంటు న్నారు. మనం కలలు కనే వాళ్లం కాదు. ఒక పీడకలగా మారిపోబోతున్న కల నుంచి మెళుకవలోకి వచ్చాం' అన్నారు.

జానపద గాయకుడు పీట్ సింగార్, గాయక బృందంతో ఊరేగింపులో పాల్గొని 'ఈ భూమి నీ భూమే', 'మనం ఎలాగైనా అధిగమిస్తాం' అని పాటలు పాడారు.

నోమ్ చామ్స్కీ, ఆలిస్ వాకర్, మార్గరెట్ అట్‌వుడ్, పాల్ క్రూగ్‌మన్, జోసెఫ్ స్టిగ్లిట్జ్, మైఖేల్ మూర్, సాలమన్ రుష్డీ, నటి సుసాన్ సారొండన్, రచయిత నయోమి వూల్ఫ్, కెనడ రచయిత్రి నయోమి క్లేన్, వందనా శివ లాంటి ప్రముఖులందరూ మద్దతు ప్రకటించారు.

వికీలీక్స్ అధిపతి జులియన్ అస్సాంజె లండన్ ప్రదర్శనలో పాల్గొన్నాడు. ఈజిప్టు ఉద్యమంలో పాల్గొన్న అస్మా మహఫౌజ్ స్వయంగా న్యూయార్క్ ప్రదర్శనలో పాల్గొన్నారు.

న్యూయార్క్ సిటీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు మద్దతు తెలుపుతూ పోలీసుల దాడులను ఖండిస్తూ ఊరేగింపు జరిపారు. యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ మద్దతు తెలిపారు.

భవన నిర్మాణ పరిశ్రమలో నాయకత్వం వహిస్తూ ఐదు లక్షల సభ్యత్వం కలిగి ఉన్న లేబరర్స్ ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ నార్త్ అమెరికా (ఎల్.ఐ.యు.ఎన్.ఎ.), ప్రభుత్వ రంగ సంస్థలలో, 12 లక్షల మంది సభ్యత్వంతో అమెరికాలో అతిపెద్ద యూనియన్ అయిన 'యునైటెడ్ స్టీల్ వర్కర్స్ యూనియన్' (యుఎస్‌డబ్ల్యు), 70 వేలు సభ్యత్వం కలిగి డోర్‌మెన్, సెక్యూరిటీ గార్డ్స్, మెయింటనెన్స్ వర్కర్స్‌కు నాయకత్వం వహిస్తున్న న్యూయార్క్ మెట్రో యూనియన్, 38 వేల సభ్యత్వంతో మిలిటెంట్ యూనియన్‌గా పేరున్న ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (టి.డబ్ల్యు.యు.)లు ఉద్యమానికి మద్దతు తెలిపాయి.

'మమ్మల్ని పెరుగుతున్న అలగా గుంపుగా హౌస్ మెజారిటీ లీడర్ ఎరిక్ కౌంటర్ అంటున్నాడు. వాల్‌స్ట్రీట్ బ్యాంకర్లు మమ్మల్ని అంచులను పట్టుకు వేలాడే సమూహాలంటూ చలికాలం రాగానే ఎవ్వరూ మిగలరు అంటున్నారు. న్యూయార్క్ టైమ్స్ వ్యాసంలో, 'గందరగోళంలో ఉన్న ఉద్యమ కార్యకర్తలు అన్నారు. ఫారన్ ఎఫైర్స్ పత్రికలో 'ఉద్యమం కేవలం వాల్‌స్ట్రీట్‌నే విమర్శిస్తుంది. కాని పెట్టుబడిదారీ విధానాన్ని కాదు' అని రాశారు. కాని వాళ్లందరూ పొరపాటుపడ్డారు. మేం ఎక్కడకూ వెళ్లం. మేం ఇక్కడే ఉంటాం. మేం గెలుస్తాం' ప్రపంచం దాన్ని కోరుతుంది' అంటూ 'యుజెనె'ను ఆక్రమించండి ఉద్యమంలో పాల్గొని 'మేం ఎందుకు ఆక్రమిస్తున్నాం, మాకేం తెలుసు' అనే వ్యాసాన్ని మంత్రీ రివ్యూ పత్రికలో వ్యాసం రాశారు. జాన్ బెల్లామీ ఫారస్టర్.

మేం కూడా మీ 99 శాతంలో వాళ్లమే. మంచి పని పరిస్థితుల కోసం, గౌరవమైన ఆదరణ, మా పిల్లలకు, కుటుంబాలకు ఒక మంచి జీవితాన్నిచ్చే అవకాశం కోసం పెనుగులాడుతున్నాం అంటూ ఓక్ ల్యాండ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఒపిఒఎ) ఉద్యమానికి తమ మద్దతునిస్తూ ఒక ఉత్తరం రాయడం విశేషం.

పోలీసు దాడులు, అరెస్టులు

ఓక్ ల్యాండ్ ఉద్యమంపై దాడి చేసి వందలాది మందిని అరెస్టు చేశారు. దాడిలో ఉద్యమకారుడు, ఇరాక్ యుద్ధంలో పాల్గొన్న 24 సంవత్సరాల సైనికుడు స్కాట్ ఓస్లెన్ తల పగిలి మెదడు వాచిపోయింది. న్యూయార్క్‌లో యువ లాయర్, నేషనల్ లాయర్స్ గిల్డ్ పరిశీలకుడిగా వచ్చి నిలబడితే అతన్ని పోలీసు మోటారు సైకిలు గుద్దెయడంతో గాయాలయ్యాయి.

బ్రూక్లిన్ బ్రిడ్జ్‌పై ఇరవై వేల మందితో జరిగిన ఊరేగింపుపై దాడి చేసి 700 మందిని అరెస్టు చేశారు. అమెరికా చరిత్రలోనే ఇంత పెద్ద సంఖ్యలో అరెస్టులు జరగలేదు.

యూనియన్ షాపింగ్ డిస్ట్రిక్ట్ వద్ద ట్రాఫిక్ నిలుపదల చేసినందుకు

80 మందిని అరెస్టు చేసారు. ఈ విధంగా అమెరికాలోని అనేక పట్టణాలలో నవంబర్ 3 నాటికి మూడు వేల మందిని అరెస్టు చేసారు.

ఉద్యమంపై నిఘా పెంచడం వలన, అక్టోబర్ 7 నాటికి పోలీసులకు ఓవర్ టైమ్ 1.9 మిలియన్ డాలర్లు, 27 నాటికి 5 మిలియన్ డాలర్లు చెల్లించామని న్యూయార్క్ సిటీ పోలీసు కమిషనర్ రేమండ్ కెల్లీ ప్రకటించారు.

ఉద్యమంపై విశ్లేషకులు

'లోటు బడ్జెట్ లాంటి విషయాల నుంచి ఉద్యమం సంపద, అధికారాల అసమానతల మీదకు మళ్లించగలిగింది. ఇంకా ముందుకు సాగాలంటే ఉద్యమ నిర్మాణం స్థిరపడాలి. ఉద్యమంలో బలీయమైన అరాచకత్వం కొనసాగుతోంది. విప్లవాత్మకమైన ప్రజాస్వామ్యం కోరుతూ సంస్థాపరమైన నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. పటిష్ఠమైన రాజకీయ సంస్థను, నాయకుల్ని సృష్టించాలంటే ఈ విషయాల మూలాల్లోకి వెళ్లాలి. దీనికి ఉద్యమ నాయకత్వం ఒప్పుకోవడం లేదు. నాయకుడు లేని, అంతరాలు లేని ఉద్యమమే ఇంతవరకు తీసుకువచ్చింది. అదే పద్ధతిని కొనసాగిస్తామంటున్నారు' అంటూ ఓహియోలో రాజకీయశాస్త్రం బోధించే ప్రొ. క్రిష్ హోవల్ అభిప్రాయపడ్డారు.

బిల్ క్లింటన్ వద్ద పనిచేసిన రాజకీయ విశ్లేషకుడు డగ్లస్ స్కోయన్ చేసిన సర్వే ప్రకారం ఉద్యమకారుల్లో సగభాగం రాజకీయాల్లో చురుగ్గా పొల్గొంటున్న వారే. మూడవ వంతు మంది తమ ఆశయాలను హింసా మార్గం ద్వారా నెరవేర్చుకోవాలనుకుంటున్నారు. అధిక శాతం పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకిస్తున్న వారే.

టామ్ డిస్పాచ్ డాట్ కామ్ నుంచి స్టీవ్ ఫ్రేజర్ 'అమెరికన్ ప్రజలు ఎదురుచూస్తున్న వర్గ పోరాటమిది' అని తన అభిప్రాయం తెలిపాడు.

'వాల్‌స్ట్రీట్ నుండి విరాళాలు పొందకుండా రాబోయే 2012 ఎన్నికలలో గెలిచే అవకాశం లేదు కాబట్టి ఒబామా ఎట్టి పరిస్థితిలోనూ ఉద్యమం వైపు నిలబడలేడు' అని ఎకనామిస్ట్ పత్రిక రాసింది.

ప్రదర్శనలు చిన్నవనీ, శక్తిమంతంగా లేవనీ పెల్లుబుకుతున్న ప్రజల కోపాగ్నిని కొట్టిపారేయడం చాలా ప్రమాదం. సరైన లక్ష్యంలేని కోపం ఎటువంటి విధ్వంసానికి దారితీస్తుందో 1930ల నాటి భయంకరమైన ఉదాహరణల్ని మర్చిపోకూడదు. నిజాల్ని నిర్భయంగా చెప్పాలి. జరిగిన తప్పులన్నింటికీ కారణాలు చెప్పాలి. కేవలం ఆర్థిక పరమైన అవకతవకల్ని మొత్తం ప్రపంచీకరణ మీద అనవసర దాడిగా మారకుండా చూడాలి' అని ఎకనామిస్ట్ పెట్టుబడిదార్లకు సలహానిచ్చింది.

'ఈ ఉద్యమంలోకి ఎక్కువ మంది కాలక్షేపం కోసం వస్తున్నారు. ఉద్యమం వలన పోలీసులకు మంచి ఓవర్ టైమ్ దొరుకుతుంది. ఉద్యమం రెండు ప్రమాదాలను ఎదుర్కోబోతోంది. 1) అవకాశవాదులు గానీ, ట్రాట్స్కియిస్టులు గానీ, అమెరికాను ద్వేషించే వారు గానీ బయట నుంచి నాయకత్వం లోబరుచుకోవచ్చు. 2) అంతర్గత వైరుధ్యాలతో పాటు (డ్రగ్స్, డ్రింకింగ్, స్మోకింగ్, టాయ్‌లెట్స్ నిర్వహణ వంటివి) శక్తి చాలక బలహీనమైపోవచ్చు. ఉద్యమకారులు ప్రపంచ మార్కెట్లను బలంతో ఆక్రమించుకోవచ్చు. కాని వాటిని లొంగదీసుకోవడానికి కావాల్సిన దృఢత్వం ఇంతవరకు కనపడలేదు' అంటూ ఒకవైపు కించపరుస్తూ మరోవైపు వాళ్ల వెనక ఇంకా బలం పెంచుకొంటే ప్రపంచాన్ని మార్చడానికి అవకాశముంది' అని తన ద్వంద్వ స్వభావాన్ని బయటపెట్టుకుంది పెట్టుబడిదారులకు మార్గదర్శకమైన ఎకనామిస్ట్ పత్రిక.

ఉద్యమంపై విమర్శలు

'ఈ గుంపు కార్యక్రమాలు అమెరికన్లకు వ్యతిరేకంగా అమెరికన్లను నిలబెడుతుంది' అని విమర్శించాడు హౌస్ మెజారిటీ లీడర్ ఎరిక్ కౌంటర్. రాబోయే ఎన్నికల్లో ప్రెసిడెంట్ పదవికి పోటీ చేయబోతున్న రిపబ్లికన్ అభ్యర్థి హెర్మన్ కెయిన్ 'వీళ్లంతా అమెరికా వ్యతిరేకులు. పెట్టుబడిదారీ విధానానికీ, ఫ్రీ మార్కెట్ విధానానికీ వ్యతిరేకులు. మీకు ఉద్యోగాలు లేకపోతే పెద్ద బ్యాంకుల్ని, వాల్‌స్ట్రీట్‌ను విమర్శించకండి. మీరు గొప్పవారు కాకపోవడానికి మిమ్మల్నే నిందించుకోండి' అన్నాడు. మరో ప్రెసిడెంట్ పదవి అభ్యర్థి మిట్ రూనీ 'వీళ్లు వర్గపోరాటం చేస్తున్నారు. చాలా ప్రమాదకారులు' అని విమర్శించి తర్వాత మాట మార్చి 'నాకు మీ పట్ల సానుభూతి ఉంది' అని అన్నాడు. ఇంకొక ప్రెసిడెంట్ పదవి అభ్యర్థి న్యూట్ గింగ్రిచ్ 'ఇదంతా ప్రెసిడెంట్ ఒబామా ప్రేరేపిత వర్గపోరాట'మన్నాడు. పాల్సన్ అండ్ కంపెనీ హెడ్జ్ ఫండ్ కంపెనీ స్థాపకుడు జాన్ పాల్సన్ 'బ్రహ్మాండమైన విజయాలు సాధించిన మన వ్యాపారాల్ని, ఆర్థిక అభివృద్ధిని విలన్లుగా చిత్రీకరిస్తున్నారు' అని అన్నాడు.

ఎవరి మీద ఈ ఉద్యమం ఎక్కుపెట్టబడిందో ఆ వాల్‌స్ట్రీట్ అధికార పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో 'ఉద్యమకారులు విశాల అమెరికన్ ప్రజల విలువలను ఏ మాత్రమూ గ్రహించకుండా ప్రమాదకరంగా మారారు. వీళ్లకు ఫ్రీ మార్కెట్, పెట్టుబడిదారీ విధానం పడదు. వామపక్ష విధానాలకు మద్దతునిస్తూ, సంపదను అందరికీ పంచమనీ, ప్రైవేట్ సెక్టర్‌ను నియంత్రించాలనీ, అమెరికన్ ప్రజల ఉద్యోగ హక్కును కాపాడుకోవాలనీ, అవుట్ సోర్సింగ్‌ను ఆపాలనీ కోరుతున్నారు. వీరికి మద్దతునిచ్చే రాజకీయ నాయకులు వచ్చే 2012 ఎన్నికల్లో ఘోరంగా దెబ్బతింటారు' అంటూ రాసాడు డగ్లస్ షూయన్. అదే పత్రికలో 'ఈ ఉద్యమం తన లక్ష్యాన్ని సాధిస్తుందా? వారి ధర్మాగ్రహం, లక్ష్య నిబద్ధతల పట్ల ఎవరికీ సందేహం లేదు. కాని స్పష్టమైన వ్యూహం లేకుండా, ఐక్యంగా ఉంచే నిర్మాణం లేకుండా లక్ష్యం సాధించగలరా? అవతలి వైపు నుంచి ఎటువంటి స్పందన లేకుండా ఎన్నాళ్లు కేకలు వేస్తారు? కొద్ది కాలంలోనే హింసా మార్గం వైపు వెళతారు? దానికి రాజ్యం తగ్గట్టుగానే జవాబు చెబుతుంది. అప్పుడు అక్కడ రక్తం వీథుల్లో పారుతుంది. ఈ ఉద్యమం ప్రపంచానికి మంచి చేసే వెలుగు దివ్వెగా నిలవగలుగుతుందా? నాకు తీవ్రమైన అనుమానాలున్నాయి' అని అంటూ రాసాడు సందీపన్ దేబ్.

హోమ్ ఆర్కివ్ ఎడిటోరియల్‌లో '99 శాతం ప్రజలమంటున్నారు. వీళ్లంతా ఒక వర్గం కాదు. వీళ్లలో అధిక శాతం మధ్యతరగతిగా ఉంటూ ధనికవర్గానికి ఎగబాకే ఆశలున్నవాళ్లు. పేద కార్మికవర్గం చేసిన ఉద్యమాల్లో వీళ్లు ఎప్పుడూ కలవలేదు. ఈ ఉదారవాద అవకాశవాదులు రాజ్యం జాతి వైషమ్య పునాదుల్లో నమ్మకమున్నవారు. అందుకే అమెరికా సామ్రాజ్యవాదానికి అనుకూలమైన విధానాలన్నింటిని ఆమోదిస్తూ వచ్చారు.'

'వీళ్లు విప్లవ సాధనలో హింసను ఒక భాగంగా తిరస్కరిస్తున్నారు. వీళ్ల ప్రత్యేకమైన భావజాలమేమంటే, ధనికులకు అధిక పన్నులు వేయడం, విద్యార్థుల రుణ విముక్తి, 'టీ' పార్టీ ఉద్యమ రాజకీయ నాయకుల్ని వ్యతిరేకించడం, ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ఒక రాజకీయ మార్గంగా

కొనసాగించడం. వీళ్ల పోస్ట్ మాడర్న్ గందరగోళం ద్వారా, రాజకీయ ఉద్యమాల్లో నిర్దిష్టమైన భావజాలాన్ని వ్యతిరేకించడం, రాజకీయ సమస్యలపై నిర్దిష్టంగా నిలబడడాన్ని వ్యతిరేకించడం, అధికారం కోసం జరుగుతున్న పెనుగులాటలకు దూరంగా ఉండడం వీరి ద్వంద్వ స్వభావానికి గుర్తు.'

'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ ఉద్యమాన్ని అంతర్గత వైరుధ్యాలే శిక్షిస్తాయి. ఆర్థిక వ్యవస్థను, రాజకీయాలను వేరు చేయడం, అమాయకమైనా కావాలి. లేదా అభివృద్ధి నిరోధకులైనా కావాలి. వాషింగ్టన్‌లో జరుగుతున్న రాజకీయ వ్యవహారాల్ని అడ్డుకోకుండా వాల్‌స్ట్రీట్‌లోని కొన్ని కార్పొరేట్ సంస్థల్ని వ్యతిరేకించడం, కేవలం దృష్టి మరల్చడం తప్ప ఏమీ మిగలదు.'

'హింస కావాలని కోరక్కర్లేదుగానీ, హింసను వ్యతిరేకిస్తూ విప్లవానికి పిలుపివ్వడం ఒక పగటికల. నిజానికి అమెరికన్ ప్రజలు అన్ని విధాలా విసిగిపోయి ఉన్నారు. వారిలో అణిగి ఉన్న కోపం అగ్గిలా రగులుతుంది. "అమెరికన్ కలకాదు కన్నది. అమెరికన్ పీడకల" అన్న మాల్కం ఎక్స్ ప్రకటించినట్లు ప్రస్తుత రాజకీయ వ్యవస్థను మార్చాలంటే ఏ పద్ధతైనా అవసరమే అన్న విధానమే పరిష్కారం చూపగలుగుతుంద'ని సాస్వత్ పట్టనాయక్ రాశారు.

ఈ ఉద్యమంలో అమెరికా ప్రజల పోరాట చరిత్ర గురించి ప్రజా నాయకులు గురించి చర్చ జరగడం ఆహ్వానించదగ్గ పరిణామం. 1870ల ఆర్థిక మహా సంక్షోభకాలంలో రక్తపుటేరుల్లో ముంచబడిన పోరాటం 1877 నాటి రైల్‌రోడ్ కార్మికుల మహత్తర పోరాటం, మరో ఆర్థిక మహా సంక్షోభ కాలం 1930ల్లో కార్మికోద్యమాలు, నల్లజాతివారి ఆత్మ గౌరవ పోరాటాలు, వారి నాయకులు మార్టిన లూథర్ కింగ్ 'మాల్కమ్ ఎక్స్'ల పాత్ర, తదితర విషయాలు చర్చలోకి వస్తున్నాయి.

ఈ సందర్భంగా అమెరికా కార్మికుల మహత్తర పోరాటాలు గుర్తు చేసుకొందాం. 1886లో ఎనిమిది గంటల పనికోసం జరిగిన మహత్తర షికాగో కార్మికుల పోరాటంలో ఆల్బర్ట్ పార్సన్స్, ఆగస్టుస్పీస్, జార్జి ఏంజెల్, ఆడాల్ఫ్ ఫిషర్‌లు ఉరికంబమెక్కారు. మైఖేల్ ష్వాబ్, సామ్యూల్ ఫిల్డెన్‌లు యావజ్జీవ కారాగార శిక్ష అనుభవించారు. ఉరితీయబడ్డ కార్మిక యోధుల భౌతిక కాయాలతో జరిగిన ఊరేగింపులో ఐదు లక్షల మంది ప్రజలు పాల్గొన్నారు.

1924లో జరిగిన సమ్మెలో ఆరు లక్షల నలభై ఐదు వేల మంది కార్మికులు పాల్గొన్నారు. 30 మార్చ్ 1930న 'అంతర్జాతీయ పోరాట దినం'లో భాగంగా 'ఉద్యోగ హామీ, సామాజిక రక్షణ కోరుతూ పన్నెండు లక్షల యాభై వేల మంది ఊరిగింపుల్లో పాల్గొన్నారు. 1931లో వెస్ట్ వర్జీనియా, పెన్‌సిల్వేనియా రాష్ట్రాల గని కార్మికులు 'ఆకలి'కి వ్యతిరేకంగా సమ్మెలు జరిపారు. 1933 నాటికి ఈ ఉద్యమంలో 11 లక్షల 70 వేల మంది కార్మికులు పాల్గొన్నారు. 1934లో జరిగిన టెక్స్‌టైల్ కార్మికుల సమ్మెలో 4 లక్షల 75 వేల మంది పాల్గొన్నారు. 1937లో కమిటీ ఫర్ ఇండస్ట్రియల్ ఆర్గనైజేషన్ (సి.ఐ.ఓ.) ఆధ్వర్యాన జరిగిన సమ్మెలో 18 లక్షల 60 వేల మంది పాల్గొన్నారు. 1934 నుండి 1939 వరకు 16 వేల సమ్మెలు జరిగి వాటిలో 70 లక్షల మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ పోరాటాల్లో అనేక వాటిని ప్రభుత్వం రక్తపుటేరుల్లో ముంచింది. వేలాది మందిని అరెస్టులు చేసింది. అయినా ఆ కాలంలో జరిగిన కార్మికుల పోరాటాలలో 78 శాతం విజయవంతమయ్యాయంటే కార్మిక శక్తి ఎంత బలమైందో మనకు అర్థమవుతుంది. వీటిని 'ఆక్రమణ ఉద్యమకారులు' పరిగణనలోకి తీసుకొంటారని ఆశిద్దాం.

అదే విధంగా ఎన్నికల ద్వారా, నాయకత్వ మార్పుల ద్వారా సమస్యల్ని పరిష్కరించగలమని ఉద్యమకారుల్లో గమనించదగ్గ శాతంలో ఉండడాన్ని గమనించాలి. ఉదాహరణకు 'సిన్సినాటీని ఆక్రమించండి' ఉద్యమకారుల్లో ఒక గ్రూపు రాబోయే ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనాలని, ఓహియో, న్యూయార్క్, కెంచుకీలలో పోటీకి ఆరుగురు అభ్యర్థిల్ని పరీక్షిస్తున్నట్లుగా అసోసియేటెడ్ ప్రెస్‌కు తెలిపారు. ఉద్యమానికి మద్దతునిస్తున్న ఎస్.ఇ.ఐ.యు. 1199 యూనియన్ ప్రెసిడెంట్ జార్జి గెషోమ్ తోపాటు, అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ కౌంటీ, మునిసిపల్ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ జెరాల్డ్ మెకాంటీలు 'ఈ ఉద్యమం వచ్చే ఎన్నికల్లో ఒబామాకు మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నాం' అని వాషింగ్టన్ పోస్టుకు తెలిపాడు. ప్రారంభంలో ఒబామా ఉద్యమానికి జాగ్రత్తగా మద్దతు తెలిపాడు. డెమాక్రటిక్ పార్టీ నేతలు చాలా ముందే మద్దతు తెలిపారు.

'టీ' పార్టీ ఉద్యమాన్ని రిపబ్లికన్ పార్టీ స్వంతం చేసుకొన్నట్లుగానే, వాల్‌స్ట్రీట్ ఆక్రమణ ఉద్యమాన్ని డెమాక్రటిక్ పార్టీ స్వంతం చేసుకొనే అవకాశం ఉందని, అక్కడ వామపక్ష భావాలుగల మేధావులు, కార్యకర్తలు భావిస్తున్నారు. ఎకనామిస్ట్ పత్రికకు 'వీళ్లంతా పాత కాపులే, మళ్లీ మళ్లీ పాత పోటీనే ముందుకు తెస్తున్నారు. పెట్టుబడిదారీ విధానాన్ని ఎన్నికల మార్గం ద్వారా వీళ్లు ఎప్పటికీ ధ్వంసం చెయ్యలేరు' అని జార్జి మెండల్ రాసిన ఉత్తరం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది.

సామ్రాజ్యవాద విధానాల ఫలితంగా ఆకలి, నిరుద్యోగం తీవ్ర స్థాయిలో ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోయింది. అభివృద్ధి పేరుతో జరుగుతున్న వినాశనాన్ని ప్రజలు అనేక దేశాల్లో తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. అత్యంత అభివృద్ధి చెందిన సామ్రాజ్యవాద దేశం అమెరికాలోనే నేడు 'ఆక్రమించండి' ఉద్యమం ప్రారంభమై, ఆ దేశంలోనే ఇతర నగరాల్లో, ప్రపంచవ్యాప్తంగా కూడా కొనసాగుతోంది. దేశాల్నే కబళిస్తున్న సామ్రాజ్యవాద దుర్మార్గంపై ప్రజలు చేసే ఎటువంటి పోరాటాన్నైనా సమర్థిస్తూనే అందులోని మంచి చెడ్డలను విశ్లేషించుకొని ముందుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(రచయిత ట్రేడ్ యూనియన్ నాయకులు) వీ

రాబోయే సంచికలలో...

- ఫోకస్ : ప్రజల ఉద్యమాలు - పాలకుల స్పందన
- సకల జనుల సమ్మెలో ఉపాధ్యాయుల పాత్ర - కె. వేణుగోపాల్
- కళింగాంధ్ర ఎదుట వెను సవాల్లు - దుప్పల రవికుమార్
- స్వయం ప్రతిపత్తి మండలితోనే ఆదివాసుల అభివృద్ధి - మైపతి అరుణ్‌కుమార్
- చిన్న రాష్ట్రాలకు అంబేద్కర్ అనుకూలమే! - లోకే రాజ్‌పవన్

వాల్‌స్ట్రీట్, యూజెక్, యునైటెడ్ నేషన్స్ ఆక్రమణలు ఇటీవల కాలంలో జరిగిన అతి పెద్ద తిరుగుబాట్లుగా పేర్కొంటున్నారు **జాన్ బెల్లమీ ఫాస్టర్**

మనం ఎందుకు ఆక్రమించాలి?

'**వా**ల్‌స్ట్రీట్ ఆక్రమణ ఉద్యమం'లో భాగంగా మనం ఇక్కడ ఉన్నాం. కేవలం కొన్ని వారాల వ్యవధిలోనే ప్రపంచవ్యాప్తంగా వంద లాది పట్టణాలకు ఈ ఉద్యమం వ్యాపించింది. ఈ దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా ఉన్న 99 శాతం మంది జనాభాలో మనం భాగం.

ప్రధాన స్రవంతి, కార్పొరేట్ మీడియాను గత కొద్దికాలంగా చదువుతూ ఉన్నాను. అలాగే పండితులు, రాజకీయ నాయకులు, దళారీలు చెప్తున్నది ఏమిటో వింటున్నాను. మనం ఇక్కడ ఎందు కున్నామో నిజంగా మనకు తెలియదని వాళ్లు విమర్శిస్తున్నారు. కేవలం కోపంతో మనమంతా ఆవేశం వెల్లగక్కుతున్నామని వాళ్లు భావిస్తు న్నారు. మెజారిటీ పార్టీ నాయకుడైన ఎరిక్ కాంటోల్ మనలను 'పెరిగిపోతున్న గుంపు' అని పిలుస్తున్నారు.

న్యూయార్క్ టైమ్స్ ఇంటర్వ్యూలో వాల్‌స్ట్రీట్ బ్యాంకర్లు మనల్ని 'గ్రహాల చుట్టూ ఉన్న వలయాలు - చలి పెరిగితే చెదిరి పోతారు' అంటున్నారు.

నిన్నటి రోజున నూయార్క్ టైమ్స్ ప్రచురించిన వ్యాసంలో మనలను 'అయోమయానికి గురైన ఉదరవాద కార్యకర్తలు', 'పక్షపాత రాజకీయాలతో విసిగిపోయిన వాళ్లు', 'స్వంత అభిప్రాయాలు లేని వాళ్లు'ని వ్యాఖ్యానించింది. అదే పత్రిక సంపాదకీయంలో 'మనం అస్పష్టమైన డిమాండ్స్ లేకుండా నిరసన తెలుపుతున్నా'మని రాశారు. బాగా చెప్పారు. వాళ్లే ఒప్పుకున్నట్లు వీథుల్లో ఉన్న ప్రజలు కాదు నిర్ణయించాల్సింది, రాజకీయ నాయకులు. 99 శాతంగా ఉన్న మనది భవిష్యత్ కార్యాచరణ కాదు.

అమెరికన్ ప్రభుత్వ విదేశీ వ్యవహారాల కౌన్సిల్ ప్రచురించే ఫారిన్ అఫైర్స్ పత్రిక 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ వాల్‌స్ట్రీట్‌పై విమర్శనాత్మకంగా ఉంది, కానీ అది కాపిటలిజం గురించి కాదు. మనం విధానాన్ని ప్రశ్నించరాదు' అని రాసింది.

అక్కడే వాళ్లు పొరబడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉధృత మవుతున్న వాల్‌స్ట్రీట్ ఆక్రమణ సైన్యంలో మనం భాగం. మనం ఇక్కడ ఎందుకున్నామో మనకందరికీ తెలుసు.

- యునైటెడ్ స్టేట్స్ మౌలికంగానే అసమ సమాజమైందని మనకు తెలుసు. కచ్చితమైన గణాంకాలు మనకు తెలియకపోవచ్చు. కానీ ఒక్క శాతంగా ఉన్న పైస్థాయిలోని వారు సమాజం మొత్తం ఆదాయంలో 25 శాతం పొందితే, 10 శాతం పైస్థాయిలోని వాళ్లు 50 శాతం ఆదాయం పొందుతున్నారు.

- అలాగే 1950-1970 మధ్యకాలంలో 90 శాతం అట్టడుగు స్థాయి ప్రజానీకం అదనంగా 1 డాలర్ ఆదాయం సమకూర్చుకుంటే, పైస్థాయిలో ఉన్న 1 శాతం మంది 162 డాలర్ల ఆదాయం పొందారు. అది వెనుకటి మాట. ఇక 1990-2002 మధ్యకాలంలో 1 శాతం మంది 18,000 డాలర్ల ఆదాయం పొందారు.

- యునైటెడ్ స్టేట్స్‌లో కేవలం నాలుగు వందల మంది వ్యక్తులు పదిహేను కోట్ల ప్రజల సంపదను సొంతం చేసుకొన్నారు.

- యునైటెడ్ స్టేట్స్‌లో ఇళ్లను మినహాయించి కేవలం డబ్బు లెక్కే చూస్తే జనాభాలో 1 శాతం మందికి అట్టడుగున ఉన్న 80 శాతం మందికి ఉన్న సంపదతో సమానమైన సంపద ఉంది.

- యు.ఎస్. జనరల్ రికౌంటింగ్ ఆఫీస్ ఆడిట్ ప్రకారం ఫెడరల్ రిజర్వ్ బోర్డ్ పెద్ద కార్పొరేషన్ల కోసం 16 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం కేటాయించింది. ఇటీవలి ఆర్థిక సంక్షోభ సమయంలోనే ఇది జరిగింది. ధనికులకు ఇలా ఉపశమనం (బెయిల్ అవుట్) దొరికితే అత్యధిక ప్రజానీకం ఆ మూల్యం చెల్లిస్తూనే ఉన్నారు.

- యునైటెడ్ స్టేట్స్‌లో అధికారికంగానే 9 శాతం నిరుద్యోగం ఉందని మనకు తెలుసు. వాస్తవంగా చూస్తే పూర్తికాలం ఉద్యోగం కావాల్సిన ప్రజల సంఖ్య రెండింతలుగా ఉంటుంది.

- అధికారిక అంచనాల ప్రకారం 25 శాతం మంది పేదవాళ్లు 16 శాతం మంది నల్లవాళ్లు, 11 శాతం మంది లాటినోలు, లాటినాలు. ఈ సంఖ్య రెండింతలు చేస్తే మనం వాస్తవానికి దగ్గరవుతాం.

- మనకు తెలుసు పేదరికం పెరిగిపోతోంది. ఈ దేశంలో చాలా మంది ప్రజలు చట్టవిరుద్ధంగా వలస వచ్చారని ముద్ర వేయబడ్డారు.

- అంతర్జాతీయ కార్మిక సంస్థ అంచనా ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 240 కోట్ల మంది ప్రజలు ఉద్యోగాలు లేక చిన్నా చితక ఉద్యోగాలు చేస్తూనో, ఆర్థికంగా శక్తిలేక దొరికిన పనిలో ఉంటూనో బతుకులు వెళ్లదీస్తున్నారు. ప్రపంచంలో 39 శాతం మంది శ్రామికులు రోజుకు 2 డాలర్ల కంటే తక్కువ ఆదాయంపై జీవిస్తున్నారు.

- బహుళజాతి సంస్థలు దేశాల్లోని వేతనాల వ్యత్యాసం దృష్టిలో ఉంచుకొని దోపిడీ చేస్తున్నాయి. నిరుద్యోగ సైన్యం అనేది అదనుగా తీసుకొని తక్కువ వేతనాలకు పని చేయించుకుంటూ అత్యధిక లాభాలను ఆర్జిస్తున్నాయి.

- వాస్తవానికి ఆర్థికంగా మెరుగుపడడం అనేది కాదు. మనం ఆర్థికంగా స్తబ్దత వచ్చిన కాలంలో ఉన్నాం. ఈ ఆర్థిక మాంద్యంలో ధనికులు మాత్రమే వెలిగిపోతున్నారు. 1960 నుండి ప్రతి పది ఏండ్లకు ఒకమారు యునైటెడ్ స్టేట్స్‌లో ఆర్థికాభివృద్ధి తగ్గుముఖం పట్టోంది.

అదిప్పుడు స్తంభించిపోయింది. ధనికులు మాత్రమే వృద్ధిలేని దేశ సంపదలో పెద్దవాటా పొందుతున్నారు. ఇక మిగిలిన వారికి దొరికేది ఏమిటో మనకంతా తెలుసు.

– భూగోళం నాశనం అవుతోంది. మనుషులే కాదు, సమస్త జీవరాశులు ధ్వంసమైపోతున్నాయి. ప్రపంచ ప్రసిద్ధ పర్యావరణవేత్త జేమ్స్ హాన్‌సేన్ 'మనకున్న చివరి అవకాశం కేవలం మానవత్వాన్ని రక్షించుకోవడమే' అంటున్నారు. సంపన్న ఆర్థిక వ్యవస్థల్లో ప్రభుత్వాలకూ, అధికారంలో ఉన్నవాళ్లకూ బొగ్గు కంపెనీలు, ఆయిల్ కంపెనీలు మాత్రమే ముఖ్యమైనవి – అంతేకాని భూగోళం భవిష్యత్తు పట్టదు.

– యునైటెడ్ స్టేట్స్, దాని మిత్రపక్షాలు ఈ మధ్యకాలంలో అఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా లాంటి దేశాలతో యుద్ధంలో ఉన్నాయి. ఇరాన్ మీదా, వెనిజులా మీదా కూడా యుద్ధానికి సన్నాహాలు చేస్తున్నారు. అమెరికా సైనిక స్థావరాలు భూగోళమంతగా రెండింతలుగా పెరిగిపోతున్నాయి. అమెరికా ప్రతి ఏటా ట్రిలియన్ డాలర్లు సైనిక నిర్వహణకే ఖర్చు చేస్తోందని మనందరికీ తెలుసు.

– మనం ప్రజాస్వామ్యంలో కాదు, ధనస్వామ్యంలో బతుకుతున్నాం. ప్రతి విషయంలోనూ రాజకీయ క్రమంలో ప్రజాభిప్రాయం డబ్బుపై ఆధారపడుతోంది.

– ఈ దేశంలో యూనియన్లు ఆత్మరక్షణలో పడిపోయాయి. అక్రమ శాసనాలతో అవి అణచివేయబడ్డాయి. తిరిగి పోరాటానికి ఏదో మార్గం కోసం ఆ యూనియన్లు పెనుగులాడుతున్నాయి.

– ప్రాథమిక, సెకండరీ విద్యా విధానం అమెరికాలో ప్రైవేటీకరింపబడి నాశనం చేయబడిందని మనకు తెలుసు.

– ప్రపంచంలోనే మనం పెద్ద ఎత్తున నిర్బంధం అనుభవిస్తున్న వాళ్లలో ఉన్నాం అనే విషయం మనకు స్పష్టంగా తెలుస్తోంది.

– వాల్‌స్ట్రీట్ సూత్రం 'ఆశ చాలా మంచిది' అని. అదే పెట్టుబడిదారీ విధానానికి గీటురాయి. ఆర్థికశక్తిది పైచేయి అయ్యే ఏ సమాజమైనా నమ్మేది అదే.

– చివరిగా మానవత్వ రక్షణలో మనకు మనం అవసరం. ప్రపంచంలో 99 శాతం మందిగా ఉన్న మనం చలి పెరిగితే పలుచబడడం అనేది ఉండబోదు. మనం గుంపు కాదు. మనం ఈ భూమి. మనమే ప్రజాస్వామ్యం. మనమే భవిష్యత్తు తరం. ఈ ప్రపంచాన్ని ఎంతో కాలంగా అతికొద్ది మందే ఆక్రమించుకుని ఉన్నారు. ఇపుడు ప్రజలు ఆక్రమించే సమయం ఆసన్నమైంది. తిరిగి తీసుకుందాం.

'ప్రజాస్వామ్యంపై ప్రపంచ ఆర్థిక మాంద్యం' చర్చలో 2009లో నేను పాల్గొన్నాను. మనం దీర్ఘకాలం ఆర్థిక మాంద్యం ఏర్పడిన కాలంలో ఉన్నాం. (అందులో ఆర్థిక సంక్షోభం అనేది ఒక లక్షణం). చారిత్రకంగా జరగబోయేది మాత్రం 'గ్రేట్ డిప్రెషన్'. 1929లో స్టాక్ మార్కెట్ పతనం తర్వాత, 1930లలో అమెరికాలో తిరుగుబాటుకు మధ్య నాలుగేళ్ల కాలం పట్టింది. పెద్ద తిరుగుబాటు అట్టడుగు స్థాయి నుండి వచ్చిన ఫలితంగా పారిశ్రామిక యూనియన్ ఉద్యమం వచ్చింది. రెండవ న్యూడీల్ కూడా వచ్చిందని మనకు తెలుసు. 1933లలో ఆర్థికంగా మెరుగుపడడం ప్రారంభం అయిన తర్వాత, ప్రజలు ఇది దగా అని గుర్తించిన తర్వాత తిరుగుబాటు జరిగింది.

ఈరోజు అమెరికాలో అటువంటి పెద్ద తిరుగుబాటు అట్టడుగు నుంచి రావాల్సి ఉంది. గ్రేట్ డిప్రెషన్ కాలపు పరిస్థితి లాగా ప్రజలు మేల్కోవాలంటే మూడు లేదా నాలుగు సంవత్సరాలు ఎదురు చూడాల్సి ఉంటుంది. ఆర్థిక వెసులుబాటు లేదా రికవరీ దగా అని తెలిసి ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు. మన కాలంలో వాల్‌స్ట్రీట్ ఆక్రమణ, యూజెక్ ఆక్రమణ, యునైటెడ్ నేషన్స్ ఆక్రమణ అట్టడుగు ప్రజల అతి పెద్ద తిరుగుబాట్లు అని చెప్పవచ్చును.

ఇది ఇంకా ఉధృతంగా కావడం మనం గమనిస్తున్నాం. కొన్ని వారాల్లోనే ప్రపంచ ఉద్యమంగా మారింది. అన్ని చోట్లా ప్రజలు పోరాటాల్లో ఏకం అవుతున్నారు. అక్టోబర్ ప్రారంభంలో నేను ఆస్ట్రేలియాలో ఉన్నపుడు, ఇదంతా మొదలవుతున్నప్పుడు రాడికల్ కార్యకర్తలు 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' సంఘటనల పట్ల పూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఈ దేశంలో ప్రధానస్రవంతి మీడియాలో ఇది రిపోర్టు కావడానికి ముందే ఇది జరిగింది. ఎందుకు? ఆస్ట్రేలియా గ్లోబ్‌లో ఇంకోవైపు ఉంది. వాళ్లు న్యూయార్క్‌లోని ప్రతిఘటన ఉద్యమాల్ని ఎందుకు పట్టించుకోవాలి?

ప్రపంచ చక్రవర్తి హృదయం లాంటి అమెరికా సైనిక స్థావరంలో ఉన్నాం మనం. ఇక్కడ ప్రతిఘటనా పోరాటాలు జరగకూడదు. ఈ కోట బీటలు వారితే, అంటే పెద్ద ఎత్తు నిరసనలు మొదలయితే, జోసఫ్ మార్ఫ్ అన్నట్లుగా 'రాక్షస దాడులు' జరిగితే ప్రపంచమంతటా తిరుగుబాట్లుకు తెరలేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజల పోరాటాలు బద్దలవుతాయని వారికి తెలుసు.

'ఆక్రమణ' అంటే అర్థం ఏమిటి? ఎందుకు ఇంతటి ప్రాధాన్యత సంతరించుకొన్నది? ఈ ప్రతిఘటన ఎందుకు చాలా ప్రత్యేకమైనది? ఎందుకంటే మనం చెదిరిపోవడం లేదు. ఎక్కడికో వెళ్లిపోవడం లేదు. మనం అలాగే నిలిచి ఉంటాం. ఈ ప్రపంచానికి కావాల్సింది కేవలం మనం గెలవడమే. మనం గెలుస్తాం.

(రచయిత 'మంత్లీ రివ్యూ' ఎడిటర్. ది ఎకలాజికల్ రిఫ్ట్; ది ఎకలాజికల్ రెవల్యూషన్; గ్రేట్ ఫైనాన్షియల్ క్రైసిస్; మార్క్స్ ఎకాలజీ; ఎకాలజీ అగెనెస్ట్ క్యాపిటలిజం, వల్నరబుల్ ప్లానెట్ లాంటి పుస్తకాలు రాశారు. అంతేకాక ఫ్రెడ్ మాగ్డాఫ్‌తో కలిసి 'వాట్ ఎవ్రీ ఎన్విరాన్‌మెంటలిస్ట్ నీడ్స్ టునో అబౌట్ క్యాపిటలిజం' అనే పుస్తకం రాశారు.)

(అనువాదం శశికళ, ఉపాధ్యాయిని) వీ

హక్కుల ఉల్లంఘనల, అమానవీయతల మూలాల గురించి ప్రశ్నలను 'వాల్‌స్ట్రీట్‌ను ఆక్రమించండి' ఉద్యమం ముందుకు తెచ్చిందనీ, మంచి భవిష్యత్తుకై ఆలోచించడానికి ఇదొక అవకాశమనీ అంటున్నారు **రేమండ్ లొట్టా**

కొత్తదారులు చూపుతున్న ఉద్యమం

'వాల్‌స్ట్రీట్‌ను ఆక్రమించండి' అనే ఉద్యమం నాకైతే చాలా ప్రాధాన్యత కలిగిన గొప్ప ఉద్యమం అనిపిస్తోంది. ఇది వ్యవస్థా ప్రతిఘటనలో ఒక కొత్త అధ్యాయం. మనం, ఈ వ్యవస్థ ఒకటికాం. అనేక హక్కుల ఉల్లంఘనలను, అమానవీయతలను నిరసిస్తున్నాం. 'వాల్‌స్ట్రీట్‌ను ఆక్రమించండి' అనే ఉద్యమం ఈ హక్కుల ఉల్లంఘనల, అమానవీయత మూలాలను గురించిన అనేక ప్రశ్నలను మన ముందుకు తెచ్చింది. వీటికి ప్రత్యామ్నాయాలను, మెరుగైన వ్యవస్థలను ఎలా రూపొందించుకోగలం అనే వాటిని గురించి మాట్లాడుకునేందుకు మనకు అవకాశాన్ని కల్పించింది. అందుకే మీతో ఇవన్నీ పంచుకోగలుగు తున్నందుకు నేను సంతోషిస్తున్నాను.

ఇక్కడ నేను ఒక ప్రశ్నతో ప్రారంభిస్తాను. 'ఈ పెద్ద కార్పొరేట్ కంపెనీలు, బ్యాంకులు మంచిదైన ఈ వ్యవస్థను అవినీతిమయం చేస్తున్నాయా, లేక అసలు పెట్టుబడిదారీ విధానం అనే వ్యవస్థే సమస్యల మయమా?'

అవును, ఈ పెద్ద కార్పొరేషన్‌లు, బ్యాంకులు చేస్తున్న దారుణాల పట్ల ప్రజలు ఆగ్రహించడం సరియైనదే. అవి చేస్తున్న దుర్మార్గాలు లెక్కలేనివి.

బ్రిటిష్ పెట్రోలియం కంపెనీని చూడండి. మెక్సికో సముద్ర తీరంలో గత సంవత్సరం అది చేసిన దుర్మార్గం చూడండి. అమెరికా చరిత్రలోనే అతి దారుణమైన పర్యావరణ విధ్వంసానికి అది కారణమైంది.

ఈ బడా బ్యాంకులు చేస్తున్న దుర్మార్గాలు చూడండి. లక్షలాది ప్రజలకు ఉండడానికి ఇల్లు లేకుండా చేసిన సబ్‌ప్రైమ్ సంక్షోభాన్ని సృష్టించి అందులో నుండి లాభాలు చేసుకున్న తీరు. ఈ సంక్షోభాన్ని ముందుగానే పసిగట్టిన గోల్డ్‌మన్ కంపెనీ వెంటనే ఆహారోత్పత్తుల వ్యాపారంలోకి ప్రవేశించి ప్రపంచవ్యాప్తంగా ఆహారోత్పత్తుల ధరలు ఆకాశాన్నంటడానికి, ప్రజల ఆకలికీ, దారిద్ర్యానికీ కారణమైంది.

మీకు తెలుసు, స్టీవ్ జాబ్స్ ఇపుడు లేడు. పర్యెక్షనిజం అనే స్వప్నాన్ని కలిగిఉన్నందుకుగాను ఆయనను ఎంతగానో పొగడుతున్నారు. విశ్వవ్యాపితమైన ఈ పెట్టుబడిదారీ దోపిడీ మాయాజాలం లేకపోయి ఉంటే స్టీవ్ జాబ్స్ ఉండేవాడే కాదు. ఆయన సృష్టించిన ఆపిల్ కంపెనీ ఉండేది కాదు. సిలికాన్ వ్యాలీ నుండి ప్రపంచమంతా పరుచుకున్న కార్పొరేట్ల ఉత్పత్తి మాయాజాలం గురించి నేను మాట్లాడుతున్నాను. చైనా నుంచి ఐఫోన్‌లను, ఐపాడ్‌లను దిగుమతి చేసుకొని కలిపి కూర్చే ఫాక్స్‌కాన్ వంటి కాంట్రాక్ట్ వ్యాపారుల గురించి మాట్లాడుతున్నాను. ఏ ఫ్యాక్టరీల్లో అయితే కార్మికులు వారానికి 60 గంటలు పనిచేస్తున్నారో, హానికరమైన రసాయనాలతో విషపూరితం చేయబడుతున్నారో, వారి హక్కులు హరించివేయబడి నిస్పృహతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారో ఆ కార్మికులు పనిచేస్తున్న కంపెనీల గురించి నేను మాట్లాడుతున్నాను.

మీకు తెలుసా, ఈ కార్పొరేషన్లు, బడా బ్యాంకులు చేస్తున్న వాటిని మనం నిజంగా అసహ్యించుకుంటూ ఉంటే, వీటన్నిటినీ మనం ఆపాలని గనక అనుకుంటూ ఉంటే ఇవన్నీ భాగస్వాములైన మొత్తం వ్యవస్థను మనం చూడవలసి ఉన్నది. ఎందుకంటే ఈ సంస్థలన్నీ వాటంతట అవే పుట్టి, వాటంతట అవే అంతరించే స్వతంత్రమైనవి కావు. అంతకన్నా చాలా పెద్దదైన, కీలకమైన ఒక వ్యవస్థ తన స్వంత చలన సూత్రాలచే నడిపిస్తున్న పెట్టుబడిదారీ విధానం అనే ఒక వ్యవస్థ వలన పుడుతున్నాయి.

అంతేకాదు, కార్పొరేషన్లు, బ్యాంకులు ఎప్పటికీ వాటికవిగానే ఉండేవికావు. అవి అమ్మబడతాయి, కొనబడతాయి. రూపాలు మార్చుకుంటాయి. జెపి మోర్గాన్, ఛేస్ లవలె లేదా టెక్స్‌కో, ఛెవరాన్‌ల వలె ఒకటి ఇంకొక దానిలో విలీనమైపోయి బ్రహ్మాండంగా విస్తరిస్తాయి. వాటి మధ్య ఉన్న కుత్తుకలు ఉత్తరించుకునే పోటీవల్ల, సంక్షోభాల వల్ల ఏ క్షణమైనా దివాళా తీసినట్లు ప్రకటిస్తాయి. లేమన్స్ బ్రదర్స్ అలాగే ప్రకటించింది. ఐబిఎం, పిసి లేదా ఆపిల్ కంపెనీల వలె అవి వాటి సామ్రాజ్యపు సరిహద్దులను అతిక్రమించి చలిస్తాయి.

భూగోళమంతటా ఆస్తులు, వ్యాపార లావాదేవీలు కలిగిన ఒక బహుళజాతి సంస్థ లేదా బ్యాంకు అవి మొత్తంగా భాగమై ఉన్న, మనందరమూ కూడా భాగమై ఉన్న, ఒకానొక ఆర్థిక వ్యవస్థ కనిపించే రూపాలు మాత్రమే. బహుళజాతి సంస్థలనేవి చమురు కోసం భూగోళాన్ని తవ్విపోసే లేదా విడివిడి కార్ల భాగాలను అసెంబుల్ చేసే టయోటా, ఎక్సాన్ వంటి కంపెనీల వలె పెట్టుబడిదారీ ఉత్పత్తి పేరుతో సంపదను, లాభాలను పోగు పడేసే చిన్న యూనిట్లు మాత్రమే.

ఇక బ్యాంకుల విషయానికి వస్తే, ప్రపంచమంతా విస్తరించిన తమ వ్యాపార లావాదేవీలతో లాభాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకుంటూ సంపదను పోగేసే యూనిట్లు. ఒక కార్పొరేషన్ అంటేనే ఏకకాలంలో అనేక దేశాల సంపదలను, వేతన శ్రామికులను ఒక పథకం ప్రకారం దోచుకునే పరికరం. కార్పొరేషన్లు అనేవి పెట్టుబడిదారీ మార్కెట్లు ప్రపంచమంతా చొప్పించబడటానికీ, ప్రపంచపు వనరులను కొల్లగొట్టడానికీ ఉపయోగపడే పరికరాలు. అయితే ఈ పరికరాలన్నీ ప్రపంచ పెట్టుబడిదారీ వర్గానికి సొంతం. వారి చేతిలో ఉండి పనిచేసేవే.

ఇంతకీ నేను చెపుతున్నదేమంటే, కార్పొరేషన్లు, బ్యాంకులు అనేవన్నీ ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద వ్యాపార చదరంగంలో పావులు మాత్రమే. అయితే ఈ చదరంగపు ఆట కూడా ఇతర అన్ని ఆటల లాగానే కొన్ని నియమాలు కలిగి ఉంది. ఆ నియమాలకు లోబడి ఆడకపోతే ఆట ముగిసిపోతుంది. ఆ నియమాలేంటో చూద్దాం:

నియమం 1: ఈ వ్యవస్థలో మనుషులు ఉపయోగించే ప్రతిదీ మార్కెట్ సరుకై ఉండాలి. లాభం కోసమే ఉత్పత్తి చేయాలి. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రతీ ఉత్పత్తి అమ్ముకోవాలి. ఏమి ఉత్పత్తి చేయాలి

అనేది ఎంత లాభం వస్తుంది అనే దానిచే నిర్ణయించబడాలి. అది ఇళ్ల నిర్మాణం కావచ్చు, కంప్యూటర్ల తయారీ కావచ్చు, మందులు, ఇంధనం – ఏదైనా, ఏదైనా. అయితే లాభాలెపుడూ మనుషుల శ్రమ దోచుకోబడడం నుండే వస్తాయి. అంతేకాదు, చాలా నేరపూరితంగా, ఈ పెట్టుబడిదారీ విధానం ప్రపంచపు పర్యావరణాన్ని, తన లాభాలకోసం ధ్వంసం చేస్తూ ఉంది. ఉదాహరణకు, టెక్స్‌కో కంపెనీ చమురు కోసం ఈక్వెడార్‌లోని వర్షాధార అడవుల్ని నాశనం చేసినట్లుగా.

నియమం 2: పెట్టుబడిదారీ ఉత్పత్తి అనేది ప్రైవేట్ వ్యక్తులకు లేదా సంస్థలకు చెందాలి. 'నిరంతరం విస్తరించు లేదా చస్తావు' అనే ఆదేశంతో నడిపించబడాలి. ఎక్సాన్ మొబైల్, రాయల్ డచ్ షెల్ లేదా క్రెడిట్ సూయిస్, జెపి మోర్గాన్ వంటి కంపెనీలు మార్కెట్లో వాటాలు చేజిక్కించుకోవడానికి ఒక దానితో ఒకటి తలపడుతూ ఉన్నాయి. అవి వాటి పెట్టుబడులను మరింత విస్తరించుకుంటూ పోవడం, ఉత్పత్తి ఖర్చులను తగ్గించుకోవడం కోసం కార్మికులను తొలగించడం అనేవన్నీ వ్యక్తిగతమైన దురాశతో చేసే చర్యలు మాత్రమే కాదు. అవి విస్తరించని మరుక్షణం, వాటి లాభాల రేటును నిరంతరం పెంచుకోని మరుక్షణం జీవించలేవు. ప్రత్యర్థి చేత తొక్కివేయబడతాయి. ఒకరినొకరు వెనక్కి నెట్టివేసే, తొక్కివేసే పెట్టుబడిదారీ పోటీ ఈ వ్యవస్థ అంతటా నిండి ఉంటుంది. ఎదుటివాడిని దెబ్బతియ్ లేదా నువ్వు దెబ్బతిను అనేదే ఇక్కడి నీతి. బ్రిటిష్ పెట్రోలియం సముద్రజలాలలో తనవల్ల జరిగిన చమురు లీకేజిని క్లీన్ చేస్తూ ఉండగా, ఇతర కంపెనీలేవీ సహాయ పడకపోగా, ఎపుడెపుడు ఈ పరిస్థితిలోంచి లాభాలు చేసుకుందామా అని ఎదురు చూసాయి. షెల్, ఎక్సాన్ మొబైల్ కంపెనీలు బిపిని కింద పడవేసి ఆక్రమించుకోవడానికి రాబందుల్లా ఎదురుచూశాయి.

నియమం 3: మొత్తం భూగోళంపై ఆధిపత్యం కోసం నిరంతర ఆరాటం. పెట్టుబడిదారీ విధానం ప్రపంచమంతా అమలవుతున్న ఒక వ్యవస్థ. ఈ వ్యవస్థలో ప్రపంచమంతా సామ్రాజ్యవాద, అధీన దేశాలుగా విడగొట్టబడి ఉంది. ఈ ప్రపంచ పెట్టుబడిదారీ ఆటస్థలంలో కార్పొరేషన్లు, బ్యాంకులు నిరంతరం ప్రపంచపు ఆధిపత్యం కోసం పోటీ పడుతూ ఉంటాయి. అయితే, అత్యంత తీవ్రమైన పోటీ మాత్రం, ప్రపంచపు వ్యూహాత్మక ప్రదేశాలు, కీలక స్థానాలు అయిన ప్రాంతాలు, మార్కెట్లు, వనరులు వంటి వాటి కోసం జరుగుతూ ఉంటుంది. ఈ తీవ్రమైన పోటీ వల్ల ఫిలిప్పైన్స్‌ను యుఎస్ ఆక్రమించినట్లుగా, అల్జీరియాను ఫ్రాన్స్ ఆక్రమించినట్లుగా, లేదా మొన్ననే ఇరాక్‌ను అమెరికా ఆక్రమించినట్లుగా దురాక్రణ యుద్ధాలు జరుగుతాయి.

ఈ మూడు ముఖ్య నియమాలకు

- శ్రమ దోపిడీ నుండి వచ్చే లాభాలు
- నిరంతర విస్తరణ లేదా తొక్కివేయబడడం
- ప్రపంచపు ఆధిపత్యం కోసం నిరంతర పోటీ – లకు లోబడే

పెట్టుబడిదారీ విధానం మనుగడ సాగిస్తుంది.

సామ్రాజ్యవాదం అంటే, అతిపెద్దవైన కొన్ని గుత్త పెట్టుబడిదారీ ఉత్పత్తి సంస్థలు, ఆర్థిక సంస్థలూ కలిసి, ఒక దేశానిది కాదు, మొత్తం ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలపై, రాజకీయ వ్యవస్థలపై – ప్రజల జీవితాలతో సహా – నియంత్రణ కలిగి ఉండడం. సామ్రాజ్యవాదమంటే మొత్తం ప్రపంచ వనరులనూ, ప్రపంచ ప్రజానీకా న్నంతటినీ దోపిడీ చేస్తూ, ప్రపంచ మానవాళి దుస్థితికి కారణమైన పరాన్నభుక్కుల వ్యవస్థ బాబ్ ఎవేకియన్ అంటాడు. ఇంకా, పరాన్నభుక్కులైన ఈ వ్యాపారవేత్తలు కంప్యూటర్ కీబోర్డులపై తమ వేళ్లను ఆడిస్తూ ప్రపంచ సంపదనంతా తమ లాభాల ఖాతాలో వేసుకుంటూ, అత్యధిక ప్రజానీకపు ఆకలికి, దారిద్ర్యానికి కారణమవుతూ ఉంటారు. ఇంకా సామ్రాజ్యవాదమంటే యుద్ధం. తమ దుష్టవిధానాలను ప్రతిఘటించే ప్రజలను నేలమట్టం చేసే యుద్ధం, తమకు పోటీగా ఉన్న ఇతర దేశాల పెట్టుబడిదారులతో చేసే యుద్ధం. సామ్రాజ్యవాదమనేది పెట్టుబడిదారీ విధానపు వైరుధ్యాలన్నీ అతి తీవ్రస్థాయికి చేరి బద్దలయ్యే ఒకానొక స్థితి. అయితే, సామ్రాజ్యవాదమంటే ప్రజాప్రతిఘటనలు, ప్రజావిప్లవాలు కూడా. ప్రపంచమంతా బాధితులు, దోపిడీకి గురవుతున్న ప్రజానీకమంతా లేచి నిలిచి తమను దోచుకుంటున్న ఈ పరాన్నభుక్కుల మీద యుద్ధం ప్రకటిస్తారు. ఈ విప్లవం ప్రపంచవ్యాపితమై భూగోళ దుష్టశక్తి సామ్రాజ్య వాదాన్ని, పెట్టుబడిదారీ విధానాన్ని ఎత్తి భూగోళం నుండి విసిరివేస్తారు.

పెట్టుబడిదారీ విధానం – రాజ్యం

ఈ పైన పేర్కొన్న నియమాలు పెట్టుబడిదారీ విధానపు మూలాలు. అయితే ఈ వ్యవస్థ మనడానికి, ముందుకు సాగడానికి దానికి రాజ్యపు సహకారం అవసరం. అందుకే పెట్టుబడిదారీ ఉత్పత్తి, వ్యాపారం, లాభాలు అన్నీ నిరంతరం పోటీతో నడిచేవైనప్పటికీ ఒక దేశానికి చెందిన పెట్టుబడిదారులందరూ ఒకే రకమైన అవసరాలు, ప్రయోజనాలను కలిగి ఉంటారు. ఈ ప్రయోజనాలు కాపాడడమే ఒక దేశపు రాజ్యాంగ యంత్రం విధి. ఈ పెట్టుబడిదారుల వర్గమే దేశ ఆర్థిక వ్యవస్థను శాసిస్తూ ఉంటుంది. ఈ పెట్టుబడిదారీ వర్గమే ఉత్పత్తి పద్ధతుల్ని, భూములను, ముడి వనరులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్నిటినీ నియంత్రిస్తూ ఉంటుంది. రాజ్యపు కీలకమైన అంగమైన ప్రభుత్వాలు, వాటి విధానాలు కూడా, దేశాధినేతలు ఎవరు అన్నదానితో సంబంధం లేకుండా, పెట్టుబడిదారీ వర్గం చేతనే నియంత్రించబడుతూ ఉంటాయి. ఒక దేశపు రాజ్యమనేది చాలా విలక్షణమైన పాత్ర నిర్వహిస్తూ ఉంటుంది. అది ఏదో ఒక పెట్టుబడిదారుడి లేదా కంపెనీ ప్రయోజనాలను కాక, మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడకు, కొనసాగడానికి అనుకూలంగా పనిచేస్తూ ఉంటుంది. అందుకోసం రాజ్యం ఏమేమి చేస్తుందంటే...

బలప్రయోగం ద్వారా అణిచివేయడానికి కావలసిన మొత్తం గుత్తాధికారాన్ని తన చేతిలో ఉంచుకుంటుంది. ప్రజల నుండి రాగల ఎటువంటి ప్రతిఘటననైనా అణిచివేయడానికి కావలసిన చట్టాలు, కోర్టులు, పోలీసులు, జైళ్లు వంటివన్నీ సమకూర్చుకుంటుంది. మనం చూస్తూనే ఉన్నాం, గత రెండు మూడు దశాబ్దాలుగా ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, డబ్ల్యు.టి.ఒ. వంటి వాటి సమావేశాలు జరిగినప్పుడల్లా నిరసన తెలియచేసే ప్రజల్ని దరిదాపుల్లోకి కూడా రానీయకుండా వేలసంఖ్యలో బలగాలను మోహరించి ప్రజలనెత్తిన బలవంతంగా ఎటువంటి విధానాలను రుద్దుతున్నారో!

రాజ్యం ప్రజలనుండి పన్నులు వసూలుచేసి పెట్టుబడి అవసరాలైన మౌలిక సదుపాయాల కల్పనకు, బ్యాంకుల వ్యవస్థ ఏర్పాటుకు పెట్టుబడిదారుల సబ్సిడీలకు ఖర్చుపెడుతుంది. ఇంకా, కార్మికులను దోచుకునేందుకు, అణచివేసేందుకు పెట్టుబడిదారుల చేతిలో ఆయుధాలుగా ఉండే కార్మిక చట్టాలను తయారు చేస్తుంది. ఇతర పెట్టుబడిదారీ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకొంటుంది. ఇదంతా పెట్టుబడి ప్రయోజనాల కోసమే జరుగుతూ ఉంటుంది.

యునైటెడ్ స్టేట్స్ రాజ్యం మొత్తం భూగోళమంతా తన సామ్రాజ్యాన్ని విస్తరించుకోవడానికి వ్యూహాలు అమలు చేస్తూ ఉంటుంది. అందుకోసం అత్యంత ఖరీదైన, పెద్దదైన, విధ్వంసభరితమైన సైనిక యంత్రాంగాన్ని, నిఘా వ్యవస్థలను రూపొందించుకొంది. ప్రపంచంలోని 100కు పైగా దేశాలలో 700 వరకూ సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకొని, ఎక్కడ ఏ క్షణమైనా దాడి చేసేందుకు అనువుగా అన్నీ సిద్ధం చేసి పెట్టుకుంది. ఏ దేశంలోనైనా తన రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు నెరవేరని మరు నిమిషం దాడి ప్రారంభిస్తుంది.

ఇంకా రాజ్యం, అతి ముఖ్యంగా, ఎన్నికలు, పార్లమెంటు, చట్టాలు వంటి వాటి ద్వారా ఈ పెట్టుబడిదారీ దోపిడీని అడుగడుగునా చట్టబద్ధం

చరిత్రలో ఆక్రమణ నిరసనలు ఒక మైలురాయిగా నిలిచిపోతాయనీ, చైతన్యపరచడం అంటే ప్రజలు నమ్మేలా చేయడం కాదనీ, ప్రజల నుంచి నేర్చుకోవడమనీ అంటున్నారు **నోమ్ చామ్‌స్కీ**

భవిష్యత్తుని సొంతం చేసుకుందాం!

హావార్డ్ జిన్ స్మారక ఉపన్యాసం ఇవ్వడం నాకు సంతోషంగానూ ఉంది, విచారంగానూ ఉంది. జిన్ కలలుగన్న ఉద్యమాన్ని ఉత్తేజితం చెయ్యడానికి అతడు లేనందుకు బాధగా ఉంది. ఈ ఉద్యమానికి అతడు పునాదులు వేశాడు.

ప్రస్తుతం ఘటనలలో ఏర్పడుతున్న బంధాలను, అనుబంధాలను ముందున్న సుదీర్ఘ, కష్టకాలంలో – విజయాలు అంత త్వరగా రావు – నిలుపుకోగలిగితే అమెరికా చరిత్రలో ఆక్రమణ నిరసనలు ఒక మైలు రాయిగా నిలిచిపోతాయి.

ఇక్కడ కానీ, ప్రపంచంలో మరెక్కడైనా కానీ ఇంతటి స్థాయిలో ఆక్రమణ ఉద్యమం వంటి మరొకదానిని నేను చూడలేదు. ఆక్రమణలో ఉన్న ప్రాంతాలలో సహకార జనజీవనాన్ని రూపొందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే అమలు అవుతున్న అణచివేతను కానీ, ముందున్న అవరోధాలను కానీ అధిగమించడానికి చిరకాలం నిలబడే సంఘాలకు సహజీవనం మూలాధారంగా ఉంటుంది.

ఆక్రమణ ఉద్యమం ఇంతకు ముందు కనీవినీ ఎరుగనిది. 1970ల నుంచి చూసుకుంటే ఇప్పుడున్నటువంటి పరిస్థితిని కూడా మనం ఇంతకు ముందు చూడలేదు.

అమెరికాలో 1970లు ఒక మలుపు. అమెరికా దేశంగా ఏర్పడిన నాటి నుంచి అది అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉంది. పరిస్థితులు అన్నిసార్లు బాగా లేకపోయినా పారిశ్రామికీకరణ, సంపదలో పురోగమనం సాధిస్తూనే ఉంది.

కష్టకాలాల్లో సైతం ప్రగతి కొనసాగుతున్న ఆశావహ దృక్పథం ఉండేది. 1930ల నాటి మాంద్య పరిస్థితుల నాటికి నాకు ఊహ ఏర్పడే వయస్సు. ఇప్పటికంటే అప్పటి పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నప్పటికీ ఆశ అడుగంటిపోలేదు.

ఆ రోజుల్లో మిలిటెంట్ కార్మిక ఉద్యమాలు – పారిశ్రామిక సంఘాల సమాఖ్య వంటివి ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. కర్మాగారా లను చేజిక్కించుకుని, స్వయంగా నిర్వహించడానికి కార్మికులు ఒక అడుగు

చేస్తుంది. తన చట్టసభల ద్వారా, న్యాయవ్యవస్థ ద్వారా ప్రజలను దోచుకొనే, పర్యావరణాన్ని ధ్వంసం చేసే దుర్మార్గ విధానాలకు ఆమోదముద్ర వేయిస్తూ ఉంటుంది.

చరిత్రలో అమెరికన్ రిపబ్లిక్ ఏర్పడిన నాటి నుండి ఈనాటి వరకూ ఎన్నికైన ప్రభుత్వాలు, రాజ్య యంత్రాంగమూ నిరంతరాయంగా తమ వ్యాపార, మార్కెట్ల, సామ్రాజ్య విస్తరణకు కృషి చేస్తూనే ఉన్నాయి. దేశ ప్రజలందరికీ చెందాల్సిన ఉమ్మడి వనరులను, శ్రామికుల శ్రమ ఫలితాన్ని సొంతం చేసుకోవడం ద్వారా ఆస్తులు పోగేసుకునే ఆస్తిపర వర్గాల ఆస్తిహక్కులను కాపాడుతూనే ఉన్నాయి. ఈ రాజ్య యంత్రాంగాలన్నీ ప్రపంచమంతా పెట్టుబడిదారీ దోపిడీ, వనరుల లూటీ విస్తరించడానికి నిరంతరంగా పని చేస్తున్నాయి. మెక్సికో నుండి ప్యూర్టొరికో వరకు, ఫిలిప్పైన్స్‌ను ఆక్రమించుకోవడం నుండి వియత్నాం ఆక్రమణ వరకూ నిన్నటికి నిన్న టెర్రరిజం సాకుతో ఇరాక్, అఫ్ఘనిస్తాన్‌లను ఆక్రమించు కోవడం వరకు ఎన్నయినా ఉదాహరణలు చూడవచ్చు.

అయితే, ఎన్ని చేసినా ఎంత శక్తివంతమైన సాధనాలను సమకూర్చుకున్నా నివారించలేనిది ఏమిటంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్గత సంక్షోభాలు. అందువల్ల ఎపుడెపుడయితే ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థికసంక్షోభాల్లోకి కూరుకుపోతుందో, అపుడు వెంటనే ప్రభుత్వాలూ, రాజ్యమూ రంగంలోకి దిగి వ్యవస్థను కాపాడే ప్రయత్నాలు మొదలుపెడతాయి. మొన్న 2008–09లో పెట్టుబడిదారీ సామ్రాజ్య మంతా పీకలలోతు సంక్షోభంలో మునిగిపోయినప్పుడు వెంటనే సామ్రాజ్యవాద దేశాధినేతలు (జి7 దేశాల అధిపతులు) అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ప్రతినిధులు వ్యవస్థను కాపాడడం కోసం రాత్రికి రాత్రే రంగంలోకి దిగి ఒబామా నేతృత్వంలో లక్షల కోట్ల డాలర్ల ధనాన్ని బయటి నుండి వ్యవస్థలోకి ఎక్కించి, దాన్ని తిరిగి పని చేయించాలని నిర్ణయించారు. ఇదంతా ఏ ఒక్క దేశానికో, సంస్థకో ప్రయోజనం చేకూర్చడానికి కాదు. మొత్తం ఈ దోపిడీపూరిత వ్యవస్థ కుప్పకూలి పోకుండా కాపాడడానికి చేపట్టిన రక్షణ చర్యలు. ఇది మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడడమే. అయితే ఈ కాపాడడమనేది ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ప్రజానీకాన్ని మరింత దరిద్రులను చేయడం ద్వారా, మరింతగా వనరులకు దూరం చేయడం ద్వారా, పర్యావరణాన్ని – భూగోళాన్ని మరింత ధ్వంసం చేయడం ద్వారా, కొల్లగొట్టడం ద్వారా మాత్రమే సాధ్యం.

ఇక ఇపుడు అమెరికా ప్రభుత్వం ప్రజలను ఉండడానికి ఇల్లా, ఆరోగ్య రక్షణా ఏదో ఒకటే ఎంచుకోమంటోంది. ప్రజలు ఏది ఎంచుకోవాలి? ఇకముందు అత్యధిక మంది ప్రజలు ఎటువంటి జీవనం గడపనున్నారు?

నేను ఒక ప్రశ్నతో మొదలుపెట్టాను. తిరిగి అదే ప్రశ్న దగ్గరకు వద్దాం. ఈ కార్పొరేషన్లు, బ్యాంకులు ఒక మంచి వ్యవస్థను అవినీతిమయం చేస్తున్నాయా లేక అసలు ఈ వ్యవస్థే దుర్మార్గమైనదా?

అవును, మనకిపుడు, మానవత్వాన్ని నిలిపే ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం, విప్లవం కావాలి.

(రచయిత కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా నాయకుడు. మావోయిస్ట్ అర్థశాస్త్రవేత్త. చైనా సాంస్కృతిక విప్లవ కాలంలో వెలువడిన షాంఘై టెక్స్ట్‌బుక్ ఆధారంగా 'మావోయిస్ట్ ఎకనామిక్స్' పుస్తకం రాశారు.

(అనువాదం: జి. ఉదయ, ఉపాధ్యాయిని) వీ

దూరంలో ఉన్నారు. కార్మికులు కర్మాగారాలను ఆక్రమించుకొని సమ్మె చేస్తున్నారు. పెరుగుతున్న ఒత్తిడి నేపథ్యంలో 'న్యూ డీల్' చట్టాన్ని చేశారు. కష్టకాలాన్ని అధిగమిస్తాం అన్న భావన సర్వత్రా ఉండేది.

కానీ ప్రస్తుతం నిరాశా దృక్పథం ఇంకా చెప్పాలంటే, నిస్పృహ అలుముకొని ఉంది. అమెరికా చరిత్రలో ఇది ఇంతకు ముందెన్నడూ లేనిది. 1930ల కాలంలో ఉద్యోగాలు దొరికే రోజు వస్తుందని కార్మికులకు నమ్మకం ఉండింది. ప్రస్తుతం మీరు ఉత్పత్తి రంగంలో కార్మికులైతే, మాంద్యం కాలం నాటి నిరుద్యోగ స్థాయి నెలకొని ఉండగా, ఇవే విధానాలు కొనసాగితే మళ్లీ ఉద్యోగం దొరికే అవకాశం లేదని మీకనిపిస్తుంది.

అమెరికన్ల దృక్పథంలోని ఈ మార్పు 1970ల నుంచి రూపు దిద్దుకుంటోంది. కొన్ని శతాబ్దాల పాటు సాగిన పారిశ్రామికీకరణ ఇప్పుడు తలకిందులై పరిశ్రమలు తగ్గిపోతున్నాయి. అయితే ఉత్పత్తి కొనసాగుతోంది – విదేశాల్లో. ఇది యజమానులకు చాలా లాభసాటిగానూ, కార్మిక వర్గానికి చాలా హానికరంగానూ ఉంది.

ఆర్థిక వ్యవస్థ విత్తీకరణవైపుకి మళ్లుతోంది. విత్త సంస్థలు గణనీయంగా వృద్ధి చెందాయి, విస్తరించాయి. విత్తం, రాజకీయాల మధ్య ఒక అపవిత్ర బంధం వేగంగా బలపడుతోంది. నానాటికీ సంపద విత్త రంగంలో కేంద్రీకృతమవుతోంది. ప్రచార ఉద్యమ ఖర్చులు భారీగా పెరగడంతో రాజకీయ నాయకులు ధనిక మద్దతు దారులకు అమ్ముడు పోతున్నారు.

తమకు ఇచ్చిన మద్దతుకు ప్రతిఫలంగా రాజకీయ నాయకులు వాల్‌స్ట్రీట్‌కి అనుకూలమైన విధానాలను తయారు చేశారు. నియంత్రణలు తొలగించడం, పన్నుల విధానంలో మార్పులు, కార్పొరేట్ యాజమాన్యంలో నిబంధనలను సడలించడం, ఈ పరస్పర 'వీపు గోకుడు' అనుబంధం నానాటికీ ముదురుతూ వస్తోంది. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం అనివార్యమైన స్థితి. విఫలమవ్వనంత పెద్దదీ, జైలుకి పంపనంత పెద్దవాళ్లుగా భావించే వాల్‌స్ట్రీట్‌ని కాపాడడానికి 2008లో ప్రభుత్వం మరోసారి ముందుకు వచ్చింది. దశాబ్దాల పాటు సాగిన దురాశ, మోసాలతో లాభపడిన 1 శాతంలోని శతాంశం ప్రజలకు ఈరోజు అంతా బాగానే ఉంది.

సిటీ గ్రూప్ (ప్రభుత్వం అనేకమార్లు దీనిని ఆర్థికంగా ఆదుకుంది) 2005లో ధనికులలో ప్రగతికి అవకాశాలను కనుగొంది. పెట్టుబడి దారుల కోసం విడుదల చేసిన కరపత్రంలో భోగ వస్తువులను ఉత్పత్తి చేసే కంపెనీలను గుర్తించిన ప్లుటోనమీ సూచిక (ప్లుటోనియం అత్యంత విలువైన లోహం నుంచి ప్లుటోనమీ – ధనిక పాలనను సూచించే పదం – అను)లో డబ్బులు పెట్టమని కోరింది.

'ప్రపంచం రెండు వర్గాలుగా విడిపోతోంది – ప్లుటోనమీ, మిగిలిన వారు' సిటీగ్రూప్ పేర్కొంది. 'అమెరికా, ఇంగ్లండ్, కెనడాలు కీలక ప్లుటోనమీలు – సంపన్నుల ద్వారా ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తోంది.

ధనికులు కాని వాళ్లు సమాజపు అంచుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రెకేరియన్, ప్రొలిటేరియట్ పదాల కలయికతో వీరిని 'ప్రికేరియట్' అంటున్నారు. 'అంచులలో' ఉంటున్న వ్యక్తి అమెరికాలోనూ, ఇతర దేశాలలోనూ ఇప్పుడు జనాభాలో గణనీయ శాతంగా ఉన్నారు.

అంటే ఇప్పుడు సంపన్నులు, పేదలు 1:99 నిష్పత్తిలో ఉన్నారు. ఆక్రమణ ఉద్యమకారుల దృష్టిలో ఇవి కేవలం గణాంకాలు కావు, ఇది వాస్తవ చిత్రం.

భవిష్యత్తు పట్ల ప్రజల ఆత్మవిశ్వాసంలో ఈ చారిత్రక మార్పు అన్నది శిలాసదృసంగా మారే అవకాశమున్న ధోరణులను ప్రతిబింబిస్తోంది. ఈ గతిశీలతను మార్చగల తొలి ప్రజా తిరుగుబాటే ఈ ఆక్రమణ ఉద్యమం.

నేను (అమెరికా) దేశ పరిస్థితులకే పరిమితమయ్యాను. కానీ అంతర్జాతీయ రంగంలో రెండు ప్రమాదకర పరిణామాలు మిగతా అంశాలన్నింటినీ కమ్మేస్తున్నాయి.

మానవ చరిత్రలో మొదటిసారి మానవజాతి ఉనికికి నిజమైన ముప్పులు ఏర్పడ్డాయి. 1945 నుంచి అణ్వాయుధాలు వచ్చాయి. అయినా ఇంకా మనం బతికి ఉన్నాం అంటే అద్భుతమనే అనుకోవాలి. అయితే ఒబామా ప్రభుత్వం, దాని మిత్ర బృందం అణ్వాయుధాల పెంపును ప్రోత్సహిస్తున్నాయి.

రెండవ ముప్పు పర్యావరణ సంక్షోభం. దీని గురించి ప్రతి ఒక్క దేశం ఏదో ఒక చర్య తీసుకుంటూనే ఉంది. అయితే అమెరికా మాత్రం వెనకడుగు వేస్తోంది. వాతావరణ మార్పు అన్నది తాటాకు చప్పుళ్లు మాత్రమేనని, దాని గురించి మాట్లాడే శాస్త్రజ్ఞులను పట్టించుకోనవసరం లేదన్న ప్రచారం జరుగుతోంది. దీనికి వ్యాపార వర్గాలు వంత పాడుతున్నాయి.

ప్రపంచంలోనే అత్యంత ధనిక, శక్తిమంత దేశంలో ఈ అసంబద్ధ విధానాలు కొనసాగితే సంక్షోభాన్ని నివారించలేం.

క్రమశిక్షణతో పట్టు విడవకుండా వెంటనే ఏమైనా చెయ్యాలి. ముందుకు వెళ్లడం అంత తేలిక కాదు. కష్టాలు, వైఫల్యాలు తప్పవు. కానీ ఇక్కడ, దేశంలో ఇతర ప్రదేశంలో, ఇతర దేశాలలో జరుగుతున్నది వ్యాప్తిచెంది సమాజంలోనూ, రాజకీయాలలోనూ ప్రధాన శక్తిగా మారితే తప్పించి భవిష్యత్తు బాగుండే అవకాశాలు తక్కువగా ఉన్నాయి.

పెద్ద సంఖ్యలో చురుకుగా పాల్గొనే ప్రజల మద్దతు ఉంటే తప్పించి చెప్పుకోదగినది మనం సాధించలేం. దేశం నలుమూలలకు వెళ్లి ఆక్రమణ ఉద్యమం ఏమిటో ప్రజలు స్వయంగా ఏం చెయ్యాలో, ఏమీ చెయ్యకపోతే సంభవించే పరిణామాలు ఏమిటో ప్రజలకు వివరించాలి.

ఇటువంటి ప్రజాబలాన్ని సంఘటితపరచడంలో కార్యాచరణ (యాక్టివిజం), చైతన్యపరచడం (బోధన, ఎడ్యుకేషన్) తప్పనిసరి. చైతన్య పరచడం అంటే మనం కావాలనుకున్నది ప్రజలు నమ్మేలా చెయ్యడం కాదు. దాని అర్థం ప్రజల నుంచి నేర్చుకోవడం, వారితోపాటు కలిసి నేర్చుకోవడం.

'ప్రపంచాన్ని అర్థం చేసుకోవడమే కాదు, దానిని మార్చాలి' అన్నాడు కార్ల్ మార్క్స్. దీనికి మరో రూపం ప్రపంచాన్ని మార్చాలని అనుకుంటే దానిని ముందు అర్థం చేసుకోవాలి. దీని అర్థం ఉపన్యాసాలు వినడం కాదు, పుస్తకాలు చదవడం కాదు – ఇవి కూడా కొన్నిసార్లు ఉపయోగ పడవచ్చు. (ఉద్యమాల్లో, ప్రజలతో కలిసి) భాగస్వాములు కావడం ద్వారా నేర్చుకోవాలి. ఇతరుల నుంచి నేర్చుకోవాలి. సంఘటితం చెయ్యాలను కుంటున్న ప్రజల నుంచి నేర్చుకోవాలి. ఆలోచనలు రూపొందించడం, అమలు చెయ్యడంలో మనందరం అవగాహన, అనుభవం పెంపొందించుకోవాలి.

అంతటా ఏర్పడుతున్న సంబంధాలు ఆక్రమణ ఉద్యమంలో అత్యంత ఉత్సాహాన్ని ఇచ్చే అంశం. వీటిని విస్తృతపరిచి, కొనసాగించగలిగితే సమాజం మరింత మానవీయ పంథా అనుసరించేలా ప్రయత్నాలు చెయ్యవచ్చు.

(నోమ్ చామ్స్కీ చరిత్రకారుడు, ఉద్యమకారుడు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆచార్యులుగా ఉన్నారు. అమెరికా విదేశీ విధానంపై అనేక పుస్తకాలు రాశారు. 'ప్రజలు చెప్పిన అమెరికా చరిత్ర' పుస్తకం రాశారు. 22 అక్టోబర్ 2011న డ్యూవీ స్క్వేర్‌లో 'బోస్టన్‌ని ఆక్రమిద్దాం' ఉద్యమకారులను ఉద్దేశించి చామ్స్కీ ఇచ్చిన ప్రసంగం ఆధారంగా తయారు చేసిన వ్యాసం ఇది. ఉద్యమకారులు నిర్వహించిన హోవార్డ్ జిన్ స్మారక ఉపన్యాసాలలో భాగంగా చామ్స్కీ మాట్లాడారు.)
(అనువాదం : సురేశ్, 'మంచి పుస్తకం' ప్రచురణల వ్యవస్థాపకులు) వీ

మన దేశంలో వందల సంవత్సరాల క్రితమే ఎన్నో జాతుల, తెగల, మత విశ్వాసాల ప్రజలు వచ్చి స్థిరపడ్డారనీ, మనది మిశ్రమ సంస్కృతి అనీ అంటున్నారు **డా. జి. సాంబశివరెడ్డి**

స్వదేశీయత, విదేశీయతలోని మూలాలు

నేటి వై.ఎస్.ఆర్. జిల్లా (మునుపటి కడప జిల్లా)లోని చరిత్ర ప్రసిద్ధిగాంచిన కోట సిద్ధవటం కోట. ఇది శ్రీశైలం దక్షిణ ముఖ ద్వారంగా ప్రసిద్ధిగాంచింది. ఈ కోటను నేను నా మిత్రుడు మహబూబ్ బాషా (అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ, లక్నో సెంట్రల్ యూనివర్సిటీ, లక్నో) చూడాలని వెళ్లాం. ప్రభుత్వ పురావస్తు శాఖ తరపున కోటను పర్యవేక్షిస్తున్న ఒక ఉద్యోగి గైడువలే మాకు కోట లోపల గల మసీదు, దర్గా, వివిధ మండపాలు, దేవాలయాలు, నాలుగు వైపుల గల బురుజులు, గుర్రపు శాలలు, విశ్రాంతి మందిరాలు, ఇతర ముఖ్యకట్టడాలు, కోటకు దక్షిణ దిశన ప్రవహిస్తున్న పెన్నా నదికి కోటకు గల అనుబంధాన్నీ, వీటి మధ్యలో గల నంది విగ్రహ ప్రాముఖ్యతనూ వివరంగా తెలుపుతూ వచ్చాడు. అయితే నంది విగ్రహాన్ని గురించి తెలుపుతూ అతడు వ్యక్తం చేసిన భావాలు ఈ వ్యాసం రాయడానికి పురికొల్పాయి.

నంది విగ్రహాన్ని ఎవరో నాశనం చేశారు. ఈ దురాగతానికి ఈ ప్రాంతాన్ని పాలించిన పాలకులకు చెందినవారు కానీ లేక గుప్త నిధుల కోసం ప్రాచీన కట్టడాలను ధ్వంసం చేసే వారు కానీ పాల్పడి ఉండవచ్చు. అయితే ఈ వాస్తవాన్ని విస్మరించిన పురావస్తు శాఖ ఉద్యోగి నంది విగ్రహ విధ్వంసంపై ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తూ 'చూడండి సార్! ఈ ప్రాంతాన్ని పాలించిన మన (హిందూ) వారు బ్రహ్మాండమైన కోటను కట్టించారు. అయితే వారి (హిందూ పాలకుల) తరువాత వచ్చిన ముస్లింలు ఈ నంది విగ్రహాన్ని ఎలా ధ్వంసం చేసారో" అని తన బాధను వ్యక్తం చేసాడు. అతడు అంతటితో ఆగలేదు. కోటలోని మసీదులను, దర్గాలను చూపించడానికీ, వాటి ప్రాముఖ్యతను తెలపడానికి ఉత్సాహం చూపించకపోగా మరింత ఆవేశంతో మాట్లాడుతూ 'వాళ్లు (ముస్లింలు) ఎక్కడి నుంచో వచ్చినవారు (ప్రపంచంలోని ఏవో సుదూర ప్రాంతాల నుండి గానీ, దేశాల నుండి గానీ వచ్చినవారు అనే భావంతో) ఈ ప్రాంతాన్ని ఆక్రమించి (అన్యాయంగా ఈ చర్యకు పాల్పడినట్లు) మన (హిందువులు) దేవాలయాలను పడగొట్టి ఈ మసీదులను, దర్గాలను వాటిపై నిర్మించు కున్నారు. ఎంత అన్యాయమో చూడండి సార్' అని వాపోయాడు.

ఇక్కడ రెండు విషయాలు గమనించాలి. 'వాళ్లు' లేక 'వారు' అనే వారు ముస్లింలనీ, వారు ఇతరులతో సంబంధం లేనివారనీ, వారు జనజీవన స్రవంతిలో కలవడానికి అర్హులుకారు అనే అర్థంలో ఆ ఉద్యోగి వ్యాఖ్యానించాడు. అంతేకాకుండా, 'మన', 'మన వాళ్లు' అనే పదజాలాన్నీ, భావాలనూ అతడు తరచూ ఉపయోగించాడు. అంటే, అతని ప్రకారం 'హిందువులు', హిందూ రాజులు/పాలకులు', 'మనవారు', 'మన పాలకులు' అనేది ఇందులోని గూడార్థం.

రెండవది 'ఎక్కడి నుంచో వచ్చినవారు' అనే అతని ఆరోపణకు సంబంధించింది. అంటే ముస్లింలనే వారు ఈ ప్రాంతానికీ, ఈ దేశానికీ చెందినవారు కాదు. వారు ఏ ఇతర దేశానికో లేక ప్రపంచం లోని ఏదో ఒక ప్రాంతానికో చెందినవారు. వారికి ఈ ప్రాంతానికీ, ఈ దేశానికీ వచ్చే అర్హత లేదు. వారికీ హిందువులకూ (ఈ దేశానికి చెందినవారికి) ఎటువంటి సంబంధం లేదు అని అతని ఉద్దేశంగా కనిపిస్తుంది.

ఈ అంశంతోపాటు భారతదేశ రాజకీయ రంగంలో తరచూ భారతీయ జనతాపార్టీ వారు సోనియాగాంధీ స్వదేశీయతపై తరచూ దాడి చేయడం, ఈ మధ్య జనతాపార్టీ నాయకుడు సుబ్రమణ్యస్వామి ముస్లింల అస్తిత్వాన్ని ప్రశ్నించడం వంటి అంశాలను పరిశీలిస్తే అసలు భారతీయులు ఎవరు? వారు స్వదేశీయులా? లేక విదేశీయులా? లేక సమ్మిశ్రమమా? భారతీయుల 'మిశ్రమ' సంస్కృతి (కంపోజిట్ కల్చర్), లేక 'బహుళత్వ సంస్కృతి' (మల్టిపల్ కల్చర్) మాటేమిటి? అనే సందేహాలు కలుగక మానవు. వీటిని నివృత్తి చేసుకోవాలంటే చరిత్ర పుటలలోకి వెళ్లి భారతీయుల మూలాలను తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ అనుమానాలను నివృత్తి చేసుకోవడానికే ఈ వ్యాసాన్ని రాయాలనిపించింది.

ప్రపంచం నలుమూలల వలెనే భారతదేశంలో కూడా ప్రాచీన కాలంలో ప్రజల జీవన విధానం, నాగరికతా, సంస్కృతులు ప్రారంభమయ్యాయి. వీటి వివరాల్లోకి వెళితే శిలాయుగాల సమకాలిన ప్రపంచం నలుదిశల నుంచీ అనేక జాతుల, తెగల ప్రజలు భారతదేశానికి వచ్చి స్థిరపడ్డారు. ఉదాహరణకు **నీగ్రిటోలు** ఆఫ్రికా నుంచి అరేబియా, ఇరాన్, బెలూచిస్థాన్‌ల మీదుగా భారతదేశానికి వచ్చారు. భారతదేశంలో వీరు మొట్టమొదటి జాతి ప్రజలు. వీరే భారతదేశంలోని ప్రాచీన శిలాయుగ నిర్మాతలు. వీరి వారసులో లేక వీరి సంతతికి చెందినవారో నేటి అస్సాములోని **అంగామీ** నాగజాతులు, తూర్పు బీహార్‌కు చెందిన రాజమంగల్ కొండజాతులు, ఆంధ్రప్రాంతానికి చెందిన ఏనాదులు, తమిళనాడుకు చెందిన ఎరంబలు, వైనాడుకు చెందిన ఇరలలు, కదిరులు, కేరళకు చెందిన కొచ్చిన–తిరువాన్కూరు ప్రాంత పాలయన్‌లు. నీగ్రిటోల తరువాత భారతదేశానికి వచ్చినవారు **ప్రోటో ఆస్ట్రోలాయిడ్స్** అనే జాతివారు. వీరు పశ్చిమ ఆసియా ప్రాంతాల నుండి వలసవచ్చారు.

వీరు నవీన శిలాయుగానికి చెందిన వారు. నేడు మధ్య భారతదేశంలోని ఆటవిక జాతులకు చెందిన సంతాలులు, ముందారీలు, లర్కాకోలులు, అసురులు, కొరవలు, ఆంధ్ర–ఒడిశా ప్రాంతంలోని గదబలు వీరి సంతతికి చెందినవారు. తరువాత మధ్యధరా జాతులకు చెందిన ద్రవిడియన్‌లు అనే ద్రావిడులు భారతదేశానికి వచ్చారు. వీరి సంతతికి చెందినవారే దక్షిణ భారతదేశానికి చెందిన ఆంధ్రులు, తమిళులు, మలయాళీ యులు, కన్నడీగులు. వీరి తరువాత నార్డిక్ జాతీయులైన ఇండో– ఆర్యన్‌లు వచ్చారు. వీరే ఆర్యులు. ఉత్తర భారతదేశవాసులు వీరి నుండి ఉద్భవించారనే అభిప్రాయం ఉంది. మనదేశానికి వచ్చి స్థిరపడిన మరొక ప్రాచీన విదేశీజాతి **మంగోలాయిడ్‌లు**. నేటి ఈశాన్య భారత దేశానికి చెందిన ప్రజలు వీరి సంతతికి చెందినవారని చరిత్రకారులు పేర్కొన్నారు.[1]

తరువాత క్రీ.పూ. 4వ శతాబ్దంలో పారశీకులు వాయువ్య సరిహద్దు భారతదేశంపై (పశ్చిమోత్తర భారతదేశంపై) దండెత్తిన సమయంలో కొంతమంది తమ స్వదేశమైన పర్షియా (ప్రస్తుత ఇరాన్) వెళ్లగా కొంతమంది భారతదేశంలో స్థిరపడ్డారు. అనంతరం జరిగిన అలెగ్జాండర్ దండయాత్ర తరువాత గ్రీకులు భారతదేశంలో స్థిరపడి భారతీయులతో మమేమకయ్యారు. మౌర్యుల అనంతరం ఇండోగ్రీకులు, శకులు, పార్థియన్‌లు, కుషాణులు వంటి అనేక ప్రధాన జాతులు, తెగలతోపాటు అనేక చిన్న చిన్న జాతులూ, తెగలూ ఇతర దేశాల నుండి పశ్చిమోత్తర ప్రాంతానికి వచ్చి, తమ అధికారాన్ని నెలకొల్పడమే కాక, స్థానిక ప్రజలతో కలిసిపోయారు.[2]

భారతదేశ చరిత్రలోని అతిముఖ్యమైన దశ క్రీ.శ. 7వ శతాబ్దంలో ప్రారంభమైంది. అవి అరబ్బుల సింధు దండయాత్ర, తదనంతర పరిణామాలు. అరబ్బులు సింధు ప్రాంతాన్ని జయించి తరువాత వారి అనుచరులైన మహమ్మద్ ఘజనీ, మహమ్మద్ ఘోరీలు భారతదేశంపై దండెత్తివచ్చి తమ అధికార స్థాపనకు శ్రీకారం చుట్టారు. అయితే ఇది ఆ తరువాత తురుష్కుల ఢిల్లీ సల్తనత్ సామ్రాజ్యాన్నీ, అఫ్ఘన్‌లు, మొఘలులు తమ తమ రాజ్యాలనూ, సామ్రాజ్యాలనూ నెలకొల్పు కోవడానికీ, ఇక్కడే స్థిరపడడానికీ దారితీసింది.[3] మొఘలుల చివరి రోజులలో పోర్చుగీసువారు, డచ్చివారు, ఫ్రెంచివారు, ఆంగ్లేయులు అనే యూరోపియనులు భారతదేశానికి వచ్చి, వర్తక వ్యాపారాలతో పాటు, రాజకీయ కార్యకలాపాలు నడిపారు. వీరిలో ఆంగ్లేయులు భారతదేశంపై ఆధిపత్యం వహించినా, స్వాతంత్ర్యా నంతరం వారు తమదేశానికి వెళ్లినా, దేశవ్యాప్తంగా అనేక పట్టణాలలో ఆంగ్లేయులు, ఇతర యూరోపియన్ జాతులు, తెగలవారు స్థిరపడ్డారు. ఈ నాటికీ పుదుచ్చేరిలో ఫ్రెంచివారు, గోవాలో పోర్చుగీసువారు నివశిస్తూ ఉండడం మనం చూడవచ్చు. వీరితోపాటు ఆయా కాలాలలో అనేకమంది విదేశీయులు రాయబారులు గా, యాత్రికులుగా, నావికులుగా, సివిల్ అధికారులుగా, ఆస్థాన చరిత్రకారులుగా, దార్శనికులుగా ఈ దేశానికి రావడమే కాకుండా, ఇక్కడే స్థిరపడి చివరకు మరణించారు. వారిలో చాలామంది భారతీయ నాగరికతా, సంస్కృతులలో కలసిపోయారు.[4]

ఈ వివరాలను పరిశీలిస్తే ప్రాచీన కాలం నుంచీ ఆధునిక కాలం వరకూ భారతదేశానికి వివిధ దశలలో వివిధ జాతుల, తెగల ప్రజలు వచ్చి స్థిరపడ్డారనేది చారిత్రక సత్యం. వీరు ప్రపంచం నలు మూలలకు చెందిన అనేక ముఖ్యమైన జాతుల, తెగల భాషల సమాహారం. ఈ విధంగా అనేక జాతులవారు భారతదేశంలో నివశిస్తున్నందువల్ల చరిత్రకారుడు విన్సెంట్ స్మిత్ 'భారతదేశం అనేక జాతుల చోద్యమైన ప్రదర్శనశాల' (ఇండియా ఈజ్ ఆన్ ఎథ్నోలాజికల్ మ్యూజియం) అని పేర్కొన్నాడు.[5]

మతపరంగా చూస్తే ప్రపంచంలోని అన్ని మతాలు భారత దేశంలో ఉన్నాయి. అంటే భారతదేశంలో నివశిస్తున్న ప్రజలు 'ప్రపంచ మతాల సంఘమం'గా ఏర్పడ్డారు. మరోరకంగా చెప్పాలంటే భారత దేశానికి వచ్చి స్థానిక ప్రజలతో మమేకమైన ప్రజలు కాలక్రమంలో హిందూ, మహమ్మదీయ, క్రైస్తవ, జైన, బౌద్ధ, పారశీక, శిక్కు మతాలను స్వీకరించారు. అయితే ఈ వివిధ మతాల ప్రజలలో ఏ జాతి, తెగ, ప్రాంత ప్రజలు ఎప్పుడు భారతదేశంలో తమకిష్టమైన మతాన్ని స్వీసరించారనేది కచ్చితంగా నిర్ధారించలేం. ప్రాంతపరంగా చూస్తే ప్రపంచంలోని ముఖ్య భూభాగాలయిన ఆఫ్రికా, పశ్చిమాసియా, మధ్య ఆసియా, పశ్చిమ–దక్షిణ ఐరోపా, గ్రీస్, మంగోలియా, మధ్యధరా, టర్కీలకు చెందిన ప్రజలు వివిధ కాలాలలో భారతదేశానికి వచ్చి స్థిరపడ్డారు. భాషాపరంగా వీరంతా విభిన్న భాషలకు చెందినవారు.

చివరకు వీరంతా ఏకమై విశిష్టమైన భారతీయ సంస్కృతిగా ఏర్పడ్డారు. అదే భారతీయ 'మిశ్రమ సంస్కృతి' లేక 'వైవిధ్యభరితమైన బహుళత్వ సంస్కృతి'. ఈ సంస్కృతి నుండి స్వదేశీయత లేక విదేశీయత అనే సంకుచిత భావజాలాన్ని, భావాన్ని కానీ వేరు చెయ్యలేం. అంటే ఫలానా జాతికానీ, తెగకానీ, మతంవారు కానీ, భాషవారు కానీ, వ్యక్తి కానీ భారతీయులు అనీ, విదేశాలకు చెందినవారు అనీ చెప్పలేం, విడదీయలేం, ప్రత్యేకించలేం. మరో రకంగా చెప్పాలంటే భారతీయు లందరూ విదేశీయులే, లేక స్వదేశీయులే. ఈ మూలాన్ని విస్తృతంగా, సమగ్రంగా ప్రతి భారతీయుడు గుర్తించవలసిన అగత్యం, అత్యవసరం ఉంది. ఈ చారిత్రక సత్యాన్నీ, నిజాన్నీ విస్మరించి విదేశీయతనూ, మెజారిటీ, మైనారిటీ అనే విషపూరిత పదజాలాన్ని, భావజాలాన్ని రెచ్చగొట్టి ప్రజల మెదళ్లనూ, ముఖ్యంగా భావిభారత పౌరులైన ఈనాటి యువత (విద్యార్థినీ / విద్యార్థుల) మెదళ్లనూ కలుషితం చేయడానికి ప్రయత్నించడం సహేతుకం కాదు. దీనిని ఆదిలోనే తుంచి వేయడానికి అన్ని తరగతుల వారూ, మేధావివర్గం, స్వచ్ఛంద సంస్థలూ ముందుకు రావాలి. అప్పుడే భారతీయ మిశ్రమ సంస్కృతి, ప్రజాస్వామ్య విలువలూ, లౌకికతత్వం, మతసామరస్యం, మానవతా విలువలూ మనగలుగుతాయి.

అంత్య సూచికలు

1. ఎ.ఎల్. బాషమ్, 'ది వండర్ దట్ వాజ్ ఇండియా', న్యూఢిల్లీ, 1984, పు.11–14, 25–29; 'భారతదేశ చరిత్ర క్రీ.శ. 1526 వరకు', తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2004, పు.21–23
2. పైదే. పు. 97, 100, 129–135, ఎ.ఎల్. బాషమ్, 'ది వండర్ దట్ వాజ్ ఇండియా' పు. 48–50, 59–62
3. ఎస్.ఎ.ఎ. రిజ్వి, 'ది వండర్ దట్ వాజ్ ఇండియా', పార్ట్–2, న్యూఢిల్లీ, 2003, పు. 8–56, 89–153
4. సుమిత్ సర్కార్ 'మోడర్న్ ఇండియా: 1885–1947', న్యూఢిల్లీ, 2004, పు. 1–12; విన్సెంట్ స్మిత్ 'ది ఆక్స్‌ఫర్డ్ హిస్టరీ ఆఫ్ ఇండియా', 1976, పు. 455–481
5. పైదే, పు.5

(రచయిత కడప యోగి వేమన యూనివర్సిటీలో చరిత్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్) వీ

ఆంధ్రప్రదేశ్‌లో బౌద్ధ మత వ్యాప్తి, భిన్న ఛాయలుగా, భిన్న ప్రాంతాలలో విస్తరించిన తీరు, చారిత్రక స్థలాల గురించి వివరిస్తున్నారు **ఎన్. లక్ష్మీదేవి**

తెలుగునాట బౌద్ధక్షేత్రాలు

సిద్ధార్థ గౌతముని జీవితకాలంలోనే ఆయన కనుగొని బోధించిన ధమ్మం తెలుగు నేలకు చేరింది. సుత్తనిపాతంలోని పారాయణ వగ్గలో, అస్సక జనపదం (గోదావరి తీరం – కరీంనగర్ జిల్లా) నుంచి బావరి అనే బ్రాహ్మణుడు తన 16 మంది శిష్యులను రాజ గృహంలో ఉన్న బుద్ధుని వద్దకు పంపాడనీ, వారు బుద్ధుని కలిసి, ధమ్మాన్ని విని తిరిగొచ్చి బావరికి అందించారని పేర్కొనబడింది. క్రీ. శ. 5వ శతాబ్దికే బౌద్ధ ధమ్మం ఇక్కడకు చేరి క్రమక్రమంగా ఆదరణకు నోచుకుంది. మూడో బౌద్ధ సంగీతి తరువాత, మహాదేవుడనే బౌద్ధాచార్యుడు బుద్ధ ధర్మ ప్రచారానికి మహిష మండలానికి వచ్చాడనీ, అలాగే ధర్మరాజుగా పేరొందిన అశోకుని ఏలుబడిలో భాగమైన ఆంధ్రదేశంలో కర్నూలు జిల్లా ఎర్రగుడి వద్ద అశోకుడు ధమ్మ శాసనాలు వేయించాడనీ, అంతేకాక ధరణికోట (అమరావతి), భట్టిప్రోలు, వడ్డమాను శాలిమండంలలోని బౌద్ధ క్షేత్రాలు ఆనాటివేనని పురావస్తు పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. అశోకుని కంటే ముందు కాలానికే దంతపురం, ధరణికోటల్లో బౌద్ధ ఆనవాళ్లున్నాయనీ, అక్కడ దొరికిన ఉత్తరాది నలుపురంగు – జిగిషి నగిషీ (నార్తరన్ బ్లాక్ పాలిష్డ్ వేర్) మట్టి పాత్రల అవశేషాలను బట్టి చెప్పవీలవుతుంది. అమరావతి, వడ్డమానులలోని స్థూపాలన వద్ద గల రెయిలింగ్ రాతి స్థంబాల నగిషీ, అమరావతిలో దొరికిన అశోకుని దనుకుంటున్న శాసన శకలం ఈ విషయాన్ని రూఢి పరుస్తున్నాయి.

తొలుత కేవలం బుద్ధుడు బోధించిన ధర్మాన్ని యథాతథంగా ఆచరించిన వైయ్యక్తిక నిర్వాణానికి ప్రాధాన్యతనిచ్చిన థేరవాదం, తరువాత బుద్ధుని ధమ్మానికి వ్యాఖ్యానాలు చెప్పడమే కాక, బుద్ధునిలో కొత్త?? కీర్తించి ఆరాధించడం మొదలుపెట్టిన మహా సాంఘికులు పెంచి పోషించిన మహాయానం, అటు తరువాత, విచ్చలవిడి మంత్ర, తంత్రాలతో విలసిల్లుతున్న బ్రాహ్మణ మతానికి ధీటుగా తాంత్రిక పద్ధతులను ప్రోత్సహించిన వజ్రయాన లేక తంత్రయానమనే మూడు దశల్లో తెలుగు నేలపై బౌద్ధం విలసిల్లింది. థేరవాదం క్రీ.శ. 3 నుండి క్రీ.శ. 5 వరకూ, మతశయానం క్రీ.శ. 1 నుంచి 7వ శతాబ్ది వరకూ, తంత్ర యానం క్రీ.శ. 3 నుంచి 10వ శతాబ్ది వరకూ వివిధ క్షేత్రాల్లో తమ తమ ప్రభావాలను చూపాయి. థేరులనగా ధమ్మ వినయాచరణలో పెద్దలనీ, వారు తు.చ. తప్పకుండా బుద్ధుని మార్గాన్ని అనుసరిస్తూ అర్హంతులై నిర్యాణాన్ని పొందుతారనీ, నిర్యాణం కేవలం వీరికొక్కరికి మాత్రమే దక్కుతున్నందున ఆ మార్గాన్ని హీనయానమని (ఇపుడు ఈ పదం నిషిద్ధం) పిలిచారు. మహాయానంలో భిక్షువులు, కరుణ, ప్రజ్ఞల ఆధారంగా సంబుద్ధత్వాన్ని సంకల్పించుకొని తమతోపాటు ఇతర జీవిరాశులకు కూడా మళ్లీ పుట్టుకంటూ లేని నిర్యాణాన్ని పొందేందుకు పాటు పడతారు. ఎక్కువ సంఖ్యలో జీవరాశులకు విముక్తి కలిగించడమే ఈ విధాన ప్రధాన లక్ష్యం కాబట్టి దీనిని మహాయానమన్నారు.

మహాయానంలో బుద్ధుని ఆరాధించడం మొదలైన తరువాత, తక్కువ సమయంలో నిర్యాణ పథాన్ని చేరడానికి కరుణ – ప్రజ్ఞల సంయోగ విధానంలో మంత్రాలు, తంత్రాలు, మండల పూజలు విపరీతమై నిర్యాణం పొందాలన్న వజ్ర సంకల్పంతో ధార్మిక ప్రగతిని పొందే మార్గం కాబట్టి దీనిని వజ్రయానమన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో క్రీ.పూ. 3 నుంచి క్రీ.శ. 10వ శతాబ్ది వరకూ విలసిల్లిన మూడు దశల బౌద్ధానికి అద్దం పట్టే 200లకు పైగా స్థావరాలు బయల్పడినాయి. క్రీ.శ. 1797–98లో కల్నల్ కాలన్ మెకంజీ నుంచి ఇటీవలి వరకూ జరిపిన పురావస్తు పరిశోధనల్లో ఎన్నో బౌద్ధారామాలు కొండల మీద, మైదానాల్లో బయల్పడినాయి. వీటిని గుహాలయాలుగా, కొండ మీది, మైదానాలలోని ఆరామాలుగా విభజించి అధ్యయనం చేయవచ్చు. కొండల మీద గల బౌద్ధారామాల్లో రామతీర్థం, గుంటుపల్లి శంకారం, తొట్లకొండ, బావికొండ, పావురాల కొండ, ఉండవల్లి, శాలి మండల, పాండవుల మెట్ట, గోపాలపట్నం, ఎర్రవరం, పెనుమాక, చంధవరం, కొండూరుతిప్ప, నందలూరు వద్ద గుర్తించినవి ముఖ్యమైనవి.

మైదానాల్లో దంతపురం, కళింగపట్నం, జీలకర్రగూడెం, పెదవేగి, ధరణికోట, భట్టిప్రోలు, కర్లపాలెం, చినగంజాం, ఉపులగొందూరు, గోలి, ఏలేశ్వరం, ధూళికట్ట, కోటిలింగాల మొదలైన బౌద్ధారామాలు ముఖ్యమైనవి. కొండల మీద గుహాలయాలు గుంటుపల్లి, గోపాలపట్నం, ఎర్రవరం, పాండవుల మెట్ట ముఖ్యమైనవి.

ప్రతి బౌద్ధారామంలో స్థూపం (బుద్ధిని అస్థికలుంటే అది మహా స్థూపం), చైత్యం, విహారం, శిలా మండపం మొదలైన కట్టడాలుంటాయి. స్థూపం బుద్ధుని ధమ్మానికి ప్రతీకగా థేరవాద, మహాయాన భిక్షువులు ఆరాధించగా, బుద్ధుని ప్రతిమను ప్రతిష్టించిన బుద్ధ చైత్యం, స్థూపం చుట్టూ బుద్ధుని జీవితగాథలను చెక్కిన శిలాఫలకాలతో అలంకరించడం మహాయాన భిక్షువులు, బుద్ధుడు, ధ్యాని బుద్ధులు (ఐదుగురు) బౌద్ధ దేవతలను, స్థూప బొమ్మల్ని, తార, హారతి మొదలైన స్త్రీ దేవతలను తంత్రయాన బౌద్ధులు ఆరాధించేవారు.

థేరవాదానికి చెందిన స్థావరాల్లో దంతుపురం, కళింగపట్నం, రామతీర్థం, తోట్లకొండ, బాలికొండ, పావురాలకొండ, శంకారం, అమలాపురం, గుంటుపల్లి, పెనుమాక, ధాన్యకటకం, భట్టిప్రోలు, చంధవరం, నందలూరు, ధూళికట్ట, కోటిలింగాల, ఫణిగిరి ముఖ్యమైనవి. అలానే, శాలిహుండం, శంకారం, గుంటుపల్లి, ఘంటసాల, నంబూరు,

ఈ దేశంలో భూ సంస్కరణల అవసరం ఎందుకుందో, ఎంత అవసరమో వివరిస్తున్నారు

ఎం. కోదండరాం, కె. సీతారామారావు

భూసంస్కరణ విధానాలు - ఒక సమీక్ష-2

(గత సంచిక తరువాయి...)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత, 1961లో ప్రభుత్వం రూపొందించిన భూగరిష్ట పరిమితి చట్ట ప్రకారం రాష్ట్రంలో ఒక సెంటు భూమి కూడా మిగులు భూమిగా గుర్తించబడి పంపకం చేయబడలేదు. దీనికి తార్కాణం 1969లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వివరాలు, చట్టం ప్రకారం భూస్వాములిచ్చిన డిక్లరేషన్‌లు పరిశీలిస్తున్నామని చెప్పినా భూములు పంచినట్లు వివరాలేమీ ప్రభుత్వం అందజేయలేదు. 1950వ దశాబ్దం మొదటి సంవత్సరాలలో తెలంగాణ ప్రాంతంలో ఎంతో కొంత మేరకైనా సమర్థవంతంగా అమలుచేయబడిన కౌలుదారీ చట్టాలు ఆంధ్ర తెలంగాణాలు, సమైక్యాంధ్రప్రదేశ్‌గా (విశాలాంధ్రగా) అవతరించిన తరువాత భూసంస్కరణల కార్యక్రమంలో స్తబ్దత ఎందుకేర్పడింది? అంతకుముందున్న బలమైన రైతాంగ ఉద్యమం లేకపోవడం వల్లనా? ఆంధ్ర రాష్ట్ర పాలక వర్గం (కోస్తాంధ్ర ప్రాంత సంపన్న భూస్వామ్యవర్గం) తమ స్వప్రయోజనాల కోసం భూసంస్కరణల కార్యక్రమాన్ని తమ అభివృద్ధికి నిరోధకంగా భావించి పక్కకు తోసివేసారా? ఇవన్నీ ఆలోచించి విశ్లేషించాల్సిన ప్రశ్నలు.

మొదటి దశలో భూసంస్కరణల చట్టాల అమలు వైఫల్యం చెందడానికి గల కారణాలను ప్రణాళిక సంఘంచే వ్యవసాయ సంబంధాలను పరిశీలించడానికి, నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీ వివరంగా తెలియజేసింది. ఈ కమిటీ పేర్కొన్న ప్రధాన కారణాలు (1) అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలకు భూసంస్కరణల అమలుపట్ల చిత్తశుద్ధి, రాజకీయ సంకల్పం (Political will) లేకపోవడం, (2) భూసంస్కరణల అమలులో గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, వ్యవసాయ కూలీ సంఘాలు ఫలవంతంగా పాల్గొనకపోవడం, (3) గ్రామాల్లోని రైతు – కూలీలు అవ్యవస్థీకృతంగా ఉండడం, భూస్వాములే రాజకీయరంగాన్ని నిర్దేశించి నియంత్రించడం.

రెండో దశలో సమగ్రమైన భూగరిష్ట పరిమితి చట్టాలు రావడానికి కారణం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగ ఉద్యమాలు, గిరిజనోద్యమాలు తిరిగి మొదలు కావడం. 1970లో సి.ఎల్.ఆర్.సి. సూచించిన మార్గదర్శక సూత్రాలు, ఈ చట్టాలను 9వ షెడ్యూల్లో చేర్చి రాజ్యాంగపరమైన రక్షణ కల్పించడంవల్ల రెండో దశలో రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన భూగరిష్ట పరిమితి చట్టాలకు సమగ్రత, ఏకరూపత

శేకూరు, ఏట్రవానిపాలెం, నేలకొండపల్లి, నాగార్జునకొండ, ఏలేశ్వరం, ఫణిగిరి, వర్ధమాన కోట మొదలైన క్షేత్రాలు మహాయాన దశకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు.

ధరణికోట, గుంటుపల్లి, శంకారం, శాలిహుండం, రామతీర్థం మొదలైన స్థావరాలు వజ్రయాన దశను సూచిస్తాయి.

ఆచార్య నాగార్జునుడు, ఆర్యదేవుడు, దిన్నాగుడు, భావి వివేకుడు మహాయాన బౌద్ధాచార్యులు కాగా, బుద్ధఘోషుడు ప్రముఖ థేరవాద బౌద్ధాచార్యుడు. వజ్రయానానికి చెందిన ఆచార్యుల పేర్లు అంతగా వెలికిరాలేదు. ఆచార్య నాగార్జునుని మూలమాధ్యమిక కోరికలు, శూన్యతా సప్తతి, చతుస్తవం, ప్రజ్ఞా పారమిత శాస్త్రం, సుహృల్లేఖ, రత్నావళి గ్రంథాలు ముఖ్యమైనవ రచనలు. నాగార్జునుని శిష్యుడైన ఆర్యదేవుడు మహాయాన ప్రవక్తగానూ, దిన్నాగుడు – ధర్మకీర్తి గొప్ప తార్కికులుగానూ పేరొందారు. బుద్ధ ఘోషుడు శ్రీలంకకు వెళ్లి పాళిలో విశుద్ధమగ్గ అనే గ్రంథాన్ని రాయడమే కాక దాన్ని సింహళ భాషలో కూడా అనువదించి అక్కడి సంఘ నాయకుల అభిమానం చూరగొన్నాడు. దిన్నాగుడు మహానాగ పర్వతంగా గుర్తించబడిన గుంటుపల్లిలో నివసించగా, భావవివేకుడు మంగళగిరిలోనూ, బుద్ధ ఘోషుడు కోటనెమలిపురిలోనూ, ధర్మకీర్తి తిరుమల కొండల మీద నివసించిన ఆధారాలున్నాయి.

తెలుగునేలపై థేరవాద స్థావరాల్లో నిర్మించిన స్థూపాలు, మహాయాన దశలో విస్తరించబడడమే కాక, శిలాఫలకాలతో అలంకరించబడి అనేక ఉత్సవాలకు ఆలవాలమైనాయి. స్థూపం చుట్టూ నాలుగు అరుగులు, వాటిపై బుద్ధుని జీవితంలో ప్రధానమైన ఐదు ఘట్టాలను సూచించే స్థంభాలను నిలపడం, స్థూపం లోపల చక్రాకారపు పూనాదు లుండడం కేవలం ఆంధ్రప్రదేశ్ బౌద్ధకట్టడాలకే పరిమితమై ప్రత్యేకతను సంతరించుకొంది. మరో విషయమేమంటే ధరణికోట, గుంటుపల్లి, శంకారం, శాలిముండాలు థేరవాద, మహాయాన, వజ్రయాన బౌద్ధ దశలకు ప్రతీకలుగా భాసిల్లాయి. థేరవాద బౌద్ధంలో బుద్ధున్ని చిహ్నాల రూపంలోనూ, మహాయానంలో బుద్ధుని మానవ రూపంలోనూ, తంత్రయానంలో బుద్ధున్ని అధి దేవతగానూ కొలిచిన ఆధారాలెన్నో దొరికాయి. తెలుగునేలపై క్రీ.పూ. 3 నుంచి క్రీ.శ. 10వ శతాబ్ది వరకూ విలసిల్లిన బౌద్ధం కుల మతాలకు అతీతంగా, సమ సమాజానికి చేరువగా అందరూ పుట్టుక హీనులుగానీ, తెలివిపరులుగానీ, నీచులుగానీ, ఉన్నతులుగానీ కారనీ, కేవలం అభ్యాస పూర్వకంగా బుద్ధుని వికసింపజేసుకొని చతురార్య సూత్రాల గుర్తెరిగి, అష్టాంగ మార్గాన్ని ఆచరించి, నిర్వాణాన్ని పొందడానికి అందరూ అర్హులేనని తేల్చి చెప్పి తెలుగు ప్రజానీకానికి వెలుగులందించిన బౌద్ధం పరమిత దౌష్ట్యానికి బలై వెలివేయబడింది.

(రచయిత పరిశోధక విద్యార్థిని) వీ

ఏర్పడిందని చెప్పవచ్చు. ఆంధ్రప్రదేశ్ 1973 వ్యవసాయ భూముల గరిష్ట పరిమితి చట్టంలో భూ యాజమాన్యం మీద గరిష్ట పరిమితి విధించే పద్ధతులను, మౌలిక భావనలెన్నింటినో వివరించడం జరిగింది. ఈ చట్టంలో కుటుంబ యూనిట్ కుండవలసిన భూమి దాని మీద పరిమితి, (10–54 ఎకరాలు భూమి నీటి వసతుల ఆధారంగా) వ్యవసాయ భూముల వర్గీకరణ, దీనికనుగుణంగా నిర్ణయించిన ప్రమాణీకరింపబడ్డ కమతం వంటి మౌలిక భావనలే కాక మినహాయింపులు, స్వాధీనపరుచుకున్న మిగులు భూముల కివ్వవలసిన నష్ట పరిహారం, భవిష్యత్తులో భూమి సంపాదనమీద పరిమితి, చట్టాన్ని ఉల్లంఘిస్తే విధించే శిక్షలు, జుర్మానాలు మొదలైన విషయాలన్నీ వివరంగా పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం 1975–81 వరకు దాదాపు ఆరు సంవత్సరాల పాటు భూగరిష్ట పరిమితి చట్టాన్ని అమలు చేయడానికి కొంత ఉత్సాహం చూపింది. ఈ చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం జిల్లాస్థాయి నుంచి పూర్తిగా రెవిన్యూ పాలనా యంత్రాంగం మీద ఆధారపడింది. జిల్లాస్థాయిలో భూసంస్కరణాధికారి చట్టం అమలుకు సంపూర్ణమైన బాధ్యత వహించడంతోపాటు, చట్టం ప్రకారం భూస్వాములు ప్రకటించిన భూసంబంధిత ఆస్తుల ప్రకటన పత్రాలు (Land holding declerations) పరిశీలించి విచారించడానికి ఏకసభ్య పాలనా న్యాయస్థానాలు (Administrative Tribunals) ఏర్పాటుచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూగరిష్ట పరిమితి చట్టం అమలు చేయడానికి దాదాపు 400 కోట్లు ఖర్చు చేసింది. ఈ చట్టం అమలు చేయడానికి ఎంతోమంది పాలనాధికారులకు ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వడం జరిగింది. అయినా చట్టం అమలులో ఆశించిన ఫలితం దక్కలేదు. 1992లో చివరిగా ప్రభుత్వం ప్రకటించిన గణాంక వివరాలను పరిశీలిస్తే భారతదేశం మొత్తంలోనే కాక, ఆంధ్రప్రదేశ్‌లో కూడా భూగరిష్ట పరిమితి చట్టం అమలు, దానివల్ల దక్కిన ఫలితాలను బేరీజుచేస్తే కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌లో భూగరిష్ట పరిమితి చట్టం ప్రకారం భూ యజమానులిచ్చిన నాలుగున్నర లక్షల డిక్లరేషన్లు. వీటిలో కేవలం 64, 911 డిక్లరేషన్లలో 16,63,881 ఎకరాలు మిగులు భూమిగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధంగా నిర్ణయించిన మిగులు భూముల్లో అసలు తేలిన నికరమైన మిగులు భూమి 8,62,991 ఎకరాలు, మిగతాదంతా కోర్టు లిటిగేషన్లల్లో ఉన్నదని తెలియ చేయడం జరిగింది. కాబట్టి ప్రభుత్వం దీన్ని పంపిణీ చేయడానికి స్వాధీనపరుచుకోలేకపోయింది. ప్రభుత్వం నికరంగా నిర్ణయించిన మిగులు భూమిలో స్వాధీనపరుచుకోగలిగిన భూమి 5,71,632 ఎకరాలు, దీనిలోంచి ప్రభుత్వం పంపిణీ చేయగలిగిన భూమి 5,10,989 ఎకరాలు. ఈ భూమిని 4,43,176 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ లబ్ధిదారుల్లో 43 శాతం ఎస్.సి.లు, 18 శాతం ఎస్.టి.లు, 32 శాతం వెనుకబడిన కులాలకు చెందినవారు. ఇప్పటికీ ప్రభుత్వం స్వాధీనపరుచు కోకుండా న్యాయస్థానాల చిక్కులవల్ల, పాలనా జాప్యంవల్ల పంచలేక పోయిన భూమి 2,29,338 ఎకరాలు. రాష్ట్రంలోనున్న పేదరైతుల, వ్యవసాయ కూలీల కుటుంబాల సంఖ్యను, ప్రభుత్వం పంపిణీ చేసిన మిగులు భూమి విస్తీర్ణాన్ని పోల్చి చూస్తే ఒక్కొక్క కుటుంబానికి ఒక్క ఎకరం భూమి కూడా దక్కలేదని చెప్పాలి. భూస్వాములకు మిగులు భూమిని స్వాధీనపరచడంలో స్వేచ్ఛ ఉండడంవల్ల వాళ్లు స్వాధీనపరిచిన భూమిలో ఎక్కువ భాగం సేద్యానికి పనికిరాదు.

భూగరిష్ట పరిమితి చట్టం అమలును క్షుణ్ణంగా విశ్లేషిస్తే విధానం, శాసనం, అమలు ఈ మూడు స్థాయిల్లోను స్పష్టంగా గుర్తించదగ్గ లోపాలున్నాయని గమనించవచ్చును. ఒక ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన ల్యాండ్ సీలింగ్ ఆక్ట్‌ను ల్యాండ్ ఫీలింగ్ ఆక్ట్‌గా సంబోధించడం జరిగింది. ఎందుకంటే ఇది భూమిలేని వాళ్లకు భూమి వస్తుందనే ఆశ, భూమి ఉన్నవాళ్లకు భూమి పోతుందనే భయం కల్పించిన చట్టం మాత్రమేనని, దీనివల్ల నిజమైన, వ్యవసాయయోగ్యమై, భూముల పంపిణీ జరుగలేదని అభిప్రాయపడినాడు. రాష్ట్రం రూపొందించిన భూగరిష్ట పరిమితి చట్టం లక్ష్యాలను పరిశీలిస్తే సి.ఎల్.ఆర్.సి. సూచించిన మార్గదర్శక సూత్రాలను రాష్ట్ర ప్రభుత్వం సరిగా పాటించలేదు. ఈ చట్టంలోని ప్రధాన అంశాలను సరియైన విధంగా నిర్వచించక పోవడమేగాక వాటిని చట్టం బహిర్గతంగా వెల్లడించిన ఆశయాలకు ప్రతికూలంగా వ్యాఖ్యానించే అవకాశం, పరిధి, చట్టంలోనే కల్పించడం జరిగింది. ప్రధానాంశాలన్నింటిలో అంతర్నిర్మితంగానున్న లొసుగులను భూసంపన్న వర్గాలు తమకనుకూలంగా సమర్థంగా ఉపయోగించుకొన్నారు. చట్టం అమలుకు ప్రధానంగా బాధ్యత వహించిన ప్రభుత్వశాఖలో ఉన్న అవినీతి వల్ల భూసంస్కరణల లక్ష్యం పూర్తిగా దెబ్బతిన్నది. గ్రామస్థాయిలోని పటేల్, పట్వారీలు, డిక్లరేషనులు నిజపరచే రెవిన్యూ అధికారులు, రికార్డు అసిస్టెంట్‌లు కొంతమంది ఉన్నతాధికారుల నిజాయితీ లేనితనం, చట్టం అమలు చేసే పద్ధతి దిశను నిర్ణయించింది. ఇదేకాక భూస్వాములు ఎన్నోరకాల మోసపూరిత పద్ధతుల ద్వారా మిగులు భూమిని చట్టం పరిధినుంచి తప్పించారు. వాటిలో ప్రధానమైనవి అధికారులతో కుమ్మక్కయి భూమికి సంబంధించిన వివరాలు తెలియజేసే రికార్డులు మార్చివేయడం, మిగులు భూమి స్వాధీనపరచకుండా తప్పించుకోవడానికి బినామి బదిలీలు, బినామి సహకార వ్యవసాయ క్షేత్రాలు, దేవస్థానాలు, విద్యాసంస్థలు సృష్టించడం, కుటుంబ యూనిట్‌ని విభజించి మైనర్ పిల్లలతో సహా ఎక్కువ కమతాలు పొందడం, వ్యవసాయ భూముల వర్గీకరణను ఉపయోగించి నాణ్యమైన భూములు అయోగ్యమైనవిగా చూపించడం మొదలైనవి. వీటన్నింటి కంటే ముఖ్యం విధాన ప్రకటన, చట్టం అమలుకు మధ్య నున్న దాదాపు రెండున్నర సంవత్సరాల కాలాన్ని భూయాజమాన్య వర్గాలు సమర్థవంతంగా ఉపయోగించుకొని తమ భూసంబంధిత ఆస్తులను చక్కగా సర్దుకొన్నారు. వీటితో పాటు న్యాయస్థానాలు చట్టం అమలుపట్ల అవలంబించిన వైఖరి, చట్టాన్ని వ్యాఖ్యానించిన తీరు, కల్పించిన న్యాయపరమైన చిక్కులు, చట్టం అమలును జాప్యం చేయడమే కాక భూ సంస్కరణల వైఫల్యానికి దోహదం చేసి భూయాజమాన్య వర్గాలకు ఊహించని మేలు చేసినవి.

ప్రభుత్వం చేపట్టి అమలుచేసిన భూసంస్కరణల కార్యక్రమం ఆశించిన విధంగా రైతాంగంలోని పేదరైతు, వ్యవసాయ కూలీ వర్గాలకు లాభం చేకూర్చకున్నా అది భూయాజమాన్య వర్గాల మీద పరోక్ష ప్రభావం చూపి వాళ్లకు కొంత వెసలుబాటును, లాభాన్ని చేయగలిగింది. భూసంస్కరణలు అమలు జరిగిన కాలంలో భూస్వాములు తీవ్రమైన మానసిక సంక్షోభానికి గురి అయినారు. న్యాయవాదులు, పాలనా యంత్రాంగం సహాయం కోసం ఎంతో డబ్బు ఖర్చు చేయాల్సి వచ్చింది. పాలకులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం తమ ప్రయోజనాలను దెబ్బతీస్తూ విధానాలు చేపట్టే ప్రమాదమున్నదని భూయాజమాన్య వర్గాలకర్థమైంది. కాబట్టి అపనమ్మకమైన పాలకుల మీద ఆధారపడడం కంటే, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించగలిగిన సారవంతమైన భూముల్లోనే సేద్యం ఉంచుకొని, మిగతా భూములు అమ్ముకొని పట్టణ ప్రాంతాల్లో ఆస్తులు నిర్మించుకోవాలని నిర్ణయానికొచ్చినారు. ఈ క్రమం

లోనే పట్టణాల్లోని పరిశ్రమల్లో, ఇతర వ్యాపార కార్యకలాపాల్లో భూయాజమాన్య వర్గాలు తమ పెట్టుబడిని క్రమంగా అవకాశమున్న చోటల్లా పెంచుతున్నారు. ఈ విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన భూసంస్కరణలు, గ్రామీణ ప్రాంతాల్లోని రైతాంగ ఉద్యమాలు భూయాజమాన్య వర్గాల దృక్పథంలో, సామాజిక విలువల్లో కొంతమేరకు మార్పు తీసుకొని రావడానికి కీలకమైన పాత్ర వహించినవి.

ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు వచ్చిన ప్రభుత్వ నిర్దేశిత భూసంస్కరణల చట్టాలవల్ల ఆశించిన ఫలితాలు దక్కలేదు. గ్రామ ప్రాంతాల్లో, భూకేంద్రీకరణ కొంత వరకు తగ్గినా ఆశించిన లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యమైన వ్యవసాయయోగ్యమైన భూమి పంపిణీ జరగలేదు. గ్రామాల్లో పేదరికం, అసంతృప్తి, అశాంతితో పాటు రైతుల బలవన్మరణాలు పెరుగుతూనే ఉన్నవి. నిజమైన వ్యవసాయ సంస్కరణలు నిజాయితీతో అమలు పరిస్తే తప్ప పేదరిక నిర్మూలన జరగదు కాబట్టి భూసంస్కరణలు ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అసంపూర్ణంగా, అపరిష్కృతంగానున్న ప్రధానమైన సామాజిక వైరుధ్యంగా మిగిలి పోయింది. ఆ తరువాతి కాలంలో, అంటే 1990 దశాబ్దంలో భారత ఆర్థిక వ్యవస్థలో ఎల్.పి.జి. విధానాలు ప్రవేశపెట్టడం జరిగింది.

2004 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు జరిగిన సార్వత్రిక ఎన్నికలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొని రావడమే కాకుండా, ఎన్నికల్లో వెలువడ్డ 'ప్రజాభీష్టం' అధికారం కోల్పోయిన పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన పార్టీకి కూడా చాలా స్పష్టమైన హెచ్చరికలు, సూచనలు పంపించాయి. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన తర్వాత నక్సలైట్ పార్టీలతో చర్చలు ప్రారంభించింది. అయితే చర్చలు విఫలం కావడానికి ప్రధాన కారణం – ప్రభుత్వం అనుసరించిన ఉద్దేశపూరితమైన 'విధానరాహిత్యం'. ఇక్కడ చర్చలు విఫలమైన తీరును, దానికి వెనుకగల కారణాలను విశ్లేషించడం ముఖ్య అంశం కాదు. ప్రభుత్వం నక్సలైట్ పార్టీలతో జరిగిన చర్చల్లో అత్యంత కీలకమైన అంశం భూమి సమస్య. ఈ విధంగా భూమి సమస్య మళ్లీ ఒకసారి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రధానమైన అంశంగా ముందుకొచ్చి ప్రభుత్వం మూడవ దఫా భూపంపిణీ కార్యక్రమం చేపట్టడానికి ముఖ్య కారణమయింది. ఆంధ్రప్రదేశ్‌లో మూడవ దఫా భూసంస్కరణలు రావడానికి ప్రధాన కారణం రైతాంగ ఉద్యమాలు గ్రామస్థాయి నుండి నిర్మించిన రాజకీయ ఒత్తిడి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడవ దఫా భూపంపిణీ కార్యక్రమం ప్రకటించడానికి ముందు కొంత కసరత్తు చేసింది. భూ పంపిణీ కార్యక్రమాన్ని నియంత్రించడానికి రాష్ట్రస్థాయిలో క్యాబినెట్ మంత్రులతో, రెవిన్యూ పరిపాలనలో అనుభవమున్న అధికారులతో ఒక కమిటీని నియమించింది. సమగ్రమైన వ్యవసాయ సంస్కరణలకు సంబంధించిన విధానాలు రూపొందించడానికి ప్రముఖ ఆర్థికవేత్త జయతీఘోష్ అధ్యక్షత రైతు సంక్షేమ కమిషన్‌ను నియమించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ అయిన ఐదు దశాబ్దాల సందర్భంగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి అకాడమీ, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలతో సంయుక్తంగా 'భూమి-గ్రామీణ పేదలు' అనే అంశం మీద ఒక రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించింది. ఈ సదస్సు ప్రధానంగా ప్రభుత్వ భూముల పంపిణీ, పంపిణీచేసిన ప్రభుత్వ భూముల అమ్మకాన్ని నిషేధించిన చట్టం అమలు, గిరిజన ప్రాంతాల్లో భూ బదలాయింపుల నియంత్రణ, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూ సంబంధిత రికార్డులు తయారుచేయడం, పేద రైతుల ఆర్.ఒ.ఆర్. యాజమాన్యపు హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై అమోదయోగ్యమైన, అమలు చేయగలిగిన ఎన్నో సూచనలు, సిఫారసులు చేయడం జరిగింది. ఆ తరువాత నక్సలైట్లతో జరిగిన చర్చల్లో భాగంగా వచ్చిన డిమాండ్ 'ప్రజా భూమి కమిషన్' ఏర్పాటు చేయడం దీనికి భిన్నంగా భూమి సమస్యలను అధ్యయనం చేసి తగిన సిఫారసులు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పటి పురపాలక శాఖామాత్యులు కోనేరు రంగారావు అధ్యక్షతన ఒక కమిటీని వేయడం జరిగింది. ఈ కమిటీలో రెవిన్యూ, ఆదివాసీ సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, భూపరిపాలనా శాఖల ఉన్నతాధికారులు సభ్యులుగా ఉన్నారు. రెండు సంవత్సరాలు పనిచేసిన ఈ కమిటీ 2006 నవంబర్‌లో 104 సిఫారసులతో ఒక నివేదికను ప్రభుత్వానికి అందించింది. అంతేగాకుండా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంచి వారి అనుభవంలో నున్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని అభివృద్ధి పేరుమీద సెజ్‌లకు, పారిశ్రామికవేత్తలకు, వ్యాపారస్తులకు, ప్రైవేట్ కంపెనీలకు కేటాయించడం జరుగుతున్నది. ఈరకంగా ప్రభుత్వం పెట్టుబడిదారుల కనుకూలంగా రియల్ ఎస్టేట్ దళారీ వ్యాపారి పాత్ర పోషిస్తున్నది. ఇది ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో నెలకొని ఉన్న రాజకీయ-పరిపాలనపరమైన నేపథ్యం. ఈ పరిస్థితిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడవ దశ భూ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ నేపథ్యంలో 2005 జనవరి నుండి ఇప్పటివరకు (డిసెంబర్ 2007) నాలుగు విడతల్లో అమలయిన భూపంపిణీ కార్యక్రమంలో ఉద్భవిస్తున్న ధోరణులను క్లుప్తంగా పరిశీలిద్దాం.

జనవరి 2005లో అత్యుత్సాహంగా 'ఇందిర ప్రభ' పేరుతో ప్రభుత్వం ప్రకటించిన మూడవ దశ భూ పంపిణీ కార్యక్రమంలో ఇప్పటివరకు (డిసెంబర్ 2007) నాలుగు విడతల్లో 6.03 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసామని ప్రభుత్వ లెక్కలు చెపుతున్నాయి. ఈ సంవత్సరం జులైలో 6.90 లక్షల ఎకరాల భూమిని ఆదివాసిలకు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మొదటి రెండు విడతల్లో ప్రభుత్వం అందించిన లెక్కల ప్రకారం 2.94 లక్షల ఎకరాల భూమి 2.17 లక్షల లబ్ధిదారులకు, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో పంపిణీ చేసామని ప్రకటించింది. అయితే ఇది వాస్తవంగా భూముల పంపిణీ కాదు పట్టాల పంపిణీ. ఒక్కమాటలో చెప్పాలంటే పాత లబ్ధిదారులకు కొత్త పట్టా పాసు బుక్కులు (ఆర్.ఒ.ఆర్) ఇవ్వడం. అయితే ఈ నాలుగు విడతల్లో కూడా భూస్వాములు, ధనిక రైతుల స్వాధీనంలో నున్న ప్రభుత్వ భూములు, సీలింగ్ చట్టం పరిధిని దాటి ఉన్న మిగులు భూములు, అన్యాక్రాంతమైన అస్సైన్డ్ భూములు పంచింది లేదు, అది పేద రైతులకు దక్కేది లేదు. ఇప్పటికే పేదల స్వాధీనంలో ఉండి, అనుభవంలో నున్న భూములకు ఆర్.ఒ.ఆర్. పట్టాలిస్తున్నారు. ఈ పట్టాల పంపిణీనే భూపంపిణీ కార్యక్రమంగా, 'భూయజ్ఞం'గా ప్రభుత్వం పంచరంగుల ప్రచారం చేస్తున్నది. ప్రస్తుత మూడవ దశలో ప్రభుత్వం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా భూపంపిణీ కార్యక్రమం అమలును నియంత్రించి, పర్యవేక్షించడానికి లబ్ధిదారులను ఎంపిక చేయడానికి, నియోజకవర్గ శాసనసభ్యుల నేతృత్వంలో రెవిన్యూ, పంచాయితీరాజ్ అధికారులు, ఎస్.సి., ఎస్.టి., బిసీ, స్త్రీల సంఘాల సభ్యులతో ఒక కమిటీని వేయడం జరిగింది. ఈ కమిటీలవల్ల భూపంపిణీ కార్యక్రమంలో ప్రజల/లబ్ధిదారుల భాగస్వామ్యం మాత్రం పెరిగిన దాఖలు లేవు.

(ఇంకా ఉంది)

(రచయితలు ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలలో రాజనీతి శాస్త్ర, ప్రభుత్వ పాలనాశాస్త్ర ప్రొఫెసర్లు) వీ

ప్రత్యామ్నాయ ఉద్యమాలు ఈ దేశంలోని ఉత్పత్తి సంబంధాలను విశ్లేషిస్తూ చేసుకున్న సూత్రీకరణను మారిన పరిస్థితుల్లో పునర్నిర్వచించుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు **రమేష్ పట్నాయక్**

భారతదేశంలో భూస్వామ్య విధానం ఉందా? - 4

(గత సంచిక తరువాయి...)

భారతదేశ పరిస్థితికి వస్తే వ్యవసాయరంగంలో సాధారణ లాభాలకు మించిన అదనపు లాభాలు ఏనాడూ రాలేదు. భూస్వామ్య విధానం నుండి పెట్టుబడిదారీ విధానానికి పరిణామం జరిగే దశలో ఏ దేశాలకైతే ప్రపంచ మార్కెట్‌పై ఆధిపత్యం ఉంటుందో ఆ దేశాలలోనే ఎగుమతి పరిశ్రమలకనువైన వ్యవసాయ ముడి సరుకు (ఉన్ని వంటివి)కు డిమాండ్ పెరిగి వాటిని ఉత్పత్తి చేసే వ్యవసాయ పెట్టుబడిదారులకు 'అదనపు లాభాలు' వచ్చేవని మార్క్స్ వివరించాడు.

భారతదేశానికి ఆనాడు గాని ఈనాడు గాని ప్రపంచ మార్కెట్‌పై ఆధిపత్యం లేనందున వ్యవసాయరంగంలో ఏ ఉత్పత్తులకూ అదనపు లాభాలు సాధ్యం కాలేదు. అంతేకాదు భారత వ్యవసాయరంగానికి అదనపు లాభాల మాట అటుంచి సాధారణ లాభాలు కూడా గగనమైన విషయమే. ఆధునిక పద్ధతులలో వ్యవసాయం చేస్తున్న ధనిక రైతులు కూడా ఈనాడు తమ పెట్టుబడులపై పారిశ్రామిక స్థాయిలో లాభాలు తీయలేక పోతున్నారు. దీనికి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరని నిరాకరించిన పారిశ్రామిక పెట్టుబడి ఆధిపత్యంలో ఉన్న ప్రభుత్వ విధానాలు ప్రధాన కారణం. భారతదేశంలో ఇప్పుడు వ్యవసాయరంగంలో 'అదనపు లాభాలు' సాధ్యం కావు. ఆ కారణంగా నేడు స్వతంత్ర సన్నకారు కౌలుదారులు ఆసామికి కౌలు చెల్లించినా, వ్యవసాయ పెట్టుబడి దారులు ఆసామికి కౌలు చెల్లించిన అది 'సాధారణ' లాభాలలో భాగమే గాని అదనపు లాభం ఎంతమాత్రమూ కాదు. నిజానికి వ్యవసాయరంగంలో లాభాలు ఇతర రంగాలలో లాభాల కంటే తక్కువగా ఉంటున్నాయి.

అదలా ఉండగా ఈనాడు ఐరోపాలో కూడా వ్యవసాయ రంగంలో అదనపు లాభాలు లేవు. కౌలు (అదనపు లాభం) చెల్లింపులూ లేవు. లెనిన్ 'సామ్రాజ్యవాదం'లో చెప్పినట్లు ఐరోపా వ్యవసాయంలో లాభాల రేట్లు తక్కువగా ఉండబట్టి ఐరోపా పెట్టుబడిదారులు పెట్టుబడిని అక్కడ వ్యవసాయంలో మదుపు పెట్టడం కంటే ఇతర దేశాలకు ఎగుమతి చేయడమే మెరుగని భావించారు. వ్యవసాయరంగంలో అదనపు లాభాల అవకాశం ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడా లేదు. చాలా దేశాలలో వ్యవసాయ రంగ లాభాలు సాధారణ లాభాల కంటె తక్కువగానే ఉంటున్నాయి. నిజానికి వ్యవసాయ కూలీ – పెట్టుబడి కౌలుదారుడూ – భూస్వామి అనే త్రికం ఇప్పుడు ఐరోపాలోనూ లేదు. అయితే భారత దేశంలో మధ్యతరగతి రైతులు కొందరు తమ భూమితోపాటు పెద్ద కమతాదారుల నుండి కొంత భూమిని కౌలుకు తీసుకుని కూలీలను కూడా పెట్టి వ్యవసాయం చేస్తున్నారు. అయితే వారు భూస్వామికి చెల్లించేది అదనపు లాభం కాదు. సాధారణ లాభాల కంటె తక్కువగా ఉన్న లాభాలలో వ్యవసాయ కూలీలకు కనీస వేతనం కూడా చెల్లించక పోవడం వలన వస్తున్న లాభాలనే రైతు, ఆసామి పంచుకుంటున్నారు. వీరు ఉత్పత్తి చేసేది సరుకే. ఉత్పత్తి అయ్యే అదనపు విలువ ఏ మేరకైతే ఆ మేరకు పెట్టుబడిగానే మారుతుంది. కౌలు అదనపు లాభంగా ఏ రూపంలోనూ లేదు. పాఠ్య పుస్తకాలలో వలె చెప్పుకుంటే ఐరోపాలో పెట్టుబడి కౌలుదారుడు (కాపిటలిస్ట్ టెనెంట్) కార్మికునికి వేతనం, భూస్వామికి కౌలు చెల్లించి తాను పెట్టుబడికి వడ్డీ, వ్యవస్థాపనకు లాభం తీసుకునేవాడు. తనకు వచ్చే లాభాన్ని, వడ్డీని పెట్టుబడి పెరుగుదలకు ఉపయోగించేవాడు. భూస్వామి తనకు వచ్చిన కౌలును (అదనపు లాభం) పెట్టుబడిగా మదుపు చేయకుండా విలాసాలకు ఖర్చు చేసేవాడు. అది పెట్టుబడిగా మారేది కాదు. ఐరోపాలో వ్యవసాయంలో అదనపు లాభాలు, కౌలు ఇప్పుడు లేవు. భూస్వాములూ ఇప్పుడు లేరు. భారతదేశం విషయానికి వస్తే ఇక్కడ అదనపు లాభం ఎప్పుడూ లేదు. నిజానికి వ్యవసాయరంగంలో జాతీయ సగటు కంటే తక్కువ లాభాలు వస్తున్నాయి. కౌలు, వడ్డీ, లాభం అన్నీ అందులో పంచుకోవలసిందే.

నిజానికి వ్యవసాయం శ్రమ ప్రాధాన్యతగల పరిశ్రమ. ఇందులో పెట్టుబడిని 'లో కాంపోజిషన్' పెట్టుబడి అంటారు. సరళంగా చెప్పాలంటే ఇతర మదుపుల కంటె వేతనాలబిల్లు ఎక్కువ. మరొక రకంగా చెప్పాలంటే వేతనాలు, ఇతర మదుపుల మొత్తాన్ని అంటే మొత్తం పెట్టుబడిని కార్మికుల సంఖ్యతో భాగిస్తే వచ్చే 'తల ఒక్కింటికి పెట్టుబడి' (కాపిటల్ పర్ వర్కర్) తక్కువ అంటే ఒక కార్మికుడు పనిచేయడానికి అవసరమైన పెట్టుబడి తక్కువ అని అర్థం. ప్రతి కార్మికుడు తక్కువ పెట్టుబడి వాడతాడు, ప్రతి కార్మికుడు అదనపు విలువను జోడిస్తాడు. ఫలితంగా ఇక్కడ లాభం రేటు ఎక్కువగా ఉంటుందనేది ఒక వాదన. అది వాస్తవం కూడా. అయితే ఈ లాభం అనేది ఉత్పత్తి అవుతున్నా అది రైతు వద్ద ఉండడం లేదు. అది మార్కెట్‌కు చేరుతుంది. ఈ రైతులు వ్యవసాయ ఉత్పత్తులను వాటి విలువ కంటె చాలా తక్కువ ధరకు మార్కెట్‌లో అమ్మవలసి వస్తుంది. వ్యవసాయరంగంలో వచ్చే లాభాలు రైతుల వద్ద నిలవడం లేదు. రైతులకు ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు అమ్మే, అలాగే రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసే వ్యాపారస్తులకు ఈ లాభాలు తరలిపోతున్నాయి.

మరొక విషయం కూడా ఈ సందర్భంగా పరిశీలించాలి. వ్యవసాయంలో తక్కువ కాపిటల్ ఎక్కువ మంది కార్మికులు ఉన్నందున లాభం రేటు ఎక్కువగా ఉంటుందన్న వాదన కూడా ఇప్పుడు సవరించవలసి ఉంది. వస్తు తయారీ రంగం వలె వ్యవసాయ రంగం యాంత్రికీకరణ జరగకపోవడం దృష్ట్యా ఈ సవరణ అవసరమవుతుంది.

మరొక విధంగా చెప్పాలంటే వ్యవసాయంలో 'సామాజికంగా అవసరమైన శ్రమ' కంటే ఎక్కువ శ్రమ వినిమయమవుతుంది. వస్తువుల విలువ సామాజికంగా అవసరమైన శ్రమ పైననే గణించవలసి ఉంటుంది. కాబట్టి వ్యవసాయరంగంలో అదనపు విలువ తక్కువగా ఉంటుంది. ఈ విషయాల వివరణ ఇక్కడ ప్రధానం కాదు. వ్యవసాయరంగంలో ప్రధానంగా వ్యవసాయాన్ని నిర్వహించే పేద, మధ్యతరగతి, చివరికి ధనిక రైతులకు చేరే లాభం తక్కువగా ఉంటుందని, అదనపు లాభాల మాట అటుంచి, సాధారణ లాభాలుకూడా రావడంలేదని ఇక్కడ ప్రతిపాదిస్తున్నాం.

ఈ అధ్యాయంలో ప్రధానంగా ముందుగా చెప్పినట్లు ఐరోపాలో ఒకనాడు భూస్వామ్య విధానంతో నేటి భారతదేశ పరిస్థితులను తులనాత్మకంగా పరిశీలించాం. ఈ అధ్యాయంపై ఆధారపడి ఐరోపాలో ఒకనాటి ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాలకు, నేటి భారత గ్రామాలలో ఉత్పత్తి సంబంధాలకు పోలిక లేదని, భారత గ్రామాలలో కౌలు దోపిడీ కూలీ దోపిడీ మారు రూపమేనని ప్రతిపాదించాం.

భారతదేశంలో వ్యవసాయం ఎందుకు వెనుకబడి ఉంది?

వ్యవసాయంలో ఉత్పత్తి అవుతున్న అదనపు విలువ (అగ్రేరియన్ సర్‌ప్లస్) ను కౌలుగా లేదా మార్కెట్ లాభాలుగా, పరిశ్రమలలో ప్రచ్ఛన్న లాభాలుగా సమీకరించి వాటిని పారిశ్రామిక, సేవారంగాలలో పెట్టుబడిగా పెట్టడం నిరంతరం మన కళ్లెదుట జరుగుతున్నదే. ధాన్యం మిల్లులు, నూనె మిల్లులు, పత్తి జిన్నులు వంటి వ్యవసాయాధార లఘు పరిశ్రమలు అలా వచ్చినవే. ఆంధ్రప్రదేశ్ విషయమే తీసుకుంటే హోటల్, సినీ పరిశ్రమలకు, రవాణా పరిశ్రమలకు వచ్చే పెట్టుబడి అంతా ప్రధానంగా వ్యవసాయపు మిగులే అన్న విషయం తెలిసిందే. ఇప్పుడు విద్యా, వైద్య రంగాలలో జరుగుతున్న వ్యాపారానికి అవసరమైన మూలధనం అక్కడి నుండి వచ్చిందే. గనులు తవ్వకం, సున్నం, సిమెంట్ పరిశ్రమలే గాక ప్రభుత్వ రంగ భారీ పరిశ్రమలకు అనుబంధంగా పెరిగిన మధ్యతరహా పరిశ్రమలకు అవసరమైన పెట్టుబడి ఎక్కువగా స్థానికంగా ఉత్పత్తయినదే. ఇక ప్రభుత్వరంగ భారీ పరిశ్రమలకు అవసరమైన బడ్జెటరీ పెట్టుబడులు (పబ్లిక్ ఫైనాన్స్) ప్రధానంగా వ్యవసాయపు మిగులే. ఇది ధనిక రైతులు బ్యాంకులలో దాచిన డబ్బు కాకపోవచ్చు. కాని మొదటి పంచవర్ష ప్రణాళిక నుంచి రైతులకు గిట్టుబాటు ధర రానీయకుండా, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు శ్రామిక రైతుల, వ్యవసాయ ఉత్పత్తి సాధనాల పునరుత్పత్తికి మాత్రమే సాధ్యమయ్యే స్థితిలో ఉంచి వ్యవసాయ మిగులు ఒకవైపు మార్కెట్‌కు, రెండవ వైపు రాజ్యానికి జమ పడేటట్టు చూస్తున్న ప్రభుత్వ విధానాల వల్లనే భారీ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలకు పెట్టుబడి సమకూరింది. అసలు కౌలు వసూలు చేసే ఆసాములు కూడా తమ దగ్గర జమ అయిన ఆ అదనపు విలువను, ఇతర రంగాలలో పెట్టుబడిగా పెడతారు గాని గిట్టుబాటు లేని వ్యవసాయంలో ఎందుకు పెడతారు?

గిట్టుబాటు లేని రంగంలోకి వెళ్లడం పెట్టుబడి లక్షణమే కాదు. భారత్ విషయం అలా ఉంచి, ఆదర్శవంతమైన ఉదాహరణ అయిన ఐరోపాలో కూడా అవసరమైనన్ని పెట్టుబడులు వ్యవసాయ రంగానికి మరలడం లేదని పెట్టుబడి ఫైనాన్స్ పెట్టుబడి అవతారమెత్తి అధిక లాభాల వేటలలో విదేశాలకు ఎగుమతి అవుతోందని సామ్రాజ్యవాదం – పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత దశ అన్న తన సిద్ధాంత గ్రంథంలో లెనిన్ రాశాడు. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం, కనీసం మూడు దశాబ్దాల పాటు సమాంతరంగా, విస్తృతంగా ఏర్పడిన సోషలిస్టు మార్కెట్ వలన సామ్రాజ్యవాద పెట్టుబడికి విదేశీయాన అవకాశాలు తగ్గి తమ తమ దేశాలలో వ్యవసాయ రంగానికి మళ్లిన విషయం అప్రస్తుతం. అవకాశం ఉన్నంత మేరకు పెట్టుబడి అధిక లాభాల వైపే వెళుతుందనేది ఇక్కడ గమనించవలసిన విషయం.

'పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రతి (సామ్రాజ్యవాద) దేశంలో తీవ్రంగా వెనుకబడి ఉన్న వ్యవసాయాన్ని అభివృద్ధి చేయగలిగితే... (ఆయా దేశాలలో) అదనపు పెట్టుబడి అనే సమస్య ఉండనే ఉండదు. కాని పెట్టుబడిదారీ వ్యవస్థ అలా చేయగలిగితే అది పెట్టుబడిదారీ విధానమే కాదు... వ్యవసాయం చాలా వెనుకబడి ఉన్నా, ప్రజలు తీవ్ర పేదరికంలో ఉన్నా పెట్టుబడికి (ఆయా దేశాల వ్యవసాయ రంగంలో) మదుపు పెట్టడానికి లాభదాయకమైన (అత్యధిక లాభాలు వచ్చే – అను) క్షేత్రం కనిపించలేదు.'

– వి.ఐ. లెనిన్, *'సామ్రాజ్యవాదం – పెట్టుబడిదారీ అత్యున్నత దశ', పెట్టుబడి ఎగుమతి విభాగం* IV

ఇక భారత ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తే వ్యవసాయంలో కౌలు రూపంలో తేలుతున్న మిగులు, అలాగే ధనిక రైతుల వద్ద పోగుపడుతున్న వ్యవసాయ కూలీలు ఉత్పత్తి చేసే అదనపు విలువ అది ఎంత మేరకైతే అంతమేరకు అన్నీ వ్యవసాయంలో పెట్టుబడులుగా మారే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ఇవ్వడాన్ని కౌలు వసూలు చేసుకుంటున్న 'భూస్వాములే' అడ్డుకుంటున్నారని చెప్పలేం. గిట్టుబాటు ధర సమస్య వ్యవసాయ, పారిశ్రామిక పెట్టుబడుల లాబీల బలాబలాలపై ఆధారపడి ఉంటుంది. అంతకంటె ప్రధానంగా రైతుకు వినియోగదారుడికి మధ్య ఉన్న టోకు వ్యాపారుల, చిల్లర వ్యాపారుల గొలుసు ధరను రెండు రెట్లు పెంచుతుంది. వినియోగదారుడు సరుకును అందులో ఉన్న విలువకే కొనుగోలు చేస్తున్నాడనుకుంటే రైతు తన ఉత్పత్తులను సగం విలువకే అమ్ముకుంటున్నాడన్నమాట. మరొక రకంగా చెప్పాలంటే వ్యవసాయ మిగులు వ్యాపార గొలుసుకు చేరుతుంది. అక్కడ అది పెట్టుబడిగానే మారుతుంది. ధనిక రైతులు, లేదా భూములు కౌలుకిచ్చే ఆసాములు కూడా కొందరు ఈ వ్యాపారంలో భాగస్వాములవుతారు. భూమిపై యాజమాన్యం కంటె వ్యాపారంలో భాగస్వామ్యం వలననే వారు ఉత్పాదిత అదనపు విలువను అధికంగా జేబులో వేసుకుంటున్నారు. ఇక్కడ ప్రధానంగా మనం గమనించవలసిందేమంటే వ్యవసాయపు 'అదనపు విలువ' పెట్టుబడిగా మారుతుందా లేదా అని మాత్రమే. ఆ పని ధనిక రైతు ద్వారా జరగవచ్చు, కౌలు యజమాని ద్వారా జరగవచ్చు. మిల్లర్ ద్వారా వ్యాపారి ద్వారా, చివరికి రాజ్యం ద్వారా జరగవచ్చు. వ్యవసాయం నుంచి వచ్చిన మిగులు పెట్టుబడిగా మారింది గాని అది హోటల్, సినిమా వంటి అనుత్పాదక రంగాలకే ప్రధానంగా మరలిందనే అభ్యంతరం కూడా ఉంది. అది చాలా విశాల పరిధి కలిగిన ప్రశ్న. అది మొత్తం పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి క్రమంపై ఆధారపడి ఉంటుంది. పెట్టుబడి ముందుగా వ్యవసాయం, వస్తూత్పత్తి రంగం, ఇంకా యంత్రాల ఉత్పత్తి మౌలిక సదుపాయాల రంగాలలో విస్తరించి తరువాతే వినోద సంబంధ సేవారంగాలకు విస్తరించడం మంచి పద్ధతి కావచ్చు. కాని మన దేశంలోనూ అలాగే అనేక దేశాలలోనూ ఈ పరిణామ క్రమాన్ని ఐరోపా సామ్రాజ్యవాదం అడ్డుకున్న విషయం

తెలిసిందే. ఐరోపా సామ్రాజ్యవాద ప్రయోజనాల ద్వారా పదనిర్దేశం చేయబడిన కారణంగా మన దేశంలో పెట్టుబడి అభివృద్ధి క్రమం అపభ్రంశం అయింది. అంతమాత్రాన 'వ్యవసాయపు మిగులు' పెట్టుబడి మారలేదనలేం. వ్యవసాయపు మిగులు వ్యవసాయంలోనే పెట్టుబడిగా మారడానికి మాత్రం అనుకూల పరిస్థితులు లేవు. పాలకవర్గాలలో పారిశ్రామిక, వ్యాపార విభాగాల ఆధిపత్యమే దీనికి ప్రధాన కారణం. వ్యవసాయం ఆధునికీకరణ జరగకపోవడానికి ప్రధానం కారణం ఇదే. గిట్టుబాటు ధరల పోరాటమే దీనికి పరిష్కారం కావచ్చు.

భారత గ్రామాలలో భూస్వామ్య విధానం ఉందా?

ఇది చాలా విశాలమైన ప్రశ్న. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో ఈ ప్రశ్నను పరిశీలించవలసి ఉంటుంది. అయితే ఈ వ్యాసం – ముందుగా చెప్పుకున్నట్లు – ఆర్థిక రంగానికి మాత్రమే పరిమితం అయింది. గ్రామాలలో వ్యవసాయ కూలీలున్నారు. గ్రామ జనాభాలో వీరి శాతం క్రమక్రమంగా పెరుగుతుంది. వ్యవసాయ కూలీల శాతం పెరుగుతూ ఉండడం పెట్టుబడిదారీ వ్యవస్థనే సూచిస్తుంది. సన్నకారు, పేదరైతులు ఉన్నారు. వీరు అర్ధ శ్రామికులు. వీరే అధికాధికంగా ప్రతి సంవత్సరం దివాళా తీస్తూ కార్మిక శ్రేణులలో కలిసి పోతున్నారు. రైతు దివాళా స్పష్టంగా పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణం. తమ భూమితో పాటు ఇతరుల భూములను కౌలుకు చేసే పేద, మధ్యతరగతి రైతులున్నారు. వీరు కౌలుకు ఆసాముల భూమి చేస్తున్నా వీరు స్వతంత్రులు. వీరిని భూస్వామ్య వ్యవస్థలో అస్వతంత్ర రైతులతో పోల్చలేమని ముందు విభాగాలలో గమనించాం. గ్రామాలలో ధనిక రైతులున్నారు. వీరు కూలీ దోపిడీ ద్వారా వ్యవసాయం చేస్తారు. వ్యవసాయాన్ని ఆధునీకరించడానికి ప్రయత్నిస్తారు. వీరు స్పష్టంగా చిన్న బూర్జువాలే. గ్రామాలలో పెద్ద భూ కమతాలు కలిగిన ఆసాములున్నారు. (25 ఎకరాల కంటే ఎక్కువగా భూమి ఉన్న వీరి సరాసరి కమతాలు ఆంధ్రప్రదేశ్‌లో 40 ఎకరాలు. వీరు గ్రామాలలో సరాసరి ఇద్దరు చొప్పున ఉన్నారు. రాష్ట్రంలో వీరి సంఖ్య మొత్తం 56 వేలు – పట్టిక 1). వీరు ఆధునిక పద్ధతులలో వ్యవసాయమన్నా చేస్తున్నారు, లేదా పట్టణాలలో ఇతర వ్యాపారాలు చేస్తూ గ్రామాలలో భూమిని కౌలుకన్నా ఇస్తున్నారు. కౌలు ద్వారా ఉత్పత్తి అయ్యే అదనపు విలువను పట్టణ వ్యాపారాలలో పెట్టుబడిగా పెడుతున్నారు. అయితే భూమి కౌలుకివ్వడం అనేది భూ ఆస్తి 25 ఎకరాలు దాటిన వారి వ్యవహారం మాత్రమే కాదు. పట్టణాలలో ఉద్యోగాలు, వ్యాపారాలు, పరిశ్రమలు ఉన్న అనేక మంది తమ భూమిని గ్రామాలలో ఇతరులకు కౌలుకిచ్చి మొత్తం అదనపు విలువనుగాని, వీలుకాకపోతే అందులో అధిక భాగం గాని కౌలుగా వసూలు చేసుకుంటున్నారు. అయితే సుమారు ప్రతి సందర్భంలో ఈ కౌలు పెట్టుబడిగానే మారుతుంది. గ్రామాలలో వృత్తి పనివారున్నారు. చాకలి, మంగలి వంటి సేవక వృత్తులు తప్ప మిగతావారందరూ స్వయం ఉపాధి కార్మికులే. చాకలి, మంగలిపై కూడా వృత్తి నిర్బంధం లేదు. మెరుగైన వృత్తులు అందుబాటులో లేక వీరు ఆ వృత్తులలో కొనసాగుతున్నారు. ఈ విధంగా గ్రామాలలో ఏ వర్గ ప్రజలను మనం భూస్వామ్య వ్యవస్థలో వర్గాలుగా గుర్తించలేం. ప్రతి వర్గం కూడా వెనుకబడిన పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉండే వర్గంగానే ఉంది. ఉత్పత్తి సంబంధాలు ఏవి కూడా భూస్వామ్య దోపిడీని సూచించడం లేదు.

సరుకు ఉత్పత్తి : భూస్వామ్య విధానంలో కూడా వ్యాపార వాణిజ్యాలుంటాయి. అయితే అవి ప్రధానంగా విలాస వస్తువులకు దూరవాణిజ్యానికి మాత్రమే పరిమితమై ఉంటాయి. విస్తృత ప్రజానీకం వాడే వస్తువులలో వాణిజ్యం పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణమే. ఈ వ్యవస్థలో ఆహారపంటలు కూడా 'సరుకులు' అయిపోతాయి. అయితే భారత దేశంలో అత్యధిక ప్రజానీకం గ్రామాలలో ఉండడం వలన గింజ ధాన్యాల (ధాన్యం, గోధుమలు, జొన్నలు...) వాడకం ఎక్కువగా ఉంది. ఆ మేరకు సన్నకారు, పేద, మధ్యతరగతి రైతులు వాడకానికి అధికంగా, అమ్మకానికి తక్కువగా గింజ ధాన్యాలను ఉత్పత్తి చేస్తున్నారు. పెద్ద కమతాలున్న భూ యజమానులంతా గింజ ధాన్యాలతో సహా అన్ని పంటలు మార్కెట్‌లో అమ్మకం కొరకు మాత్రమే పండిస్తున్నారు. అంటే 'సరుకులు' ఉత్పత్తి చేస్తున్నారు. మధ్యతరగతి రైతులు కూడా గింజ ధాన్యాలు కాని ఇతర పంటలను మార్కెట్ కొరకే పండిస్తున్నారు. చివరికి సన్నకారు, పేదరైతులు కూడా, కొన్ని సందర్భాలలో, గింజ ధాన్యాల సాగు మానేసి, వ్యాపార పంటలు పండిస్తూ మార్కెట్‌లో అమ్ముతూ గింజ ధాన్యాలతో సహా తమకవసరమైన వ్యవసాయ, ఇతర ఉత్పత్తులను మార్కెట్‌లో కొనుక్కుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అయితే పత్తి, పొగాకు, మిర్చి, పప్పు ధాన్యాలు, నూనె గింజలు, పళ్లు, కూరగాయలు, పూలు, కలప, పాలు, చేపలు, రొయ్యలు, కోడిమాంసం ఈ విధంగా మార్కెట్ చేయబడే ఉత్పత్తులే అత్యధికంగా ఉన్నాయి. ఈ విధంగా విస్తృతంగా సాగుతున్న సరుకుల ఉత్పత్తి పెట్టుబడిదారీ విధానాన్నే సూచిస్తుంది. అంతేకాదు భూమి ఒక ఫ్యూడల్ ఆధిపత్య వ్యక్తీకరణగా, అంటే జమీందారీగా కాకుండా వ్యక్తిగత కమతాలుగా, వ్యక్తిగత ఆస్తిగా, అమ్మకపు సరుకుగా మారిపోయింది. అంటే పంటకాదు భూమి కూడా సరుకు అయిపోయింది. అలాగే మన గ్రామాలు ఇంకెంత మాత్రమూ స్వయం పోషక యూనిట్లు కావు. ఎరువులు, పురుగు మందులు విత్తనాలు మార్కెట్‌లో కొనవలసి వస్తోంది. పంటలు మార్కెట్‌లో అమ్మవలసి వస్తోంది. ధనిక స్వాములే కాకుండా పేద, మధ్యతరగతి రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తికారులు తమ గృహావసరాలకు మార్కెట్‌పై ఆధారపడవలసి వస్తోంది. మన మార్కెట్‌లు ఇంకెంత మాత్రమూ వారాంతపు సంతలు కావు. అవి ఇప్పుడు జాతీయ మార్కెట్‌లో భాగమైన పట్టణ మార్కెట్‌లు. అసలు వ్యవసాయ మార్కెట్ కూడా ఇప్పుడు గ్లోబల్‌గా మారిపోతోంది. గ్రామాలను విముక్తి చేసి పట్టణాలను పట్టుకోవడం ఇంకెంత మాత్రమూ సాధ్యంకాదు. గ్రామాలు తమ కాళ్లమీద తాము నిలబడే స్థితి పూర్తిగా పోయింది. అవి ఇప్పుడు పట్టణాలకు తోకలుగా మారిపోయాయి.

మనం ఇప్పుడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిశీలిస్తే సరుకుగా మారిపోయిన కార్మిక శ్రమ, స్వయం ఉపాధి రైతులు, వృత్తికారులు, దాస్య స్థితిలో కాక స్వేచ్ఛా స్థితిలో ఉన్న కౌలుదారులు కనిపిస్తారు. కాని అస్వతంత్రులైన రైతులు కనిపించరు, ఫ్యూడల్ దాస్య ఆర్థిక సంబంధాలు కనిపించవు. గ్రామీణ వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తులు సరుకులైపోయాయి. భూమి సరుకుగా మారిపోయింది. గ్రామాల స్వయం పోషక వ్యవస్థ విచ్ఛిన్నమైపోయింది. గ్రామాలు, పట్టణ మార్కెట్‌కు లోబరచబడ్డాయి. గ్రామాలలో మనం సాంస్కృతిక రంగంలో ఫ్యూడలిజం వెదకవలసిందే గాని ఆర్థిక రంగంలో ఎల్లెడల కనిపించేది వివిధ రూపాలలో పెట్టుబడిదారీ దోపిడీయే.

(ఇంకా ఉంది)

(రచయిత విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు) వీ

మల్కన్‌గిరి ప్రాంత ఆదివాసుల రాజకీయార్థిక జీవన స్థితిగతులు, వారిపై కొనసాగుతున్న దోపిడీ, అణచివేతలను వివరిస్తూ, వారి అభివృద్ధికి ఏం చేయాలో వివరిస్తున్నారు **శ్రీరాముల శ్రీనివాస్**

మల్కన్‌గిరిలో ఏం జరుగుతోంది? - 3

(..గత సంచిక తరువాయి)

అంతా కలిపి సంవత్సరంలో ఆరు నెలలు మాత్రమే రెండు పూటలు తింటున్నారు. మరో ఆరు నెలలు ఒక పూట వెదురు కొమ్ములు, కందగడ్డలు, పనస పండ్లు, అంబలితో సరిపెట్టుకోవాల్సిందే. నేను చూసిన మేరకు కొండరెడ్లు, పోర్జాలు, బొండాలు, రాణాలు, కొందరు కోయ ఆదివాసులు పనుల కోసం వలస వెళ్లారు. ఉంటే తింటారు, లేకుంటే ఉపవాసం ఉంటారు.

అటవీ ప్రాంతాలు : వ్యవసాయంలో నాగలిని ఉపయోగించడం, ఎరువులను వాడడం వంటి పద్ధతులు ఉన్నప్పటికీ చాలా తక్కువ. దున్నిన తరువాత విత్తనాలు చల్లుతారు. కలుపుతీయడం ఉండదు. పశువులు, మేకలు, కోళ్లు ఉంటాయి. పాలు పిండడం వల్ల దూడకు సరిపోక దాని పాపం వారికి తగులుతుందని వారి విశ్వాసం. కొన్ని తెగలు పశువులు, పందుల మాంసం తింటే మరికొన్ని తెగలు తినవు. వీరు కూడా ఒక్కపంటనే పండిస్తారు. మరో పంట కూరగాయలు, నువ్వులు, మొక్కజొన్న పండిస్తారు. అంతా కలగల్సి కుటుంబాన్ని గెంటుకెళ్లడం బహుకష్టం. కొద్దిమందికి సంవత్సరంకు సరిపడ ధాన్యం రాగా, మరికొద్దిమంది అదనపు ధాన్యం అమ్ము కుంటున్నా 90 శాతం మంది అదనంగా కూలీ చేసుకోవడం లేదా ముంబై, సూరత్, బెంగళూర్, హైదరాబాద్, చెన్నైలకు వలస వెళ్లుతుంటారు. ఎంత కష్టపడినా వీరంతా నిత్యం దరిద్రులే. చదువు సంధ్యలు అంతంత మాత్రమే. అనాదిగా జీవనాధారమైన భూమిని ఇటు సర్కారు అటు ఆదివాసేతరులు కొల్లగొట్టడం, కౌలు రూపంలో కాజేయడం జరుగుతోంది.

అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు : ఇరవై శాతంకు తక్కువగానే కెనాల్స్ కింద సేద్యం చేయడం జరుగుతోంది. సుర్లుకొండ డ్యాం నుండి విడుదలయ్యే నీటిలో కొంతభాగం కుడి, ఎడమ కాల్వల ద్వారా ఒక పంట ధాన్యం, మరొక పంట వేరుశనగ, కూరగాయలు పండిస్తారు. ఈ మధ్యకాలంలో కొందరు చేపల వ్యవసాయం చేస్తున్నారు. ట్రాక్టర్లు ఉన్నా వ్యవసాయం సాగు కోసం కాకుండా అనుబంధ పనులతో పాటు ఇతర పనులకు అక్కడ వినియోగించడం జరుగుతోంది. కొద్దిమంది వ్యవసాయంతో పాటు వ్యాపారాలు, ఉపాధి అవకాశాలను చేపట్టిందంతా స్థానికేతరులే. 1980 తరువాత కలకత్తా నుండి వచ్చిన బెంగాలీలు ముందు వచ్చిన రిఫ్యూజ్డ్ బెంగాలీలు, ఆదివాసుల భూములు కొనుగోలు చేయడం, గుంజు కోవడం, మభ్యపెట్టడం ద్వారా ఎక్కువ శాతం కాజేశారు. వీరు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే గాక 1964-72లలో వచ్చిన 80 శాతం మంది భూముల అమ్ముకొని లేదా వివిధ రూపాలలో కోల్పోయి, కుటుంబాల సంఖ్య పెరిగి చాలీచాలని పరిస్థితులలో అత్యంత దుర్భరతను ఎదుర్కొంటున్నారు. కలకత్తా నుండి వచ్చిన రిఫ్యూజ్డ్ బెంగాలీలు, కోయ ఇతర ఆదివాసీలపై ఆర్థిక, రాజకీయ, సామాజిక ఆధిపత్యానికి, దోపిడీ, పీడనలకు గురిచేస్తున్నారు. గ్రామాలలో అనేక సమస్యలను, అశాంతిని సృష్టిస్తున్నారు. 120 నుండి 140 వరకు ఉన్న ఉపాధ్యాయులు, 30 నుండి 40 మంది పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న వారిలో 90 శాతం కలకత్తా నుండి వచ్చిన వారే. రిఫ్యూజ్డ్ బెంగాలీలు వ్యవసాయం, కూలీలు, మేస్త్రీలు, డ్రైవర్లుగా అసంఘటిత రంగాలలో పనిచేస్తూ 90 శాతం యువకులు హైదరాబాద్, బెంగళూర్, చెన్నై, రాజమండ్రి తదితర ప్రాంతాలకు వలస వెళ్తుంటారు.

భూ సమస్య : ప్రభుత్వం అభివృద్ధి పేర చేపడుతున్న కార్యక్రమాల మూలంగా నిర్వాసితులవుతున్నది స్థానిక ఆదివాసులే. బలిమెల డ్యాం ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల నిర్వాసితులైన ఆదివాసులకు ఇప్పటి వరకు లభించింది ఏమీలేదు. హిరాకుడ్, మాచ్‌కుండ్ ప్రాజెక్టుల నిర్మాణం వల్ల వచ్చిన అదనపు జనాభా, బెంగాలీలకు ప్రభుత్వం భూముల పంపిణీ చేయడం మూలంగా స్థానిక ఆదివాసుల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారయింది. ప్రభుత్వ లేదా అటవీ భూముల పేర అధికారుల వేధింపులు భరించలేక భూములు విడిచిపెట్టిన వారి సంఖ్య పెద్ద మొత్తం లోనే ఉంటుంది. ఆదివాసేతరులు, ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చిన వారు ఆదివాసుల భూముల కొనుగోలు చేయరాదు అని చట్టం చెబుతున్నప్పటికీ నామ మాత్రపు ధరలో కొనుగోలు చేయడం ఆక్రమించు కోవడం వంటి సమస్యలు సమాజంలోని సంక్లిష్టతలను, వైషమ్యాలను తెలియజేస్తున్నాయి. మథిలీ, పంగం, గోవిందపల్లి ఏరియాల నుండి పోలీసులు భూస్వాములు, రాజకీయ నాయకులు, వ్యాపారస్తులతో కలగలిసి వీరి దోపిడీని కప్పబెడుతూ ఆదివాసులు భయపడేలా అక్రమంగా అరెస్టులు చేస్తున్నారు. ఆదివాసీ సంఘం పేర పిల్లల నుండి వృద్ధుల వరకు 60-70 మందిని అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపారు. పోలీసులు ఒక్కొక్కరిపై 10, 12 కేసులు పెట్టగా హైకోర్టులో బెయిల్స్ వేలాది రూపాయలు ఖర్చు చేసి విడుదల కావడం జరుగుతుంది. కొంత మంది భూస్వాములైన తీరు ఎన్నో ఆశ్చర్యకరమైన వాస్తవాలు కనిపిస్తున్నాయి.

మథిలీ పక్క గ్రామమైన అటల్‌గూడాలో రమణమూర్తి ఆంధ్రప్రదేశ్ నుండి వలసవచ్చి నేడు 120 ఎకరాలకు పైగా భూమికి యజమాని. రైస్ మిల్, ట్రాక్టర్, వ్యాన్‌లు రెండు కలిగి ఉన్నాడు. మథిలీ బ్లాక్ చైర్మన్‌గా కాంగ్రెస్‌లో ఉంటూ ఎన్నుకోబడగా జిల్లా పరిషత్ మెంబర్‌గా బిజెపి నుండి ఎన్నికయ్యాడు. పంగం పక్కనే ఉన్న కావుడిగూడ గ్రామాలలో బొలీజెనా అనే ఆదివాసేతర భూస్వామికి దాదాపు 70 ఎకరాలకు పైగానే ఉంటుంది. 15 ఎకరాల వరకు ఒక ఆదివాసీ అతని భూమిని తనఖా పెట్టుకొని కాజేశాడు. ఆదివాసీ భూమిని ఆదివాసీకే ఇవ్వాలని సంఘం ఆందోళన చేపట్టింది. దీంతో ఆ భూమిని ప్రభుత్వం సీజ్ చేసుకోవడంతో గత కొంతకాలంగా పడావు పెట్టబడింది. మథిలీలో లక్ష్మన్ నుండి (గౌడ్) కాము సుండి అనే తెలుసు వారు మిల్లుగూడ గ్రామంలో 140 ఎకరాల భూమిని కలిగి ఉన్నారు. వీరికి సారాయి, వడ్డీ వ్యాపారాలు ఉన్నాయి. మోహన్ రావు అనే ఫెర్తో కొరకు కుమారగూడ అనే గ్రామంలో వంద ఎకరాలు ఉంటుంది. ఇతను పోలీస్ స్టేషన్ లింక్‌లో ఉంటూ ప్రజల అవసరాలకు పిటిషన్స్ వేస్తుంటాడు. ఒక్కొక్క పిటిషన్ రాసినందుకు 150, 200, 500 రూపాయల వరకు తీసుకుంటాడు. ప్రభుత్వ యంత్రాంగం కూడా ఇతని దగ్గరకు పంపిస్తుంది. బాబూరావు అనే భూస్వామికి గోడియాలి – గోవింద్‌పల్లి చౌక్, మథిలిలలో 80 ఎకరాలకు పైగా భూమి కలిగి ఉన్నాడు. గోడియాలిలో 15 ఎకరాల భూమిని 15 రూపాయలకు కుదువ పెట్టుకొని ఆదివాసులకు తెలియకుండా తహసిల్దార్, ఆర్.ఐ.ల సహకారంతో ఆ భూమిని తన పేర చేయించుకున్నాడు. ఆదివాసీ పక్షం ఆదివాసీ సంఘం నిలబడడంతో భూమి అతనిని, ఆదివాసీ సంఘం కార్యకర్తల అరెస్టు చేయించాడు. ఇతనికి రైస్ మిల్ కూడా ఉంది. సుగ్రిగూడాకు చెందిన గౌరిసుగ్రీ రాణా తెగకు చెందిన ఆదివాసీ అయినా పెత్తందారు. బిజెపి లీడర్ 150 ఎకరాల భూస్వామి. కుటుంబంలో ఇద్దరు పోలీసు డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. ఈ విధంగా కూడా ప్రజలను భయపెట్టిస్తుంటాడు. ఒనకడిల్లీ గ్రామం నుండి ముండాగూడ గ్రామం వలస వచ్చిన సునాధర్ గౌడ్ 120 ఎకరాలు, లక్ష్మన్ గౌడ్ 65 ఎకరాలు ఆదివాసుల నుండి ఆక్రమించుకొన్నారు. ఊదివాడ సర్పంచ్ పూజారిగూడ గ్రామవాసి పరుశురామ్ మాజీ, బిజెపి పార్టీ 80 ఎకరాలను ఆదివాసుల నుండి ఆక్రమించుకున్నదే. హరిబంధు నాయక్ 100 ఎకరాలు కాజేశాడు. ఇవన్నీ మథిలీ చుట్టుపక్కల గ్రామాలకు సంబంధించింది. అయితే ఇప్పుడు ఒక్క గోవిందపల్లి గ్రామాన్ని పరిశీలిద్దాం.

గోవిందపల్లిలో ప్రఫుల్ రథో 200 ఎకరాలు, కిశోర్ రథో 150 ఎకరాలు, మాజీగౌరి 250 ఎకరాలు, 10 ట్రాక్టర్లు, దుకాణం, రెండు రైస్ మిల్లులు ఉన్నాయి. ఇతని భూమిలో 8 గ్రామాల ప్రజలు నిత్యం పనిచేస్తూంటారు. లక్ష్మి కోమటి 120 ఎకరాలు, రైస్ మిల్లు, రెండు వ్యాన్లు, ట్రాక్టర్, ఇతర వాహనాలు ఉన్నాయి. మాజీగౌరి (దుకాణం పేరు) యజమాని పోలీస్ కానిస్టేబుల్. ప్రైవేట్ బస్సులు నడిపిస్తాడు. గాంజా వ్యాపారం చేస్తాడు. గాంజా వ్యాపారస్తులతో సంబంధాలు పెట్టుకొని కమిషన్లు పొందుతుంటాడు. ఇతను తన మిల్ కోసం ఇద్దరు ఆదివాసీ యువతులను బలి ఇచ్చాడు. మరో ఇద్దరు యువతులతో బలవంతంగా లైంగిక సంపర్కం పెట్టుకొని గర్భవతులవ్వడం తెలిశాక అడవిలో హత్య చేయించి అమాయకుడిని ఈ కేసులో ఇరికించాడు.

బయటి ప్రాంతాల నుండి ఉపాధి కోసం వచ్చిన వారే నేడు ఆదివాసులకు భూములు లేకుండా చేశారు. ఆర్థికంగా, రాజకీయంగా స్థిరపడి ఆదివాసులను దోపిడీ, పీడన, అణచివేతలకు గురిచేస్తున్నారు. ఇందుకు అన్నిరకాల ప్రభుత్వ శాఖలు భూస్వాములకు సహకరిస్తున్నాయి. ఇద్దరు ఆదివాసీ యువతులను బలితీసుకోవడం, మరో ఇద్దరిని గర్భవతులను చేసి హత్య చేయడం విషయంలో పోలీసులు ప్రజలను తప్పుతోవ పట్టించే కుతంత్రాలకు పాల్పడినా అసలైన దోషి భూస్వామిని రక్షించినట్లుగా ప్రజలు విశ్వసిస్తున్నారు. సుగ్రిగూడ గౌరుచంద్ర సుగ్రీ, పంగం బాబ్లాసాలు ఆదివాసీల పేర పట్టా చేయించి సేద్యం చేసుకుంటుంటే ఆదివాసులు ఆందోళన చేపట్టగా ప్రభుత్వం ఆ భూములను సీజ్ చేసుకున్నా వారిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఆదివాసులకు సేద్యం చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం లేదు. సారంగపల్లిలో లలిత నుండి ప్రభుత్వ పథకం కింద గ్రూప్‌గా ట్రాక్టర్ తీసుకున్నా ఆదివాసులకు ఎలాంటి ప్రతిఫలం అందడం లేదు. ఆదివాసుల కోసం అని ప్రభుత్వాలు ఎన్నో చట్టాలను తీసుకువచ్చిన అవన్నీ ఆదివాసీ, ఆదివాసేతర భూస్వాములకే చుట్టాలుగా మారాయని నిరూపితమవుతున్నాయి. నేడు 50 శాతంకు పైగా ఆదివాసులు తమ భూములను కోల్పోగా మిగిలిన వారు ఒకటి రెండు నుండి ఐదు ఎకరాల లోపు భూమిని కిలిగి ఉన్నారు. వ్యవసాయం చేయడానికి వనరులు, పెట్టుబడి లేకపోవడం, సేద్యం చేసే పద్ధతులు అభివృద్ధి చెందకపోవడంతో నామ మాత్రపు దిగుబడి వస్తుంది. మానవ మనుగడకు అత్యంత ఆవశ్యకమైన ఈ సమస్యలపై ఏ మాత్రం పట్టింపులేని వినీల్ క్రిష్ణ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ఎవరికి లబ్ధి చేకూరుస్తున్నాయి అనేది బలమైన ప్రశ్న. ఆదివాసుల రక్తాన్ని పీల్చిపిప్పిగా మారుస్తున్న వారితో అధికారులు కుమ్మక్కయ్యిన దుస్థితిని పట్టించుకోని కలెక్టర్ ఆధివాసుల కోసం పనిచేసినాడు అని చెప్పడం ఎలా సాధ్యమవుతుంది. అమాయకులైన ఆదివాసీ యువతీ, యువకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి తప్పుడు కేసులతో బంధించడమే గాక విడుదల కాకుండా ప్రతి మూడు నాలుగు నెలలకు ఒకసారి ఒక్కొక్కటి చొప్పున ఆరోపిస్తుంటే, కేసుల విచారణ ముగిసి నిర్దోషిగా విడుదలయ్యి జైలు ద్వారం దాటగానే మరల అరెస్టు చేసి తప్పుడు కేసులు పెడుతుంటే చోద్యం చేస్తూ రోమ్ నగరం తగుల బడుతుంటే ఫిడేలే వాయించిన చందంగా వ్యవహరించిన పెద్ద మనిషి ఆదివాసుల అభివృద్ధికి పాల్పడినట్టా? పోలీసుల నిరంకుశ పోకడలను నిలిలివేసి రాజ్యాంగపరంగా పౌరులకు సంక్రమించిన హక్కులను రక్షించని పిటిషన్లపై పిటిషన్లు రాయడమే గాక ఎనిమిది సార్లకు పైగా ఆమరణ నిరాహార దీక్షలు చేసినా పట్టించుకోని మల్కన్‌గిరి జిల్లా ప్రథమ పౌరుడు జిల్లా మెజిస్ట్రేట్ అధికారాలను కలిగి ఉండి కూడా ఏమీ చేయలేదు. మల్కన్‌గిరి జైలుకు వచ్చినప్పుడు కోర్టు, పోలీసు వ్యవహారాలను విడిచి జైలు సమస్యలు చెప్పమనడం విజ్ఞులకు తగుతుంది? చట్టం, రాజ్యాంగ పరిధిలో జిల్లా ప్రజల హక్కులను రక్షించడం మీ బాధ్యతగా అడగగా జిల్లా జడ్జీ, పోలీసు సూపరింటెండెంట్‌ను అడగమని చెప్పడం బాధ్యతారాహిత్యం కాదా అనేదానికి బాధ్యతగల పౌరుడైతే తప్పక సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఆదివాసుల జీవనాధారమైన భూమిని, వనరులను గద్దల్లా తన్నుకపోతుంటే మౌనం వహిస్తూ జన సంపర్క

శిబిరాల పేర పోలీసుల రక్షణ లేకుండా వెళ్లడమే ఆదివాసుల అభివృద్ధి చేపడుతున్నాడనే దానికి సాధికారతనా? గత ఆరు దశాబ్దాలుగా మరి ముఖ్యంగా ఒకటిన్నర దశాబ్దాలుగా ఆదివాసుల పేరుతో ఖర్చు చేస్తున్నట్టుగా పెద్ద మొత్తంలో ప్రచారం జరుగుతున్నప్పటికీ ఆదివాసులు అభివృద్ధికి ఆకాశమంత దూరంలో ఎందుకున్నారన్నది మౌలిక ప్రశ్న. స్థానికేతరులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా శాసిస్తుంటే, ఆదివాసుల పేరుతో ఆదివాసేతరులే డీలర్‌షిప్‌లు, కాంట్రాక్టులు, ప్రభుత్వ ఉద్యోగాలు, భూముల ఆక్రమణలు విపరీతంగా జరుగుతున్నా ఎందుకు పట్టించులేదు. ఎన్.ఆర్.జి.ఇ.ఎ. పథకంలో అవకతవకలు అవినీతిలపై ఒకవైపు సుప్రీంకోర్టు ఒరిస్సా రాజ్యాన్ని పదే పదే చివాట్లు పెడుతుంటే మరొకవైపు సిపిఐ (మావోయిస్టు) పార్టీ ఆధునిక యంత్రాలను ఉపయోగించకుండా ప్రజలు భాగస్వామ్యంతో చేపట్టాలని ప్రచారం చేసినా కాంట్రాక్టర్లు పెడచెవిన పెడుతుంటే ఆధునిక యంత్రాలను తగులబెట్టినా కలెక్టర్ నిద్దుర నుండి మెలుకువరాని పరిస్థితుల్లో ఎందుకున్నట్టు? పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా చీకటి వ్యాపారాలు చేస్తున్న బడా వ్యక్తులను వదలి కూలి చేసుకొని కడుపు నింపుకొనే వారిపై కొరడా దుల్పడం దేనికి? వంటి అనేక ప్రశ్నలకు కలెక్టర్ నుండి సమాధానాలు దొరకవు. అయినా ఆదివాసుల బాంధవుడిగా చెప్పడం లేదా చెప్పుకోవడం ప్రభుత్వ ప్రాయోజితం, దోపిడీ వర్గాల అవసరం. పిల్లల నుండి మతపెద్దల వరకు గ్రామరక్షణ సభ్యుల నుండి హోంగార్డు, ఎస్.పి.ఒ.ల కుటుంబాల భాగం చేస్తూ మీడియా విచిత్ర చిత్రీకరణలతో కలెక్టర్‌ను ఆకాశానికి ఎత్తారు. ఇవేవీ రాబోవు పరిస్థితిని చక్కబెట్టలేవని, ఆదివాసుల సమస్యలకు ప్రత్యామ్నాయం గాని సమాధానంగాని కాదని తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది. భూ సమస్య సంక్లిష్టంగా వైశమ్యంగా రూపుదిద్దు కుంటుంది. ఇందులో ఉన్న సంక్లిష్టతలను పరిష్కరిస్తూ ఆదివాసుల భూములు ఆదివాసులకు చెందకుండా పరిష్కారం కాదు. వ్యవసాయం, సాగుకు ఎత్తిపోతల పథకాలు, చెక్‌డ్యాంల నిర్మాణాలు, పెద్ద, మధ్యతరహా చెరువుల నిర్మాణాలు, చిన్న చిన్న డ్యాంల నిర్మాణం చేపట్టడం ద్వారా మూడు పంటలు పండించే అవకాశాలు ఎంతగానో ఉన్నాయి. వ్యవసాయ, అటవీ ఉత్పత్తుల అనుబంధ పరిశ్రమలు, నిత్యావసరాల ఉత్పాదనకు చిన్న, మధ్యతరహా పరిశ్రమల నిర్మాణాల ద్వారా ఆదివాసుల ఆర్థిక వికాసానికి పర్యవసానంగా విద్యా, వైద్యం, ఉద్యోగం, ఉపాధి వంటి అనేక సమస్యలకు పరిష్కారానికి ఒక నమూన. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు రోగమొక్కటి అయితే వైద్యం మరొకటి చేసినట్టుగా 'అభివృద్ధి పేరుతో ఆదివాసుల జంగల్, జమీన్, జల్‌లకు దూరం చేయడం' ఆదివాసీ యువతీ, యువకులను హోంగార్డ్స్‌గా, ప్రత్యేక పోలీసు అధికారులుగా, గ్రామ రక్షకులుగా ఏర్పాటు చేసి ఆధివాసులపై యుద్ధాన్ని ప్రకటిస్తున్నాయి. దీనికే 'హరితవేట' అని నామకరణం చేయడం జరిగింది. 1947 తరువాత ఏ చట్టాల ద్వారా ఫారెస్టు, పోలీసు డిపార్ట్‌మెంట్‌లు ఆదివాసులను యాతనలకు గురిచేస్తూ వచ్చాయో అంతకంటే క్రూరమైన చట్టాల ద్వారా ఆదివాసులను అణచిపెట్టడానికి ఆదివాసీ యువతీ, యువకులను ప్రోత్సహిస్తున్నారు తప్పా ఆదివాసీ అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు అనేది వాస్తవం. ఆదివాసీ యువతీ యువకులను అక్రమంగా అరెస్టు చేసి తప్పుడు కేసులు ఆరోపించడం, మాయం చేయడం, యువతులపై అత్యాచారాలకు పాల్పడడం, పట్టుకొని కాల్చి చంపడం, ఆస్తులు ధ్వంసం చేయడం, ఇండ్లు తగుల బెట్టడం, పంటలను నాశనం చేయడం, కోళ్లు, మేకలు, బంగారం, డబ్బులు ఎత్తుకపోవడం వంటి అమానుశ ఆకృత్యాలకు, దోపిడీలకు పోలీసులు పాల్పడుతున్నారు. ప్రజా సంఘాలు, పార్టీలపై నిషేధాలు విధించడం ద్వారా రజాకీయ స్వేచ్ఛ, స్వతంత్ర్యాలను హరించబడి ఆదివాసుల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ అభివృద్ధికి వేల కిలోమీటర్ల దూరం విసరబడుతున్నారు.

నిరుద్యోగం : మల్కన్‌గిరి జిల్లాలో ఆదివాసీ, ఆదివాసేతర యువతీ, యువకులు నిరక్షరాస్యులుగా, నిరుద్యోగులుగా పెద్ద సంఖ్యంలోనే ఉన్నారు. పట్టణీకరణ పెరగడంతోపాటు పరంపరగా వస్తున్న సంస్కృతి, భాషలు ధ్వంసం కాబడుతున్నాయి. వస్తు వనరుగా తయారయ్యింది. యువతీ, యువకులు దోపిడీలు, దొంగతనాలు, మోసాలకు పెద్ద మొత్తంలోనే పాల్పడుతున్నారు. నేను మల్కన్‌గిరి జైలుకు వచ్చిన తరువాత డెకాయిట్ కేసులో తొమ్మిది మంది బెంగాలీ యువకులు జైలుకు వచ్చారు. వీరు డ్రైవింగ్, వ్యవసాయం, వ్యాపారం వంటి గౌరవప్రదమైన పనులు చేస్తూ జీవించేవారే. నక్సలైట్ పేరుతో డబ్బులు, బంగారం దోచుకోవడంతో పాటు గృహిణిని కిడ్నాప్ చేసిన కేసులో ముగ్గురు జైలుకు వచ్చిన 13 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. మొత్తం కేసును పరిశీలిస్తే పోలీసులు మిగతా వారిని అరెస్ట్ చేయకపోవడం, నక్సలైట్ పేరుతో డాకియిట్స్ చేసిన మరో హత్యా నేరం వీరిపై ఆరోపించడం. ఈ హత్య చేసిన వారిని ఎవ్వరిని అరెస్టు చేయకపోగా పై ముగ్గురితో పాటు నక్సలైట్ పేర అరెస్టు కాబడిన బొండా యువకుడిని కలిసి కేసు నమోదు చేయడం చూస్తుంటే పోలీసులు నిందితులతో కుమ్మక్కు అవ్వడమే గాక రాజకీయ, వ్యక్తిగత కారణాలతో అమాయకులను అరెస్టు చేసినట్టుగా అర్థమవుతుంది. ప్రభుత్వ ప్రతినిధులు, మధ్యవర్తుల మధ్య ఒక అవగాహనకు వచ్చిన తరువాత కొద్దిరోజులకే మావోయిస్టుల పేరుతో డెకాయిట్ జరిగింది. దీని విచారణను ఎస్.పి. స్థాయిలో తీసుకొని మావోయిస్టులు చేసినట్టుగా పెద్ద ప్రచారం చేశారు. ఇంటివారు గుర్తించినా పోలీసులు అరెస్టు చేసి విడిచిపెట్టారు కాబట్టి అనేక అనుమానాలకు తావిస్తుంది. మరో కేసులో తన అన్ననే పది వేల రూపాయలు డిమాండ్ చేస్తూ మావోయిస్టు పేరుతో తన భార్యతో పోస్టర్ రాయించి మోటర్ సైకిల్‌కు పెట్టిన కేసులో భార్యభర్తలు పట్టుబడ్డారు. చిత్రకొండలో ధయానిది, కెముదు, డొముదు, ధగియాలు నక్సలైట్ పేరుతో సునిల్ అగర్వాల్ అనే వ్యాపారికి ఫోన్ చేయగా ఎనిమిది వేల రూపాయలు ఇచ్చాడు. వీటిని తాగడం, తినడానికి ఖర్చు చేసిన వీరు సురేంద్ర రౌత్ అనే మరో పెద్ద వ్యాపారస్తునికి డబ్బులు డిమాండ్ చేస్తూ ఫోన్ చేసి పట్టుబడి జైలుకు వచ్చారు. ఒక ఎస్.పి.ఒ.తోపాటు మరో ఆదివాసి యువకుడు కలిసి యువతులను ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లి అమ్మిన కేసులో జైలుకురాగా, అత్యాచారాలు, కొట్లాటలు, గాంజా కావడి కూలీలు, డ్రైవర్లు, క్లీనర్లు అరెస్టు అయి జైలుకు రావడం నిరుద్యోగానికి, వస్తు వినియోగానికి, సంస్కృతి ధ్వంసానికి ఒక పార్శ్వం అయితే, మరో పార్శ్వం ముంబై, సూరత్, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వలస వెళ్లడం.

(ఇంకా వుంది)

(రచయిత మావోయిస్ట్ నాయకులు, రాజకీయ ఖైదీ) వీ

భూమికీ, మనిషికీ సంబంధాన్ని నిర్దేశించే రెవెన్యూ పాలన ప్రారంభం, పూర్వాపరాల చరిత్రను వివరిస్తున్నారు

ఎస్. సరళా వందనం

ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన - 10

(గత సంచిక తరువాయి...)

1891లో చెంగల్పట్టు కలెక్టరును నిమ్నజాతుల జీవనస్థితిగతులపై అధ్యయనం చేసి నివేదికను ఇవ్వమని కోరారు. ఆ నివేదిక ద్వారా బ్రిటిష్ పార్లమెంట్ 30 సెప్టెంబర్ 1892, 1 ఫిబ్రవరి 1893 ఉత్తర్వుల ద్వారా అప్పటికే సెటిల్‌మెంట్ అయిన భూముల వివరాలను 'రిసెటిల్‌మెంట్ రిజిష్టర్'లో పొందుపరిచే సందర్భంలో ప్రభుత్వ భూమిలో కొంత భూమిని ఆ గ్రామ నిమ్నజాతి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వ్ చేయాలని నిర్ణయం తీసుకుంది. అప్పట్నుంచి ఆర్.ఎస్.ఆర్.లో ఒక కొత్త కాలమ్‌ను సృష్టించి దాదాపు ప్రతి గ్రామంలోను నిమ్నజాతుల అవసరాల కోసం భూమిని రిజర్వ్ చేసి ఆ భూములను నిమ్నజాతుల వారే వారసత్వ రీత్యా అనుభవించాలి, వేరే ఎవరూ కొనడానికి కానీ అమ్మడానికి కానీ వీలు లేకుండా నిబంధనలు విధించారు. 1919లో ఈ రిజర్వ్ చేసిన భూములను పరిరక్షించడానికీ, పంపిణీ చేయడానికీ ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. ఈ అధికారి ఆధ్వర్యంలో నిమ్నజాతుల వారికి 'సహకార సంఘాలు' పెట్టి వారికి భూమిని పంపిణీ చేయడం మొదలుపెట్టారు. రిజర్వ్ చేసిన భూములు చాలని సందర్భంలో భూ సేకరణ మొదలుపెట్టి 1920–21 సంవత్సరానికంతా బ్రిటిష్ వారి ఆధీనంలో ఉన్న రాష్ట్రంలో 3,42,611 ఎకరాలను నిమ్నజాతులకు వ్యవసాయం చేసుకోవడానికి పంపిణీ చేశారు.

1866లో పట్టణాలలో అంతర్గత రహదార్లు, పరిశుభ్రత, పాఠశాలలు, ఆరోగ్యం కోసం స్థానిక నిధి ఒకటి ఉండాలనే అవసరాన్ని బ్రిటిష్ వారు గుర్తించి 'పట్టణాల అభివృద్ధి చట్టం'ను అమలులోకి తీసుకొచ్చి ఒక ప్రత్యేక రుసుం (సెస్)ను ప్రజల నుండి వసూలు చేయడం మొదలు పెట్టారు. రుసుంను ఇంటి పన్నుతో కలిపి వసూలు చేయడం మొదలు పెట్టారు. ఇలానే గ్రామాలలో కూడా పారిశుధ్యం, ఆరోగ్యం, రహదారులు, పాఠశాలల కోసం కావలసిన నిధి కోసం 'విలేజ్ సెస్ యాక్ట్ IV 'ను 1871లో చేశారు. ఈ చట్టం ప్రకారం ప్రతి రూపాయి రెవెన్యూ వసూలుకు పది పైసలు స్థానికంగా ఉపయోగించుకోవడానికి కేటాయించడం మొదలు పెట్టాలని నిర్ణయించారు. ఒకవైపు ఇనాం భూములపై క్విట్ రెంటు ఇంకోవైపు సెస్ వసూలు చేయడం వలన రెవెన్యూ ఆదాయం బాగా పెరిగింది. ఈ వసూళ్లన్నీ గ్రామ రెవెన్యూ యంత్రాంగమే చేసేది. కలెక్టర్ అధ్యక్షతన ఉండే లోకల్ బోర్డ్ ఆధీనంలో అధికారులు, ప్రముఖులు సభ్యులుగా ఉండి ఈ స్థానిక నిధులను గ్రామ, పట్టణ అవసరాల నిమిత్తం విడుదల చేస్తుండేవారు.

విలేజ్ సెస్ యాక్ట్ అమలులోకి వచ్చిన తరువాత కర్నూలు జిల్లాలో వసూళ్లు ఈ విధంగా పెరిగాయి.

సంవత్సరం	క్విట్ రెంట్	గ్రామ సుంకం	ఇతరాలు	మొత్తం
1878–79	2,47,558	1,24,997	18,091	3,90,641
1879–80	2,89,872	1,67,322	18,000	4,74,195

బందెలదొడ్డిలో వచ్చిన వసూలు (పౌండ్ ఫండ్)ను, అడవులలో చెట్లు (ఎండిపోయినవి) అమ్మగా వచ్చిన డబ్బు, గడ్డి మేపుకొన్నందుకు వచ్చిన అటవీ సంరక్షణ నిధిని కూడా స్థానిక అవసరాలకు వినియోగించేవారు. 1882లో 'అటవీ చట్టం' చేసి అడవులను సంరక్షించడానికి, అటవీ సంపదను క్రమబద్ధీకరించడానికి గాను కొత్తగా అటవీ శాఖను కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేసే విధంగా నెలకొల్పారు. 1871లో వచ్చిన సెస్ యాక్ట్ ద్వారా చెరువులు, కాలువలు బాగు చేయడం, తీయడం పబ్లిక్ వర్క్స్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో జరుగుతున్నా పూడిక డ్రయినేజ్, సానిటేషన్ మాత్రం రెవెన్యూ శాఖ నిర్వహించేది.

1856లో రెవెన్యూ సెటిల్‌మెంట్ శాఖను నెలకొల్పి తమ పాలనంలో ఉన్న అన్ని భూములపై సర్వే మొదలు పెట్టాలని నిర్ణయించుకున్నారని, ముప్పై సంవత్సరాల తరువాత రీసర్వే చేయాలని నిర్ణయించారని చెప్పడం జరిగింది. ఇందుకోసం ముందుగా రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాలోని భూములను జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో 'పైలట్ ప్రాజెక్ట్' కింద చేపట్టారు. వీరు ముందుగా గ్రామ సరిహద్దులు కొలిచి తరువాత శిస్తు నిర్ధారణ చేయాలని చూశారు. కాని సరిహద్దులు డీ మార్కేషన్ చేయడంలో జరిగిన పొరపాట్లు, అవి తరచూ మారుతుండడం వలన పదే పదే రెవెన్యూ డిమాండ్ మార్చాల్సి రావడం, కచ్చితమైన సెటిల్‌మెంట్ చేయడానికి సాధ్యం కాలేదు. దానితో 1864లో సర్వే, సెటిల్‌మెంట్ కోసం ఒక ప్రత్యేక శాఖను నెలకొల్పి బోర్డు ఆఫ్ రెవెన్యూ మెంబర్ పర్యవేక్షణలో సర్వే, సెటిల్‌మెంట్ చేయించారు.

అన్ని భూములపై పన్నును విధించడానికి కావల్సిన సర్వేను, దానిని పొందుపరిచే పటాలను స్థూలంగా రెండు రకాలుగా తయారు చేశారు.

1) టోపో గ్రాఫికల్ సర్వే : గ్రామం సరిహద్దులకు ఒక స్థలాకృతిని,

గీతల రూపంలో మొత్తం కలిపి ఇచ్చి ఒక ఆకారం తీసుకు రావడమే ఈ సర్వే ఉద్దేశం. గ్రామ సరిహద్దు లైను లోపల ఉన్న చెరువులు, కుంటలు, నదులు, రస్తాలు (బండి రస్తా, కాలిబాట, రోడ్లు), దేవాలయాలు, చర్చీలు, మసీదులు, పర్వతాలు (గుట్టలు, చిన్న కొండలు), కాలువలు, పొలాల సరిహద్దులు, రైలు మార్గాలు, ఇతర ఉమ్మడి గ్రామ ఆస్తులు ఈ పటంలో నమోదు చేస్తారు. స్థూలంగా దానిని పటం (విలేజ్ మాప్) అంటారు. పెద్ద పెద్ద విస్తీర్ణాలలో ఉన్న గ్రామాలను రెండు లేదా నాలుగు లేదా ఇంకా ఎక్కువ భాగాలుగా విడగొట్టి తయారు చేసి వాటికి 1/4, 2/4, 3/4, 4/4, ఇలా నంబర్లు ఇస్తారు. వాటన్నిటినీ కలిపితే కచ్చితమైన మొత్తం గ్రామ సరిహద్దులు గుర్తించవచ్చు. గ్రామ సరిహద్దులు పూర్తయిన తరువాత గ్రామాన్ని ఇలా కొన్ని ఖండములుగా విభజిస్తారు. మాగాణి అయితే వంద నుంచి రెండు వందల ఎకరాలు, మెట్ట అయితే రెండు వందల నుంచి మూడు వందల ఎకరాల ఒక ఖండం స్కెచ్ తయారు చేస్తారు. ఖండం స్కెచ్‌లను తప్పులేకుండా కొన్ని పొలాలను సర్వే చేయడానికి అనుకూల రీతిలో ఉపఖండంగా కొలుస్తారు. వీటిని డి స్కెచ్‌లంటారు. ఈ డి స్కెచ్‌ల నుంచి ఒక్కో సర్వే నంబర్ ఇస్తారు.

2) రెవెన్యూ సర్వే (కడస్ట్రల్ సర్వే) : ఈ సర్వేలో ప్రతి పొలం (సర్వే నంబర్)లోని వ్యక్తులకు సంబంధించిన సరిహద్దులు కనపరుస్తారు (చుట్టు పక్కల సర్వే నంబర్లు, విస్తీర్ణం మొదలైనవి). ఇందులో పట్టాదారుని పేరు, అనుభవదారుని పేరు, కచ్చితమైన విస్తీర్ణం ఉంటాయి. పోరంబోకు, ప్రభుత్వ భూముల, ఇనాం భూముల విస్తీర్ణాలు కూడా వేరుగా గుర్తిస్తారు. (ఈ సర్వే కేవలం పన్ను విధింపునకు ఉపయోగపడడానికి, అప్పట్లో తయారు చేసినా, ప్రస్తుతం ఇవి ఉమ్మడి ఆస్తిగా ఉన్న భూమిని పంచుకోవడానికి, పాయికారి రైతులు (సరిహద్దు) ఆక్రమణలను తొలగించడానికి, ఎవరికి వారు తమ స్వంత భూమిని లావాదేవీల కోసమో, తమ వ్యక్తిగత అవసరాల కోసమో పటం వేయించుకొని చట్టబద్ధత కల్పించుకోవడానికి తరచూ ఉపయోగపడుతుంటుంది.

ముఖ్యంగా ఒక పొలం విస్తీర్ణంలో ఎలాంటి మార్పు లేకపోయినా లావాదేవీలు, పంపకాలలో జరిగే మార్పులను ఎప్పటికప్పుడు అందులో సబ్ డివిజన్‌గా ఇచ్చి ఆ మార్పులను ఈ పటంలో నమోదు చేస్తారు. 1872 సంవత్సరానికంతా మద్రాస్ ప్రెసిడెన్సీలోని దాదాపు అన్ని జిల్లాలలో చాలా వరకూ ఈ సర్వే పూర్తయింది.

సెటిల్‌మెంట్ రిజిష్టర్ (డిగ్లాట్ రిజిష్టర్) : 1872లో సర్వే ద్వారా వచ్చిన వివరాలతో ఈ రిజిష్టర్‌ను దాదాపు ప్రతి గ్రామానికి తయారు చేశారు. ప్రతి సర్వే నంబర్‌కూ (పొలానికి) ఎన్ని ఎకరాలు, ఎన్ని సెంట్లు, సెంట్లలో ఎన్ని గజాలు ఉన్నాయో కూడా ఇందులో నమోదు చేశారు. ఒక సర్వే నంబర్‌లో పది మంది అనుభవంలో ఉంటే ఆ సర్వే నంబర్‌ను పది సబ్ డివిజనల్‌గా చేసి (ముందుగా ఎ,బి,సి,డి ఇలా వరుస అక్షరాలు ఇచ్చేవారు. తరువాత 1,2,3,4.. ఇలా అంకెల రూపంలో సబ్ డివిజన్‌ను చూయించారు.) ఒక్కొక్కరి అనుభవంలో ఉన్న భూమి విస్తీర్ణం అందులో నమోదు చేస్తారు. విస్తీర్ణంతో పాటు వారి పేర్లు కూడా ఒకవైపు నమోదు చేసి, రెండోవైపు ఒక్కొక్క వ్యక్తికి ఎంత శిస్తు విధించిందీ, ఆ భూమి వర్గీకరణ నమోదు చేయడంతోపాటు, ఆ భూమిని ఏ పేరుతో పిలుస్తారు అనేది కూడా రాస్తారు.

ప్రతి వ్యక్తికీ ఒక ఖాతా నంబర్ (పర్సనల్ ఎకౌంట్) ఇచ్చి, ఆ రిజిష్టర్‌లో నమోదు చేస్తారు. ప్రతి పట్టాదారు లేదా జాయింట్ పట్టాదారులకు ఒక ఖాతా నంబర్‌తో పాటు వారి సర్వే నంబర్, విస్తీర్ణం, నిర్ధారించిన శిస్తు మొదలగు వివరాలతో కూడిన పట్టాను గ్రామంలోని ప్రతి రైతుకూ ఇవ్వడంతో ఆ గ్రామ సెటిల్‌మెంట్ పూర్తయినట్లుగా ప్రభుత్వం పరిగణిస్తుంది. ఈ సెటిల్‌మెంట్ రిజిష్టర్‌లో శిస్తు విధించని భూములు, ఇనాం భూములు, ఎస్టేట్ భూముల వివరాలు, వాటి అనుభవదారుల పేర్లు కొత్తగా భూములు కేటాయించిన వారి వివరాలను చివరి ఖాతా నంబర్ నుంచి మొదలుపెట్టి నమోదు చేసుకుంటూ పోతారు. చివరిలో శిస్తు విధించిన భూముల విస్తీర్ణం వాటికి నిర్ధారించిన శిస్తు, శిస్తు విధించని భూములు, వాటి విస్తీర్ణం మార్పులు నికర విస్తీర్ణాలలో గోష్వార తయారు చేస్తారు. ఇలా గ్రామంలోని అన్ని వివరాలతో పాటు ప్రతిగ్రామ పటం (విలేజ్ మ్యాప్) కూడా ఈ రిజిష్టర్‌కు జతచేసి తాలూకాకు పంపిస్తారు' అన్ని గ్రామాల వివరాలను ఒకటి లేదా ఎక్కువ వాల్యూంలలో వాటి మ్యాప్‌లతో తయారు చేసి తాలూకాకు సంబంధించిన అన్ని వివరాలను తయారుచేస్తారు. 1872 సంవత్సరానికి సంబంధించి కర్నూలు జిల్లా మొత్తానికి భూమి శిస్తు రూపంలో రు. 14,56,898 ఉంటే, అబ్కారీ పన్నుగా రు. 3,27,015, స్టాంపుల రుసుం, కొనుగోలు లావాదేవీల ద్వారా రు. 99,968, ఇన్‌కమ్ టాక్స్ రూపంలో రు. 9,931, మొరుసు లేదా గ్రావెల్‌కు పన్ను రు.2,343 వసూలైంది. వెరసి మొత్తం రు. 18,95,555 వసూలైందని సెటిల్‌మెంట్ లెక్కల ద్వారా తేలింది.

ఈ విధంగానే 1882–83లో మొత్తం భూముల విస్తీర్ణం, అందులో అనుభవంలో ఉన్న విస్తీర్ణం, విధించిన శిస్తు కర్నూలు జిల్లాలో ఈ విధంగా ఉన్నాయి.

సర్వే సెటిల్‌మెంట్ జరిగిన విస్తీర్ణం	- 35,20,403 ఎకరాలు
పైమాష్ సర్వే ద్వారా జరిగిన విస్తీర్ణం	- 1,39,006 ఎకరాలు
ఎస్టిమేషన్ వలన వచ్చిన విస్తీర్ణం	- 8,37,602 ఎకరాలు
మొత్తం విస్తీర్ణం	- 44,97,011 ఎకరాలు

ఈ మొత్తం విస్తీర్ణంలో 16,30,460 ఎకరాలలో ఒక పంట సాగు కాగా, 5,106 ఎకరాలలో రెండవ పంట కూడా వేశారు. సాగుకు పనికి వచ్చి శిస్తు విధించినా కూడా సాగు చేయని భూమి 9,73,506 ఎకరాలు, గడ్డి, అటవీ భూముల విస్తీర్ణం 3,22,526 ఎకరాలు, సాగుకు పనికి రాని ప్రభుత్వ పోరంబోకు భూముల విస్తీర్ణం 15,70,519 ఎకరాలుగా ఉంది. ఇందులో 26,03,906 ఎకరాలకు గాను రు. 24,83,786 శిస్తుగా నిర్ధారించారు.

ప్రతి గ్రామానికి సెటిల్‌మెంట్ రిజిష్టర్ తయారయినా ఇంకా కొంత విస్తీర్ణాన్ని సర్వే చేయాల్సి రావడం, సెటిల్‌మెంట్ అయిపోయిన ముప్పై సంవత్సరాలకు గాను రిసెటిల్‌మెంట్ చేయాలని ముందుగానే నిర్ణయించుకోవడం వలన 1887లో ఆంధ్ర బోర్డ్ ఆఫ్ రెవెన్యూను పునర్వ్యవస్థీకరించి సర్వే, సెటిల్‌మెంట్ శాఖను బోర్డ్ ప్రత్యక్ష పర్యవేక్షణ పరిధిలోకి తీసుకొచ్చారు. 1903లో కమిషనర్ ఆఫ్ రెవెన్యూ సెటిల్‌మెంట్ పేరును మార్చి కమిషనర్ ఆఫ్ రెవెన్యూ సెటిల్‌మెంట్, సర్వే, ల్యాండ్ రికార్డ్, అగ్రికల్చర్‌గా చేశారు.

రీసెటిల్‌మెంట్ : సెటిల్‌మెంట్‌లో నిజాం రాష్ట్ర భాగంలో సర్వేకు గంటర్ చెయిను ఉపయోగించారని ముందే చెప్పుకున్నాం. కాని రీసెటిల్‌మెంట్, చేయడానికి మెట్రిక్ పద్ధతి ప్రవేశపెట్టే, మద్రాస్ ప్రెసిడెన్సీ గంటర్ గొలుసు స్థానంలో ఇరవై మీటర్ల పొడవుండే 'మెట్రిక్ గొలుసు'తో సర్వే చేయించారు. ఈ గొలుసు ఒక్కొక్క లింకు ఇరవై సెంటిమీటర్ పొడవుండి వంద లింకులు కలిగి ఉంటుంది. యాభై లింకుల వద్ద ఒక ఇత్తడి బిళ్ల ఉండి, 10,20,30,40,60,70,80,90,వ లింకువద్ద చిన్న ఇత్తడి కొనలు ఉండి ఈ గొలుసు మడుచుకోవడానికి, విప్పడానికి, మోసుకుపోవడానికి చాలా అనుకూలంగా ఉంటుంది. ఇప్పటికీ రాష్ట్రమంతా ఇదే మెట్రిక్ గొలుసును వాడుతున్నారు. గొలుసులతో పాటు ఎన్ని గొలుసుల దూరం కొలిచారో తెలుసుకోవడానికి 30 నుండి 40 సెంటిమీటర్లు పొడవు కలిగిన 1 నుండి 1 1/2 అడుగుల వెడల్పుండి భూమిలో గుచ్చడానికి సూదిమొన ఉన్న ఇనుప మేకులను ఒక్కొక్క గొలుసు దూరం కొలిచిన చోట గుచ్చుకుంటూ పోతారు. దీనితో పాటు కొలతల కోసం సరిహద్దులన్ని వైపులా దూరంను గుర్తించడానికి, ఆ దూరాన్ని కొలవడానికి ఆరు అడుగుల వెదురు కర్రకు ఎరుపు లేదా తెలుగు రంగు వస్త్రాన్ని చుట్టి పాతుతారు. దీనితో కొలవాల్సిన లేదా కొలిచిన విస్తీర్ణంపై పూర్తి అవగాహన వస్తుంది.

క్రాస్ స్టాఫ్ : పక్కాగా కొలతలు ఉన్నాయా లేదా చూడడానికి 4 1/2 అడుగుల నుండి 5 అడుగులు ఉన్న ఇనుప వూచకు కొయ్యతో తయారు చేసిన 4 అంగుళాల చదరం 2 1/2 అంగుళాల వెడల్పు ఉండి పై భాగంలో 4 సమ భాగాలుగా 1/2 అంగుళం కట్ (తరిగిన) చేసిన భాగంతో ఏ వైపున తిరిగినా 90 శాతం కోణంలో కొలత కనిపించే విధంగా ఉండే పరికరాన్ని ఉపయోగిస్తారు. ఈ క్రాస్ట్ స్టాఫ్ వలన గొలుసు పట్టుకోవడంలో తప్పులు సరిచేయడం వలన కచ్చితమైన కొలత వస్తుంది.

ఫీల్డ్ మెజర్‌మెంట్ పుస్తకం : ప్రతి సర్వే ఫీల్డును పైన చెప్పిన పరికరాల సహాయంతో కొలిచి, 5 ఎకరాల లోపు విస్తీర్ణం ఉంటే ఫీల్డ్ పటం వేసేటప్పుడు 1 గొలుసుకు 1 సెంటిమీటర్‌గా గీస్తారు. అదే ఒక సర్వే ఫీల్డ్ 20 ఎకరాల వరకు ఉంటే 1 గొలుసును 1/2 సెంటిమీటర్‌గా గీస్తారు. ప్రతి సర్వే ఫీల్డ్‌కు ఒక పేజీలో పటం గీసి ఎడమవైపు జిల్లా తాలూకా, కుడివైపు గ్రామం పేరు, విస్తీర్ణం హెక్టార్లలో, ఏర్లలో నమోదు చేసి కొలతలను నిచ్చెన ఆకారంలో తయారు చేయడమే కాకుండా, ఫీల్డు పటం చుట్టూ కూడా కొలతలు సెంటిమీటర్‌లలో వేస్తారు. చివర తయారు చేసిన సర్వేయరు సంతకం ఉండి, ఫీల్డ్ నంబర్ వారీగా వరుస క్రమంలో ఈ స్కెచ్ (పటం)లను ఉంచి పుస్తకంగా తయారు చేస్తారు. ఒరిజినల్ ఎఫ్.ఎం.బి. తయారు కాగానే, దాని పూర్తి కాపీని డూప్లికేట్ (నఖలు) ఎఫ్.ఎం.బి. ప్రతి గ్రామానికి తయారు చేస్తారు.

డి-స్కెచ్ (డీమార్కేషన్ స్కెచ్) : గ్రామంలోని సర్వే ఫీల్డ్‌లను (ఎఫ్.ఎం.బి.) కొన్నిటిని ఒక చోట ఖండంగా చేర్చి, అన్ని స్కెచ్‌లను 2 1/2 చైనులకు 1 సెంటిమీటర్ కొలతతో ప్రమాణంగా ప్లాటు చేసి, సరిహద్దు రేఖలు, ప్రతి ఫీల్డ్ జంక్షన్ దగ్గర, సబ్ డివిజన్ దగ్గర పాతిన సర్వే రాళ్లను డి-స్కెచ్ నందు గుర్తిస్తారు. ఈ స్కెచ్‌లు గ్రామ రెవెన్యూ పరిపాలనాధికారి దగ్గర ఉంచుతారు.

ఫీల్డ్ లోకేషన్ స్కెచ్ : ప్రతి ఖండంలోని ఒక సర్వే నంబర్‌ను, అందులో సబ్ డివిజన్‌లను డి-స్కెచ్‌లో గుర్తించి, పాత సర్వే నంబర్ నల్ల సిరాతో, కొత్త సర్వే నంబర్ సబ్ డివిజన్‌లను ఎర్ర సిరాతో ఖండంలో ఒక సర్వే ఫీల్డ్‌కు ప్లాటు చేస్తారు.

ఫెయిర్ ల్యాండ్ రిజిష్టర్ : ప్రతి సర్వే నంబర్‌ను వేరు వేరుగా తయారు చేసి అందులో ఆ భూమి స్వభావం (మాగాణి లేదా మెట్ట), ఇనామా పోరంబోకా లేదా పట్టానా, పొలం పేరు, పూర్వం ఎంత విస్తీర్ణంలో ఉంది, పట్టాదారు / అనుభవదారు పేరు, భూమి తరము, శిస్తు వివరాలు, కొత్త సర్వే నంబర్, సబ్ డివిజన్ నంబర్లు నమోదు చేస్తారు. ఇది సర్వే శాఖ దగ్గరే ఉండే అతి ముఖ్యమైన రిజిష్టర్. ఇందులో గ్రామంలోని ప్రతి సర్వే నంబర్‌లో అనుభవం వివరాలు ఉంటాయి.

కోరిలేషన్ స్టేట్‌మెంట్ : ఇందులో పూర్వపు సర్వే నంబర్‌కు కొత్త సర్వే నంబర్‌కు గల తేడాలు, వాటిని సర్వే చేసిన తేదీ, సర్వేయర్ సంతకంతో నమోదు చేస్తారు.

రాళ్ల లెక్కలు (స్టోన్ అకౌంట్స్) : ప్రతి ఖండమునకు పాతబడిన రాళ్ల జాబితా, ప్రతి ఫీల్డ్ వారీగా ఎన్ని పాతారు అనే వివరాలు నమోదు చేస్తారు.

మైనర్ సర్క్యూట్ ఫీల్డ్ : గ్రామంలో చిన్న చిన్న కొండలు, గుట్టలు, చెరువులను, ఒకే పట్టాదారునికి చెందిన యాభై ఎకరములపైబడిన పొలాలను గొలుసుతోను క్రాస్ స్టాఫ్‌తోను కొలవడానికి వీలుకాని పక్షంలో థియోడిలైట్ రాళ్లు (20 నుండి 40 గొలుసుల కంటే ఎక్కువ దూరం లేకుండా ఒకదానికొకటి కనబడే విధంగా రాళ్లు పాతడం), పాతి ప్రతి వంపులో సర్వే రాళ్లు పాతుతూ దానికి ఒక్కొక్క సర్వే నంబర్ కేటాయించి, పటంను 2 1/2 చైనులకు, 1 సెంటిమీటర్ ప్రామాణికంగా తయారు చేస్తారు.

సర్వేకు సంబంధించి అన్ని రకాల రిజిష్టర్లు, స్కెచ్‌లు తయారు చేసిన తరువాత నేల రకమును బట్టి తరము గుర్తిస్తారని ఇంతకు ముందే చెప్పుకున్న విధంగా ప్రతి ఫీల్డ్‌కు తరం రేటు నిర్ణయించిన తరువాత ప్రతి గ్రామానికి రిసెటిల్‌మెంట్ రిజిష్టర్ తయారు చేస్తారు.

(ఇంకా ఉంది)

(రచయిత రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ అధికారి)
saralareddy007@gmail.com

వీ

రచయితలకు సూచన : తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 23వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. – సం.


తారాపూర్ అణు రియాక్టర్ నెలకొల్పడంలో అమెరికా సహాయం తీసుకున్నామనీ, అయితే అణ్వస్త్ర పరీక్షల కోసం మన దేశం ఇతర దేశాలపై ఆధారపడలేదనీ అంటున్నారు **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**


అణు ఇంధన పదార్థాలు

ఏ దేశమైనా అణ్వస్త్రాల తయారీకి ప్రయత్నించాలంటే కొన్ని ప్రత్యేక పదార్థాలనూ, సాంకేతికవిజ్ఞానాన్నీ కూడా స్వంతం చేసుకోగలిగి ఉండాలి. సైనికపరంగా ప్రపంచాధిపత్యమంతా తమదిగానే ఉండాలనుకున్న అగ్రదేశాలన్నీ ఇటువంటి సాంకేతిక ప్రగతి ఇతర దేశాలకు అందకుండా ఉండాలని కనిపెడుతూ, శతవిధాల ప్రయత్నిస్తూ ఉంటాయి. ఈ పదార్థాలలో ముఖ్యమైనవి బాంబుల ఇంధనాలైన యురేనియం, ప్లూటోనియం. సహజంగా దొరికే యురేనియంలో సులువుగా విచ్ఛిత్తికి లోనయే 235 ఐసోటోప్ 0.7 శాతం మాత్రమే ఉంటుంది కనక ఈ మోతాదును పెంచే పరిజ్ఞానం చాలా ప్రధానపాత్ర వహిస్తుంది.

ఐసోటోప్‌లను వేరుచెయ్యడం సులువుకాదు. ఎందుకంటే అణువులన్నీ రసాయనికంగా ఒకేలాంటివి కనక దీనికి సామాన్య రసాయనిక ప్రక్రియలు పనిచెయ్యవు. బరువులోకూడా యురేనియం 235 అణువులకూ, 238 అణువులకూ స్వల్పమైన తేడా (1.26%) మాత్రమే ఉంటుంది. వేరుచేసే పద్ధతులు ఏవైనప్పటికీ తేడాలు స్వల్పం కావడంతో అవన్నీ అతినింపాదిగా, కాస్తకాస్తగా జరుగుతాయి. మనకు పనికొచ్చే ఐసోటోప్ మోతాదు చాలానెమ్మదిగా పెరుగుతుంది. ప్రక్రియలను ఎన్నో అంచెలవారీగా మళ్లీ మళ్లీ జరపవలసివస్తుంది. వీటిలో ఒకవంక మనకు కావలసిన పదార్థపు మోతాదు పెరుగుతూ ఉంటే మరొకవంక వ్యర్థపదార్థం పోగవుతూ పోతుంది.

ఇందుకు పనికొచ్చే ఒక పద్ధతిలో ఇంధనాన్ని యురేనియం హెక్సాఫ్లోరైడ్ అనే వాయువు రూపంలో అర్ధపారగమ్యత కలిగిన సెమీ పెర్మియబుల్ మెంబ్రేన్ అనే పొర గుండా వ్యాపనం (డిఫ్యూషన్) చెందేట్టు పంపుతారు. ఇటువంటి రకరకాల పొరలను ఎన్నో సాంకేతికప్రక్రియల్లో





సెంట్రీఫ్యూజ్ యంత్రాలు, వీటిలో వేడిమిని పెంచగా పైకి లేచిన తేలిక అణువులు

అవసరాన్నీ, సందర్భాన్నీబట్టి ఉపయోగిస్తారు. వీటిలోని సూక్ష్మరంధ్రాలు ఒక మోతాదుకు మించని కణాలను అవతలివైపుకు వెళ్లనిచ్చి, అంతకన్నా పెద్దవాటిని అడ్డుకుంటాయి. క్రమంగా తేలికైన, లేదా పరిమాణంలో చిన్నవైన కణాలన్నీ ఒక వేపున పోగవుతాయి.

అంతకన్నా తక్కువ ఖర్చుతో కూడిన మరొకపద్ధతిలో ఈ వాయువును సెంట్రీఫ్యూజ్ అనబడే అపకేంద్రయంత్రంలో తిప్పుతారు. వేరువేరు బరువుగాని, సాంద్రతగాని ఉన్న కణాలను గుండ్రంగా తిప్పితే బరువైనవన్నీ అక్షానికి ఎడంగానూ, తేలికవన్నీ దగ్గరగానూ పోగవుతాయి. ఒక యంత్రంలో ఉష్ణాన్నికూడా పెంచడంతో తేలిక అణువుల వాయువు పైభాగానికి తేలుతుంది. పటంలో ముదురురంగులో ఉన్నవన్నీ యురేనియం-238 అణువులుగానూ, తేలికరంగువన్నీ యురేనియం-235 అణువులుగానూ ఊహించుకోవచ్చు. పద్ధతి ఏదైనప్పటికీ ఇందులో శ్రమా, ఖర్చూ, సాంకేతిక నైపుణ్యమూకూడా చాలా ఎక్కువగా అవసరమవుతాయి. అయితే అణ్వస్త్రాల కోసమో, అణుఇంధనం కోసమో గట్టిగా ప్రయత్నించే దేశాలు ఇటువంటివి చేపట్టక తప్పదు.

శుద్ధి చేశాక మిగిలిన యురేనియంలో 238 అణువులు మామూలుకన్నా ఎక్కువగా చేరుతాయి. ఈ క్షీణించిన, లేదా డిప్లీటెడ్ యురేనియం దట్టమైన కవచంగా పనికొస్తుంది. దీని సాంద్రత నీటికన్నా 19 రెట్లు పైబడినది కనక మామూలుగా తూటాలు ఛేదించలేని లోహపు కవచాలను బద్దలుకొట్టడానికి దీనితో చేసిన ప్రత్యేక తూటాలను వాడడం కద్దు.

ప్లూటోనియం అనేది సహజ యురేనియంలో ఎక్కువగా ఉండే 238 ఐసోటోప్‌ను న్యూట్రాన్ల తాకిడికి గురిచేసినప్పుడు కృత్రిమంగా తయారయే మూలకం. మనదేశపు అణురియాక్టర్లన్నీ ప్రధానంగా సహజ యురేనియం ఇంధనంగా ఉపయోగించేవే. అణురియాక్టర్లు పనిచేస్తూ ఒకవంక వేడిమినీ, తద్వారా విద్యుత్తునూ ఉత్పత్తి చేస్తున్నప్పుడు వాటి ఇంధనంలోని స్వల్పమైన 235 ఐసోటోప్ సైతం కొంతకాలానికి ఖర్చయిపోతుంది. ఆ అణువులు విచ్ఛిత్తి అవుతున్నప్పుడు పుట్టుకొచ్చే న్యూట్రాన్లలో కొన్ని 238 ఐసోటోప్ అణువులకు తగలగా అవన్నీ ప్లూటోనియం-239గా మారిపోతాయి. ఒకవంక రియాక్టర్లు సక్రమంగా పనిచేసి, ఇంధనం కాలగా అందులో మిగిలిన వ్యర్థపదార్థాలను శుద్ధిచెయ్యడంవల్ల ప్లూటోనియం-239ను తయారుచేసుకోవచ్చు.

అమెరికా 1952లోనూ, రష్యా 1953లోనూ తమ తొలి హైడ్రొజన్ బాంబులను పేల్చాయి. ఎంతో వినాశకరశక్తి ఉన్న వీటిని ఇంతవరకూ ఏ యుద్ధంలోనూ ఎవరూ ప్రయోగించలేదు. హైడ్రొజన్ అణువుకు ఐసోటోప్‌లయిన డ్యూటీరియం, ట్రీటియం ఎక్కువ ఉష్ణోగ్రతలో అణుసంయోగం చెందడంతో పేలుడు జరుగుతుంది. సహజంగా ఇవన్నీ వాయువులే కనక హైడ్రొజన్ బాంబుల్లో లీథియం డ్యూటిరైడ్ అనే ఘనపదార్థాన్ని ఉపయోగిస్తారు. ప్రకృతిలో దొరికే లీథియంలో 8 శాతంకన్నా తక్కువగా లీథియం-6 అణువులు ఉండగా తక్కినదంతా లీథియం-7 అణువులే. దీనితో డ్యూటీరియం కలిసిపోయి ఉంటుంది. ఏదైనా శక్తివంతమైన న్యూట్రాన్ లీథియంను ఢీకొడితే ట్రీటియం అణువులు ఉత్పత్తిఅవుతాయి. ముందుగా ఏటంబాంబు పేలుతుంది కనక హెచ్చు ఉష్ణోగ్రతతోబాటుగా న్యూట్రాన్ల విడుదలకూడా జరిగి డ్యూటీరియం, ట్రీటియంల అణుసంయోగానికి దారితీస్తుంది. ఎటొచ్చీ ఏటం బాంబు తయారీ సాధించిన దేశాలు మాత్రమే హైడ్రొజన్ బాంబు స్థాయికి చేరగలవు.

మనవాళ్లు జరిపిన అణ్వస్త్రపరీక్షలకు విదేశాలేవీ సహాయ పడలేదని ప్రత్యేకంగా చెప్ప నవసరంలేదు. మన శాస్త్రవేత్తలు వివరాలు ప్రకటించకపోయినా ఇంధనాల దగ్గరనుంచీ అన్నీ స్థానికంగానే తయార యాయనేది స్పష్టం. అణ్వస్త్రాలకేకాక అణురియాక్టర్లలో వాడడానికి కూడా కొన్ని సందర్భాల్లో ప్రత్యేకపదార్థాలు అవసరమవుతాయి. మహారాష్ట్రలోని తారాపూర్‌లో అణురియాక్టర్ నెలకొల్పడానికి మన దేశానికి అమెరికా మొదట్లో సహాయపడినప్పటికీ దాని ఇంధనం ఖర్చయాక మళ్లీ సరఫరా చెయ్యనిరాకరించి నానా ఇబ్బందులూ పెట్టింది. ఇంతాచేసి అందులోని యురేనియం-235 శాతం 2.5 మాత్రమే. ఆ తరవాతికాలంలో అణు రియాక్టర్ల నిర్మాణంలో మనదేశం ఎన్నో ప్రయోగాలు చేసిందనీ, అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయని చాలామందికి తెలియకపోవచ్చు. అణు రియాక్టర్ల ఇంధనాలుగా పనికొస్తాయని మన శాస్త్రవేత్తలు నిరూపించిన పదార్థాలలో సహజయురేనియం, యురేనియం-235, ప్లూటోనియం, వాటి మిశ్రమం, యురేనియం-233 ఇలా రకాలున్నాయి. కేరళలోనూ, ఇతర చోట్లా లభించే థోరియంమీద కూడా విజయవంతమైన ప్రయోగాలు జరిగాయి.

సహజ యురేనియం ఇంధనంగా పనిచేసే అణురియాక్టర్లలో గొలుసుపద్ధతిలో విచ్ఛిత్తి కొనసాగడానికి న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించడానికి డ్యూటీరియంతో తయారయే భారజలం అవసరమవు తుంది. దీన్నీ, పరిశుద్ధత కలిగిన అనేక లోహాలనూ, ఇతర ప్రత్యేకనిర్మితులనూ మన నిపుణులు తయారుచేశారు. విదేశాల సాంకేతికసహాయం అందకపోవడం ఒకవిధంగా లాభించి, మన శక్తిమీదనే మనం ఆధారపడే అవకాశం ఏర్పడింది.

ఇందుకు పేర్కొనదగిన ఒక ఉదాహరణ అణుప్రయోగాలకు పనికొచ్చే మరొక పదార్థం బోరాన్-10. మామూలుగా దొరికే బోరాన్‌లో 80 శాతం బోరాన్-11 అణువులుంటాయి. వీటికన్నా న్యూట్రాన్లను చాలా ఎక్కువగా సంగ్రహించగలిగినవి బోరాన్-10 అణువులు. ఈ పదార్థాన్ని ఏదో ఒక రూపంలో అవసరమున్నప్పుడల్లా రియాక్టర్ లోపలికి ప్రవేశపెడితే అందులోని న్యూట్రాన్ల సంఖ్య బాగా తగ్గిపోతుంది. రసాయనికంగా అయాన్‌ఎక్స్చేంజ్ పద్ధతిలో బట్టీలద్వారా బోరాన్-10 అణువుల సంఖ్యను కృత్రిమంగా పెంచే ప్రక్రియ తమిళనాడులోని కల్పాక్కం అణుకేంద్రంలో జరుగుతోంది.

(రచయిత అణుధార్మిక శాస్త్రవేత్త) వీ

ఆలోచనల గూటికి పుల్లా పుడకా

సమాజంలోనూ, పుస్తకాలలోనూ, పత్రికలలోనూ, ఇతర ప్రచార సాధనాలలోనూ ఎన్నెన్నో తెలుసుకోవలసిన, ఆలోచించవలసిన విషయాలు ఉన్నప్పటికీ, వెలువడుతున్నప్పటికీ ప్రత్యేకంగా ఎత్తిచూపక పోవడం వల్ల వెలుగులోకి రాకుండా, ఆలోచనాపరుల దృష్టికి రాకుండా పోతున్నాయి. అటువంటి తెలుసుకోవలసిన విషయాలను మా దృష్టికి వచ్చినంతవరకు సేకరించి అందించడం ఈ శీర్షిక లక్ష్యం. ప్రజల అవగాహనల గూడును సుస్థిరంగా నిర్మించడానికే ఈ పుల్లా పుడకా.

❊ ❊ ❊ ❊ ❊

భారత పాలకవర్గాల కుటిల రాజనీతికి నిదర్శనాలు కోకొల్లలు. శాంతి మంత్రాలు జపిస్తూనే యుద్ధ సన్నాహాలు సాగించడం, తెల్లజెండాలు ఎగరేస్తూనే కుత్తుకలు తెగ్గోయడం, పావురాలు ఎగరేస్తూనే వాటిని కాల్చిచంపడం భారత పాలకులకు వెన్నతో పెట్టిన విద్య. నవంబర్ రెండో వారంలో మాల్దీవుల లోని అడ్డు నగరంలో సమావేశమైన దక్షిణాసియా దేశాల సమాఖ్య (సార్క్) సభలో భారత పాలకులు “దక్షిణాసియాలో శాంతి, విశ్వాస నిర్మాణం, స్వేచ్ఛ, మానవ హోదా, ప్రజాస్వామ్యం, పరస్పర గౌరవం, సత్పరిపాలన, మానవహక్కులు వంటి ఆశయాలకు పునరంకిత మవుతామ”ని గంభీర ప్రవచనాలు పలికారు. సార్క్ సభ్యులైన బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక, అఫ్ఘనిస్తాన్ అన్నీ కూడ ఆర్థిక వ్యవస్థ రీత్యానూ, జనాభా రీత్యానూ, సైనిక పాటవం రీత్యానూ భారత్ కన్న చాల చిన్నవి. ఆ దేశాల ప్రభుత్వాలతో శాంతిసామరస్యాలు నెరపి దక్షిణాసియాలో శాంతి నెలకొల్పవలసిన బాధ్యత భారత ప్రభుత్వానిదే. కాని భారత ప్రభుత్వం ఇరుగుపొరుగు దేశాలతో శాంతి ప్రవచనాలు పలుకుతూనే, తన సైనిక పాటవాన్ని, ఆయుధ శక్తిని, విధ్వంసక శక్తిని విపరీతంగా పెంచుకుంటూ పోతున్నది. భారతదేశం శాంతి అహింసలకు నిలయం అని, యుద్ధాలకు వ్యతిరేకి అని, తనకు తానై ఎవరిమీదా యుద్ధం చేయలేదని మన పాఠ్యాంశాల్లో చిన్నప్పటినుంచీ నూరిపోస్తున్నారు. కాని అవన్నీ పచ్చి అబద్ధాలని ఈ ఆరు దశాబ్దాల స్వతంత్ర భారత చరిత్ర ప్రతిరోజూ నిరూపిస్తున్నది. కనీసం గత ఇరవై సంవత్సరాలలో భారత ప్రభుత్వం ఆయుధాల కొనుగోళ్లలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలుస్తున్నది. తనను తాను శాంతి కాముకమని అభివర్ణించుకునే ప్రభుత్వం వేలకోట్ల రూపాయలు రక్షణ వ్యయానికి వెచ్చిస్తూ పెద్ద ఎత్తున మారణాయుధాలు కొనుగోలు చేస్తున్నది. రానున్న 12 సంవత్సరాలలో కనీసం 200 బిలియన్ డాలర్ల (ప్రస్తుత మారకపు రేటు ప్రకారం పదిలక్షల కోట్ల రూపాయలు) యుద్ధసామగ్రి, విమానాలు, జలాంతర్గాములు, విమాన వాహక నౌకలు, క్షిపణులు, ఆయుధాలు కొనుగోలు చేయాలని భారత ప్రభుత్వం ప్రణాళికలు వేస్తున్నది. సార్క్ సమావేశాలలో శాంతి ప్రకటన చేసి నాలుగు రోజులు గడవకుండానే స్విట్జర్లాండ్ నుంచి యుద్ధ విమానాలు, ఫ్రాన్స్ నుంచి క్షిపణులు కొనడానికి రు. 5000 కోట్ల బేరం కుదుర్చుకుంది. ఇదే నెలలో ఫైటర్ జెట్ యుద్ధ విమానాలు కొనడానికి 11 నుంచి 20 బిలియన్ డాలర్ల (55 వేల నుంచి ఒక లక్ష కోట్ల రూపాయల) బేరం ప్రారంభించింది. ఈ బేరంలో అధికారులను, మంత్రులను మెప్పించడానికి (అంటే ముడుపులతో కొనివేయడానికి) ఐదు బహుళజాతి సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. అవి అమెరికాకు చెందిన బోయింగ్, లాక్ హీడ్ మార్టిన్, ఫ్రాన్స్ కు చెందిన దసాల్ ఏవియేషన్, రాఫేల్, యూరపియన్ కూటమికి చెందిన యూరోఫైటర్. ఇవి కాక బ్రిటిష్ సంస్థ హాక్ నుంచి రు. 16 వేల కోట్ల యుద్ధవిమానాలు, రష్యా నుంచి రు. 65000 కోట్ల యుద్ధ విమానాలు కొనే ప్రణాళికలు కూడ ఉన్నాయి. గత నాలుగు సంవత్సరాలలో భారత ప్రభుత్వం బహుళజాతి సంస్థల నుంచి కొనుగోలు చేసిన రక్షణ సామగ్రి విలువ ఒక లక్షా యాభై ఐదు వేల కోట్ల రూపాయల పైచిలుకే. 2007-8లో రు. 28,159 కోట్లుగా ఉన్న ఈ కొనుగోళ్లు 2010-11 నాటికి రు. 46,887 కోట్లకు పెరిగాయి. ఇవి విదేశాల నుంచి నేరుగా దిగుమతులు కాగా, స్వదేశీ సంస్థల నుంచి కొనుగోళ్లు ఇందుకు రెట్టింపు ఉంటాయి. అవి కూడ స్వదేశీ సంస్థలని పేరు పెట్టుకున్నవే గాని పరోక్షంగా ఆ డబ్బు బహుళజాతి సంస్థలకు చేరేదే. ఇంతకూ ఇన్ని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి కొంటున్న సామగ్రిలో ఎక్కువ భాగం ఎందుకూ పనికి రానిది. రిపబ్లిక్ డే కవాతులో ప్రదర్శన మినహా ఎప్పుడూ వాడనిది. కేవలం పొరుగుదేశాలు కొన్నాయని భారత ప్రభుత్వం, భారత ప్రభుత్వం కొన్నదని పొరుగుదేశాల ప్రభుత్వాలు పోటీపడి కొనుక్కుని ఆ సామగ్రిని తయారుచేసే బహుళజాతి సంస్థలకు లాభాలు సమకూర్చి పెట్టడానికి తప్ప మరెందుకూ పనికి రానివి. అసలు ఈ యుద్ధ సామగ్రి కొనుగోళ్ల పోటీ ఒక పెద్ద కుంభకోణం. విస్తృతమైన కుట్ర. మొదట బహుళజాతి సంస్థల యాజమాన్యాలు, ప్రతినిధులు ఏదో ఒక దేశ నాయకులకు, అధికారులకు ముడుపులు పెట్టి ఆ సామగ్రి కొనిపిస్తారు. వాళ్లు కొన్నారని చూపి పొరుగువాళ్లను భయపెట్టి, బెదిరించి వీళ్లతోనూ కొనిపిస్తారు. ఈలోగా సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి వల్ల మరింత మెరుగైన, శక్తిమంతమైన సామగ్రి తయారవుతుంది. కనుక పాతది తీసేసి కొత్తది కొనుక్కొమ్మని మళ్లీ వెంట పడతారు. ఈ విషచక్రం నిర్విరామంగా తిరుగుతూనే ఉంటుంది. దేశాభివృద్ధికీ, సంక్షేమ పథకాలకూ, కోట్లాది ప్రజలకు కూడూ గూడూ గుడ్డా ఇవ్వడానికీ పనికి రావలసిన లక్షల కోట్ల రూపాయల అపారమైన నిధులు ధ్వంసమై పోతుంటాయి.

❊ ❊ ❊ ❊ ❊

ప్రజల వోట్ల ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధులే ఈ దేశ పాలకులనీ, వారికి ఏదో ఒక స్థాయిలో ప్రజాప్రయోజనాల పట్ల శ్రద్ధాసక్తులు ఉంటాయనీ అనుకుంటే అది అమాయకత్వానికి చిహ్నం. కాదనుకుంటే రెండు తాజా ఉదాహరణలు చూడండి. పరిపాలనకు సంబంధించిన కీలక చట్టాలు చేసే అధికారం ఉన్న పార్లమెంటు ప్రతి సంవత్సరం మూడు నాలుగు సార్లు సమావేశమై ఆ బిల్లులను చర్చిస్తుంది. ఆ చట్టాలు నిజంగా ప్రజోపయోగానికేనా, వాటిలో ప్రజాప్రయోజనాలకు వ్యతిరేకమైన నిబంధనలుంటే ఎలా సవరించాలి అని చర్చించే అవకాశం ప్రజా ప్రతినిధులు అని పిలవబడే పార్లమెంటు సభ్యులకు ఉంటుంది. కాని చాల బిల్లులు ప్రవేశపెడుతున్న సమయంలో, చర్చ జరిగే సమయంలో, బిల్లులు ఆమోదం పొంది చట్టాలుగా మారే సమయంలో సభలో నాలుగో వంతు

సభ్యులు కూడ లేకపోవడం ఆనవాయితీగా ఉంటున్నది. ఉన్నవారైనా అవి వింటారో, చదువుతారో, చర్చిస్తారో, నిద్రలో జోగుతుంటారో తెలియదు. ఎంతో కీలకమైన, ప్రజా జీవితాన్ని ధ్వంసం చేసే, దేశ వనరులను బహుళజాతి సంస్థలకు దోచిపెట్టే చట్టాలు కూడ ఎటువంటి చర్చా లేకుండా క్షణాలలో ఆమోదం పొందిన అనుభవాలెన్నో ఉన్నాయి. ఈ సారి నవంబర్ 22 నుంచి డిసెంబర్ 21 వరకు, నెల రోజుల్లో జరగనున్న శీతాకాలపు సమావేశాల్లో సభ మొత్తం 21 రోజులు కూచుంటున్నది. ఈ సారి చర్చకు రానున్న బిల్లులలో అతి ముఖ్యమైనవే 20 ఉన్నాయి. అంటే ఈ 21 రోజుల్లో కొన్ని రోజులైనా ఆందోళనలకు, అభ్యంతరాలకు, అవరోధాలకు, వాయిదాలకు చెల్లిపోతాయనుకుంటే, రోజుకు రెండు బిల్లులు ఆమోదించినా కష్టమేనన్నమాట. ఈ బిల్లులలో రెండో దశ ఆర్థిక సంస్కరణలు అమలు జరపడానికి, అంటే బహుళజాతి సంస్థలకు, దేశ దేశాల సంపన్నులకు ఉపయోగపడే విధానాలు అమలు చేయడానికి ఉద్దేశించినవి ఎన్నో ఉన్నాయి. ఇప్పటికే ఉన్న స్టాంపుల చట్టానికి, అక్రమ ధన లావాదేవీల నిరోధక చట్టానికి, జీవిత బీమా చట్టానికి, బీమా చట్టాలకు, బ్యాంకింగ్ చట్టాలకు, ఎగుమతి దిగుమతి బ్యాంకుల చట్టానికి, పెట్రోలియం, ఖనిజాలు, పైప్ లైన్ల చట్టానికి, దామోదర్ లోయ కార్పొరేషన్ చట్టానికి, ప్రసారభారతి చట్టానికి బహుళజాతి సంస్థలకు అనుకూలమైన సవరణలు చేస్తున్న బిల్లులు ఉన్నాయి. అలాగే పెన్షన్ నిధులను బహుళజాతి సంస్థలకు అప్పగించడానికి ఉద్దేశించిన బిల్లు, అణు విద్యుత్ సంస్థలను, బయోటెక్నాలజీని నియంత్రించే స్వతంత్ర సంస్థలను ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన బిల్లు కూడ ఈ బిల్లులలో ఉన్నాయి. వీటిలో ప్రతి ఒక్క బిల్లులోనూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దేశ ప్రజలకు నష్టదాయకమైన నిబంధనలున్నాయి. దేశ వనరులను కొల్లగొట్టుకు పోయేందుకు బహుళజాతి సంస్థలకు అవకాశ మిచ్చే నిబంధనలున్నాయి. అధికార కూటమికి ఉన్న ఆధిక్యత వల్ల గాని, ప్రపంచీకరణ పట్ల ప్రతిపక్షాలకు కూడ నిజమైన వ్యతిరేకత లేనందువల్లగాని ఈ బిల్లులన్నీ ఎటువంటి చర్చా లేకుండానే యథాతథంగా, అంటే లబ్ధిదారులైన బహుళజాతిసంస్థలు రాసి ఇచ్చిన దానిలో అక్షరం పొల్లు పోకుండా చట్టాలుగా మారిపోతాయి. ప్రజాజీవనాన్ని అల్లకల్లోలం చేస్తాయి.

* * * * *

చట్టసభల ద్వారా, చట్టబద్ధంగానే, బహిరంగంగానే ఇంత దుర్మార్గం సాగిపోతుండగా మరొక వైపు నుంచి ప్రపంచ ప్రఖ్యాత మేధావిగా, శాస్త్రవేత్తగా పేరు తెచ్చుకుని రాష్ట్రపతిగా కూడ కొంతకాలం పనిచేసిన అబ్దుల్ కలాం కూడంకుళం అణువిద్యుత్ కేంద్రానికి బహిరంగంగా మద్దతు ప్రకటించి తాను అణువిద్యుత్ బహుళజాతి సంస్థల సేవలో ఉన్నానని చూపుకున్నారు. తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా కూడంకుళంలో ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన అణు విద్యుత్ కర్మాగారం తమ బతుకులకు బుగ్గి చేయనున్నదని, తమ జీవితాలలో విషం చిలకనున్నదని గుర్తించిన ఆ ప్రాంత ప్రజలు చాల కాలంగా పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు. పదమూడు వేల కోట్ల రూపాయల వ్యయంతో, రష్యన్ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణమవుతున్న ఈ విద్యుత్ కేంద్ర వ్యయంలో సగానికి పైగా బహుళజాతి సంస్థలకే అందుతుంది. ఇటీవల జపాన్ లో ఫుకుషిమా అణువిద్యుత్ కేంద్రంలో జరిగిన ప్రమాద తీవ్రత చూసిన తర్వాత కూడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా ప్రజాందోళన మరింత ఉధృతమైంది. భద్రతా ప్రమాణాలను పరిశీలించడానికి కేంద్ర ప్రభుత్వం నిపుణులతో, నిరసనకారులతో ఒక బృందాన్ని నియమించవలసి వచ్చింది. ఆ నిపుణుల బృందం సమావేశానికి సరిగ్గా రెండు రోజుల ముందర, ఆ సమావేశాన్ని ప్రభావితం చేసే దురుద్దేశంతో, ఒక ప్రముఖ ఇంగ్లిష్ దినపత్రికలో మాజీ రాష్ట్రపతి మహాశయులు దుర్మార్గమైన, అణువిద్యుత్ అనుకూలమైన, బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు మేలు కలిగించే సుదీర్ఘ వ్యాసం రాశారు. ఇటు పార్లమెంటు సభ్యులైనా, అటు రాష్ట్రపతి అయినా జీ హుజూర్ జో హుకుం అని బహుళ జాతి సంస్థలకు చెప్పుకోవడానికి ఎన్ని పాట్లు పడుతున్నారో!

* * * * *

అలా ఒకవైపు ప్రభుత్వం తరఫున, చట్టసభల తరఫున రెండో దశ ఆర్థిక సంస్కరణల ప్రతిపాదనలు, ప్రయత్నాలు జరుగుతుండగానే, ప్రపంచీకరణ శక్తులకు, బడాపెట్టుబడిదారులకు ప్రతినిధిగా ఉన్న వాణిజ్య పత్రిక ది ఎకనమిక్ టైమ్స్ ఈ మార్పులకు అనుగుణంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి ప్రయత్నిస్తున్నది. ఇరవై సంవత్సరాల ప్రపంచీకరణ ముగిసిపోయి, దేశం ఒక మూలమలుపుకు చేరిందని, ఇక్కడినుంచి ఇంకా పునరుద్ధరించడానికి ఒక దిశా నిర్దేశం కావాలని గంభీరంగా ప్రవచిస్తూ "ఎజెండా ఫర్ రిన్యువల్" ప్రకటించింది. అధికార మార్పిడికి ముందు 1944-45లోనే దేశంలోని బడా పారిశ్రామికవేత్తలు తమ ప్రయోజనాల పరిరక్షణ కోసం భారత జాతీయ కాంగ్రెస్ ముందు ఉంచిన బొంబాయి ప్లాన్ తో పోల్చదగినంత చరిత్రాత్మక కార్యక్రమంగా ఎకనమిక్ టైమ్స్ దీన్ని అభివర్ణిస్తోంది. దేశంలోని ఆరుగురు బడా సంపన్నులు, పారిశ్రామిక, వ్యాపారవేత్తలు ఈ పది అంశాల ప్రణాళికను తయారు చేశారు. ఎచ్‌డిఎఫ్‌సి అనే ద్రవ్యసంస్థ అధిపతి దీపక్ పరేఖ్, ఐసిఐసిఐ బ్యాంక్ అధిపతి కెవి కామత్, హిందుస్తాన్ యునిలివర్ అనే బహుళజాతి సంస్థ మాజీ అధిపతి అశోక్ గంగూలీ, ఎ జెడ్ బి పార్ట్‌నర్స్ అనే బహుళజాతి న్యాయసలహా సంస్థ అధిపతి జియా మోడీ, వివిధ రంగాలకు వ్యాపించిన వ్యాపారవేత్త సునీల్ భారతి మిత్తల్, ఇన్ఫోసిస్ మాజీ అధిపతి ఎన్ ఆర్ నారాయణ మూర్తి ఈ ప్రణాళిక రచయితలు. వీరిలో ఏ ఒక్కరూ భారత సమాజంలో గ్రామీణ ప్రాంతాలతో గాని, అట్టడుగు వర్గాలతో గాని, పేదరికంతో గాని, సాధారణ ప్రజా జీవితంతో గాని సంబంధం ఉన్నవాళ్లు కాదు. వారికి ఈ దేశాభివృద్ధి అంటే అర్థం తమ వ్యాపారాలు, తమ యజమానులైన బహుళజాతి సంస్థల వ్యాపారాలు అభివృద్ధి చెందడం మాత్రమే. ఈ ప్రణాళిక దేశ పునర్నిర్మాణానికి సూచిస్తున్న పది అంశాలు: 1. ప్రభుత్వ ప్రయత్నాలను వ్యతిరేకించడం, ప్రజలలో నిరాశను వ్యాపింప జేయడం ప్రతిపక్షాలకు అలవాటయింది. ఆ అలవాటును వదులుకుని ప్రతిఒక్కరూ సంస్కరణల రంగంలో ప్రభుత్వానికి సహకరించాలి. 2. దేశంలో పెట్టుబడులు పెట్టదలచిన విదేశీ, స్వదేశీ మదుపుదార్లకు ఉత్సాహం కలిగించే సత్వర నిర్ణయాలు తీసుకోవాలి. 3. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి అవసరమైన చిన్నా పెద్దా చర్యలన్నీ చేపట్టాలి. 4. విద్యుత్ చార్జీలు పెంచి, సబ్సిడీలు తగ్గించి విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయాలి. 5. వ్యవసాయ రంగంలో పెద్ద ఎత్తున సంస్కరణలు తీసుకురావాలి. వ్యవసాయ మార్కెట్ల మీద ప్రభుత్వ నియంత్రణ తగ్గించాలి. 6. పెద్ద నగరాలను నిర్మించాలి. ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల సమన్వయం ద్వారా నగరాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. 7. పారిశ్రామిక, వ్యాపార అవసరాల కోసం భూసేకరణను సులభతరం చేయాలి. 8. సత్వర ఆర్థికాభివృద్ధి కొరకు వివిధ మంత్రిత్వ శాఖల మధ్య ఇతోధిక సమన్వయం కావాలి. 9. విద్యారంగాన్ని ప్రైవేటీకరించి, లాభం కోసం పనిచేసే రంగంగా మార్చాలి. 10. రాజకీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థలు ఇచ్చే విరాళాలను పారదర్శకంగా మార్చి అవినీతిని అరికట్టాలి. ఈ పది అంశాలనూ ఒక్క మాటలో చెప్పాలంటే, దేశాన్ని ఇంకా ఎక్కువగా అమ్మకానికి పెట్టండి అని. లేదా, ఈ దేశ వనరులన్నిటినీ దేశదేశాల సంపన్నులకు అప్పగించండి అని. ఇది దేశ పునర్నిర్మాణ ప్రణాళిక కాదు, దేశ విధ్వంస ప్రణాళిక.

మణిపూర్‌లో ఆగని ఆర్థిక దిగ్బంధం

మణిపూర్‌లోని సేనాపతి జిల్లాల్లో నుంచి తాము మెజారిటీగా ఉన్న ప్రాంతాలను విడదీసి ప్రత్యేకంగా సదర్ జిల్లాను ఏర్పాటు చేయాలని కుకీలు డిమాండ్ చేస్తున్నారు. 'సదర్ హిల్స్ డిస్ట్రిక్ట్ డిమాండ్ కమిటీ' (ఎస్‌హెచ్‌డీడీసీ) ఆధ్వర్యంలో ఆగస్ట్ 1 నుంచి జాతీయ రహదారులన్నిటి పైనా వాహనాల రాకపోకలను అడ్డుకుని ఆర్థిక దిగ్బంధం చేశారు. ఈ ఉద్యమం నవంబర్ 5 నాటికి 98వ రోజుకు చేరింది. కుకీల డిమాండ్‌ను వ్యతిరేకిస్తున్న నాగా తెగకు చెందిన 'యునైటెడ్ నాగా మండలి' (యూఎన్‌సి) ఆగస్టు 25 నుంచి రహదారుల దిగ్బంధాన్ని కొనసాగిస్తోంది. వంద రోజులకు పైగా కొనసాగిన ఆర్థిక దిగ్బంధనంవల్ల మణిపూర్‌కు దేశంలోని ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. ఆ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా పునర్విభజన కమిటీని ఏర్పాటు చేసింది. అయితే కుకీల ఉద్యమానికి తలొగ్గిన సర్కార్–సదర్ పర్వత ప్రాంతాలతో మరో మూడు సబ్ డివిజన్‌లను ఏర్పాటు చేసేందుకు ఆ కమిటీ నివేదిక విడుదలయ్యేలోపే అంగీకరించింది.

భూపేన్ హజారికా కన్నుమూత

ప్రముఖ జానపద కళాకారుడు భూపేన్ హజారికా (86) ముంబైలోని కోకిలాబెన్ ధీరుబాయి అంబానీ అస్పత్రిలో శ్వాస సంబంధిత సమస్యకు చికిత్స పొందుతూ నవంబర్ 5న మరణించారు. 1926లో అసోంలోని నదియాలో భూపేన్ పుట్టారు. తన 12వ ఏటనే 'బిశ్వా నిజోమ్ నొజోవాన్' పాటతో సంగీత జీవితం ప్రారంభించారు. బెనారస్ యునివర్సిటీలో బి.ఎ పూర్తిచేసిన ఆయన, ఉన్నత విద్య కోసం అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో చేరారు. జానపదాలకు, ఆదివాసి కళారూపాలకు శాస్త్రీయతను తీసుకొచ్చిన కళాకారుడు. ఆరు దశాబ్దాల సినిమా, సంగీత రంగాలలోనే కాకుండా దక్షిణాసియా సాంస్కృతిక అనుసంధానకర్తగా సేవలు అందించారు. ఆయన పాత్రికేయుడు, కథా రచయిత, సినిమా విమర్శకుడిగానూ రాణించారు. వెయ్యికి పైగా పాటలు, కొన్ని కథా సంపుటాలు, కళారంగంపై పలు వ్యాసాలు రాశారు.

నెత్తుటి మయమవుతున్న లాకప్‌లు

దేశంలో గత పదేళ్లలో 14,231 మంది పోలీసు నిర్బంధంలో మరణించారని ఆసియన్ సెంటర్ ఫర్ హ్యూమన్ రైట్స్ (ఎసిహెచ్‌ఆర్) సంస్థ పేర్కొంది. వీరిలో 1,504 మంది పోలీసు కస్టడీలో మరణించగా, మిగిలిన వారు జ్యుడిసియల్ కస్టడీలో మరణించారని ఆ సంస్థ వెల్లడించింది. 2001–2010 మధ్య తమ వద్దకు వచ్చిన కేసుల ఆధారంగా ఈ గణంకాలు రూపొందించామని ఎసిహెచ్‌ఆర్ పేర్కొంది. సంస్థ దృష్టికిరాని కేసులు, సైనిక దళాల చర్యలను సమీక్షించే అధికారం హక్కుల సంఘానికి లేదు గనుక ఆ వివరాలు కూడా ఇందులో లేవని తెలిపింది. 250 కస్టడీ మరణాలతో మహారాష్ట్ర మొదటి వరుసలో ఉండగా, ఉత్తరప్రదేశ్ 174, గుజరాత్ 134, ఆంధ్రప్రదేశ్ 109 తదుపరి స్థానాల్లో ఉన్నాయి. జైళ్లలో సంభవించిన మరణాల వివరాల్లోకి వెళితే 2,171తో ఉత్తరప్రదేశ్ తొలి స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో బీహార్ 1512, మహారాష్ట్ర 1176, ఆంధ్రప్రదేశ్ 1037 ఉన్నాయి.

గుజరాత్‌లో 31 మందికి జీవిత ఖైదు

గుజరాత్‌లో గోధ్రా రైలు దహనం తరువాత జరిగిన దాడులకు పాల్పడిన వారిలో 31 మందికి గుజరాత్ ప్రత్యేక న్యాయస్థానం జరిమానాతో సహా, జీవిత ఖైదు విధించింది. గుజరాత్‌లో జరిగిన మత హింసలో సర్దార్‌పురా ఊచకోత ఒకటి. ఈ ఊచకోతకు బాధ్యులుగా విచారణను ఎదుర్కొంటున్న 76 మందిలో 31 మందికి శిక్ష పడింది. గోధ్రా అనంతరం జరిగిన అల్లర్లకు సంబంధించి తొమ్మిది కేసులను సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ చేపట్టి, ముందుగా సర్దార్‌పురా కేసు విచారణ పూర్తి చేసింది. తొమ్మిదేళ్ల అనంతరం మెహసనా జిల్లాలోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఈ కేసుపై నవంబర్ 9న తీర్పు చెప్పింది.

ఇష్రత్‌ది పోలీసు హత్యే

ముంబైకి చెందిన ఇష్రత్ జహాన్ అనే కాలేజి విద్యార్థినితో పాటు ఆమె ముగ్గురు స్నేహితులను 2004 జూన్ 15న ఎన్‌కౌంటర్ పేరుతో అహ్మదాబాద్ పోలీసులు కాల్చిచంపారు. ఈ సంఘటనపై విచారణ జరిపిన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ తమాంగ్ అది బూటకపు ఎన్‌కౌంటర్ అని నివేదిక ఇచ్చారు. 2004 జూన్ 15న జరిగిందని చెబుతున్న ఎన్‌కౌంటర్ కంటే ముందుగానే ఇష్రత్, మరో ముగ్గురు మరణించినట్లు సిట్ తన నివేదికలో పేర్కొంది. ఈ ఘటనలో పాల్గొన్న పోలీసు అధికారులపై ఐపిసి సెక్షన్ 302 కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని జస్టిస్ జయంత్ పటేల్, జస్టిస్ అభిలాషా కుమారితో కూడిన ధర్మాసనం నవంబర్ 20న ఆదేశించింది.

యుపి విభజనకు అసెంబ్లీ ఆమోదం

ఉత్తరప్రదేశ్‌ను నాలుగు రాష్ట్రాలుగా విభజించడానికి ఆ రాష్ట్ర అసెంబ్లీ మూజువాణీ ఓటుతో విభజన తీర్మానాన్ని నవంబర్ 21న ఆమోదించింది. ఉత్తరప్రదేశ్‌ను పూర్వాంచల్, పశ్చిమప్రదేశ్, బుందేల్ ఖండ్, అవధ్ ప్రదేశ్‌లుగా విభజించాలని ఇందుకు అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరిచారు. బి.ఎస్పికి చెందిన 40 మంది ఎంఎల్ఎలు మాయవతిని సమర్థించడం లేదని బి.జె.పి., సమాజ్‌వాదీ పార్టీలు బి.ఎస్.పి ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి స్పీకర్‌కు నోటీసు ఇచ్చాయి. దీనికి కాంగ్రెస్ మద్దతు పలికింది. ప్రతిపక్ష పార్టీలు అవిశ్వాస తీర్మానంపై చర్చించాలని పట్టుబట్టాయి. తీవ్ర వాగ్వివాదాల మధ్యనే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌కు సభ ఆమోదం తెలిపింది. ఆ గందరగోళంలోనే మూజువాణీ ఓటుతో విభజన తీర్మాణాన్ని ఆమోదించింది.

సుఖ్‌రాంకు ఐదేళ్ల జైలు శిక్ష

మాజీ టెలికం శాఖ మంత్రి సుఖ్‌రాంకు సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం నవంబర్ 19న టెలికం అక్రమాల కేసులో ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. టెలికాం మంత్రిగా ఉన్నప్పుడు లాభదాయక కాంట్రాక్టును కట్టబెట్టినందుకు, 3 లక్షల రూపాయల లంచం తీసుకున్నందుకు ఈ శిక్ష పడింది. సుఖ్‌రాం తనకు విధించిన శిక్షను సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీ

ప్రపంచ జనాభా 700 కోట్లు

ప్రపంచ జనాభా 700 కోట్లు దాటింది. భారతదేశంలో ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో సమీపంలో అక్టోబర్ 31న పుట్టిన ఆడపిల్ల 700 కోట్ల సంఖ్యగా నమోదయింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అసమానతల కారణంగా కోట్లాది మంది ప్రజలు కనీసావసరాలకు సైతం నోచుకోలేకపోతున్నారని యుఎన్ఎఫ్‌పిఎ తెలిపింది. ప్రపంచ జనాభాలో 180 కోట్ల మంది 10 నుంచి 24 ఏళ్ల లోపు పిన్న వయస్కులే. ప్రస్తుతం 134.76 కోట్లతో అత్యధిక జనాభా కలిగిన దేశంగా చైనా ఉంది. 124.15 కోట్ల జనాభాతో భారతదేశం రెండో స్థానంలో ఉంది.

నైజీరియాలో దాడులు

నైజీరియా ఈశాన్య రాష్ట్రం యోబె రాజధాని డమాటూరులో పోలీస్ స్టేషన్లు, చర్చిలపై కొందరు తీవ్రవాదులు బాంబులు, తుపాకులతో దాడులు జరిపారు. నవంబర్ 4న జరిగిన ఈ దాడుల్లో 67 మంది మృతి చెందారు.

లిబియాకు కొత్త ప్రధాని

లిబియాలో గడ్డాఫీ శకం ముగిసిన తర్వాత ఆ దేశానికి తాత్కాలిక ప్రధానిగా జాతీయ అధికార మార్పిడి మండలి (ఎన్‌టిసి)కి చెందిన అబ్దుల్ రహీమ్ అల్ కీబ్ ఎన్నికయ్యారు. అక్టోబర్ 31న నిర్వహించిన ప్రత్యక్ష ఎన్నికలలో ఎన్‌టిసి సభ్యులు ఆయనను ఎన్నుకున్నారు. మానవ హక్కుల పరిరక్షణకు తమ మధ్యంతర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని కొత్త ప్రధాని కీబ్ హామీ ఇచ్చారు.

సార్క్ సమావేశాలు

17వ సార్క్ సమావేశాలు నవంబర్ 10-11న మాల్దీవ్ రాజధాని అద్దులో జరిగాయి. ఈ సమావేశాల్లో ఉగ్రవాదంపై కలసికట్టుగా పోరాడాలని, దక్షిణాసియాలో వాణిజ్యాన్ని సరళీకరించ డానికి దిగుమతులపై సుంకాల తగ్గింపు, రద్దునకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. నవంబర్ 11న ముగింపు సందర్భంగా దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం (సార్క్) కూటమి 'అద్దు డిక్లరేషన్' పేరుతో ప్రకటన విడుదల చేసింది. దక్షిణాసియా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (సాఫ్టా) పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నాయి. సార్క్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని మన్మోహన్ సింగ్ అఫ్ఘనిస్తాన్ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్, నేపాల్ ప్రధాని బాబూరాం భట్టారాయ్‌తో చర్చలు జరిపారు.

అంతరిక్ష నౌకల అనుసంధానం

మానవ రహిత అంతరిక్ష నౌకలు తియాన్‌గాంగ్-1, షెంఝౌ-8లను కక్ష్యలో చైనా విజయవంతంగా అనుసంధానం చేసింది. దీంతో సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు దిశగా చైనా అడుగులు వేస్తోంది. గత నెలలో పంపించిన తియాన్‌గాంగ్-1తో భూమికి 343 కిలోమీటర్ల ఎత్తులో నవంబర్ 2న పంపిన షెంఝౌ-8 తో కక్ష్యలో నవంబర్ 4న అనుసంధానం అయింది. ఈ రెండు నౌకలతో కూడిన వ్యవస్థ ఇప్పటికే భూమి చుట్టూ ఆరుసార్లు తిరిగిందనీ, అందులోని పరికరాలు సమర్థంగా పనిచేస్తున్నాయనీ చైనా 'మానవ రహిత అంతరిక్ష కార్యక్రమం' అధికార ప్రతినిధి తెలిపారు.

ఇటలీ ప్రధాని రాజీనామా

ఇటలీ ప్రధాని సిల్వియా బెర్లుస్కోనీ నవంబర్ 12న రాజీనామా చేశారు. దీంతో గడిచిన పదిహేడేళ్లలో పదేళ్లు కొనసాగిన ఆయన అధికారం ముగిసింది. యూరోజోన్ సంక్షోభం దెబ్బకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. బెర్లుస్కోనీ పాల్గొన్న చివరి సమావేశంలో ఇటలీ పార్లమెంట్‌లో ప్రభుత్వం ఆస్తుల విక్రయం, లేబర్ మార్కెట్ సరళీకరణలు తదితర ఆర్థిక సంస్కరణలను ఆమోదించింది. కాగా బెర్లుస్కోనీ స్థానంలో ఆర్థికవేత్త మారియో మౌంటీ ఇటలీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి. మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా మౌంటీని కోరే అంశంపై అధ్యక్షుడు నాపోలిటానో పార్టీతో చర్చలు జరిపారు.

ట్యునీషియా తాత్కాలిక అధ్యక్షుడు

ట్యునీషియాకి తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త, కాంగ్రెస్ ఫర్ ద రిపబ్లిక్ (సిపిఆర్) పార్టీ అధ్యక్షుడైన మొన్సెఫ్ మార్జౌకీని రాజకీయ పార్టీలు ఎన్నుకున్నాయి. గత అక్టోబర్‌లో జరిగిన ఎన్నికల్లో మొత్తం 217 అసెంబ్లీ సీట్లకుగాను ఎన్నాహ్దా పార్టీ 89 సీట్లను, సిపిఆర్ 29 సీట్లను గెలుచుకుని తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. మొన్సెఫ్ వృత్తి రీత్యా వైద్యుడు. ఆయన 'ట్యునీషియా లీగ్ ఫర్ హ్యూమన్ రైట్స్'కు నేతృత్వం వహించారు. ట్యునీషియా మాజీ అధ్యక్షుడు జైన్ ఎల్ అబిదీన్ బెన్ అలీకి వ్యతిరేకంగా పోరాడిన మొన్సెఫ్ 1994లో నాలుగు నెలలపాటు జైలులో గడిపారు.

'ఆక్యుపై వాల్‌స్ట్రీట్' ఆందోళన ఉధృతం

గత నెలలో ప్రారంభమైన 'ఆక్యుపై వాల్‌స్ట్రీట్' ఉద్యమం రోజు రోజుకూ విస్తరిస్తోంది. అమెరికాలో వాణిజ్య కూడలిలో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. జూకోటి పార్క్‌లో వేల సంఖ్యలో టెంట్లు వేసుకొని ఆందోళన ప్రదర్శనలు చేపట్టారు. పోలీసులు దాడిచేసి యాభై మందికి పైగా ఆందోళనకారులను అరెస్టు చేశారు. టెంట్లను ఖాళీ చేయించి వారిని తరిమికొట్టారు. కోర్టు జోక్యంతో తిరిగి ఆందోళకారులు వాల్‌స్ట్రీట్ వీధుల్లో ర్యాలీలుగా జూకోటి పార్కు చేరుకొని నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

లండన్ వీధుల్లో విద్యార్థుల ప్రదర్శన

లండన్‌లో ట్యూషన్ ఫీజుల పెంపుపై నవంబర్ 9న జరిగిన నిరసన ప్రదర్శనలో వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. లండన్‌లోని ట్రాఫల్‌గర్ స్క్వేర్ వద్ద టెంట్లు వేసి నిరసన తెలపడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసు, విద్యార్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇరవై మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీ

వీక్షణం 2011 సూచిక

జనవరి 2011 సంచిక : 114

ఫోకస్ : వనరులు, ప్రజలు, సమస్యలు, పోరాటాలు – ఎన్. వేణుగోపాల్

పాఠకుల వీక్షణం
పాలకులకు రైతులపై ఎంత ప్రేమ! (సంపాదకీయం)
గొంతెత్తేవారిని బెదిరించడానికే బినాయక్ సేన్‌కు శిక్ష;
నిజాలు బయటపెట్టడమే నేరం సంపాదకీయ వ్యాఖ్యలు
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈ నేల
బినాయక్ సేన్ కోర్టు ప్రకటన
కొండలను కొల్లగొడుతున్న దోపిడీ – సుజాత సూరేపల్లి
నిజం చెప్పినందుకే వికీలీక్స్‌పై దాడులు – జూలియన్ అసాంజె
ప్రజల కోసమే ప్రత్యేక తెలంగాణ – జంజర్ల రమేష్‌బాబు
వాటాల మార్కెట్టులో బి.ఎస్.ఎన్.ఎల్. – ఆర్.ఎస్. చౌహాన్
జి–20 సదస్సు – కుదరని ఏకాభిప్రాయం – ఎ. నర్సింహారెడ్డి
విప్రో ప్రేమ్‌జీ దాతృత్వం విద్య కోసమేనా? – కె. వేణుగోపాల్
విద్యారంగంలో ప్రత్యేక ఆర్థిక మండలాలు – కె. లక్ష్మినారాయణ
ఫ్రాన్స్ కార్మికవర్గపు వెలుగురేఖలు – పి. ప్రసాద్
చితికిపోతున్న చేనేతల బతుకులు – అందె నరసింహారావు
ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన – ఎస్. సరళా వందనం
ఆధ్యాత్మిక గురువుల బూటకత్వం – జావేద్ అఖ్తర్
భూగోళ వినాశనాన్ని అడ్డుకుందాం – డా. వందనా శివ
సమాజ దుస్థితికి సూచిక అసహజ మరణాలు – డి.వి. రామకృష్ణారావు, వై. రామచంద్రం
కాశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కు – సృజన, జూన్–జూలై 1990 సంచిక నుంచి
మానవ వనరుల వినియోగంతోనే ఆర్థికాభివృద్ధి – డా. తడకమళ్ల శేఖర్
గిరిజన ప్రజల సామాజిక, ఆర్థిక సంస్కృతులు – కొంగర కృష్ణప్రియ
సృష్టి ప్రతిపాదనలు – డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్
ఇరుగు పొరుగు
భూగోళం
అసహజ మరణాల సూచి – రాంకి, వై. రామచంద్రం

ఫిబ్రవరి 2011 సంచిక : 115

ఫోకస్ : శ్రీకృష్ణ కమిటీ నివేదిక

పాఠకుల వీక్షణం
పరిష్కారానికేనా శ్రీకృష్ణ కమిటీ? (సంపాదకీయం)
దొంగల పేరు చెప్పాలా, ఎంతమాట?!;
ప్రజాశక్తిని రుజువు చేస్తున్న టునీషియా, సూడాన్ (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈ నేల
నిజమైన ప్రజల మనిషి కన్నబిరాన్ – ఎన్. వేణుగోపాల్
వలస చట్టాల ప్రభావం – కె.జి. కన్నబిరాన్
నిజానికి ఈ దేశం ఆదివాసులదే – సుప్రీంకోర్టు తీర్పు
టునీషియా ప్రజా విజయగాథ – రాజవరం పార్థసారథి
మళ్లీ మొదలైన గుజ్జర్ల ఆందోళన – నుగునుతుల వెంకటరమణ
బినాయక్‌సేన్‌కు శిక్ష దేనికి శిక్ష? – చిమ్మె జాన్ బర్నబాస్
మనువాద రాజ్యస్థాపనకే హిందుత్వ ఉగ్రవాదం – ఎ. నర్సింహారెడ్డి
❖ శ్రీకృష్ణ కమిటీ నివేదిక – – వి. హనుమంతరావు
❖ శ్రీకృష్ణ కమిటీ నివేదిక – పూర్వాపరాలు – ఆర్.ఎస్. చౌహాన్
❖ శ్రీకృష్ణ కమిటీ కాదు, దుగ్గల్ కమిటీ ఇది – మాడభూషి శ్రీధర్
❖ పరిష్కార మార్గాలు ఆలోచించాలి – చలసాని శ్రీనివాస్
❖ తప్పుల తడక కమిటీ నివేదిక – శ్రీధర్‌రావు దేశ్‌పాండే
అభివృద్ధి పథంలో రాజ్యహింస – వరవరరావు
ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన – 2 – ఎస్. సరళా వందనం
కుల సమస్య సారాంశంలో వర్గ సమస్యే – సత్యం
కోస్టల్ కారిడార్‌ను రద్దుచేయాలి – తుంపాల శ్రీరామమూర్తి
ఆదివాసుల వర్గీకరణ జరగాలి – వూకే రామకృష్ణ
పుస్తకంపై ఆసక్తి తగ్గలేదు – వై. రామచంద్రం, సి. రాజశేఖర్, ఎ. మల్లేష్, వై.నర్సింలు
అపోహలూ, గుడ్డి నమ్మకాలూ – డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్
ఇరుగు పొరుగు
భూగోళం
అసహజ మరణాల సూచి – రాంకి, వై. రామచంద్రం

మార్చ్ 2011 సంచిక : 116

ఫోకస్ : అరబ్ ప్రజా ఉద్యమాల వెల్లువ

పాఠకుల వీక్షణం
ఇన్ని సమస్యలతో రాష్ట్ర పయనం ఎటు? (సంపాదకీయం)
దొంగల రాజ్యంలో మరొక స్పెక్ట్రమ్ కుంభకోణం;
ఈజిప్ట్, సిరియా, బహ్రెయిన్, లిబియా... (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈ నేల
❖ అరబ్ ప్రపంచంలో ప్రజా ఉద్యమాలు – ఎ. నరసింహారెడ్డి
❖ నాసర్ నుంచి ముబారక్ వరకు – ఎరిక్ రుడర్
❖ అమరులకు వందనం – విప్లవానిదే విజయం – ఈజిప్ట్ రెవల్యూషనరీ సోషలిస్టులు
❖ ప్రపంచ గమనానికి మలుపు – అరబ్బు ఉద్యమాలు – పి. ప్రసాద్
❖ అరబ్ ప్రజల కదలిక నేర్పుతున్నదేమిటి? – ఎన్. వేణుగోపాల్
❖ తెలుగు ఆలోచనాపరుల అభిప్రాయాలు : సూరేపల్లి సుజాత, గోగు శ్యామల, లతీఫ్ మొహమ్మద్ ఖాన్, ఎస్. భూమన్, సురవరం సుధాకరరెడ్డి, రమా మెల్కోటె, ఆకుల భూమయ్య, ప్రొ. కె. జయశంకర్, ఎ.బి.కె. ప్రసాద్
మన గుట్టలను ధ్వంసం చేస్తే... – తోటపల్లి జగన్మోహనరావు
ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థుల కోసమా? – సిలువేరు హరినాథ్
తెలంగాణకు కావలసింది మిలిటెంట్ పోరాటాలు – ఆత్రం రామారావు
తెలంగాణ – సహాయ నిరాకరణ – యాటెల్లి రామచంద్రం
జ్యోతిష్యం శాస్త్ర విజ్ఞానమట! – డి.వి. రామకృష్ణారావు
మహిళా దినోత్సవం – ఒక ఎరుక, హెచ్చరిక – కాత్యాయనీ విద్మహే
మల్లపోలమ్మ స్ఫూర్తితో ఉత్తరాంధ్ర మహిళ – కె.ఎన్. మల్లీశ్వరి
అంతర్జాతీయ మహిళా దినోత్సవ కర్తవ్యాలు – డా. నళిని
నిషిద్ధ సంస్థ సభ్యుడు కావడం నేరం కాదు! – సుప్రీంకోర్టు తీర్పు
కన్నీరొలుకుతున్న కరవాక – నక్కా హేమా వెంకట్రావ్
ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన – 3 – ఎస్. సరళా వందనం
వీక్షణం రచయితల సమావేశం
మంత్రాలూ, చింతకాయలూ – డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్
ఇరుగు పొరుగు
భూగోళం
అసహజ మరణాల సూచి – రాంకి, వై. రామచంద్రం

ఏప్రిల్ 2011 సంచిక : 117

ఫోకస్ : 2011–12 కేంద్ర , రాష్ట్ర బడ్జెట్లు

పాఠకుల వీక్షణం
మిలియన్ మార్చ్, విధ్వంసం, ఎనిమిదో అధ్యాయం... (సంపాదకీయం)
భారత పాలన గురించి వికీలీక్స్ నిజాలు;
సామ్రాజ్యవాదమే ప్రపంచ ప్రజల అసలు శత్రువు (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈ నేల
కాకరాపల్లి ప్రజలు అడుగుతున్నదేమిటి? – యాటెల్లి రామచంద్రం
హిరోషిమా నుంచి ఫుకుషిమా దాకా – జొనాథన్ షెల్
లిబియాపై విదేశీ సైనిక చర్య మానవతేనా? – ఎ. నరసింహారెడ్డి
లిబియాపై యుద్ధోన్మాద దాడుల నేపథ్యం – పి. ప్రసాద్
నిప్పుల కుంపటిపై అరబ్ ప్రపంచం – నోమ్ ఛామ్‌స్కీ
'మిలియన్ మార్చ్'కు కోటి వందనాలు... – ఎస్. కిశోర్ కుమార్
తెలంగాణ ఉద్యోగుల పోరాటస్ఫూర్తి – కె. ప్రభాకర్
పీడిత వర్గాల ఐక్యత కావాలి – ఎం. కృష్ణ ఆదిత్య
❖ 2011–12 బడ్జెట్ పరిశీలన – ఆర్.వి. రమణమూర్తి
❖ ఎవరెంతో వారికంత రాని బడ్జెట్ – పాపని నాగరాజు
❖ ఈ బడ్జెట్ ఎవరి అభివృద్ధికి? – వి. హనుమంతరావు
మానసిక యుద్ధం – భౌతిక విధ్వంసం – వరవరరావు
కృష్ణా జలాల పంపిణీ వివాదం ఎందుకు? – ఎన్. వేణుగోపాల్
సూక్ష్మ రుణ వడ్డీ వ్యాపారం – ప్రజాస్వామ్య విద్రోహం – కె. విజయకుమార్
గోధ్రా తీర్పు – న్యాయం ఎటువైపు? – రాం పునియాని
ఈ ఆకలి పాలక విధానాల సృష్టే – డా. వందనాశివ
తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం – ఎం. డి. సర్దార్, మామిడాల శ్యామ్‌సుందర్, మునుకుంట్ల శ్రీనివాస్
స్వాతంత్ర్యోద్యమంలో పత్రికల పాత్ర – సింగతి వెంకటేశం, సుందరగిరి శ్రీనివాస్
ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన – 4 – ఎస్. సరళా వందనం

స్వాతంత్ర్యానంతరం స్త్రీ స్థితి – గ్గెని రవీందర్, వడ్డెపల్లి లలిత, పంజాల అశోక్
మతాల హిప్నాసిస్ – డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్
ఇరుగు పొరుగు
భూగోళం
అసహజ మరణాల సూచి – రాంకి, వై. రామచంద్రం

మే 2011 **సంచిక : 118**

ఫోకస్ : అభివృద్ధి పథకాలు – అభివృద్ధా? విధ్వంసమా?

పాఠకుల వీక్షణం
దేవుడి క్షేమం కోరే భక్తులు, ఆస్తుల పంపకంలో దేవుడు! (సంపాదకీయం)
లోక్‌పాల్ లేకనేనా అవినీతి సాగేది?!;
ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్.ల ఆర్తనాదాలు (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈ నేల
అవినీతి నిర్మూలనకు అవినీతిపరుల మద్దతా? – ఎ. నర్సింంహారెడ్డి
అవినీతి – పౌర సమాజం – నైతికత – జి. లచ్చయ్య
బాధిత ఆదివాసులను కలవడమే నేరమా? – కవితా శ్రీవాత్సవ
బయటపడిన శ్రీకృష్ణ రెండో నాలుక – మాడభూషి శ్రీధర్
ఎవరి కోసం ఈ ఉప ఎన్నికలు? – పి. వరలక్ష్మి
ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు – సి. రాజశేఖర్
తెలంగాణానంతర దిశ ఆలోచిద్దాం... – సుధా కిరణ్
అప్రజాస్వామిక ఉత్తర్వు – జి.ఒ. 177 – లోకే రాజ్‌పవన్
❖ సోంపేట, కాకరాపల్లి బాటలో కనపర్తి – చిట్టిపాటి వెంకటేశ్వర్లు
❖ ముంచుకొచ్చిన అణు ప్రకంపనలు – డా. కె. సత్యలక్ష్మి, కె. సజయ
❖ గనుల్లో రాజకీయ మాఫియా – కె. నాగేశ్వరాచారి
❖ ఉత్తరాంధ్ర వెలుగు నీడలు – పి. కృష్ణారావు
❖ ప్రజల అభివృద్ధి ప్రజాయుద్ధంలో భాగమే – గురూజీల బృందం
అణు విద్యుత్ – ప్రజల ప్రాణాలతో చెలగాటం – పి.వి. రమణ
ఆదివాసుల రగల్ జెండా పోరాటం – బి. వేణుగోపాల్ రెడ్డి
ఎస్.సి., ఎస్.టి. అత్యాచార నిరోధక చట్టం – చిమ్మె జాన్ బర్నబాస్
అడవిపై సామ్రాజ్యవాదుల కన్ను – సి.ఎస్. పొదిల ఆజాద్
రైతుల ఆత్మహత్యలకు ఎక్స్‌గ్రేషియా ఎక్కడ? – బి. కొండల్ రెడ్డి
రికవరీ కేసులు – స్వర్ణకారుల గోసలు – ఏలేశ్వరం వెంకటేశ్
ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన – 5 – ఎస్. సరళా వందనం
కొత్త మెడికల్ కోర్స్‌కు ఆహ్వానం – డా. రాపోలు సత్యనారాయణ
'అతీంద్రియ' పరిశోధనల చరిత్ర – డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్
ఇరుగు పొరుగు
భూగోళం
అసహజ మరణాల సూచి – రాంకి, వై. రామచంద్రం

జూన్ 2011 **సంచిక : 119**

ఫోకస్ : పాఠశాల విద్యారంగం – సమస్యలూ, సవాళ్లూ

పాఠకుల వీక్షణం
రైతాంగ సమస్యలపై రాజకీయపక్షాల పోరు (సంపాదకీయం)
ఎన్నికల ఫలితాలు ప్రజల అసంతృప్తి వ్యక్తీకరణ;
'ఉగ్రవాది' ఒసామాను చంపిన మహోగ్రవాది ఒబామా (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈ నేల
ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ప్రజా చైతన్యం – భరణి
సాయిబాబా – సమాధానం లేని ప్రశ్నలు – జి. లచ్చయ్య
లాడెన్‌పై సామ్రాజ్యవాదుల నిందా ప్రచారాలు – పి. ప్రసాద్
బస్తర్‌ను ముంచెత్తనున్న బోధ్‌ఘాట్ ప్రాజెక్ట్ – బి.డి. దమయంతి
ప్రజాభిప్రాయ సేకరణా? సంహరణా? – ఎన్. వేణుగోపాల్
'ముస్లింలలో అసంతృప్తికి మనమే కారణం' – నెహ్రూ – మహబూబ్ బాషా
బెంగాల్ వామపక్ష ప్రభుత్వం – ఆదివాసులు – భాను సర్కార్
కలెక్టర్ నిర్బంధం – డిమాండ్లు – ప్రకాశ్ సింగ్ – భాస్కర్
చౌక వైద్యమా? చౌకబారు వైద్యమా? – ఇ.ఎస్. బ్రహ్మచారి
❖ అందరికీ విద్య ఇంకెంత దూరం? – రమేష్ పట్నాయక్
❖ వధ్యశిలపై పాఠశాల విద్య – ప్రమాణాలు – కె. ప్రభాకర్
❖ తెలుగు బోధనలో దృక్పథాల పాత్ర – జి. శ్రీనివాసాచార్యులు
❖ పాఠశాల విద్య – విఫల ప్రయోగాలు – కె. వేణుగోపాల్
తెలుగు పత్రికారంగంలో స్త్రీలు – ఎన్. యాకయ్య
మైక్రో ఫైనాన్స్ సంస్థల పక్షమా? ప్రజల పక్షమా? – సిలువేరు హరినాథ్
భారత ఆర్థికాభివృద్ధి – సామాజిక న్యాయం – డా. గోలక్ బీహారీనాథ్
సంస్మరణ – హక్కుల చిరునామా.. బుర్రా రాములు – సాదు రాజేష్

స్త్రీ విముక్తి మరో కోణం – ఆశాలత
నిర్దిష్ట దృక్పథానికి పునాది ఈ 'కొత్తచూపు' – విద్యాభూషణ్
మానవాభివృద్ధి నివేదిక – చీకోటి శ్రీనివాస్
విద్యా హక్కు చట్టం – 2009 – ఎం. సంజీవరెడ్డి, ఎం. రాజేందర్ రెడ్డి
ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన – 6 – ఎస్. సరళా వందనం
ఇరుగు పొరుగు
భూగోళం
అసహజ మరణాల సూచి – రాంకి, వై. రామచంద్రం

జూలై 2011 **సంచిక : 120**

పాఠకుల వీక్షణం
ప్రజల పట్ల శ్రద్ధలేని పాలకులు (సంపాదకీయం)
అసలు సమస్యలను మసకబార్చే 'అవినీతి వ్యతిరేకత';
ఎప్పటికైనా రాజపక్షను శిక్షిస్తారా? (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈ నేల
మనిషి కేంద్రంగా ఆలోచించిన మనిషి – వై. రామచంద్రం
ఆర్.ఎస్. రావను స్మరించుకోవడమంటే.. – డి.వి. రామకృష్ణారావు
అదృశ్యమైన ధృవతార ఆర్.ఎస్. రావు – ఎన్. వేణుగోపాల్
సంస్మరణ – మాధవస్వామి
సంభాషించే ప్రయత్నంలో.. – ప్రొఫెసర్ ఆర్.ఎస్. రావు
నా విద్యాలయం – తెలంగాణ ఆకాంక్ష – ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్
సంస్మరణ – నటరాజ రామకృష్ణ
అవినీతికి వ్యతిరేకంగా రాందేవ్ దీక్ష – రామ్ పున్యాని
పుట్టపర్తిలో ఏం జరుగుతోంది? – బాబు గోగినేని
ప్రణాళికా వ్యవస్థకు ప్రణాళిక ఉందా? – వి. హనుమంతరావు
మరో సింగూరుగా ప్రాణహిత – చేవెళ్ల – తోటపల్లి జగన్మోహనరావు
లేసు పరిశ్రమలో మహిళా కార్మికులు – కె. సుభాషిణి
వీరవనిత అయిలమ్మ యాదిలో.. – ఎస్. నీళాదేవి
ఉత్తరాంధ్ర ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా – పి. కృష్ణారావు
మానుకోట నుండి మిలియన్ మార్చ్ దాకా.. – పిట్టల రవీందర్
'విశాలాంధ్రలో ప్రజారాజ్యం'లో ఏముంది? – ఆర్.జె. రాంపల్లి
సంస్మరణ – ప్రత్తిపాటి వెంకటేశ్వర్లు
రెండో దశకు చేరిన 'ప్రజలపై యుద్ధం' – అమన్
కాఫీ ప్లాంటేషన్ – ఆదివాసుల ఆందోళన – ఎం. నాగమణి
సోషలిజం భ్రమా? అవినీతి వాస్తవమా! – వీర బ్రహ్మాచారి
లాడెన్‌పై సామ్రాజ్యవాదుల నిందా ప్రచారాలు – పి. ప్రసాద్
అణుశక్తి అంటే ఏమిటి? – డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్
ఇరుగు పొరుగు
భూగోళం
అసహజ మరణాల సూచి – రాంకి, వై. రామచంద్రం

ఆగస్ట్ 2011 **సంచిక : 121**

ఫోకస్ : ఆగస్ట్ 15 స్వాతంత్ర్యం ఎంత నిజం? ఎంత అబద్ధం?

పాఠకుల వీక్షణం
అనైతిక రాజకీయాలకు అద్దం రాజీనామాల ఘట్టం (సంపాదకీయం)
రాజా అప్రూవర్ ప్రకటన – 'అందరం దొంగలమే'!;
యూరప్ అశాంతి దేనికి సంకేతం? (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈ నేల
విశ్వవిద్యాలయాల విధ్వంసానికే బిల్లులు – డా. కె. లక్ష్మీనారాయణ
నెల్లూరు గుండెలపై కుంపట్లు – ఎన్. వేణుగోపాల్
సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పులు – రాజవరం పార్థసారథి
ప్రజల పాటకు ప్రతిఫలం మరణశిక్ష – ఒక విలేఖరి
వ్యవసాయ సంబంధాల సిద్ధాంతం దిశగా.. – ఆర్.ఎస్. రావు
గ్రీస్, స్పెయిన్ ప్రజా ఆందోళనలు – ఎ. నర్సింంహారెడ్డి
ప్రమాదం అంచున కుంటాల జలపాతం – పిట్టల రవీందర్
రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు – వై. రామచంద్రం
పేదరికంపై ఔషధ ప్రయోగాలు – ఎస్. కిషోర్
అవన్నీ హిందీ రాష్ట్రాలు కావు – మరింగంటి అప్పలాచారి
❖ చీకటిలోంచి చీకటిలోకి.. – లోకే రాజ్‌పవన్
❖ అభివృద్ధి నమూనా – రెండు ముఖాలు – ఎస్. శేషయ్య
❖ ఇది స్వరాజ్యమేనా? – వి. హనుమంతరావు
రాజ్యాంగ విధి విధానాలు ఎవరికోసం? – దాసరి స్రవంతి
పిల్లలపై దండనలు అమానుషం? – బి. రామకృష్ణ
రెండో దశకు చేరిన 'ప్రజల పై యుద్ధం' – అమన్
లాడెన్‌పై సామ్రాజ్యవాదుల నిందా ప్రచారాలు – పి. ప్రసాద్

ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన – 7 – ఎస్. సరళావందనం
యురేనియం స్వరూప స్వభావాలు – డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్
శ్రీలంక సంపాదకీయ వ్యాఖ్యపై విమర్శ – ఎస్. కృష్ణమూర్తి
ఇరుగు పొరుగు
భూగోళం
అసహజ మరణాల సూచి – రాంకి, వై. రామచంద్రం

సెప్టెంబర్ 2011 **సంచిక : 122**

ఫోకస్ : ఇరవై ఏళ్ల ప్రపంచీకరణ

పాఠకుల వీక్షణం
మరోసారి రుజువవుతున్న 'అందరూ దొంగలే' (సంపాదకీయం)
రామలీల మైదానంలో వ్యవస్థ దింపుడు కళ్లం;
పతనం అంచున సామ్రాజ్యవాదం (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈ నెల
సృష్టించిన ప్రజలదే ఈ సంపద – కె.వి. కూర్మనాథ్
సంస్మరణ – వేగుంట మోహన్ ప్రసాద్ (మో)
బ్రిటన్‌లో ప్రజాగ్రహ జ్వాలలు.. – ఎ. నరసింహారెడ్డి
లండన్ ఎందుకు తగలబడింది? – డా. జి. లచ్చయ్య
తిరగబెడుతున్న మరొక మాంద్యం – ఇ.ఎస్. బ్రహ్మచారి
బతుకును హరిస్తున్న 'అభివృద్ధి' – డి.వి. రామకృష్ణారావు
అక్షరాలతో ఘోరాలు – మర్డోక్ నేరాలు – మాడభూషి శ్రీధర్
వ్యవసాయ సంబంధాల సిద్ధాంతం దిశగా.. – 2 – ఆర్.ఎస్. రావు
పతనానికే అమెరికా యుద్ధం – పి. ప్రసాద్
❖ ప్రజా ఉద్యమాల ప్రపంచీకరణ జరగాలి – వి. హనుమంతరావు
❖ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ – కొన్ని వ్యక్తీకరణలు – వరవరరావు
❖ ప్రపంచీకరణ అనుభవాలు – ప్రజల పాలిట శాపాలు – ప్రొ. కె.ఆర్. చౌదరి
❖ ప్రపంచీకరణ – ఇవాల్టి స్థితి – ఎన్. వేణుగోపాల్
భారతదేశంలో భూస్వామ్య విధానం ఉందా? – రమేష్ పట్నాయక్
ప్రత్యామ్నాయ ప్రజా ఆర్థిక విధానాలు – అనుభవం – సోను
ఎస్.టి. జాబితా – లంబాడీలు – మైపతి అరుణ్‌కుమార్
కాపీ ఆధారిత పరీక్షలు – ప్రభావం – బి. మల్లయ్య
వ్యవసాయానికి ఉపాధి హామీ పథకం – బండారి ఐలయ్య
దళితులపై హిందూ బందిఖానాలు – జూపాక సుభద్ర
గొలుసుకట్టుగా అణువిచ్ఛిత్తి – డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్
ఆలోచనల గూటికి పుల్లా పుడకా
ఇరుగు పొరుగు
భూగోళం
అసహజ మరణాల సూచి – రాంకి, వై. రామచంద్రం

అక్టోబర్ 2011 **సంచిక : 123**

ఫోకస్ : అవినీతి వ్యతిరేక ఉద్యమాలు

పాఠకుల వీక్షణం
ప్రజల సమస్యలు పట్టని బధిరాంధ పాలకులు (సంపాదకీయం)
నరహంతకుడే భావి భారత ప్రధాని!;
అధికారికంగా సామ్రాజ్యవాద సంక్షోభ వార్తలు (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈ నెల
ఆంధ్రప్రదేశ్ – ప్రపంచబ్యాంక్ అప్పు – ప్రొ. జి. హరగోపాల్
మారుతి సుజుకి కార్మికుల పోరాటం – పి.వి. రమణ
ఉరిశిక్షలు రద్దు కావాలి – డి.వి. రామకృష్ణారావు
మల్కన్‌గిరిలో ఏం జరుగుతోంది? – శ్రీరాముల శ్రీనివాస్
దేశ ఆర్థిక పరిస్థితిపై కారుమబ్బులు – వి. హనుమంతరావు
ఎరువుల కోసం ఎవుసం పాట్లు – ఎన్. భగవాన్ రెడ్డి
ఛిద్రమవుతున్న ఆహార భద్రత! – విద్యాభూషణ్
❖ హజారే ఉద్యమం – ప్రత్యామ్నాయం – ఎస్. శేషయ్య
❖ అవినీతి నియంత్రణ పౌర సమాజానికి సాధ్యమా? – వాసిరెడ్డి భాస్కరరావు
❖ అవినీతి సమస్య – మార్క్సిస్ట్ అవగాహన – లోకే రాజ్‌పవన్
వ్యవసాయ సంబంధాల సిద్ధాంతం దిశగా.. – 3 – ఆర్.ఎస్. రావు
భారతదేశంలో భూస్వామ్య విధానం ఉందా? – రమేష్ పట్నాయక్
పర్యావరణ విధ్వంసం మానవ మనుగడకు చేటు – ఎ. నరసింహారెడ్డి
ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన – 8 – ఎస్. సరళా వందనం
సంస్మరణ – నండూరి రామమోహనరావు
సామ్రాజ్యవాద పెట్టుబడి – ఐక్య ప్రజాపోరాట వేదిక – బి.ఎస్. రాజు
మంచి తీర్పు – చెడు ఫలితాలు – చెరుకూరి సత్యనారాయణ
అణు బాంబుల ప్రయోగాలు – డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్
ఆలోచనల గూటికి పుల్లా పుడకా
ఇరుగు పొరుగు
భూగోళం
అసహజ మరణాల సూచి – రాంకి, వై. రామచంద్రం

నవంబర్ 2011 **సంచిక : 124**

ఫోకస్ : సకల జనుల సమ్మె

పాఠకుల వీక్షణం
మేధావులకు సకల జనుల సమ్మె పాఠాలు (సంపాదకీయం)
నెత్తుటి చాలు పోసే అద్వానీ రథయాత్ర;
వాల్‌స్ట్రీట్ ముట్టడి, గడ్డాఫీ హత్య (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈ నెల
❖ సకల జనుల సమ్మె : విజయాలు – వైఫల్యాలు – శ్రీధర్ దేశపాండే
❖ చిత్తశుద్ధిలేని పోరాటం – డా. ప్రభంజన్ యాదవ్
❖ సకల జనుల సమ్మె – సామాన్యుల ఇబ్బందులు – చలసాని శ్రీనివాస్
❖ సకల జనుల సమ్మెను ఎలా చూడాలి? – ఎన్. వేణుగోపాల్
తెలంగాణ – సంఘ్ పరివార్ ఎజెండా – వరవరరావు
ప్రపంచీకరణ వ్యతిరేక నిరసన జ్వాలలు – ఎ. నర్సింహా రెడ్డి
'పెట్టుబడిని ముట్టడిద్దాం' – కె.వి. కూర్మనాథ్
బీళ్లుగా మారుతున్న పంట భూములా – వై. రామచంద్రం
మతహింస బిల్లు – పూర్వాపరాలు – మహమ్మద్ లతీఫ్ ఖాన్
సామాజిక న్యాయం నుంచి సమాజ ద్రోహం వరకు.. – ఎస్. కిశోర్ కుమార్
సంస్మరణ – తుమ్మల వేణుగోపాల రావు
భూసేకరణ చట్టం–2011: నేపథ్యం – ముదునూరి భారతి
కోటి లోపాల కొత్త బిల్లు – లోకే రాజ్‌పవన్
భూసంస్కరణ విధానాలు – ఒక సమీక్ష – ఎం. కోదండరాం, కె. సీతారామారావు
మరో జాదూగూడ కానున్న కడప – పి. వరలక్ష్మి
సంస్మరణ – రాజ్ బహదూర్ గౌర్
భాషాప్రయుక్త రాష్ట్రాలపై అంబేద్కర్ – ఎం. కృష్ణ ఆదిత్య
భారతదేశంలో భూస్వామ్య విధానం ఉందా?– 3 – రమేష్ పట్నాయక్
మల్కన్‌గిరిలో ఏం జరుగుతోంది? – 2 – శ్రీరాముల శ్రీనివాస్
ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన – 9 – ఎస్. సరళా వందనం
హైడ్రోజన్ బాంబు భౌతిక సూత్రాలు – డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్

ఆలోచనల గూటికి పుల్లా పుడకా
ఇరుగు పొరుగు
భూగోళం
అసహజ మరణాల సూచి – రాంకి, వై. రామచంద్రం

డిసెంబర్ 2011 **సంచిక : 125**

ఫోకస్ : 'ఆక్యుపై వాల్‌స్ట్రీట్' నిరసనలు చెబుతున్నదేమిటి?

పాఠకుల వీక్షణం
తెలంగాణ, కరవు, సిబిఐ విచారణలు, రచ్చబండ.. (సంపాదకీయం)
ఉత్తర ప్రదేశ్ విభజన – అవకాశవాదపు మరో ముఖం;
కుప్పకూలుతున్న యూరోజోన్ ఆర్థిక వ్యవస్థ (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈ నెల
అద్వానీ రథయాత్ర – డి.వి. రామకృష్ణారావు
సమస్యల వలయంలో మన్మోహన్ ప్రభుత్వం – వి. హనుమంతరావు
రెండేళ్ల ప్రత్యేక తెలంగాణ ఉద్యమం – సి. కాశీం
కాగల కార్యం తీర్చిన సకల జనుల సమ్మె – గొడిశాల వెంకటేశ్వర్లు
లిబియా దురాక్రమణ – గడ్డాఫీ హత్య – ఎ. నర్సింహారెడ్డి
సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం – ఎస్. శేషయ్య
❖ 'వాల్‌స్ట్రీట్ ఆక్రమణ' ఉద్యమ గమనం – గమ్యం – పి. ప్రసాద్
❖ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల ఆవశ్యకత – పి.వి. రమణ
❖ మనం ఎందుకు ఆక్రమించాలి? – జాన్ బెల్లమీ ఫాస్టర్
❖ కొత్తదారులు చూపుతున్న ఉద్యమం – రేమండ్ లొట్టా
❖ భవిష్యత్తుని సొంతం చేసుకుందాం! – నోమ్ చామ్‌స్కీ
స్వదేశీయత, విదేశీయతలోని మూలాలు – డా. జి. సాంబశివరెడ్డి
తెలుగునాట బౌద్ధక్షేత్రాలు – ఎన్. లక్ష్మీదేవి
భూసంస్కరణ విధానాలు – ఒక సమీక్ష–2 – ఎం. కోదండరాం, కె. సీతారామారావు
భారతదేశంలో భూస్వామ్య విధానం ఉందా?– 4 – రమేష్ పట్నాయక్
మల్కన్‌గిరిలో ఏం జరుగుతోంది? – 3 – శ్రీరాముల శ్రీనివాస్
ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ పరిపాలన – 10 – ఎస్. సరళా వందనం
అణు ఇంధన పదార్థాలు – డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్
ఆలోచనల గూటికి పుల్లా పుడకా
ఇరుగు పొరుగు
భూగోళం
వీక్షణం – 2011 విషయ సూచిక
అసహజ మరణాల సూచి – రాంకి, వై. రామచంద్రం

అసహజ మరణాల సూచి

సంకలనం : రాంకి, వై. రామచంద్రం


మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(ఈ సంవత్సరం మొత్తం అసహజ మరణాల పాలైన వారి సంఖ్య –21 నవంబర్ 2010 నుండి 20 నవంబర్ 2011 వరకు 22616)


జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక,			గుర్తు		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు,	మిస్సింగ్/ లాకప్	ప్రకృతి
		వ్యవసాయ	చేనేత	ఇతరాలు									పనిచేసే	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
జనవరి '11	2	124	10	160	251	89	110	36	38	68	72	83	57	82	636	309	–	–	3	48	25
ఫిబ్రవరి '11	3	269	6	205	264	84	129	42	31	76	56	85	45	51	675	256	–	1	–	21	14
మార్చ్ '11	3	75	7	164	185	35	70	21	16	41	48	81	45	57	413	150	–	–	1	10	4
ఏప్రిల్ '11	1	69	13	202	267	74	87	26	33	69	68	77	76	83	535	319	4	–	–	42	7
మే '11	4	51	6	197	222	72	101	31	34	65	61	75	63	91	518	319	1	1	1	31	26
జూన్ '11	5	48	12	231	234	62	95	29	38	86	57	72	82	82	628	324	–	–	–	17	208
జూలై '11	5	47	3	163	167	91	87	28	30	53	52	89	98	91	463	204	–	–	1	18	62
ఆగస్ట్ '11	3	47	11	168	195	65	85	22	28	69	71	94	74	92	425	234	–	–	–	20	17
సెప్టెంబర్ '11	1	48	2	140	182	51	83	32	32	41	41	63	69	71	325	211	–	–	–	26	21
అక్టోబర్ '11	1	56	3	182	217	70	128	70	34	100	70	69	88	106	429	307	–	1	–	22	21
నవంబర్ '11	1	63	4	173	198	91	108	50	39	73	56	74	66	61	383	264	2	–	0	10	28
డిసెంబర్ '11	2	117	6	180	231	100	165	78	29	70	65	93	46	66	469	267	–	–	–	32	16
మొత్తం	31	1014	83	2165	2613	884	1248	465	382	811	717	955	809	933	5899	2845	7	3	6	297	449

అందిస్తున్నవారు : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎల్. సంతోష్; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఎక్బాల్; నల్గొండ – గొడిశాల వెంకటేశ్వర్లు; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – ఎస్. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్; అనంతపూర్ – కె. నాగేశ్వరచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – దస్తగిరి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; గుంటూరు – బి. అంజమ్మ ; నెల్లూరు – బాలగురువయ్య; శ్రీకాకుళం – జి. సుధీర్; ప్రకాశం – ఎల్. సాంబశివరావు, విజయనగరం – డి. సుధాకర్


వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు




కొత్తచూపు
పేజీ 295, రు.120




అభివృద్ధిని ఇలా చూద్దాం
పేజీ 205, రు.80



మీరు–నేను– ఆర్థికం
పేజీ 215, రు.60




ఒక దళారీ పశ్చాత్తాపం
పేజీ 172, రు.50




కుట్రాజకీయం
పేజీ 114, రు.40




ఇన్ సెర్చ్ ఆఫ్ మెథడ్
పేజీ 367, రు.200




ఇండివిడ్యుల్ సబ్–గ్రూప్స్ గ్రూప్స్ అండ్ ఫ్రీడం
పేజీ 59, రు.75




క్రైసిస్ అండ్ డెవెలప్‌మెంట్ ఇన్ మార్క్సియన్ ఫ్రేంవర్క్
పేజీ 105, రు.80




ఆన్ ఎడ్యుకేషన్
పేజీ 142, రు.100




మెథెడోలజీ ఆఫ్ సోషల్ ఎన్క్వైరీ
పేజీ 201, రు.150




ఫిఫ్టీ ఇయర్స్
ఆఫ్
ఆంధ్రప్రదేశ్
1956 – 2006
పేజీ 568, రు.300



రాబందు వాలిన నేల
పేజీ 408, రు.180




లేచినిలిచిన తెలంగాణ
పేజీ 303, రు.120



కల్లముందరి చరిత్ర
పేజీ 309, రు.80




పరిచయాలు
పేజీ 194, రు.50



గంగానమ్మ
పేజీ 61, రు.15




పావురం
పేజీ 109, రు.30




నవలాసమయం
పేజీ 176 రు.50



విశ్వాంతరాళం
పేజీ 189, రు.90




మానవ పరిణామం
పేజీ 211, రు.90



జీవకణాలూ – నాడీకణాలూ
పేజీ 184, రు.80



జాత్యహంకారి హిట్లర్
పేజీ 171, రు.80



రాబందు నీడ
పేజీ 111, రు.25

డిసెంబర్ 1 నుంచి 11 వరకు హైదరాబాద్ నిజాం కాలేజ్ గ్రౌండ్స్‌లో జరిగే 'హైదరాబాద్ బుక్ ఫెయిర్'లో వీక్షణం స్టాల్ ఉంది

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 125 -December 2011 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482● Published on 29/11/2011 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2011-13

వీక్షణంకు చేయూతనివ్వండి...

మీ ఆదరాభిమానాలతో త్వరలో పదో సంవత్సరంలో అడుగుపెడుతున్న వీక్షణం మీరు మరింత సహాయం అందించకపోతే ఎక్కువకాలం నడవడం కష్టం...

ఔను, వీక్షణం నష్టాలతో నడుస్తున్నదని, ఉత్పత్తి వ్యయం కూడ తిరిగి రావడం లేదని, ఆర్థిక పరిస్థితి నానాటికీ క్షీణిస్తున్నదని గత కొంతకాలంగా చెపుతూనే ఉన్నాం. అది ఇంకా విషమించింది. వీక్షణం నాలుగు కాలాల పాటు సజావుగా నడవడానికి ఇప్పటికే వందలాది మంది అభిమానులు తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నప్పటికీ, ఆ సహాయం చాలడం లేదు. సహాయం ఇతోధికంగా పెరగకపోతే వీక్షణం ఎక్కువకాలం మనగలగడం కష్టం.

వీక్షణం మీ పత్రిక. ప్రజల పత్రిక. ప్రజలకు అవసరమైన పత్రిక. ఇది ఆగిపోకుండా కాపాడండి.

- ❖ ప్రతి పాఠకుడూ/పాఠకురాలూ కనీసం మరొకరికి వీక్షణాన్ని పరిచయం చేయండి.
- ❖ ప్రతి చందాదారూ కనీసం మరొకరిని చందాదారుగా చేర్పించండి.
- ❖ మీకు తెలిసిన కళాశాలలు, కార్యాలయాలు, గ్రంథాలయాలు, ప్రజా సంస్థలు వీక్షణంను తెప్పించేలా చూడండి.
- ❖ మీ గ్రామంలో, పట్టణంలో న్యూస్ ఏజెంట్ దగ్గర వీక్షణం అమ్మేలా చూడండి

ఇవన్నీ వీక్షణం ప్రచురిస్తున్న భావాలు ప్రచారం చేయడానికి. కాని వీక్షణం ఆర్థిక పరిపుష్టికి అవి మాత్రమే సరిపోవు. వ్యాపార, ప్రచార ప్రకటనలు లేకుండా పత్రికలేవీ మనుగడ సాగించలేవు. వీక్షణంకు మీకు తెలిసిన వ్యక్తులనుంచీ, సంస్థల నుంచీ ప్రకటనలు సంపాదించండి. కళాశాలలు, వైద్యశాలలు, ఆస్పత్రులు, దుకాణాలు, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా పాలక సంస్థలు, దాతలు... సంస్థల బాధ్యులు, వ్యక్తులు ఎవరి నుంచి ఐనా సరే...

- ❖ జీవిత చందాలు, కానుకగా చందాలు, విరాళాలు సేకరించండి.
- ❖ ప్రకటనలు సేకరించండి.

ప్రతినెలా కనీసం మూడు పేజీల ప్రకటనలు ఉంటేనే వీక్షణం ఆర్థిక స్థితి ఏనెలకానెల అన్నట్టు సాగుతుంది. తెలుగు సమాజం తనతో తాను జరుపుకుంటున్న సంభాషణ ఆగిపోకుండా మీ వంతు సాయం చేయండి.

మీ సహకారం అందించాల్సిన చిరునామా :

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
ఇమెయిల్ : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao